సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 317

శనివారం 7-2-2026

SIMULTANEOUSLY PRINTED AT TIRUPATHI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | VISAKHAPATNAM | WARANGAL

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

యువ భారత్ 'సిక్సర్'

అంతర్జాతీయ క్రికెట్ వేదికపై భారత కుర్రాళ్లు మళ్లీ అదరగొట్టారు. అద్భుత ఆటతో అండర్-19 ప్రపంచ కప్‌ను సొంతం చేసుకున్నారు. సంచలన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ మెరుపు సెంచరీతో పాటు కెప్టెన్ ఆయుశ్ మాత్రే రాణించడంతో భారత్ 100 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఆడిన ఏడు మ్యాచ్‌లలోనూ గెలిచిన భారత్ అజేయంగా ఈ టోర్నీని ముగించింది.

14 లో



ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న భారీ జనసందోహంలో ఓ భాగం

పవిత్ర లడ్డూపై దుష్ప్రచారం ఆపి..

క్షమాపణ చెప్పాలి

చంద్రబాబు సర్కారు కుట్రలపై వైఎస్ జగన్ నిప్పులు

మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్. చిత్రంలో జోగి రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు

శ్రీవేంకటేశ్వరస్వామి ముందు లెంపలేసుకుని చంద్రబాబు ప్రజలకు క్షమాపణలు చెప్పాలి

తిరుమల లడ్డూ నెయ్యిలో జంతుకొవ్వు కలవలేదని ప్రఖ్యాత ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు నిర్ధారించాయి

10 లో

- చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలని, జంతుకొవ్వు కలవలేదని సీబీఐ చార్జ్‌షీట్‌లో తేల్చేసింది
- ఆ చార్జ్‌షీట్‌లో మరో ముఖ్యమైన అంశం.. చంద్రబాబు సీఎం అయ్యాక నాణ్యత లేదని టీటీడీ 4 నెయ్యి ట్యాంకర్లను రిజెక్ట్ చేసింది
- ఆ రిజెక్ట్ చేసిన ట్యాంకర్లు మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే దొడ్డిదారిన మరో పేరుతో తిరిగి వస్తే టీటీడీ ఆమోదించింది
- అవే ట్యాంకర్ల నెయ్యిని లడ్డూ తయారీకి వాడారని స్వయంగా సీబీఐ వెల్లడించింది
- చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పులు, వాళ్లు చేసిన అన్యాయంపై చార్జ్‌షీట్‌లో రాసింది
- తనకు అనుకూలమైన నివేదిక కోసమే బాబు సీబీఐ రిపోర్టును కాదని.. కొత్తగా కమిషన్
- న్యాయం కోసం ఎన్‌హెచ్ఆర్‌సీ, సుప్రీంకోర్టు తలుపు కూడా తడతాం..
- ఇప్పుడు తప్పులు చేస్తున్న వారెవరినీ వదిలి పెట్టబోం.. బోనులో నిలబెడతాం
- వచ్చేది మా ప్రభుత్వమే..
- వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి ఏ తప్పూ చేయలేదు.. అందుకే వారి పేర్లు సీబీఐ చార్జ్‌షీట్‌లో పెట్టలేదు.. అరెస్టు చేయలేదు

- జంగిల్‌రాజ్‌పై ప్రశ్నిస్తున్నందుకే.. టీడీపీ గూండాల దాడులు
- అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు హేయం
- పోలీసుల సమక్షంలోనే రెండు చోట్లా దాడులు.. విధ్వంస కాండ
- చంద్రబాబుకు చిప్ సరిగ్గా ఉంటే ఇలాంటి పనులు చేయిస్తారా?
- టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన జోగి రమేష్ నివాసాన్ని పరిశీలించిన వైఎస్ జగన్.. అండగా ఉంటామని భరోసా

రూటు మారినా తగ్గని జన సునామీ

13 లో

చంద్రబాబు సర్కారు కుట్రలను భగ్నం చేస్తూ భారీగా తరలివచ్చిన జనం

అభిమాన నేత వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికిన ఎన్టీఆర్ జిల్లా ప్రజానీకం

పర్యటనకు అడుగడుగునా ఆంక్షలు విధించిన పోలీసులు

నేతలకు నోటీసులు.. పర్యటనలో పాల్గొంటే కేసులంటూ బెదిరింపులు

ప్రజలు పోటెత్తడంతో తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నానికి 6 గంటల సమయం

జోగి రమేష్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన జననేత

పాక్‌లో ఆత్మాహుతి దాడి

కల్లోల పాకిస్తాన్‌లో మరో ఆత్మాహుతి దాడి జరిగింది. రాజధాని ఇస్లామాబాద్ శివార్లలోని మసీదులో షియా వర్గీయులే లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో దాదాపు 50 మంది ప్రాణాలు కోల్పోగా.. 169 మందికి పైగా గాయపడ్డారు.

6 లో

వాళ్లూ.. పూర్తి స్థాయి ఉపాధ్యాయులే

సర్వ శిక్షా అభియాన్ పార్ట్‌టైం, కాంట్రాక్ట్ టీచర్లు, ఇన్‌స్ట్రక్టర్లపై సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు

ఉపాధ్యాయులతో తక్కువ వేతనానికి పని చేయించుకోవడం అంటే వెట్టి చాకిరీనే

సర్వ శిక్షా అభియాన్ ఉపాధ్యాయులను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పరిగణించరాదు

వారిని పార్ట్‌టైం టీచర్లని పిలవడం మోసపూరితమే అవుతుంది

వారు ఇతర పనులు చేసుకోకుండా ప్రభుత్వం నిషేధం విధించింది

అందువల్ల వారు పూర్తిస్థాయి ఉపాధ్యాయులే అవుతారు

అనుభవం ఉన్న వారిని తీసేసి కొత్త వారిని నియమించడానికి వీల్లేదు

తాత్కాలిక నియామకాలు కాకుండా రెగ్యులర్ నియామకాలు చేపట్టాలి

సర్వశిక్షా అభియాన్ కింద గౌరవ వేతన చెల్లింపు బాధ్యత రాష్ట్రాలదే

గౌరవ వేతనం ఎప్పుడూ ఒకేలా ఉండకూడదు

15 లో

'పది'ంతల విధ్వంసానికి 'సై'

పదో టి20 ప్రపంచ కప్‌కు సమయం ఆసన్నమైంది. భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీ నేడు ప్రారంభం కానుంది. తొలి రోజు మూడు వేర్వేరు వేదికల్లో మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి. 20 జట్లు బరిలోకి దిగుతుండగా.. 30 రోజుల పాటు 55 మ్యాచ్‌లతో ఈ ధనాధన్ వినోదం సాగుతుంది. మార్చి 8న అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. నేడు జరిగే తొలి మ్యాచ్‌లో భారత జట్టు అమెరికాతో తలపడనుంది.

14 లో

గంజాయి బ్యాచ్ గ్యాంగ్‌రేప్

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దారుణం

- 12 ఏళ్ల బాలికకు గంజాయి కలిపిన వాటర్ నీళ్లను తాగించి ఇద్దరు అఘాయిత్యం
- కోవూరు, నెల్లూరు ప్రభుత్వాస్పత్రుల్లో బాధితురాలికి చికిత్స.. పరిస్థితి విషమించడంతో చెన్నైకి తరలింపు
- అక్కడ వారం రోజులపాటు మృత్యువుతో పోరాడి ఓడిన చిన్నారి.. నిందితులిద్దరిపై పోక్సో కేసు.. జైలుకు తరలింపు
- అత్యాచారం జరగలేదని, ప్రేమ వ్యవహారమంటున్న పోలీసులు
- చిన్నబిడ్డకు ప్రేమ వ్యవహారం అంటకట్టడం చాలా పాపమంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు
- వైఎస్సార్‌సీపీ నేతలు వస్తున్నారన్న సమాచారంతో కేసు తారుమారుకు పోలీసుల యత్నాలు

3 లో

నేటి గుడ్లు & చికెన్ తిరుపతి జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹75

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 108 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో 196 కిలో

రిటైల్ లైవ్ బర్డ్ 135 కిలో | స్కిన్ లెస్ 223 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ఇంకుడుకోట

ఇలా వారానికొకసారి కనిపించి వెళ్లు!

ఒక్కరితో ఆగని 'అరవ' అరాచకాలు

- ఎమ్మెల్యే అయినందుకు శుభాకాంక్షలు చెబుతూ మెసేజ్ చేసిన అమ్మాయిలకు వల
- స్నేహితులుగా ఉందామన్నా వినకుండా పరిచయస్తురాలితో అసభ్యంగా సంభాషణ
- రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే మరికొన్ని చాటింగ్‌లు వెలుగులోకి..

- వివరాలు 5లో

రేట్లకు బ్రేక్.. వృద్ధే టార్గెట్

రెపోరేటు యథాతథం.. తటస్థ విధానానికే ఓటు

ఎంఎస్ఈలకు రూ.20 లక్షల రుణసాయం

బ్యాంక్ కస్టమర్ మోసపోతే రూ.25 వేల పరిహారం.. రియల్‌ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులకు ఇకపై బ్యాంక్ రుణాలు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయాలు

- వివరాలు 15లో

అగ్ని-3 పరీక్ష విజయవంతం

భారత సాయుధ దళాల అమ్ములపొది మరింత బలోపేతమైంది. అణ్వస్త్ర సామర్థ్యంతో కూడిన అత్యాధునిక అగ్ని-3 ఖండాంతర క్షిపణి పరీక్ష విజయవంతమైంది. 3,000 కిలోమీటర్ల పై చిలుకు దూరంలోని లక్ష్యాలను ఛేదించగల ఈ క్షిపణిని ఒడిశా తీర సమీపంలోని చందీపూర్‌లోని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ కేంద్రం నుంచి ప్రయోగించారు.

వివరాలు 6లో

విద్య.. మోయలేని భారం కాదు



విద్యాభ్యాసం అంటే మోయలేని భారంగా భావించొద్దు. కేవలం మార్కులపైనే కాకుండా జీవితాన్ని మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాలి. బలమైన సంకల్పం ఉన్నప్పుడే మన జీవన విధానం మారుతుంది. పరీక్షలు వస్తున్నాయంటే భయపడాల్సిన పని లేదు. పరీక్షలను పండుగలా భావించాలి. ఒత్తిడిని జయిస్తే పరీక్షల్లో విజయం తథ్యం.

- పరీక్షా పే చర్చలో విద్యార్థులతో ప్రధాని మోదీ

6 లో

లడ్డూపై రాజకీయానికి

ముగింపు పలకండి

సీఎం చంద్రబాబుకు సీపీఐ నేత రామకృష్ణ లేఖ

16లో

సిట్ నివేదిక పక్కనపెట్టి

కమిటీ పేరుతో కాలయాపనా?

చంద్రబాబు ప్రభుత్వ తీరును తప్పుబట్టిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

16లో

అబూజ్‌మాడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టుల హతం
- మృతుల్లో మావోయిస్టు అగ్రనేత, తెలంగాణ వాసి ప్రభాకర్
- సీ–60 జవాన్ దీపక్ మాడవి మృతి
- మూడు ఏకే–47 తుపాకుల స్వాధీనం

ప్రభాకర్ అలియాస్ స్వామి అలియాస్ లోకేటి చందర్ (ఫైల్)

మృతి చెందిన పోలీసు జవాను దీపక్ చిన్న మడావి (ఫైల్)

సాక్షి ప్రతినిధి, వరంగల్/కాళేశ్వరం: మహారాష్ట్ర–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని అబూజ్‌మాడ్ అటవీ ప్రాంతంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పోలీసులు–మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు. మృతుల్లో మహారాష్ట్రలోని గడ్చిరోలి డివిజన్ కమిటీ ఇన్‌చార్జి, వెస్ట్ సబ్‌జోనల్ బ్యూరో ఇన్‌చార్జి, సీపీఐ (మావోయిస్ట్) కంపెనీ నంబర్ 10 ఇన్‌చార్జి ప్రభాకర్ (తెలంగాణ, కామారెడ్డి జిల్లా వాసి) కూడా ఉన్నారు. ప్రభాకర్‌పై తెలంగాణ, మహారాష్ట్రల్లో రూ.50 లక్షల రివార్డు ఉంది. గత మూడు రోజులుగా కొనసాగిన ఆపరేషన్‌లో గురువారం రాత్రి వరకు ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకోగా, శుక్రవారం ఆపరేషన్లలో మరో నలుగురు (ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు) మావోయిస్టుల మృతదేహాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మృతుల్లో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. మిగిలిన మావోయిస్టుల గుర్తింపు.. నిర్ధారణ కావాల్సి ఉంది. ఘటనాస్థలం నుంచి మూడు ఏకే–47 రైఫిళ్లు, 1 ఎస్ఎల్ఆర్, ఒక 303 పిస్టల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సీ–60 జవాన్ దీపక్ చిన్న మాడవి (38) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అహేరి తాలూకా మంద్రా గ్రామానికి చెందిన ఆయన గురువారం ఇద్దరు మావోయిస్టులను హతమార్చారు. అదే సమయంలో గుండెపోటు రావడంతో హెలికాప్టర్‌లో బామ్రాగడ్ సబ్‌డివిజన్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ మృతిచెందారు. మరో సీ–60 జవాన్ జోగా మాడవ్‌కు బుల్లెట్ గాయాలయ్యాయి. ఆయనను హెలికాప్టర్‌లో గడ్చిరోలికి తరలించి వైద్యం చేస్తున్నారు. ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను గడ్చిరోలి పోలీసులు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించనున్నారు.

1995లో అజ్ఞాతంలోకి..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: మహారాష్ట్ర గడ్చిరోలి ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన సీనియర్ మావోయిస్టు ప్రభాకర్ అలియాస్ పడ్కల్ స్వామి అలియాస్ లోకేటి చందర్ రావు (60)ది కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడి గ్రామం. 1995లో అడవిబాట పట్టిన ఆయన తిరిగి ఇంటిముఖం చూడలేదు. అప్పట్లో తండ్రి చనిపోయినా, మూడేళ్ల కిందట తల్లి చనిపోయినా ఇంటికి రాలేదు. సిర్నాపల్లి దళ కమాండర్‌గా, జిల్లా కమిటీ సభ్యుడిగా, జిల్లా కార్యదర్శిగానూ పనిచేశారు. పోలీసు నిర్బంధం పెరిగిన సమయంలో ఆయన్ను దండకారణ్యానికి పంపించారు. అక్కడ పీపుల్స్ గెరిల్లా లిబరేషన్ ఆర్మీకి ప్రభాకర్ నాయకత్వం వహించినట్టు తెలుస్తోంది. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన హిడ్మా నాయకత్వంలో ఆయన పనిచేసినట్టు ఈ మధ్య లొంగిపోయిన ఓ మావోయిస్టు నేత చెప్పారు. ప్రభాకర్ వెళ్లిన కొంత కాలానికి ఆయన భార్య నవత అలియాస్ లోకేటి సులోచన కూడా అజ్ఞాతంలోకి వెళ్లింది. ఎనిమిదేళ్ల కిందట అనారోగ్యంతో దండకారణ్యంలో చనిపోయింది. ఆయన కొడుకు రమేశ్ అలియాస్ అశోక్, కూతురు లావణ్య కూడా తల్లిదండ్రుల బాటలో నడిచారు. రెండు నెలల కిందట రమేశ్ లొంగిపోగా, లావణ్య ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టయి జైల్లో ఉన్నారు.

ఆరోగ్య ఆసరాకు చంద్రబాబు పాతర!

సాయం అందడం లేదని 104 కాల్ సెంటర్‌ను సంప్రదిస్తున్న పేదలు

2024 సెప్టెంబర్ నుంచి 2025 డిసెంబర్ మధ్య 10 వేల కాల్స్

అందులో 60 శాతానికిపైగా ఆసరాకు చెందినవే..

సాక్షి, అమరావతి: ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఆరోగ్య ఆసరా సాయాన్ని పూర్తిగా అటకెక్కించింది. వైద్య శాఖకు చెందిన 104 కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదుల్లో ఆసరా సాయానికి సంబంధించినవే ఎక్కువగా ఉంటున్నాయి. 2024 సెప్టెంబర్ నుంచి గతేడాది డిసెంబర్ నెలాఖరు వరకూ వివిధ సమస్యలపై దాదాపు 10 వేల కాల్స్ రాగా.. వీటిలో 60 శాతం అంటే 6,060 కాల్స్ ఆరోగ్య ఆసరాకు సంబంధించినవే. డిశ్చార్జి సమయంలో ఆరోగ్య మిత్ర సిబ్బంది బ్యాంక్ వివరాలు తీసుకున్నారని, అయితే డబ్బులు మాత్రం జమ కాలేదంటూ ప్రజలు కాల్ సెంటర్‌కు ఫోన్‌లు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందిన రోగులకు ఆరోగ్య ఆసరా సాయానికి ఏటా రూ.400 కోట్లకు పైగా ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంటుంది. బాబు గద్దెనెక్కాక ఆ సాయం ఊసే లేకుండా పోయింది.

గరిష్టంగా నెలకు రూ.5వేలు..

పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని వ్యక్తులు అనారోగ్యం బారిన పడి శస్త్రచికిత్సల అనంతరం ఇంటికే పరిమితమై విశ్రాంతి తీసుకోవాలంటే ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. వాటి నుంచి గట్టెక్కడానికి, పూర్తిగా కోలుకునే వరకూ రోగులు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకాన్ని 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టింది. దీని కింద నెట్‌వర్క్ ఆస్పత్రిలో చికిత్స అనంతరం డిశ్చార్జి అయిన రోజే వైద్యులు సూచించిన విశ్రాంత సమయం వరకు రోజుకు రూ.225 లేదా గరిష్టంగా నెలకు రూ.5 వేలు చొప్పున వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించింది. డిశ్చార్జి అయిన 24 గంటల్లో ఆసరా సాయాన్ని బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేది. ఇలా ఐదేళ్లలో **24,59,090** మందికి రూ.1,465.67 కోట్ల మేర ఆర్థిక సాయాన్ని చేసింది. ఇందుకుగాను ఈ పథకాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం గ్రీన్ చానల్‌లో ఉంచింది. చంద్రబాబు అధికారం చేపట్టగానే ఆసరాను అటకెక్కించారు. పథకాన్ని గ్రీన్ చానల్ నుంచి తొలగించి, 2025–26 బడ్జెట్‌లో ఆసరా కోసం కేవలం రూపాయి కేటాయించింది. దీంతో సాయం అందక నిరుపేదలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వైఎస్ జగన్ హయాంలో ఆరోగ్య ఆసరా సాయం ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	నిధులు (రూ.కోట్లలో)
2019-20	1,07,233	79.54
2020-21	2,77,563	194.31
2021-22	5,05,515	297.98
2022-23	7,30,273	433.09
2023-24	8,38,506	460.75
మొత్తం	24,59,090	1465.67

రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్

సాక్షి, అమరావతి: విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో శిక్షణ ఇచ్చే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు ఎన్‌వీడియా సంస్థతో శుక్రవారం రాష్ట్ర ఐటీ శాఖ ఒప్పందం చేసుకుంది. అమరావతిలో ప్రధాన కేంద్రం ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 8 నుంచి 12 స్పోక్ ఇన్‌స్టిట్యూషన్స్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ల్యాబ్స్ నిర్వహణకు అయ్యే వ్యయాన్ని గవర్నమెంట్ గ్రాంట్స్‌తో పాటు కార్పొరేట్స్ సామాజిక నిధుల ద్వారా సమకూర్చుకోనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

మహిళా అంధుల క్రికెటర్లకు నగదు ప్రోత్సాహకాలు

సాక్షి, అమరావతి: ప్రపంచ మహిళా అంధుల టీ–20 క్రికెట్ కప్ విజేత జట్టులో కీలక పాత్ర పోషించిన ఏపీ క్రీడాకారిణులు, కోచ్‌కు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పి.కరుణ కుమారికి రూ.15లక్షలతోపాటు త్వరలో విశాఖలో ఇంటి స్థలం కేటాయించనుంది. టీ–20 కెప్టెన్ దీపికకు రూ.10లక్షలు, కోచ్ ఐ.అజయ్‌కుమార్‌రెడ్డికి రూ.2.50లక్షలు అందించనుంది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులిచ్చారు.

శిక్షాగ్రహ లీడర్ షిప్ అవార్డు గ్రహీతకు అభినందన

సాక్షి,అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో సైన్స్ విద్యను చేరువ చేస్తూ ప్రతిష్టాత్మక 'శిక్షాగ్రహ లీడర్‌షిప్ అవార్డు' అందుకున్న నెల్లూరు జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ ఎన్.సుబ్రహ్మణ్యంకు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. విద్యారంగంలో మూడు దశాబ్దాలుగా సుబ్రహ్మణ్యం అందిస్తున్న సేవలకు గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. బెంగళూరులో నిర్వహించిన 'ఇన్వోక్ 5.0 మిషన్ టు మూమెంట్' జాతీయ విద్యాసదస్సులో ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు ఎస్‌డీ శిబులాల్, కుమారి శిబులాల్ చేతుల మీదుగా శిక్షాగ్రహ అవార్డును సుబ్రహ్మణ్యం అందుకున్నారు.

మొబైల్ యాప్‌లపై రైతులకు అవగాహన

సాక్షి, అమరావతి: ఏపీ ఎయిమ్స్ 2.0, ఊబరైజేషన్, రైతు మొబైల్ యాప్‌లతో పాటు డిజిటల్ ఈ–పంట సర్వే, ఫార్మర్ రిజిస్ట్రీపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సంచాలకులు డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్ ద్వారా యాప్‌లతోపాటు రైతు ప్రాయోజిత కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ అభివృద్ధి చేసిన ఈ యాప్ ఏపీఎయిమ్స్ అనే సమగ్ర డిజిటల్ వ్యవస్థపై ఆధారపడి పనిచేస్తుందన్నారు.

పులి.. అక్కడ చిక్కింది.. ఇక్కడ నక్కింది!

- ఏపీలో దొరికిన పులి..
- విశాఖ జూకు తరలింపు

పులిని తరలిస్తున్న సిబ్బంది

రాయవరం: వారం రోజులుగా తూర్పు గోదావరి జిల్లా ప్రజలను వణికించిన పులి ఎట్టకేలకు రాయవరం మండలం కూర్మాపురంలో పట్టుబడింది. గ్రామంలోని పంట పొలాల్లో శుక్రవారం ఉదయం రైతులకు పులి కనిపించింది. పాద ముద్రలను గుర్తించిన వారు గ్రామ శివార్లలోని చెరువు గట్టు వద్ద దాని గాండ్రింపులు వినిపించడంతో వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ, పోలీసు అధికారులు అక్కడకు చేరుకున్నారు. గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో తిష్ట వేసినట్లు గుర్తించారు. వెంటనే ఆ ఇంటిని చుట్టుముట్టారు. ట్రాంక్విలైజేషన్ ద్వారా పూణే నుంచి వచ్చిన రెస్క్యూ టీమ్ పులిని పట్టుకునేందుకు ప్రయత్నించింది. అయితే, అధికారుల కళ్లుగప్పి ఆ పులి గోడ దూకి పారిపోయింది. అక్కడి నుంచి ఓ పశువుల పాకలోకి దూరింది. ఆ పాక చుట్టూ అధికారులు వలలు పన్ని పులిని పట్టుకునేందుకు వ్యూహం రచించారు. బయటకు రాగానే ట్రాంక్విలైజేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో పులి బయటకు రావడంతో రెస్క్యూ టీమ్ సిబ్బందిలో ఇద్దరు ట్రాంక్విలైజర్ (తుపాకి వంటి సాధనం)తో మత్తు ఇంజక్షన్ ఇచ్చారు. దీంతో పులికి ఇంజక్షన్ తగిలి 100 మీటర్ల దూరం వెళ్లి గ్రామంలోని దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద మత్తుతో పడిపోయింది. నిమిషాల వ్యవధిలో అధికారులు పులిని బోనులోకి నెట్టారు. విశాఖపట్నంలోని జంతు ప్రదర్శన శాలకు తరలిస్తున్నామని చెప్పారు.

- రఘునాథపల్లి మండలంలో లేగదూడపై పెద్దపులి దాడి

రఘునాథపల్లి/బచ్చన్నపేట: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలో పులి సంచారం కలకలం రేపుతోంది. మండెల గూడెం శివారులోని పరిశె రాజుకు చెందిన లేగదూడపై శుక్రవారం తెల్లవారుజామున పెద్ద పులి దాడిచేసి చంపింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై దూదిమెట్ల నరేశ్, డీఎఫ్‌వో కొండల్‌రెడ్డి, సిబ్బందితో వెళ్లి పులి పాదముద్రలు గుర్తించారు. అవి పులి అడుగులేనని నిర్ధారించారు. పులిని సురక్షితంగా బంధించేందుకు చర్యలు చేపట్టినట్లు డీఎఫ్‌వో కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. పులి సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

మద్దూర్‌లో పులి సంచారం...

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం సరిహద్దు సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం సలాక్‌పూర్ గ్రామంలో పులి పాదముద్రలను గుర్తించారు. శుక్రవారం ఉదయం గ్రామ పొలాల్లో పులి అడుగులను గుర్తించిన రైతులు.. పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమేశ్, ఎస్సై ఆసిఫ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాముడు కలిసి వచ్చి పాదముద్రలు పరిశీలించారు. పులి అడుగులుగా నిర్ధారించారు. పక్క గ్రామాలైన బచ్చన్నపేట మండలంలో కట్కూర్, వీఎస్ఆర్ నగర్, బండనాగారం, బంజేరు, మార్మాముల గ్రామాల సర్పంచ్‌లకు సమాచారమిచ్చి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కాగా, రఘునాథపల్లి, బచ్చన్నపేట మండలాల్లో సంచరిస్తున్న పులులు వేర్వేరని, రెండు పులులు ఉన్నట్లు భావిస్తున్నారు.

గంజాయి బ్యాచ్ గ్యాంగ్ రేప్

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దారుణం

12 ఏళ్ల బాలికకు గంజాయి కలిపిన వైట్నర్ నీళ్లను తాగించి ఇద్దరు అఘాయిత్యం

కోవూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో దారుణం జరిగింది. గంజాయి బ్యాచ్ అరాచకానికి ఓ బాలిక బలైపోయింది. ఇద్దరు మృగాళ్లు కలిసి ఓ బాలికను గ్యాంగ్ రేప్ చేశారు. బాధితురాలి పరిస్థితి విషమించగా వారం రోజులపాటు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి చివరికి శుక్రవారం ప్రాణాలు విడిచింది. అయితే, నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి అరెస్టుచేసిన పోలీసులు.. బాధిత కుటుంబం ఇంటికి వైఎస్సార్‌సీపీ నేతలు వస్తున్నారన్న సమాచారంతో బాలిక మృతి ఘటన ఎక్కడ తమ మెడకు చుట్టుకుంటుందోనని వారు కేసు తారుమారుకు యత్నాలు ప్రారంభించారు. బాలిక తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి వారితో మరో రకంగా ఫిర్యాదు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆమెకు ప్రేమ వ్యవహారం అంటగట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు పోలీసుల తీరుతో అర్థమవుతోంది. జిల్లాలో కలకలం రేపిన ఈ ఘటన వివరాలు..

అరిఫా (ఫైల్)

ఏం జరిగిందంటే..

కోవూరు పంచాయతీ పరిధిలోని గుమ్మళ్లదిబ్బ కొత్తకాలనీకి చెందిన ఎస్కే రసూల్ దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. అతనికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె అరీఫా (12) గత నెల 30వ తేదీ (శుక్రవారం) రాత్రి దుకాణానికి వెళ్లొస్తుండగా, గంజాయికి బానిసలైన అదే ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలురు ఆమెపై కన్నేశారు. బాలికను సమీపంలోని చెట్ల పొదల్లోకి బలవంతంగా లాక్కెళ్లి వైట్నర్ కలిపిన నీటిని బలవంతంగా తాగించారు. బాలిక స్పృహ కోల్పోగానే వారు విచక్షణ మరిచి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. స్పృహలోకి వచ్చిన తర్వాత ఆ చిన్నారి జరిగిన ఘోరాన్ని తల్లిదండ్రులకు వివరించింది. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. అప్పటికే బాలిక పరిస్థితి విషమంగా ఉండడంతో తొలుత కోవూరు ప్రభుత్వాస్పత్రికి అక్కడ నుంచి నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని స్టాన్లీ ఆస్పత్రికి తరలించారు. వారం రోజులుగా ఐసీయూలో మృత్యువుతో పోరాడిన ఆ బాలిక చివరికి శుక్రవారం ప్రాణాలు విడిచింది. తమ బిడ్డకు మత్తు ద్రావణం తాగించి దారుణంగా అఘాయిత్యానికి పాల్పడ్డారంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారిన ఇల్లు

కేసు తారుమారుకు పోలీసుల యత్నం

బాలిక మృతి చెందడంతో చెన్నైలోనే పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. అనంతరం శనివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించనున్నారు. ఇప్పటికే ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వాకబు చేసినట్లు సమాచారం. అయితే, బాలిక స్వగ్రామానికి కాకాణి శనివారం వెళ్లనున్నారనే సమాచారంతో పోలీసులు కేసు తారుమారు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇందులో భాగంగా బాలిక కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఆమెకు ప్రేమ వ్యవహారం ఉన్నట్లుగా కథలు అల్లుతున్నట్లు తెలుస్తోంది.

పోక్సో కేసు నమోదు.. రేప్ జరగలేదంటూ బుకాయింపు..

ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు, ఘటనా స్థలాన్ని సైతం పరిశీలించారు. అక్కడ కొన్ని ఆధారాలు సేకరించి, మైనర్లు అయిన ఇద్దరు నిందితులపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపర్చారు. అయితే, గంజాయి బ్యాచ్ అరాచకాల విషయంలో పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకే అవకాశం ఉండడం వల్ల కూడా వారు కేసు తారుమారు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఆవేదన వ్యక్తంచేస్తున్న కుటుంబ సభ్యులు

ఆ ఇద్దరే కారణం..

మా బిడ్డకు జరిగిన అన్యాయం మరెవ్వరికీ జరగకూడదు. అభం శుభం తెలియని మా బిడ్డపైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. చిన్న బిడ్డకు ప్రేమ వ్యవహారం అంటకట్టడం చాలా పాపం. అవన్నీ తప్పుడు ప్రచారం. మా బిడ్డను కొందరు బలవంతంగా తీసుకెళ్లి ఇబ్బందికి గురిచేసిన విషయం నిజమే. అందుకే కోవూరు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మా బిడ్డ చనిపోవడానికి కారణం ఆ ఇద్దరు పిల్లలే. వారిని కఠినంగా శిక్షించాలి.
– ఎస్కే రసూల్, బాలిక తండ్రి

విచ్చలవిడిగా గంజాయి ఆగడాలు..

మరోవైపు.. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి రవాణా, విక్రయాలు, అరాచకాలు, ఆగడాలు మితిమీరాయి. అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులు, ఎక్సైజ్ శాఖలు అవినీతి మత్తులో జోగుతున్నారు. ఈ క్రమంలోనే నెల్లూరులో గంజాయి నిరోధక ఉద్యమకారుడు పెంచలయ్యను ఇటీవలే గంజాయి విక్రేతలు దారికాచి తరిమితరిమి కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు అరవ కామాక్షితోపాటు ఆమె సోదరుడు, అనుచరులు జిల్లా జైల్లో రిమాండ్‌లో ఉన్నారు. ఇక గంజాయి విక్రయ మూలాలను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారనడానికి తరచూ భారీస్థాయిలో పట్టుబడుతున్న గంజాయే నిదర్శనం. నిజానికి.. నెల్లూరు నగరానికి పక్కనే ఉన్న కోవూరు అడ్డాగా గంజాయి విక్రయాల దందా జరుగుతోంది. ఒడిశా నుంచి రైళ్లల్లో, బస్సుల్లో తెస్తూ.. పడుగుపాడు, ఇనమడుగు ప్రాంతాల్లో విక్రేతలు పాగా వేసి విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం.

మా బిడ్డకు ఇలా జరగడం దారుణం..

పోయిన శుక్రవారం ఏదైనా కొనుక్కుంటానంటే నేనే రూ.10 ఇచ్చి పంపాను. దుకాణానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఇద్దరు పిల్లలు బలవంతంగా తీసుకెళ్లి మత్తు నీళ్లు తాగించడంతో చెట్ల పొదల మధ్యన పడిపోయింది. గంటసేపైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది అంతా వెతికాం. ఇంతలో ఇద్దరు పిల్లలు అక్కడ కూర్చొని ఉంటే అడిగాం. ముందు చూపిస్తామని, ఆ తర్వాత మాకు తెలియదని చెప్పారు. చివరకు చెట్ల పొదల్లో చూడగా అక్కడ మా బిడ్డ స్పృహలేకుండా పడిపోయి ఉంది. అప్పుడు కోవూరు ఆస్పత్రికి తీసుకెళ్లాం. పరిస్థితి ఇబ్బందిగా ఉంటే.. నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాం. అక్కడ కూడా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో చెన్నైకు తీసుకెళ్లమన్నారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయింది. మా కళ్ల ముందు ఆడుకుంటున్న బిడ్డకు ఇలా జరగడం దారుణం.
– బాలిక పిన్ని

అంతా అబద్ధం

గుమ్మళ్లదిబ్బలో బాలికపై అసలు అత్యాచారమే జరగలేదు. అదంతా అబద్ధం. ఆ బాలికకు బాలుడితో ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఆ బాలిక తన స్నేహితులతో ఉంటూ పొద్దుపోయే వరకు ఇంటికి వెళ్లకపోవడంతో ఇంట్లో వాళ్లు తిడతారేమోనని సమీపంలో ఉన్న గుర్తు తెలియని లిక్విడ్ తాగింది. ఆ కారణంగానే చనిపోయింది.
– సుధాకర్‌రెడ్డి, కోవూరు సీఐ

రాష్ట్రం గంజాయికి అడ్డాగా మారింది..

రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. మా ప్రభుత్వ హయాంలో గంజాయి, అక్రమ మద్యాన్ని ఉక్కుపాదంతో అణిచివేశాం. కానీ, నేడు చంద్రబాబు కనుసన్నల్లో రాష్ట్రమంతా గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. ఈ మత్తు పదార్థాలవల్ల పసిబిడ్డల ప్రాణాలు సైతం గాలిలో కలిసిపోతుంటే ఈ ప్రభుత్వానికి కనికరంలేదు. కూటమి ప్రభుత్వ అక్రమాలకు కొందరు పోలీసులు వంత పాడటం సిగ్గుచేటు. బాలిక అత్యాచారం కేసును పక్కదోవ పట్టించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరిస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తేలేదు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.
– నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, మాజీమంత్రి

అంబటిపై కేసులో చట్ట ప్రకారం నడుచుకోండి

మంగళగిరి గ్రామీణ పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత అంబటి రాంబాబుపై అన్యాయంగా నమోదు చేసిన అక్రమ కేసులో చట్ట ప్రకారం వ్యవహరించాలని హైకోర్టు శుక్రవారం గుంటూరు జిల్లా, మంగళగిరి గ్రామీణ పోలీసులను ఆదేశించింది. ఆయనకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులకు స్పష్టం చేసింది. దర్యాప్తునకు సహకరించాలని అంబటిని ఆదేశించింది. చట్ట ప్రకారం దర్యాప్తు పూర్తి చేయవచ్చునని పోలీసులకు తేల్చి చెప్పింది. ఫిర్యాదుదారు గంగాధర్‌కూ నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీ నేత ఫిర్యాదుతో అక్రమ కేసు

తిరుమల లడ్డూ తయారీకి వాడే నెయ్యిలో జంతు కొవ్వు కలవలేదంటూ సీబీఐ కోర్టులో దాఖలుచేసిన చార్జిషీట్‌లో వాస్తవాలను జీర్ణించుకోలేని అధికార టీడీపీ నేతలు లడ్డూ నెయ్యిపై దుష్ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో టీటీడీ నేతలకు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ గుంటూరు గోరంట్ల శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేసి వస్తున్న అంబటి రాంబాబు, ఇతర వైఎస్సార్‌సీపీ నేతలను టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అంబటి పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై టీడీపీ నేత టి.గంగాధర్ మంగళగిరి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా అంబటి రాంబాబుపై గత నెల 31న పోలీసులు అక్రమ కేసు నమోదు చేశారు.

ఒకే అంశంపై బహుళ ఎఫ్ఐఆర్‌లు

అంబటి రాంబాబు తరఫు న్యాయవాది వై.యల్లారెడ్డి వాదనలు వినిపించారు. ఇదే అంశంపై నమోదైన అక్రమ కేసులో రాంబాబును నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారని, ప్రస్తుతం ఆయన రిమాండ్‌లో ఉన్నారని వివరించారు. ఇప్పుడు మంగళగిరి గ్రామీణ పోలీసులు పీటీ వారెంట్ మీద రాంబాబును అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఒకే అంశంపై బహుళ ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ, రాంబాబుకు నోటీసులిచ్చి వివరణ తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు

గుంటూరు రూరల్: టీడీపీ రౌడీల దాడిలో తీవ్ర ఇబ్బందులకు గురైన మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈనెల 4వ తేదీన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు వచ్చిన సందర్భంగా ఆయన వెంట వచ్చిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలపై నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో గురువారం అక్రమంగా కేసులు నమోదు చేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్, మాజీ ఎంపీ నందిగం సురేష్‌తోపాటు పలువురిపై 125, 126(2), 270, 292, 189(2), ఆర్‌డబ్ల్యూ 190 బీఎన్ఎస్, 32 పీఏ 1861 యాక్ట్‌ల ప్రకారం కేసులు నమోదు చేశారు. ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా, జగన్ పర్యటనకు రావొద్దని ఇచ్చిన నోటీసులను ధిక్కరించినందుకు కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

జోగి రమేశ్‌కు హైకోర్టులో ఊరట

- ఆయన వ్యాఖ్యలు వాక్ స్వాతంత్య్రం, భావ వ్యక్తీకరణలో భాగం
- ఆయనపై ఆరోపించిన నేరాలు ఏడేళ్ల కన్నా తక్కువ శిక్ష పడేవే
- కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు.. కఠిన చర్యలేవీ తీసుకోవద్దు
- జోగి రమేశ్ దాఖలు చేసిన వ్యాజ్యాల్లో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- తదుపరి విచారణ ఈ నెల 27కి వాయిదా

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదు చేసిన కేసుల్లో కఠిన చర్యలేవీతీసుకోవద్దని ఎన్టీఆర్ జిల్లా, ఇబ్రహీంపట్నం పోలీసులతోపాటు, తిరుపతి జిల్లా, తిరుపతి గ్రామీణ పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 27కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల లడ్డూ నెయ్యి కల్తీపై అధికార టీడీపీ కూటమి నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారంపై జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యల గురించి న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో ప్రస్తావించారు. జోగి వ్యాఖ్యలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం 'వాక్ స్వాతంత్య్రం, భావ వ్యక్తీకరణ' పరిధిలోకి వస్తాయని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. అంతేకాక ఆయనపై ఆరోపించిన నేరాలు ఏడేళ్ల కంటే తక్కువ జైలు శిక్ష పడేవేనని తెలిపారు. అందువల్ల ప్రస్తుత దశలో జోగి రమేశ్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన తక్షణ అవసరం ఏదీ లేదని ఆమె ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

కుప్పం కమాండ్ కంట్రోల్ కేంద్రానికి రూ.7.46 కోట్లు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటుకు రూ.7.46 కోట్లకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ఈ కేంద్రం ఏర్పాటుకు రూ.5.30 కోట్లకు అనుమతించారు. అయితే అదనంగా మరో రూ.2.16 కోట్ల వ్యయానికి అనుమతించాల్సిందిగా కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు వ్యయాన్ని రూ.7.46 కోట్లకు పెంచుతున్నట్టు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఫుడ్ కమిషన్ ఛైర్మన్ భద్రతను పునరుద్ధరించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం తరఫున చట్టబద్ధమైన విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తికి కల్పించిన భద్రతను ఏకపక్షంగా తొలగించడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసింది. గతంలో ఇచ్చిన భద్రతను తొలగించేందుకు సరైన కారణాలు వెల్లడించాల్సి ఉంటుందని తేల్చి చెప్పింది. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చింతా విజయ్ ప్రతాప్‌రెడ్డికి గత ప్రభుత్వం కల్పించిన 1+1 భద్రతను వెంటనే, గరిష్టంగా 2 వారాల్లో పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు 1+1 భద్రతను, ఎస్కార్ట్‌ను ఇస్తూ 2017లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన మెమోకు విరుద్ధంగా ఈ ప్రభుత్వం భద్రతను తొలగించిందని, తన భద్రతను యథాతథంగా పునరుద్ధరించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ చింతా విజయ్ ప్రతాప్‌రెడ్డి హైకోర్టులో 2024లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జరిగిన విచారణలో ప్రతాప్‌రెడ్డి తరఫు న్యాయవాది కాకర్ల చెన్నారెడ్డి వాదనలు వినిపించారు. విధి నిర్వహణలో భాగంగా పిటిషనర్ రాష్ట్ర వ్యాప్తంగా తిరగాల్సి ఉంటుందని, సున్నితమైన వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. బలవంతులైన వ్యక్తులనూ ఢీకొనాల్సి ఉంటుందన్నారు. అందువల్ల భద్రత అవసరమని వివరించారు.

ఏ నెలకానెల తేల్చండి

సోలార్ రూఫ్‌టాప్ సిస్టమ్ బిల్లులు, చెల్లింపులపై ఏపీఈఆర్‌సీ ఆదేశాలు

సాక్షి, అమరావతి: సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకున్న వినియోగదారులకు ఇకపై ప్రతి నెలా బిల్లులు, చెల్లింపులు జరగాల్సిందేనని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆదేశించింది. ఏ నెలకానెల వినియోగించిన విద్యుత్‌కు బిల్లులు ఇవ్వడంగానీ, ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు ఇచ్చిన విద్యుత్‌కు చెల్లింపులుగానీ సక్రమంగా జరగడం లేదంటూ సోలార్ రూఫ్ టాప్ వినియోగదారులు ఇటీవల బహిరంగ విచారణలో ఏపీఈఆర్‌సీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నిబంధనల ప్రకారం అలా జాప్యం చేయడం కుదరదని, ఇకపై ఖచ్చితంగా నెలా నెలా జరగాల్సిందేనని ఏపీఈఆర్‌సీ స్పష్టం చేసింది. డిస్కంలు ఈ ఆదేశాల అమలులో అలసత్వం వహిస్తే వినియోగదారులు తమకు ఫిర్యాదు చేయాల్సిందిగా మండలి సూచించింది.



సరైన మార్గం ఎప్పుడూ నడవటానికి కష్టమైన మార్గంగానే ఉంటుంది. అయినప్పటికీ అది ఆనందాన్ని తెస్తుంది.

– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 7 ఫిబ్రవరి 2026

సభాపర్వం నిరాశాజనకం

‘మీ స్వరాన్ని పెంచకండి... చట్టసభల్లో మెరుగుపరుచుకోవాల్సింది మీ వాదనను మాత్రమే’ అన్నారు నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, దక్షిణాఫ్రికా హక్కుల యోధుడు డెస్మండ్ టుటు. దేశంలో చట్టసభల తీరుతెన్నులు చూస్తున్నవారికి ఎప్పుడూ ఖేదమే మిగులుతోంది. చట్టసభల పేరుచెబితే వాగ్యుద్ధాలూ, వాకౌట్లూ గుర్తుకొస్తున్నాయి. ఎప్పటిలాగే పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు కూడా ఆ ధోరణిలోనే సాగుతున్నాయి. ఈసారి పార్లమెంటు లోపలే కాదు, వెలుపల కూడా ఆధిక్యతా ప్రదర్శన కనబడుతోంది. కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు జరగబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కావొచ్చు, అధికార విపక్షాలు ప్రత్యర్థుల్లాకాక శత్రుపక్షాల్లా పోట్లాడుకుంటున్నాయి. చివరకు ఎక్కడివరకూ పోయిందంటే... కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీ పట్ల అవాంఛనీయ చర్యకు పాల్పడే అవకాశం ఉందంటూ తనకు సమాచారం అందటంతో ఆయన్ను సభకు రావొద్దంటూ తానే సూచించానని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అదంతా అబద్ధమన్నది కాంగ్రెస్ వాదన. నిజానిజాల సంగతలా ఉంచి లోక్‌సభ స్పీకర్ ప్రధానిని సభకు రావద్దని సూచించటం ఊహకందనిది. ఇలాంటి పరిణామాలు ప్రపంచం దృష్టిలో మన ప్రజాస్వామ్యాన్ని పలచబారుస్తాయి.

కాంగ్రెస్ తీరుచూస్తే సభను సాగనివ్వకపోవటమే దాని ఏకైక వ్యూహంగా కనబడుతోంది. దీనిద్వారా ఆ పార్టీ ఎలాంటి సందేశం పంపదల్చుకున్నదోగానీ, కీలకమైన బిల్లులు ఎలాంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో ఆమోదం పొందుతున్నాయి. పద్దులు గిలెటిన్ అవుతున్నాయి. పాలక పక్షం పని సులభమవుతోంది. సభలో మెజారిటీయే దేన్నయినా నిర్ణయిస్తుంది. విపక్షాలు దాన్ని అడ్డుకోలేవు. కనీసం అర్థవంతమైన చర్చంటూ జరిగితే ఎలాంటి బిల్లులు వస్తున్నాయో, వాటి లోటుపాట్లేమిటో, అందువల్ల కలిగే పరిణామాలేమిటో సామాన్యులు అర్థం చేసుకునే వీలుంటుంది. తమ వ్యూహం సామాన్య పౌరులకు ఆ అవకాశాన్ని నిరాకరిస్తున్నదని కాంగ్రెస్ గ్రహించటం లేదు. యూపీఏ హయాంలో కూడా బీజేపీ ఇదే వ్యూహాన్ని అమలు చేసింది. దాన్నే తామూ ప్రయోగించి పైచేయి సాధించాలని చూడటం ద్వారా కాంగ్రెస్ ఆశిస్తున్న ప్రయోజనమేమిటో అర్థంకాదు.

తోచింది చేసుకుంటూ పోవటం, జరిగే ఘటనలపై అప్పటికప్పుడు అనాలోచితంగా స్పందించటం తప్ప కాంగ్రెస్‌కు పకడ్బందీ వ్యూహం ఉన్నట్టు కనబడదు. బుధవారం పార్లమెంటు మకరద్వారం వద్ద జరిగిన ఘటనే ఇందుకు తార్కాణం. కేంద్ర మంత్రి రవనీత్‌సింగ్ బిట్టూతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జగడం నివారించదగింది. బిట్టూ అక్కడ ధర్నాకు కూర్చున్న కాంగ్రెస్ ఎంపీలనుద్దేశించి అవహేళనగా వ్యాఖ్యానించి ఉండొచ్చు. కానీ అవి యథాలాపంగా అన్న మాటలు కాదు. ఇరుపక్షాల మధ్యా యుద్ధం సాగుతున్న వేళ వ్యూహాత్మకంగా మాట్లాడినవి. రాహుల్ గాంధీ ఆయన్ను కాస్తా ద్రోహి అంటూ నిందించటం ద్వారా బీజేపీకి పదునైన ఆయుధం ఇచ్చారు. పార్టీ మారటం ద్రోహమైతే, అలాంటివారు కాంగ్రెస్‌లో లేరా? అసలు పార్టీని నమ్ముకుని ఉన్నవారి పట్ల అధినేతలుగా తాము చేసిన, చేస్తున్న ద్రోహం మాటేమిటి? అవసరార్థం పక్క పార్టీలతో కుమ్మక్కవుతూ మొత్తంగా పార్టీలో ఉన్నవారందరికీ చేస్తున్న ద్రోహమెంత? రాహుల్ గాంధీ ఆలోచించారా? పరిస్థితులు మళ్లీ చక్కబడితే బిట్టూ లాంటివారు తిరిగి కాంగ్రెస్‌లోకి రారనీ, రాహుల్ తీసుకోబోరనీ ఎవరైనా చెప్పగలరా?

ఎందుకో ఈసారి పార్లమెంటులోనూ, వెలుపలా ‘పుస్తక ప్రదర్శన’ జరిగింది. చైనా నుంచి ముప్పు ముంచుకొస్తున్నవేళ బాధ్యతంతా రాజకీయ నాయకత్వం అప్పటి ఆర్మీ చీఫ్ జనరల్ నరవణేపై వదిలేసి, చేతులు దులుపుకొన్నదని రాహుల్ ఆరోపించారు. జనరల్ నరవణే పుస్తక సారాంశాన్ని సభలో చెబుతానన్న భయంతోనే తనను అడ్డుకున్నారని అన్నారు. దీనికి పోటీగా బీజేపీ సభ్యులు సభలో పుస్తకాలు ప్రదర్శించారు. ఈ దఫా పుస్తకాల ప్రస్తావన రావటం బాగున్నా, వాటిని ప్రదర్శించటంతో సరిపెట్టక ఇరుపక్షాలవారూ ఎవరికివారు చదువుకోవాలి. అప్పుడు మన చట్టసభల తీరు ఇంత అధ్వాన్నంగా అయితే ఉండదు. కనీసం సభల నిర్వహణకయ్యే వ్యయాన్నయినా దృష్టిలో ఉంచుకుని సమావేశాలను వృథా కానీయరాదని రెండు పక్షాలూ గ్రహించటం అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.3.57 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** చిత్త రా.3.48 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.10.41 నుండి 12.24 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.34 నుండి 8.07 వరకు, **అమృత ఘడియలు:** రా.8.56 నుండి 10.38 వరకు.

సూర్యోదయం : 6.35
సూర్యాస్తమయం : 5.54
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

ప్రేరణ

నువ్వు రచయితవా? నీ కోసం రాసుకో. ప్రపంచాన్ని సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తే చివరికి ఆత్మ లేని కథే తయారౌతుంది. ప్రేరణ కోసం కూడా చూడకు. ప్రేరణ ఒక ఫ్యాక్టరీ కార్మికురాలు. షిఫ్టు మొదలైనప్పుడు మాత్రమే ఆమె నీకు కనిపిస్తుంది.

– అశోక్ బ్యాంకర్, రచయిత, స్క్రీన్ రైటర్

విరామం

ఎదురు దెబ్బలు మెరుగైన భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో చెబుతాయి. కష్టాలకు వ్యతిరేకంగా పట్టుదలను పెంచుతాయి. సమష్టి పోరాటానికి సమాయత్తం చేస్తాయి. ఓటమి ఎన్నటికీ వైఫల్యం కాదు. తిరిగి పుంజుకునేందుకు లభించిన విరామం.

– ప్రకాష్ కారత్, మార్క్సిస్టు నేత

షాట్

షూటింగ్ స్పోర్ట్స్‌లో మీ అతి పెద్ద శత్రువు మీ గుండె చప్పుడు. ప్రపంచం అంతా నిశ్శబ్దంగా మీ వైపే చూస్తూ ఉన్నప్పుడు మీరు ప్రశాంతంగా ఉండటం నేర్చుకోవాలి. గెలవటా నికి అవసరమైన 580 పాయింట్స్‌ను పక్కన పెట్టి, మీరు కొడుతున్న ఒకే ఒక్క షాట్‌పై ధ్యాస ఉంచండి.

– హర్‌ప్రీత్ సింగ్, పిస్టల్ షూటర్

రూపాయి

తెలివైన వ్యక్తి తన వ్యాపారాన్ని ఆర్థిక మాంద్యంలో మాత్రమే ప్రారంభిస్తాడు. ఎందుకంటే అది ప్రతి రూపాయి విలువను అతడికి ఒక పాఠంలా బోధిస్తుంది. భిన్నంగా ఆలోచించేలా చేస్తుంది. సురక్షితమైన దూకుడు వ్యూహాలు పన్నేందుకు ప్రోత్సహిస్తుంది.

– సుశీల్ మంత్రి, వ్యాపార వ్యూహకర్త

ప్రత్యర్థి

నువ్వు గెలవగలవన్న నమ్మకం నీలో లేకపోతే, మొదటి సర్వ్‌కు ముందే నువ్వు ఓడిపోయినట్లు! జీవితానికి కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. నెట్‌కి అవతలి వైపు ఎవరున్నారో నేను ఎప్పుడూ చూడను. షటిల్‌నే నా ప్రత్యర్థిగా భావించి, దాని మీదే దృష్టి పెడతాను.

– శ్రీకాంత్ కిదాంబి, బ్యాడ్మింటన్ ఆటగాడు

సత్యం

చరిత్రకారుల బాధ్యత గతాన్ని ఆరాధించటం కాదు, గతాన్ని అర్థం చేసుకోవటం; మరింత మెరుగ్గా ప్రజాస్వామ్య భవిష్యత్తును నిర్మించుకునేలా గతాన్ని వివరించటం. సత్యాన్ని విస్మరించటం వల్ల చరిత్ర కనుమరుగౌతుందన్న సంగతిని మనం మరువకూడదు.

– డా॥ వాసు మళలి, కన్నడ చరిత్రకారిణి

పరిశోధనలు ప్రైవేటు పరమా?

విశ్లేషణ

దినేశ్ సి. శర్మ

సాధారణంగా అందరూ అనుకునేట్టు కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రవేశపెట్టే బడ్జెట్ కేవలం పన్నులు, ఆదాయం, ఆ యా రంగాలకు కేటాయింపులు మాత్రమే కాదు. కీలక రంగాల విషయంలో ప్రభుత్వ ఆలోచనలు, విధానపరమైన మార్పులు ఇందులోనే వ్యక్తమవుతాయి. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞాన రంగం ఉరకలేస్తున్న తరుణంలో అంతర్జాతీయ రాజకీయ పరిణామాలనూ దృష్టిలో ఉంచుకుంటే ఈ ఏడాది బడ్జెట్ సరికొత్త సవాళ్లకు సమాధానాలు తెలిపేదిగా ఉంటుందని ఆశించడం సహజం. కానీ ఈ దిశలో బడ్జెట్ నిరాశ పరిచిందనే చెప్పాలి. ప్రభుత్వం ప్రకటించుకున్నట్టు ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్ కాదు. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన రంగాల విషయంలో ఇది యథాతథ స్థితిని కొనసాగించే సాధారణ బడ్జెట్.

◆ కృత్రిమ మేధ, సెమీ కండక్టర్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన రంగాల విషయంలో ఇది యథాతథ స్థితిని కొనసాగించే సాధారణ బడ్జెట్.

మార్పునకు సూచికలేనా?

ఆర్థిక శాఖ మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో సైన్స్, టెక్నాలజీ రంగాలకు సంబంధించి ఏం మాట్లాడారో చూద్దాం. కొత్త టెలిస్కోపులు, వేధశాలల ఏర్పాటును ప్రస్తావించారు. అరుదైన మూలకాలకు సంబంధించిన కారిడార్ల గురించి, సెమీ కండక్టర్ మిషన్ రెండో అధ్యాయం ప్రారంభం, బయోఫార్మా తయారీ వ్యూహాలూ ప్రసంగంలో ఉన్నాయి. ఇవన్నీ చేయాల్సిన పనులే. అయితే ఏవీ ఓ గొప్ప మార్పునకు సూచికలైతే కావు. ‘ది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్’ (ఐఐఏ) 15 ఏళ్లుగా నేషనల్ లార్జ్ సోలార్ టెలిస్కోపు తయారీ కోసం శ్రమిస్తోంది; ఐదేళ్లుగా నేషనల్ లార్జ్ ఆప్టికల్ ఇన్ఫ్రారెడ్ టెలిస్కోపు నిర్మాణ ప్రయత్నాల్లోనూ ఉంది. ఆర్థిక మంత్రి వీటి గురించే బడ్జెట్‌లో ప్రస్తావించారు. వీటి డిజైనింగ్, స్థలం ఎంపిక, పరిశోధన వేదిక పునాదులు, సిబ్బంది వంటి కీలకమైన ఏర్పాట్లు ఇప్పటికే జోరుగా సాగుతున్నాయి. స్థలం ఎంపిక కోసం ఆర్థిక మంత్రి స్వయంగా లద్దాఖ్‌ను సందర్శించారు కూడా.

సూర్యుడిపై పరిశోధనల విషయంలో భారత్ సామర్థ్యం గట్టిదే. ప్రతిపాదిత టెలిస్కోపు కూడా ఆదిత్య ఎల్, ఉదయ్‌పూర్‌లోని మల్టీ అప్లికేషన్ సోలార్ టెలిస్కోపుల ద్వారా అందుతున్న సమాచారానికి సాయంగా నిలుస్తుంది. కొత్త టెలిస్కోపు నిర్మాణ వ్యయం దాదాపు రూ.3,500 కోట్లుగా లెక్కగట్టారు. అయితే ఐఐఏకు అదనపు బడ్జెట్ కేటాయింపులేవీ జరగలేదు. ఐఐఏ సహా డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్‌కు అనుబంధంగా ఉన్న 25 అటానమస్ సంస్థలకు ఈ ఏడాది బడ్జెట్‌లో దక్కింది రూ.1,623 కోట్లు మాత్రమే.

సాధారణ ప్రక్రియలో భాగమే!

రానున్న ఐదేళ్లలో రూ.10,000 కోట్లతో బయోఫార్మా ‘శక్తి’ కార్యక్రమాన్ని కూడా ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా బయలాజిక్స్, బయో సిమిలర్స్ తయారీ చేపడతారు. అయితే మంత్రి ప్రకటించిన మొత్తం... మూడు కొత్త ‘నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్’ (నైపర్)ల నిర్మాణానికీ, వీటికి అనుబంధంగా ఉన్న వెయ్యి అక్రిడిటెడ్ క్లినికల్ ట్రయల్స్‌కూ ఖర్చు చేస్తారు. ఈ రెండూ సాధారణ ప్రక్రియల్లో భాగమే కానీ, బయోఫార్మాకు ప్రత్యేకమైనవి ఏమీ కాదు.

‘సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్’ను బలోపేతం చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. ఇది అవసరమే కానీ బయోఫార్మా వ్యూహంలో దీన్ని భాగం చేయడం ఆశ్చర్యకరం. శక్తి కార్యక్రమంలో భాగంగా కేటాయించిన పదివేల కోట్ల రూపాయల్లో నైపర్‌లకు ఎంత, మిగిలిన వాటికి ఎంతెంత అన్న స్పష్టత లేదు. వాస్తవానికి, శక్తి కార్యక్రమం 2017లో వరల్డ్ బ్యాంక్ సాయంతో నేషనల్ బయోఫార్మా మిషన్‌లో భాగంగా 25 కోట్ల డాలర్లతో చేపట్టారు. దీని ద్వారా టీకాలు, బయోసిమిలర్లు, వైద్య పరికరాల తయారీ, పరిశోధనలు చేయాలన్నది లక్ష్యం.

హాట్ టాపికే కానీ...

బడ్జెట్ ప్రసంగంలో సెమీ కండక్టర్లు, రేర్‌ఎర్త్ మినరల్స్, ఏఐ వంటి వాటి ప్రస్తావన వచ్చినప్పటికీ ఏదీ గేమ్‌ఛేంజర్ స్థాయికి చేరలేదు. రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్స్ తయారీ కేంద్రం ఒకదాన్ని గత ఏడాది నవంబరులో ప్రారంభించామని ప్రకటించిన మంత్రి... ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రేర్ ఎర్త్ కారిడార్ల ఏర్పాటు చేసుకునేందుకు సహకరిస్తామని తెలిపారు. గతేడాది ప్రకటించిన నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ లో ఇవన్నీ భాగం కావడం గమనార్హం.

కొన్నేళ్లుగా బడ్జెట్ ప్రసంగాల్లో తరచూ వినిపించిన ఇంకో ఆలోచన ‘అనుసంధాన్ నేషనల్ రిసెర్చ్ ఫౌండేషన్’. ఈసారి దీన్ని కేవలం ప్రస్తావనకు మాత్రమే పరిమితం చేశారు. ఐదేళ్లలో రూ. 50,000 కోట్లు కేటాయిస్తామని చెప్పినా గతేడాది రూ. 2,000 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ఏడాది కేటాయింపులు కూడా అంతే మొత్తంలో ఉండటం గమనార్హం. గతేడాది ప్రకటించిన రిసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్(ఆర్డీఐ) స్కీమ్ ద్వారా ప్రైవేట్ రంగ డీప్ టెక్ ప్రాజెక్టులకు వచ్చే ఏడేళ్లలో రూ.లక్ష కోట్లు అందాల్సి ఉండగా గతేడాది రూ.20,000 కోట్లు దక్కాయి. ఇందులో ఖర్చయ్యింది రూ. 3,000 కోట్లు మాత్రమే. కేంద్ర కేబినెట్ దీన్ని గత ఏడాది జూలైలో ఆమోదించడం ఇందుకు కారణం. నియమ నిబంధనలు కాస్తా నవంబరుకు కానీ పూర్తి కాలేదు.

కేటాయింపులో ఖర్చు చేసిన మొత్తం తక్కువైనా... అమలు తీరులో ఎన్నో లోపాలున్నా ఆర్డీఐకి జరిపిన కేటాయింపులను బట్టి చూస్తే... ప్రభుత్వం పరిశోధనలను ప్రైవేట్‌పరం చేసేందుకు నిర్ణయించినట్టుగా కనిపిస్తోంది. ‘అనుసంధాన్’కు కేవలం రూ. 2,000 కోట్లే దక్కాయి. ఆర్డీఐకి ఇంతకు పది రెట్లు ఎక్కువ కేటాయించారు. ప్రభుత్వ పరిశోధన సంస్థలకు కేటాయింపులు తగ్గిపోగా... ప్రైవేట్ రంగానికి ఎక్కువయ్యాయి. ఇదేమంత మంచి పరిణామం కాదు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత

అంతరిక్షానికి నిచ్చెనౌతాను!

వ్యూ పాయింట్:

పాడ్‌కాస్ట్: అన్‌పాలిటిక్స్

అతిథి: సునీతా విలియమ్స్, ‘నాసా’ వ్యోమగామి

హోస్ట్: ప్రీతి చౌధరీ, ‘ఇండియా టుడే’ టీవీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్

ఇటీవలి తన భారతదేశ పర్యటనలో భాగంగా ‘నాసా’ వ్యోమగామి సునీతా విలియమ్స్ ‘అన్‌పాలిటిక్స్’ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నారు. ఆ ఇంటర్వ్యూలో, మునుపెన్నడూ వెల్లడించని విషయాలను, భావోద్వేగాలను సునీత పంచుకున్నారు.

‘ద మార్షియన్’ సినిమా గుర్తొచ్చింది!

‘‘మేము అంతరిక్ష నౌకను అంతరిక్ష కేంద్రంతో కలుపుతున్న (డాకింగ్) సమయంలో ఐదు ఇంజిన్లు ఆగిపోయాయని తెలిసి ఆందోళన కలిగింది. అది మా పుస్తకాల్లో ఎక్కడా లేని ఒక పెద్ద సాంకేతిక సమస్య. కానీ ఒక పెద్ద సమస్యను ఎలా పరిష్కరించాలి? చిన్న చిన్న భాగాలుగా చేసుకుని ఒక్కొక్కటిగా పరిష్కరించాలి. అప్పుడు నాకు ‘ద మార్షియన్’ సినిమా గుర్తొచ్చింది. పరిస్థితులు భయంకరంగా ఉన్నప్పుడు, ఆ సమస్య ఎంత పెద్దదని చూడకూడదు; మన ముందున్న చిన్న పని మీద మాత్రమే దృష్టి పెట్టాలి. పనిలో పడిపోతే భయపడటానికి సమయం ఉండదు.

కల్పన కుటుంబంతో మూడు నెలలు

‘కొలంబియా’ ప్రమాదం జరిగిన తర్వాత, నేను హ్యూస్టన్‌లోని కల్పన (చావ్లా) కుటుంబంతో మూడు నెలల పాటు గడిపాను. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు వారితోనే ఉండేదాన్ని. అది ఊహించని, విపత్కాలం. వారికి ఆ బాధ నుండి ఉపశమనం కలిగించాలని అనుకున్నాను. ఆ మూడు నెలల్లో మేము ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం.

ప్రీతి చౌధరీ

సునీతా విలియమ్స్

కల్పనలోని సుగుణాల గురించి నేను వారికి చెప్పాను. ఇండియాలో కల్పన చిన్ననాటి కథలను వారు నాకు చెప్పారు. అది మా అందరికీ ఎంతో ఊరటనిచ్చింది.

రానున్న కాలమంతా చంద్రుడిదే!

‘‘నా రిటైర్మెంట్ గురించి నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఎందుకంటే ఈ అధ్యాయాన్ని ముగించడానికి ఇదే సరైన సమయం అని నా భావన. నా కెరీర్ అంతా అంతరిక్ష కేంద్రంతోనే సరిపోయింది కానీ, రాబోయే కాలం చంద్రుడికి సంబంధించింది. ఇప్పుడు నాకంటే చిన్న వయస్సులో ఉన్నవాళ్లు బాధ్యతలు చేపట్టారు. వారు చరిత్ర సృష్టించటానికి సిద్ధంగా ఉన్నారు. ఇకపై ఆ సీటులో నేనే కూర్చోవాలని లేదు. నేనేమీ అద్భుతాలు చేసే మెజీషియన్‌ని కాదు. నేను కూడా వారిలో ఒకరిని మాత్రమే. వారు పైకి ఎదగడానికి నేను ఒక నిచ్చెనలా తోడ్పడాలని కోరుకుంటున్నాను. (సునీత 27 ఏళ్ల కెరీర్ తర్వాత ‘నాసా’ నుంచి 2025 డిసెంబర్ 27న రిటైర్ అయ్యారు. ఆ సంగతిని నాసా, సునీత ఇండియా పర్యటనలో ఉండగా 2026 జనవరి 21న ప్రకటించింది.)

అదొక అందమైన జీవ ప్రవాహం!

‘‘అంతరిక్షం నుండి భారతదేశాన్ని చూడటం అద్భుతంగా ఉంటుంది, ముఖ్యంగా రాత్రిపూట. మనం పైనుండి వెళ్తున్నప్పుడు, నగరాలన్నీ ఒకదానితో ఒకటి కలిసిపోయి ఒక ‘నరాల వ్యవస్థ’ లాగా కనిపిస్తాయి. మా నాన్న మైక్రోస్కోప్ కింద చూసే బొమ్మల్లా ఉంటాయవి. ముంబై తీరంలో చేపల పడవలు వెలుగుతున్న దీపాల్లా కనిపిస్తాయి. తీరం వెంబడి కాంతులు ఒక ముత్యాల హారంలా మెరుస్తాయి. ఇవన్నీ చూస్తుంటే మా కుటుంబ చరిత్ర, ఈ దేశంతో మాకున్న అనుబంధం నాకు బలంగా గుర్తొస్తాయి. చూడటానికి అది ఒక అందమైన జీవప్రవాహంలా అనిపిస్తుంది.

పెంపుడు కుక్క ప్రేమ జ్ఞాపకాలు

‘‘నా చేతిపై ఉన్న ఈ పాదముద్రల పచ్చబొట్లు మా పెంపుడు కుక్కవి. ఇవి నా దగ్గర 2001 నుండి 2017 వరకు ఉన్న ‘జాక్ రస్సెల్ టెర్రియర్’ రకానికి చెందిన నా పెంపుడు కుక్క అసలు పాద ముద్రలు. అది నాతో పాటు శిక్షణ కోసం రష్యాకు కూడా వచ్చింది. నేను పరిగెత్తేటప్పుడు లేదా ఈత కొట్టేటప్పుడు దానిని చూస్తుంటే, నాకు ఇంటితో ఉన్న అనుబంధం గుర్తుకొస్తుంది. అంతరిక్షంలో ఉన్నప్పుడు, జంతువులు మనకు స్వచ్ఛమైన నిజాయితీ గల ప్రేమను గుర్తు చేస్తాయి. మన మనుషుల్లాగా వాటికి మనసులో గందరగోళం ఉండదు. నా శరీరంపై ఉన్న ఈ గుర్తులు నన్ను ఎప్పుడూ నా ఇంటి జ్ఞాపకాలతో, ఆ స్వచ్ఛతతో కలుపుతూ ఉంటాయి.

❑ ఎడిటోరియల్ టీమ్

పేరుకే కేటాయింపులు...

అంతర్జాతీయంగా ట్రంప్ నిర్ణయాలు ప్రపంచ విపణిని కుదిపేస్తున్న వేళ, దేశీయంగా రూపాయి పతనం ఆందోళన కలిగిస్తోంది. నిరుద్యోగం, ధరల పెరుగుదల, కొనుగోలు శక్తి మందగించడం వంటి ఆర్థిక సంక్షోభ సూచికలు కళ్లముందే ఉన్నా... కేంద్ర ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్లు పేలవమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. గత దశాబ్ద కాలంగా ‘అచ్ఛే దిన్’, ‘అమృత్ కాల్’ వంటి పడికట్టు పదాలతో కాలం వెళ్లదీస్తున్న పాలకులు, ఈసారి ‘వికసిత్ భారత్–2047’ అనే కొత్త రాగం అందుకున్నారు. 2022 నాటికే ‘సొంత ఇల్లు’, ‘రైతు ఆదాయం రెట్టింపు’ వంటి హామీలు నీటి మూటలని తేలడంతో, ప్రజలను భ్రమల్లో ముంచేందుకు సుదూర భవిష్యత్తు లక్ష్యాలను తెరపైకి తెచ్చారు.

గణాంకాలను పరిశీలిస్తే ఈ బడ్జెట్ అసలు రంగు బయటపడుతుంది. అట్టహాసంగా ప్రకటించిన పథకాలకు, వాస్తవ ఖర్చులకు పొంతన లేదు. ముఖ్యమైన ‘హర్ ఘర్ జల్’ పథకంలో 50 వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయకుండా వదిలేశారు. రాష్ట్రాలకు ఇచ్చే గ్రాంట్లలో ఏకంగా లక్ష కోట్లకు పైగా కోత పెట్టడం గర్హనీయం. ప్రభుత్వ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్‌కు మూలధన సాయం పేరుతో ఊరించి, తీరా కేటాయింపుల్లో మొండి చేయి చూపడం ఆనవాయితీగా మారింది. శాస్త్రీయ పరిశోధనల నిధుల్లో 85 శాతం ఖర్చు చేయకపోవడం ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలను వెల్లడిస్తోంది.

గతేడాది ప్రకటించిన 10 వేల కోట్ల స్టార్టప్ ఫండ్ నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నది చేదు నిజం. ఇప్పుడు మళ్ళీ ‘సెమీ కండక్టర్ మిషన్’, ‘మెగా టెక్స్‌టైల్ పార్కు’ల పేరుతో వేలాది కోట్లు ఖర్చు చేస్తామంటూ కొత్త ఆశలు కల్పిస్తున్నారు. రాష్ట్రాలకు పన్నుల్లో 41 శాతం వాటా ఇస్తున్నామనే ప్రకటనలు కూడా అవాస్తవమే. వాస్తవానికి ఇది 37 శాతం కూడా దాటడం లేదు. ఎక్సైజ్, కస్టమ్స్ సుంకాలను తగ్గిస్తూ... రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సిన అవసరం లేని సర్ ఛార్జీలు, సెస్సులను పెంచుతూ కేంద్రం కపట నీతిని ప్రదర్శిస్తోంది.

వ్యవసాయ మౌలిక వసతుల సెస్సు (ఏఐడీసీ) పేరుతో పెట్రోల్, డీజిల్‌పై ప్రజల ముక్కు పిండి లక్షల కోట్లు వసూలు చేస్తున్నారు. గత ఐదేళ్లలో సుమారు 4.74 లక్షల కోట్లు వసూలైనా, మార్కెట్లు, కోల్డ్ స్టోరేజీలపై పెడుతున్న ఖర్చు ఏడాదికి రూ. 100 కోట్లు కూడా లేకపోవడం మహా మోసం. 10 వేల ఈ–నామ్‌ల అనుసంధాన లక్ష్యంలో ఐదేళ్ల తర్వాత కనీసం 16 శాతం కూడా పూర్తి చేయలేకపోయారు. ఎరువుల సబ్సిడీని తగ్గిస్తూ, కార్పొరేట్ డేటా సెంటర్లకు రాయితీలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వం తన కార్పొరేట్ అనుకూల స్వభావాన్ని చాటుకుంది.

పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు పూర్తిగా మొండి చేయి చూపించిన బడ్జెట్ ఇది. మందగిస్తున్న వస్తు సేవల వినియోగం, పెరుగుతున్న వ్యక్తిగత రుణాలు, స్తంభించిపోయిన ఆదాయాలు వంటి వాస్తవిక విత్త విపత్తులకు ఒక్క సమాధానం గానీ, పరిష్కారం గానీ చూపెట్టలేక పోయింది.

– రాంపల్లి శశి కుమార్ । చార్టర్డ్ అకౌంటెంట్

డేటా పాయింట్

‘నిఫా’ కలకలం

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల ప్రాణాంతక నిఫా వైరస్ కేసులు నమోదయ్యాయి. 2011 నుంచి దేశంలో ఇప్పటివరకూ కేరళ, బెంగాల్‌లలోనే ఈ కేసులు వెలుగుచూశాయి. గత 25 ఏళ్లలో మన దేశంలో ఈ కేసుల మరణాల రేటు 72 శాతం.

ఆధారం: ప్రపంచ ఆరోగ్య సంస్థ, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్

దేశం	కాలం	కేసులు	మరణాలు
భారత్	2001-25	108	78
బంగ్లాదేశ్	2001-24	341	242
మలేషియా	1998-99	283	109
ఫిలిప్పీన్స్	2014	17	9

నిందించడం అజ్ఞానం

జ్యోతిర్మయం

కురుక్షేత్ర సంగ్రామంలో నూరుగురు పుత్రులను పోగొట్టుకున్న గాంధారి శోకానికి అంతం లేదు. శ్రీకృష్ణుడు మనస్ఫూర్తిగా ప్రయత్నించి ఉంటే ఇరుపక్షాల మధ్య సంధి కుదిరి యుద్ధం తప్పేదనీ, తనకు ఇంత శోకం ఉండేది కాదనీ శ్రీకృష్ణుడిని నిందించి, శపించింది. ‘శ్రీకృష్ణా... దైవం తలిస్తే కాని కార్యం ఏది ఉండగలదు? సంధి పొసగే మార్గం వీగిపోయి నీవు ఏ రోజు ఉపప్లావ్యపురానికి తిరిగి వెళ్ళిపోయావో, ఆ రోజుననే నా పుత్రులు అజీవితులుగా మారిపోయారు. వారి పట్ల మాతృభావనను ప్రదర్శించడం ఇక మానుకొమ్మని ఆ రోజుననే భీష్ముడు, విదురుడు నాకు చెప్పారు. వారి మాటలు అబద్ధాలు కావని నిరూపితమైంది. జనార్దనా! పాండురాజు పుత్రులు, ధృతరాష్ట్ర కుమారులు సఖ్యత కోల్పోయి వాళ్ళలో వాళ్ళు పోట్లాడుకుని భస్మమయ్యారు. దీనిని నీవు చూస్తూ ఎందుకు ఉపేక్షించి ఊరుకున్నావు? పతిసేవా పరాయణత తప్ప అన్యం తెలియని నేను, నా పతిసేవలో సంపాదించుకున్న తపోబలంతో శపిస్తున్నాను. నేటి నుండి సరిగ్గా ముప్పది ఆరవ సంవత్సరానికి నీ కుటుంబంలోనూ అంతఃకలహం పుట్టి, మీలో మీరు పోట్లాడుకుని నశిస్తారు. ఆ సమయానికి నీవు నీ బంధు జనులకు దూరమై, ఒంటరిగా అడవిలో అనాథ మరణం పొందుతావు. ఈ భరతవంశ స్త్రీల వలెనే నీ కుటుంబంలోని స్త్రీలు కూడా రోదిస్తారు!’

తే. మున్నకాదె యాదవులకు మునివరేణ్య / కలిత దారుణ శాపంబు గలదు నీకు/ నేల చర్వితచర్వణమిట్లు సేయ? / దీన నీవేమి త్రవ్వితి? దాని జెపుమ! గాంధారి శాపాన్ని విన్న శ్రీకృష్ణుడు, చిరునవ్వు నవ్వి ‘వాళ్ళకు మునివర్యులు ఇచ్చిన శాపం ముందే ఉంది. ఇప్పుడు నీవు కొత్తగా తవ్వి తీసి చెప్పే సంగతి ఏముంది ఇందులో? అది చెప్పు!’ అన్నాడని ఆంధ్రమహాభారతం, స్త్రీపర్వం, ద్వితీయాధ్యాయంలోని పై పద్యం చెబుతోంది. శ్రీకృష్ణుడిని నిందించడంలో తన తప్పిదాన్ని గ్రహించిన గాంధారి, మరేమీ మాట్లాడక ఊరకుండిపోయింది. ఆవేశంలో, అజ్ఞానంలో భగవంతుడిని నిందించడం మంచిది కాదని పై సన్నివేశం బోధిస్తోంది.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

కల్తీ జరిగిందని నమ్మించడానికే ఏకసభ్య కమిషన్

వైఎస్సార్‌సీపీ నేతలు కన్నబాబు, మజ్జి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చేసిన ప్రచారం అబద్ధమని సీబీఐ సిట్ చార్జిషీట్ సాక్షిగా బట్టబయలవడంతో.. తమపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత నుంచి బయటపడ్డానికి కూటమి నేతలు మరింత దుష్ప్రచారానికి తెగబడుతున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, మాజీమంత్రి కురసాల కన్నబాబు, పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) విమర్శించారు. రాజకీయ లబ్ధికోసం చంద్రబాబు చేసిన కుట్రలే ఆయన ప్రభుత్వానికి ఉరితాడులా బిగుసుకున్నాయన్నారు. కల్తీ జరిగిందంటూ నివేదిక రాయించుకుని వైఎస్సార్‌సీపీ నేతలను జైళ్లకు పంపించడమే లక్ష్యంగా ఏకసభ్య కమిషన్ అంటున్నారని మండిపడ్డారు. కురసాల, మజ్జి శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జంతువుల కొవ్వు కలిసిందన్న ప్రచారం సీబీఐ సిట్ చార్జిషీట్‌తో వికటించడంతో బాత్రూమ్‌ల క్లీనింగ్‌కు వాడే హార్పిక్ వంటి రసాయనాలను లడ్డూ తయారీకి వాడారంటూ చంద్రబాబు కొత్త డ్రామాకు తెరదీశారని విమర్శించారు. తిరుమల లడ్డూ అంశాన్ని ప్రచారం చేసుకుని రాబోయే మూడేళ్లు డైవర్షన్ పాలిటిక్స్ చేయాలని చంద్రబాబు ఫిక్సయ్యారన్నారు. జంతువుల కొవ్వు కలవలేదని జనసేన ఎమ్మెల్యేల సమావేశంలో చెప్పిన పవన్‌కళ్యాణ్.. చంద్రబాబుతో జరిపిన ఏకాంత చర్చల తర్వాత మాటమార్చేశారని చెప్పారు. తప్పుడు ప్రచారాలను ఖండిస్తున్నందుకే అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల ఇళ్లపై టీడీపీ గూండాలతో దాడులు చేయించారని వారు పేర్కొన్నారు.

కాపుల్లో ఎవరికి అన్యాయం జరిగినా వైఎస్సార్‌సీపీ అండ

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మహారాణిపేట: కాపులు అంటే మొదటి నుంచి చంద్రబాబుకు కక్ష ఉందని, వంగవీటి రంగాను హత్య చేశారని, ముద్రగడను అనేక రకాలుగా వేధించారని, ఇప్పుడు అంబటి ఇంటి మీద దాడి చేసి ఆయన మీద తప్పుడు కేసులు పెట్టారని, ఇదంతా రాజకీయ ప్రేరేపితమని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. శుక్రవారం విశాఖజిల్లా మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో అమర్‌నాథ్ మాట్లాడుతూ కాపుల్లో ఎవరికి అన్యాయం జరిగినా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. అంబటి రాంబాబుపై తప్పుడు కేసులు వ్యవహారంలో న్యాయ పరంగా పోరాటం చేస్తామన్నామని పేర్కొన్నారు. శనివారం చలో గుంటూరు కార్యక్రమంలో భాగంగా అంబటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తామన్నారు. తాము చేసేది సంఘీభావ యాత్ర మాత్రమేనని స్పష్టం చేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్ రంగంలోకి దిగే వరకు అంబటి ఇంటిపై దాడి చేసిన వాళ్లపై సర్కారు కేసులు పెట్టలేదని పేర్కొన్నారు.

లంచం కేసులో డీసీహెచ్‌ఎస్‌కి ఏడేళ్ల జైలు

కడప అర్బన్: లంచంతీసుకున్న కేసులో కర్నూలు ఏసీబీ కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన అధికారికి ఏడేళ్లు జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది.వివరాలు..వైఎస్సార్ కడప జిల్లా ఆస్పత్రి సేవల (డీసీహెచ్‌ఎస్)సమన్వయ అధికారిగా డాక్టర్ మాడభూషి శేష పద్మజ విధులు నిర్వహించారు. వార్షిక ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు జూనియర్ అసిస్టెంట్ రాధిక నుంచి డాక్టర్ శేష పద్మజ రూ.5వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని రాధిక కడప ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. 2019 ఆగస్టు 27న రూ.5 వేలు తీసుకుంటుండగా.. ఏసీబీ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో డాక్టర్ శేష పద్మజను అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి వాదనలు విన్న కర్నూలుఏసీబీ కోర్టు జడ్జి శుక్రవారం మాడభూషి శేష పద్మజ(ప్రస్తుతం రిటైర్డ్)కు ఏడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2 లక్షలు జరిమానా విధించారు. బాధితురాలు రాధికకు రూ.లక్ష పరిహారం ఇవ్వాలని తీర్పునిచ్చారు.

ఒక్కరితో ఆగని అరవ అరాచకాలు

ఎమ్మెల్యే అయినందుకు శుభాకాంక్షలు చెబుతూ మెసేజ్ చేసిన అమ్మాయిలకు వల

ఓ అమ్మాయి శరీరాన్ని వర్ణిస్తూ శ్రీధర్ చేసిన మెసేజ్‌లు



వివాహితతో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ చాటింగ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వోద్యోగి అయిన ఓ మహిళను లైంగికంగా వేధించారంటూ పీకల్లోతు ఆరోపణల్లో కూరుకుపోయిన జనసేన కూటమి పార్టీ రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ రాసలీలలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా.. బాధిత మహిళ శుక్రవారం ఎమ్మెల్యేకు సంబంధించిన మరికొన్ని ప్రైవేట్ వీడియోలు, చాట్‌లు బయటపెట్టారు. వీటినిబట్టి ఆయన మరికొంత మంది మహిళలకు వల వేసేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఆ వివరాలు..

రాయలేని విధంగా మెసేజ్‌లు

బెంగళూరులో చదువుకుంటున్న ఓ అమ్మాయి శ్రీధర్ ఎమ్మెల్యే కాగానే శుభాకాంక్షలు చెబుతూ ఓ మెసేజ్ చేసింది. అంతే.. ఆమెకు అరవ శ్రీధర్ వరుసగా మెసేజ్‌లు చేస్తూనే ఉన్నారు. కొన్నింటికి సమాధానం ఇచ్చిన ఆ అమ్మాయి.. 'మీరు ఎమ్మెల్యే కదా.. ఇలా ఇంతసేపు అమ్మాయిలతో చాటింగ్ చేసేంత తీరిక, ఖాళీ దొరుకుతుందా' అని సందేహం వ్యక్తంచేసింది. ఉంది కాబట్టే మెసేజ్‌లు చేస్తున్నానని శ్రీధర్ బదులిచ్చారు. మరో అమ్మాయితో చాటింగ్ చేసిన ఎమ్మెల్యే ఆమె శరీరాన్ని రాయలేని విధంగా వర్ణిస్తూ మెసేజ్‌లు చేశారు.

వద్దన్నా వినలేదు..

ఓ వివాహితతోనూ వ్యవహారం నడపాలని కూడా ఎమ్మెల్యే చూశారు. ఆమెతో గతంలో ఉన్న పరిచయాన్ని ఉపయోగించుకుని చిన్ననాటి స్నేహితుడినంటూ ఆమెను లోబరుచుకునేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అంతేకాక.. ఆమెను ఏకాంతంగా గడిపేందుకు రావాల్సిందిగా మెసేజ్‌ల రూపంలో అడిగారు. దానికి ఆమె నిరాకరించారు. తాను వివాహితనని, భర్త, పిల్లలు ఉన్నారని, తనతో ఈ విధంగా అసభ్యకరంగా మాట్లాడటం సరికాదని వారించారు. కాదూ కూడదంటే మంచి స్నేహితులుగా ఉందామని హితవు చెప్పారు. అయినాసరే ఎమ్మెల్యే శ్రీధర్ వినిపించుకోకుండా ఆమె వెంటపడుతూనే ఉన్నారు. ఇలా ఇవి కొన్ని ఆధారాలు మాత్రమేనని, ఇంకా చాలా అధారాలు, ఎంతమంది మహిళలతో ఎమ్మెల్యే ఈ విధంగా ప్రవర్తించారనే వీడియోలు తన వద్ద ఉన్నాయని ప్రభుత్వోద్యోగి అయిన బాధిత మహిళ చెబుతున్నారు. అదే విధంగా.. ఎమ్మెల్యే ఇతర మహిళల గురించి చేసిన అసభ్యకర వ్యాఖ్యలకు సంబంధించి వాట్సప్ చాటింగ్‌ను కూడా ఆమె బయటపెట్టారు. వాట్సప్, స్నాప్‌చాట్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను ఉపయోగించి వారిని బుట్టలో వేసుకోవాలని ఎమ్మెల్యే చూశారని ఆరోపించారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayindia
ద.మ. రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును
టెండరు ప్రకటన నం.: G/E.29/Tr./Tender Notice/49/2025-26, తేది: 04.02.2026
భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/ ట్రాక్షన్/ గుంతకల్ వారు దిగువ పనుల కోసం ఇ-టెండర్లు కోరుతున్నారు.
టెండరు నం.: GTL-TRD-29-eTN-80-2025-26, **పని పేరు:** గుంతకల్ డివిజన్: రేణిగుంట స్టేషన్ వద్ద ట్రిప్ షెడ్ పెంపుదలకు సంబంధించిన OHE మోడిఫికేషన్స్. **సుమారు విలువ:** రూ. 31,97,896.50/-, **బయానా:** రూ. 64,000/-
టెండరు ముగింపు తేది మరియు సమయం: 26.02.2026న 15.00 గం॥కు.
గమనిక: 1.టెండరుదారులు www.ireps.gov.in నుండి టెండరు డాక్యుమెంట్‌ను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in కు లాగిన్ కావలెను. సవరణ ఏదైనా ఉంటే ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును.
సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్, గుంతకల్
A2391 PUB/1987
తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

వారాహి అమ్మవారి ఆలయంలో నిర్మాణాల కూల్చివేత

అటవీ శాఖ స్థలంలో నిర్మాణాల పేరుతో రాత్రివేళ జేసీబీతో నేలమట్టం

- ధ్వంసమైన నవగ్రహ మండపం, దేవతామూర్తుల విగ్రహాలు
- భక్తుల ఆందోళన... ప్రొద్దుటూరులో ఉద్రిక్తత

ఆలయంలో అటవీశాఖ అధికారులు కూల్చిన మండపం

ప్రొద్దుటూరు క్రైం: గతంలో రకరకాల సాకులతో రాష్ట్రంలోని ఆలయాలను కూల్చివేసిన చంద్రబాబు ప్రభుత్వం, ఇప్పుడు మరో ఆలయంపై పడింది. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల రోడ్డులో ఉన్న వారాహి అమ్మవారి ఆలయంలోని కొన్ని నిర్మాణాలను గురువారం రాత్రి అటవీశాఖ అధికారులు జేసీబీతో కూల్చేశారు. అదే సమయంలో అక్కడున్న నవగ్రహ మండపం కూలిపోవడంతో దేవతామూర్తుల విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ప్రొద్దుటూరులోని ఎర్రగుంట్ల రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వెనుక భాగంలో కొన్నేళ్ల క్రితం శ్రీ లక్ష్మీనరసింహస్వామి, శ్రీ వారాహి మాత ఆలయాలను దాతల సాయంతో నిర్మించారు. ఆలయ ప్రాంగణంలోనే కొత్తగా మరొక మండపం నిర్మాణాన్ని చేపట్టారు. అయితే, అది అటవీశాఖ స్థలమని చెప్పి గురువారం రాత్రి అటవీశాఖ రేంజ్ అధికారి (ఎఫ్‌ఆర్‌వో) హేమాంజలి సిబ్బందితో వచ్చి నూతన నిర్మాణాన్ని జేసీబీతో కూల్చేశారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న నవగ్రహ మండపం, దేవతామూర్తుల విగ్రహాలు ధ్వంసమయ్యాయి. ఈ విషయం తెలిసి వీహెచ్‌పీ, ఇతర హిందూ సంఘాల నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అటవీశాఖ అధికారుల తీరును తప్పుపట్టారు. దీంతో అధికారులు వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం కూడా హిందూ సంఘాల ప్రతినిధులు, భక్తులు భారీగా అక్కడికి చేరుకున్నారు. కొద్దిసేపటి తర్వాత స్థానిక టీడీపీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కూడా వచ్చారు. 'ఇది ఇక్కడి అటవీశాఖ అధికారులు చేసినపని కాదు... కర్నూలు నుంచి వచ్చిన అధికారులు తొలగించారు.' అని ఎమ్మెల్యే చెప్పారు. దీనిపై భక్తులు అభ్యంతరం వ్యక్తంచేసి.. స్థానిక అధికారులే కూల్చారని స్పష్టంచేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందిస్తూ.. 'ఈ ప్రాంతమంతా అటవీశాఖకు చెందినది. అనుమతి లేకుండా ఎలాంటి కట్టడాలు చేపట్టకూడదు' అని చెప్పారు. దీనిపై ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఆలయం బయట కొత్తగా నిర్మాణాలు చేపట్టలేదని, లోపలే మండపం నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం ఇక ఈ ఘటనను ఎవరూ వివాదం చేయొద్దని చెప్పి ఎమ్మెల్యే వెళ్లిపోయారు. ఆయన వెళ్లిన వెంటనే హిందూ సంఘాల ప్రతినిధులు, భక్తులు ఆలయం ఎదుట ఎర్రగుంట్ల రోడ్డుపై బైఠాయించి అటవీశాఖ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాతల సహకారంతో ఆలయం లోపల నిర్మాణాలు చేపడితే ఎలా కూల్చివేస్తారని భక్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు, అటవీశాఖ అధికారులు వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా భక్తులు వినలేదు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. సుమారు గంటన్నర తర్వాత తహసీల్దార్ గంగయ్య వచ్చి ఆలయంలో కూల్చిన కట్టడాలను 15 రోజుల్లో తిరిగి నిర్మిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No.45/VMC/CDB/2025-26,Dt.06-02-2026
Roads, Drain, Culvert, Water supply, repairs, maintenance works (Total 51 works)-Est. Amount Rs.1135.94 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen @ www.tender.apeprocurement.gov.in.
S/d- For COMMISSIONER

ఏపీపీజీఈసెట్‌కు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీపీజీఈసెట్–2026కు ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. శుక్రవారం నుంచి దరఖాస్తులు ప్రారంభించగా మార్చి 6వ తేదీ నాటికి ఆన్‌లైన్ అప్లికేషన్లను సమర్పించాలని సూచించింది. ఆ తర్వాత రూ.వెయ్యి అపరాధ రుసుముతో మార్చి 11వ తేదీ వరకు, రూ.2 వేలు రుసుముతో మార్చి 16 వరకు, రూ.4వేలు అపరాధ రుసుముతో 19 వరకు, రూ.10 వేలు రుసుముతో 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. 24, 25 తేదీల్లో దరఖాస్తుల సవరణకు అవకాశం కల్పించింది. ఏప్రిల్ 15న హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, 28 నుంచి 30 తేదీల్లో పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపింది. ప్రాథమిక కీ విడుదల, అభ్యంతరాల స్వీకరణ అనంతరం మే 14న ఫలితాలు ప్రకటించనున్నట్టు పేర్కొంది. ఈ పీజీ ఈసెట్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్నట్టు తెలిపింది.

సీపీఎం నాయకుడు అప్పలరాజు విడుదల

ఆరిలోవ: అనకాపల్లి జిల్లా సీపీఎం కార్యదర్శివర్గ సభ్యుడు ఎం అప్పలరాజు జైలు నుంచి శుక్రవారం విడుదలయ్యారు. రైతుల సమస్యలపై చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆయన్ను గత నెలలో పోలీసులు అరెస్టు చేశారు. ప్రభుత్వం పీడీ యాక్టు పెట్టి జైలుపాలు చేసింది. దీనిపై సీపీఎం నాయకులు రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయగా.. ఆయన విశాఖ జైలు నుంచి విడుదలయ్యారు.

ANDHRA PRADESH POWER DEVELOPMENT COMPANY LIMITED
E-PROCUREMENT NOTIFICATION
APPDCL invites Tender for Supply of "Various Sizes of GI Pipes & GI ERW pipes for CAM divisions of Stage-I & II/SDSTPS" through APGENCO e-Procurement Platform vide Tender No.610002169. For Further details, please visit: www.apgenco.gov.in OR https://etender.apgenco.gov.in/
CHIEF GENERAL MANAGER
DIPR.No. 4801PP/CL/Advt/1/1/2021-22 Dt.06.02.2026

కాన్పు చేయలేం.. ఎక్కడికైనా వెళ్లండి

108లోనే మగబిడ్డ ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

- గిరిజన గర్భిణీకి కాన్పు చేయలేమని పంపిన రెండు ప్రభుత్వాస్పత్రుల వైద్యులు
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఘటన...
- ప్రభుత్వాస్పత్రుల్లో దిగజారిన వైద్యసేవలకు నిదర్శనం

రొంపిచెర్ల: పురిటి నొప్పులతో వెళ్లిన గిరిజన మహిళకు కాన్పు చేయలేమని రెండు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు చేతులెత్తేశారు. తాము కాన్పు చేయలేమని, మరెక్కడికైనా వెళ్లాలని పంపించారు. చివరికి ఆమె 108లోనే మగబిడ్డను ప్రసవించింది. ప్రభుత్వాస్పత్రుల్లో దిగజారిన వైద్య సేవలకు అద్దంపట్టిన ఈ ఘటన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జరిగింది. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళ్యెం మండలం చింతగుంట గ్రామ పంచాయతీ నాగినేనివారిపల్లె ఎస్టీ కాలనికి చెందిన సుబ్రహ్మణ్యం భార్య ఎం.నిరంజనకుమారి(28)కి గురువారం రాత్రి 7 గంటలకు పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేయగా, చిత్తూరు జిల్లా రొంపిచెర్ల పీహెచ్‌సీ నుంచి అంబులెన్స్ వచ్చి చిన్నగొట్టిగల్లులోని 50 పడకల ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి బిడ్డ ఉమ్మ నీరు తాగిందని, కాన్పు చేయలేమని శుక్రవారం ఉదయం 8 గంటలకు నిస్సహాయత వ్యక్తంచేశారు. అనంతరం అన్నమయ్య జిల్లా పీలేరులో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి 'మా దగ్గర మీరు అసలు పరీక్షలు చేయించుకోలేదు. మేం హైరిస్క్ కాన్పు చేయలేము.' అని చెప్పి వెనక్కి పంపారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లే స్థోమత లేక కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. చివరికి 108లోనే తిరుపతిలోని ప్రసూతి ఆస్పత్రికి తరలిస్తుండగా, రొంపిచెర్ల క్రాస్–చిన్నగొట్టిగల్లు మధ్యలో నిరంజనకుమారికి డెలివరీ అయ్యింది. అంబులెన్స్‌లోని టెక్నీషియన్ నవీన్‌కుమార్, పైలెట్ రెడ్డెప్ప చాకచక్యంగా ఆమెకు 108లోనే సాధారణ కాన్పు చేశారు. అనంతరం బాబును అబ్జర్వేషన్ కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. తల్లిని ఇంటికి పంపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ఆరు కాన్పులూ సాధారణమే..

గిరిజన మహిళ నిరంజనకుమారికి ఇది ఆరో కాన్పు. ఇంతకుముందు ఐదు సాధారణ కాన్పులలో ఐదుగురు ఆడపిల్లలు జన్మించారు. వారిలో ఇద్దరు మృతిచెందారు. ప్రస్తుతం ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. ఆరో కాన్పు కూడా సాధారణమే కావడం, మగబిడ్డ పుట్టడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.



ఎంబీయూపై అసత్య ఆరోపణలు తగదు

- ఫీజులపై ప్రతి అంశం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలుసు
- కిడ్నాప్ ఘటనలో మోహన్‌బాబు, విష్ణులకు సంబంధం లేదు
- మీడియా ఇన్‌చార్జ్ డాక్టర్ శాఖమూరి రవిచంద్రబాబు

చంద్రగిరి: కళాశాలల స్థాయి నుంచి వర్సిటీ స్థాయికి ఎదిగిన మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ)పై పనిగట్టుకుని అసత్య ఆరోపణలు చేయడం తగదని ఎంబీయూ మీడియా ఇన్‌ఛార్జ్ డాక్టర్ శాఖమూరి రవిచంద్రబాబు అన్నారు. కొన్ని విద్యార్థి సంఘాలు, కొంతమంది వ్యక్తులు ఎంబీయూ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల చోటు చేసుకున్న పలు ఘటనలపై ఆయన శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. 34 ఏళ్లుగా విద్యానికేతన్ పరిధిలో నడుస్తున్న విద్యా సంస్థలు నేడు మోహన్‌బాబు యూనివర్సిటీగా అభివృద్ధి చెందాయని తెలిపారు. నాణ్యమైన విద్య, ప్రతిభకు ప్రమాణాలకు గా ఎంబీయూ నిలిచిందన్నారు.

అదనపు ఫీజుల వసూళ్లు అవాస్తం

ఎంబీయూలో విద్యార్థుల నుంచి అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. వర్సిటీలో చేరే ప్రతి విద్యార్థికి విద్యావకాశాలు, ఫీజుల వివరాలు, సౌకర్యాలు ముందుగానే చెబుతున్నామన్నారు. ఈ విషయంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. అసత్యాలను, అబద్ధాలను పదే పదే చెప్పినంత మాత్రాన అవి నిజం కాలేవన్నారు. వర్సిటీ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం కొంతమంది స్వార్థపూరిత దుష్టశక్తులకు అసూయ కలిగించిందన్నారు. అటువంటి దుష్ట శక్తులు, విద్యార్థి సంఘాల ముసుగులో వర్సిటీ, విద్యానికేతన్ విద్యాసంస్థల ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. ఎంబీయూపై అసత్య ప్రచారాలు, ఆందోళనలు, చేస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే చంద్రగిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

తిరుపతి ఘటనకు చాన్సలర్‌కు సంబంధం లేదు

తిరుపలో చోటు చేసుకున్న కిడ్నాప్ ఘటనలో చాన్సలర్ మంచు మోహన్‌బాబు, ప్రో–చాన్సలర్ మంచు విష్ణుకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. పోలీసులు, న్యాయవ్యవస్థపై వర్సిటీకి సంపూర్ణ విశ్వాసం ఉందని, తదుపరి చర్యల కోసం తాము పూర్తిగా సహకరిస్తామని చెప్పారు.

శుక్రవారం లోక్‌సభలో వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు

వాయిదా పర్వం

న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్షాల ఆందోళనలు శుక్రవారం కూడా నిర్నిరోధంగా కొనసాగాయి. దాంతో కార్యకలాపాలేవీ సాగించకుండానే సభ మరోసారి వాయిదాపడింది. ఉదయం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు పలు అంశాలపై ఆందోళనకు దిగారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ ఓం బిర్లా వారించినా లాభం లేకపోయింది. దాంతో, ఇలాంటి అంతరాయాలతో ఈ సమావేశాల్లో ఇప్పటికే ఏకంగా 19 గంటల విలువైన సభా సమయం వృథా అయిందంటూ ఆయన ఆవేదన వెలిబుచ్చారు. కాంగ్రెస్ సభ్యురాలు ప్రియాంకగాంధీ అడగాల్సిన ప్రశ్న కూడా జాబితాలో ఉందని తెలిపారు. అయినా లాభం లేకపోవడంతో, ఇటువంటి సభను తాను నడపలేనంటూ స్పీకర్ ఆగ్రహం వెలిబుచ్చారు. నాలుగు నిమిషాలకే సభను వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమయ్యాక కూడా అవే దృశ్యాలు కన్పించాయి. సభ్యులు నినాదాల నడుమ తిరిగి వెల్‌లోకి దూసుకెళ్లారు. తమ స్థానాల్లోకి తిరిగి వెళ్లాల్సిందిగా ప్యానెల్ స్పీకర్ కృష్ణప్రసాద్ తెన్నేటి పదేపదే విజ్ఞప్తి చేసినా లాభం లేకపోయింది. దాంతో సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

వారం రోజులుగా...

లోక్‌సభ గత సోమవారం నుంచీ విపక్షాల నిరసనలతో అట్టుడుకుతోంది. పలు అంశాలపై అధికార, విపక్షాలు నడుమ నువ్వా, నేనా అన్నట్టు తలపడుతున్నాయి. 2020 భారత్–చైనా ఘర్షణకు సంబంధించి నాటి ఆర్మీ చీఫ్ ఎం.ఎం.నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ప్రస్తావించేందుకు రాహుల్ చేసిన ప్రయత్నం వివాదానికి దారి తీయడం తెలిసిందే. దానిపై మొదలైన రగడ కొనసాగుతూనే ఉంది. దాంతో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని గత 22 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని సమాధానం లేకుండానే సభ ఆమోదించింది.

కాంగ్రెస్ నిరసన

లోక్‌సభ వాయిదా పడ్డాక పార్లమెంటు ప్రాంగణంలో మకరద్వారం వద్ద కాంగ్రెస్‌తో పాటు పలు ఇతర పార్టీల ఎంపీలు నిరసనకు దిగారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం, నరవణె పుస్తకం, 8 మంది ఎంపీల సస్పెన్షన్ తదితరాలపై నినాదాలతో హోరెత్తించారు. 'వాణిజ్య వల' అంటూ అమెరికా ఒప్పందంపై బ్యానర్ ప్రదర్శించారు. ప్రియాంక, సస్పెండైన ఎంపీలతో పాటు పలువురు వీటిలో పాల్గొన్నారు.

అగ్ని-3 పరీక్ష విజయవంతం

బాలాసోర్ (ఒడిశా): బారత సాయుధ దళాల అమ్ములపొది మరింత బలోపేతమైంది. శుక్రవారం జరిపిన అణ్వస్త్ర సామర్థ్యంతో కూడిన అత్యాధునిక అగ్ని–3 ఖండాంతర క్షిపణి పరీక్ష విజయవంతమైంది. 3,000 కిలోమీటర్ల పై చిలుకు దూరంలోని లక్ష్యాలను ఛేదించగల 17 మీటర్ల పొడవైన ఈ సర్ఫేస్ టు సర్ఫేస్ క్షిపణిని ఒడిశా తీర సమీపంలోని చందీపూర్‌లోని స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ కేంద్రం నుంచి ప్రయోగించారు. ఈ సందర్భంగా క్షిపణి తాలూకు వ్యవస్థలన్నీ పూర్తిస్థాయిలో అంచనాల మేరకు పని చేసినట్టు అధికారులు వెల్లడించారు. ''రెండు దశలతో కూడిన ద్రవ ఇంధన ఆధారిత క్షిపణి ఆద్యంతం నిర్దేశించిన మార్గంలో దూసుకెళ్లింది. బంగాళాఖాతంలో లక్ష్యాన్ని కచ్చితత్వంతో గమ్యాన్ని ఛేదించింది''అని తెలిపారు. ప్రయోగం ద్వారా ఉద్దేశించిన లక్ష్యాలన్నింటినీ పూర్తిస్థాయిలో సాధించినట్టు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) వర్గాలు వెల్లడించాయి. అత్యాధునిక రాడార్ వ్యవస్థల ద్వారా క్షిపణి గమనాన్ని అనుక్షణం గమనిస్తూ వచ్చినట్టు వివరించాయి. అగ్ని–3 ఇప్పటికే సైన్యం అమ్ములపొదిలోకి చేరింది. ఏకంగా 1,500 కిలోలకు మించిన పేలోడ్‌తో 3,000 కి.మీ. పై చిలుకు దూరంలోని లక్ష్యాలను అలవోకగా ఛేదించగల సామర్థ్యం దీని సొంతం.

విద్య.. మోయలేని భారం కాదు

పరీక్షలను పండుగలా భావించాలి

- మార్కులు ఒక్కటే పరమావధి కాదు
- జీవితాన్ని మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాలి
- బలమైన సంకల్పం ఉంటే జీవన విధానం మారుతుంది
- ఆశించిన లక్ష్యం కోసం కష్టపడాలి
- 'పరీక్షా పే చర్చ'లో విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ సూచన

పరీక్షా పే చర్చ సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో విద్యార్థులతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: విద్యాభ్యాసం అంటే మోయలేని భారంగా భావించొద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. కేవలం మార్కులపైనే కాకుండా జీవితాన్ని మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఇతరులు చెప్పేది వినాలని.. చివరకు మన జీవితానికి సంబంధించిన నిర్ణయం మనమే తీసుకోవాలని పేర్కొన్నారు. మారాలన్న బలమైన సంకల్పం ఉన్నప్పుడే మన జీవన విధానం మారుతుందని స్పష్టంచేశారు. పరీక్షలు వస్తున్నాయంటే భయపడాల్సిన పని లేదని, పరీక్షలను పండుగలా భావిస్తూ ఆనందంగా జరుపుకోవాలని వెల్లడించారు. 'ప్రధానమంత్రితో పరీక్షా పే చర్చ–2026'కార్యక్రమంలో భాగంగా దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులతో మోదీ ఢిల్లీలోని తన నివాసంలో సమావేశమయ్యారు. త్వరలో పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. ఒత్తిడిని జయించి, పరీక్షలకు హాజరైతే విజయం సొంతమవుతుందని అన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ వీడియోను మోదీ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. పరీక్షలను పూర్తి ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవడంపై విద్యార్థులతో చక్కటి చర్చ జరిగిందని వివరించారు. ఈ వీడియోను అందరూ తిలకించాలని కోరారు. పరీక్షా పే చర్చలో ప్రధానమంత్రి ఏం చెప్పారంటే.

మనపై మనకు విశ్వాసం ఉండాలి

''కంఫర్ట్ జోన్‌లో ఉండిపోతే జీవితం మారదు. అందుకోసం జీవన విధానం మార్చుకోవాలి. విద్యను భారంగా భావించకుండా అందులో పూర్తిగా నిమగ్నం కావాలి. అరకొరగా చదివితే ఉపయోగం ఉండదు. కేవలం మార్కులే పరమావధిగా భావించకుండా జీవితంపైనా దృష్టి పెట్టాలి. తల్లిదండ్రులు, టీచర్లు, మిత్రులు ఏం చెప్పారన్నది కాకుండా మనపై మనకు విశ్వాసం ఉండాలి. ఇతరులు చెప్పేది మనసులో పెట్టుకోవాలి. మన జీవితాన్ని మార్చే నిర్ణయం మనమే తీసుకోవాలి. ఆశించిన లక్ష్యం సమీపంలోనే ఉంటుంది. కానీ, దాన్ని అందుకోవాలంటే కష్టపడాలి. మనసును అదుపులో పెట్టుకొని చదివితే అనుకున్నది సాధించడం సులభమే. మార్కుల కోసం ఎక్కువ ఆరాట పడొద్దు. గత ఏడాది బోర్డు పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి పేరు ఎవరికైనా గుర్తుందా? చాలావరకు గుర్తుండదు. అలాంటి విద్యార్థిని కొద్దిసేపు ప్రశంసిస్తాం, తర్వాత మర్చిపోతాం. అందుకే పరీక్షల్లో మార్కులే ముఖ్యమని భావించడానికి వీల్లేదు.

చదువులో సొంత విధానం ఉండాలి

విద్యార్థుల భవిష్యత్తు గురించి తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటారు. చదువు విషయంలో ఒత్తిడి చేస్తుంటారు. చదివే విధానం గురించి తల్లిదండ్రులు ఒకలా, టీచర్లు మరొకలా చెబుతుంటారు. విద్యార్థులు ఇంకోలా భావిస్తుంటారు. మొత్తానికి వారిలో గందరగోళం ఏర్పడుతుంది. ఏది సరైందో నిర్ణయించుకోలేరు. ఒక ఇంటిలో తోబుట్టువుల్లోనే ఎన్నో వ్యత్యాసాలు ఉంటాయి. ఎవరి సొంత విధానం వారికే ఉంటుంది. అందుకే చదువు విషయంలో మీకు ఏది నచ్చితే అదే చేయండి. కొందరు రాత్రిపూట చదువుకోవడానికి, మరికొందరు ఉదయం పూట చదువుకోవడానికి ఇష్టపడుతుంటారు. మీకు ఎప్పుడు చదుకోవడం వెసులుబాటుగా ఉంటుందో అప్పుడే చదువుకోండి. సొంత విధానాన్ని నమ్ముకోవాలి. ఇతరుల సూచనలు జాగ్రత్తగా వింటూ.. సొంత అనుభవాల ద్వారా ఆ విధానంలో మార్పులు చేసుకోవచ్చు. ఎవరో ఏదో చెప్పారని గుడ్డిగా అనుసరించాల్సిన పనిలేదు. నేను 'పరీక్షా పే చర్చ'ను ప్రారంభించినప్పుడు కొన్నాళ్లు ఒకేలాగా కొనసాగింది. తర్వాత మెరుగుపర్చాం. వేర్వేరు రాష్ట్రాల్లో సెషన్లు నిర్వహించాం. మూలానికి కట్టుబడి ఉంటూనే ఫార్మాట్ మార్చాం.

జరిగిపోయిన దాని గురించి ఎందుకు?

విద్యార్థులు గతాన్ని తవ్వుకుంటూ సమయం వృథా చేయొద్దు. భవిష్యత్తు గురించి ఆలోచించాలి. జరిగిపోయిన దాని గురించి నేను అంతగా పట్టించుకోను. ఇకపై ఏం జరగబోతోందో దానిపైనే నా దృష్టి ఉంటుంది. పరీక్షల్లో రాబోయే ముఖ్యమైన ప్రశ్నలు, సమాధానాలు మాత్రమే టీచర్లు బోధించే విధానం గతంలో ఉండేది. పరీక్షల్లో మంచి మార్కుల కోసం అలా చేసేవారు. నిజానికి ఒక మంచి టీచర్ జీవితానికి పనికొచ్చే అన్ని అంశాలూ బోధిస్తాడు. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తాడు. జీవితం అంటే పరీక్షలు ఒక్కటే కాదు, జీవితంలో పైకి ఎదగడానికి విద్య ఒక సాధనం. నేను ప్రధానమంత్రిని అయ్యాను. విభిన్నంగా పని చేయండి అని ప్రజలు చెబుతుంటారు. మీరు కూడా విభిన్నంగా చదవడం ప్రయత్నించండి.

ఇంటర్నెట్‌పై సమయం వృథా చేయొద్దు

ఇంటర్నెట్‌లో గేమింగ్‌లు పక్కనపెట్టి చదువుపైనే దృష్టి పెట్టాలంటూ విద్యార్థులపై సమాజం నుంచి ఒత్తిడి ఉన్నమాట నిజమే. గేమింగ్ అంటే ఒక అభిరుచి మాత్రమే కాదు.. అదొక నైపుణ్యం. అందులో రాణించాలంటే వేగం, అప్రమత్తత అవసరం. సెల్ఫ్ డెవలప్‌మెంట్‌కు గేమింగ్ తోడ్పడుతుంది. నాణ్యమైన గేమ్‌ల్లో అనుభవం పెంచుకోండి. అదే సమయంలో చదువును నిర్లక్ష్యం చేయొద్దు. గేమింగ్‌లో జూదానికి దూరంగా ఉండాలి. జూదాన్ని అరికట్టే చట్టాలు మనదేశంలో ఉన్నాయి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు చాలా ప్రమాదకరం. దేశంలో ఇంటర్నెట్ చౌకగా దొరుకుతోంది కదా అని దానిపైనే సమయం వృథా చేయకండి. నిర్మాణాత్మక నైపుణ్యాలు పెంచుకోవడం కోసం గేమ్‌లు ఆడొచ్చు. భారతీయ సంస్కృతి, పురాణ గాథలతో ముడిపడి ఉన్న స్టోరీ టెల్లింగ్ గేమ్‌లను అభివృద్ధి చేయండి. వాటిని సోషల్ మీడియాలో పంచుకుంటే చక్కటి గుర్తింపు లభిస్తుంది. అప్పుడు తల్లిదండ్రులు సంతోషిస్తారు. మరింత ప్రోత్సహిస్తారు. కొత్త ఐడియాలు ఇస్తారు. పంచతంత్ర కథల ఆధారంగా గేమ్‌ను అభివృద్ధి చేయొచ్చు. మీరు క్రియేటర్‌గా మారండి. సొంతంగా సోషల్ మీడియా పేజీ ప్రారంభించండి.

విద్యార్థి ఒక అడుగు ముందే ఉండాలి

విద్యార్థి వేగం ఎల్లప్పుడూ టీచర్ వేగం కంటే ఎక్కువే ఉండాలి. అలా ఉండేలా చూసే బాధ్యత టీచర్లదే. అంటే టీచర్ కంటే విద్యార్థి ఒక అడుగు ముందే ఉండాలి. విద్యార్జనలో సమతూకం ఉండేలా జాగ్రత్తపడాలి. చదువుతోపాటు విశ్రాంతి, నైపుణ్యాలు, అభిరుచులకు ప్రాధాన్యం ఇవ్వాలి. లైఫ్ స్కిల్స్, ప్రొఫెషనల్ స్కిల్స్ అని రెండు రకాల నైపుణ్యాలు ఉంటాయి. ఆ రెండింటినీ విడదీసి చూడలేం. కేవలం ఒకదానివైపే మొగ్గు చూపితే జీవితంలో విఫలమవుతారు. రెండు రకాల నైపుణ్యాలూ సమానమే''అని ప్రధాని మోదీ వివరించారు.

గిన్నిస్ రికార్డుకెక్కిన చర్చ

ప్రధాని మోదీ ఆధ్వర్యంలో 'పరీక్షా పే చర్చ'2018లో ప్రారంభమైంది. ప్రతిఏటా ఆయన విద్యార్థులతో సంభాషిస్తున్నారు. వార్షిక పరీక్షల ముందు వారిలో ఆత్మస్థైర్యం నింపుతున్నారు. పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇది దేశంలో అతిపెద్ద విద్యా కార్యక్రమాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. పరీక్షా పే చర్చలో పాల్గొనడం కోసం 2023లో 38.8 లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 2025లో ఆ సంఖ్య 3.53 కోట్లకు చేరింది. ఈ ఏడాది 4.5 కోట్ల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ కార్యక్రమం ఇప్పటికే గిన్నిస్ బుక్ రికార్డుకెక్కింది.

ఇంకా 25 ఏళ్లు ఉన్నాయి

పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ ఒక ఆసక్తికరమైన విషయం పంచుకున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 17వ తేదీన ఆయన 75వ జన్మదినం జరిగింది. ఈ సందర్భంగా ఓ నాయకుడు ప్రధానమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మీకు 75 ఏళ్లు వచ్చాయంటూ గుర్తుచేశారు. మోదీ బదులిస్తూ.. 75 ఏళ్లు రావడం కాదు, ఇంకా 25 ఏళ్లు ఉన్నాయని చెప్పారు. మణిపూర్ సైనిక్ స్కూల్ నుంచి వచ్చిన ఇమోటా కె.శ్యామ్ అనే విద్యార్థి మోదీతో మాట్లాడాడు. చిన్నప్పటి నుంచి మీరంటే ఎంతో స్ఫూర్తి అని అన్నాడు. తన పుట్టినరోజు గురించి తెలిపాడు. మోదీ స్పందిస్తూ... 'జరిగిపోయినదాన్ని నేను లెక్కపెట్టను. జరగబోయేది మాత్రమే లెక్కిస్తా. మీకు నేను చెప్పేది ఒక్కటే. పాత విషయాల గురించి ఆలోచిస్తూ టైమ్ వేస్టు చేసుకోకండి. జరగబోయేదే ఆలోచించండి. మిగిలిన జీవితం ఎలా జీవించాలో యోచించండి''అని సూచించారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి

షియా మసీదులో పేలుడు • 50 మంది దుర్మరణం • 169 మందికి గాయాలు

ఇస్లామాబాద్: కల్లోల పాకిస్తాన్‌లో మరో ఆత్మాహుతి చోటుచేసుకుంది. షియా వర్గీయులే లక్ష్యంగా జరిగిన ఈ దారుణంలో కనీసం 50 మంది దుర్మరణం పాలయ్యారు. 169 మందికి పైగా గాయపడ్డారు. రాజధాని ఇస్లామాబాద్ శివార్లలో ఉన్న షియా మసీదులో శుక్రవారం ప్రార్థనల సందర్భంగా అత్యంత శక్తిమంతమైన పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రతకు కాళ్లూ చేతులూ తెగి పడ్డవారు, తీవ్ర గాయాలతో అల్లాడుతున్న వారికి సంబంధించిన వీడియోలు వైరల్‌గా మారాయి. మృతులు, క్షతగాత్రుల బంధుమిత్రుల ఆర్తనాదాలు, రోదనలతో ఘటనా స్థలి మారుమోగిపోయింది. వారిలో తమవారు కూడా ఉన్నారేమోనని పలువురు వెదుక్కుంటుండటం కన్పించింది. ''చాలామందిని ఆస్పత్రుల్లో చేర్పించాం. వారిలో ఎందరు బతికి బయటపడతారో చెప్పలేం''అని పోలీసు అధికారి ఒకరు రాయిటర్స్ వార్తా సంస్థతో చెప్పుకొచ్చారు. దాంతో మృతుల సంఖ్య భారీగా పెరగవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే 70 దాటినట్టు కూడా వార్తలు వెలువడుతున్నాయి. మృతుల్లో ఇస్లామాబాద్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ సోదరుడు, మరో బంధువు కూడా ఉన్నారు. ఆత్మాహుతి బాంబర్ ఒక విదేశీయుడని అనుమానిస్తున్నట్టు పోలీసులు చెప్పారు. అతను ఫిత్నా అల్ ఖ్వారిజీ అలియాస్ తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ) సభ్యుడని భావిస్తున్నారు. అయితే ఈ ఘటనలో తమ ప్రమేయం లేదని ఆ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. తమ లక్ష్యం ఎప్పుడూ పాక్ సైన్యం మాత్రమేనని చెప్పుకొచ్చింది. పాకిస్తాన్ తాలిబాన్‌గా పిలిచే టీటీపీ కొన్నేళ్లుగా దేశవ్యాప్తంగా పలు దాడులు చేస్తూ వస్తోంది. దాడిని అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ తదితరులు తీవ్రంగా ఖండించారు. ''ఇది పిరికిపంద చర్య. అమాయకులను లక్ష్యం చేసుకోవడం మానవత్వానికే తీరని మచ్చ''అంటూ మండిపడ్డారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ పాక్‌లో పర్యటిస్తున్న వేళ ఈ దాడి జరగడం గమనార్హం. ఇస్లామాబాద్‌లో గత ఆర్నెల్లలో ఇది రెండో ఆత్మాహుతి దాడి. గత నవంబర్‌లో ఒక వ్యక్తి ఏకంగా ఇస్లామాబాద్ కోర్టు కాంప్లెక్స్‌లోనే కారులో తనను తాను పేల్చేసుకున్నాడు! ఆ ఘటనలో 12 మందికి పైగా మరణించారు. అంతకుముందు 2008 సెప్టెంబర్‌లో ఇస్లామాబాద్‌లోని మారియట్ హోటల్లో జరిగిన ఆత్మాహుతి దాడి 63 మందిని బలిగొంది.

ఘటనా స్థలి వద్ద పోలీసులు

తొలుత కాల్పులు...

ఇస్లామాబాద్‌లోని షెహజాద్ టౌన్‌లో తర్లాయ్ ప్రాంతంలో ఉన్న ఖదీజా అల్ కుబ్రా ఇమాంబరాలో షియా వర్గీయులు భారీ సంఖ్యలో శుక్రవారం మధ్యాహ్న వేళ ప్రార్థనల కోసం గుమిగూడారు. అదే సమయంలో ఆత్మాహుతి బాంబర్ లోనికి దూసుకొచ్చేందుకు ప్రయత్నించాడు. గేట్ దగ్గర గార్డులు అడ్డుకోవడంతో అక్కడికక్కడే తనను తాను పేల్చేసుకున్నట్టు పోలీసులతో పాటు ప్రత్యక్ష సాక్షులు కూడా వెల్లడించారు. దుండగుడు తొలుత కాల్పులకు తెగబడి తర్వాత పేలుడుకు పాల్పడ్డట్టు వారిని ఉటంకిస్తూ జియో న్యూస్ వార్తా సంస్థ పేర్కొంది. పేలుడు తీవ్రతకు మసీదు ప్రధాన ద్వారం కుప్పకూలడంతో పాటు సమీప భవనాల కిటికీలు ధ్వంసమయ్యాయి. ఎటుచూసినా ఛిన్నాభిన్నమైన మృతదేహాలు, తెగిపడ్డ అవయవాలతో రక్తంతో ఘటనాస్థలి భీతావహంగా మారింది. దాడి తమ పనేనని ఇప్పటిదాకా ఏ ఉగ్ర సంస్థా ప్రకటించుకోలేదు. పోలీసులతో పాటు సహాయక బృందాలు హుటాహుటిన అక్కడికి చేరుకున్నాయి. క్షతగాత్రుల్ని ఆస్పత్రులకు తరలించాయి. ఘటన నేపథ్యంలో ఇస్లామాబాద్‌లోని ఆస్పత్రుల్లో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. పాక్ కొంతకాలంగా ఆత్మాహుతి దాడులతో అతలాకుతలమవుతోంది. స్వతంత్ర బలూచిస్తాన్ డిమాండ్‌తో ఆ ప్రావిన్స్‌లో బలూచ్తిఆన్ లిబరేషన్ ఆర్మీ నిరంతరం పాక్ సైనికులపై దాడులకు దిగుతోంది. ఆ క్రమంలో ఇటీవల జరిపిన ఆత్మాహుతి దాడుల్లో భారీ సంఖ్యలో సైనికులు మృత్యువాత పడటం తెలిసిందే. సైన్యం ప్రతీకార దాడుల్లో బలోచీ సాయుధులు కూడా వందల్లో మరణించారు.

శుక్రవారం ఇస్లామాబాద్ శివార్లలోని మసీదు ప్రాంగణంలో ఆత్మాహుతి పేలుడు అనంతర దృశ్యం

నీట్-పీజీ అర్హత స్కోర్‌ను ఎందుకు తగ్గించారు?

సుప్రీంకోర్టు సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: నీట్–పీజీ 2025–26కు క్వాలిఫయింగ్ కటాఫ్ పర్సంటైల్‌ను భారీగా తగ్గించడంపై వివరణ ఇవ్వాలని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్)ను సుప్రీంకోర్టు ఆదేశించింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం ఎదుట శుక్రవారం పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ వాదనలు వినిపించారు. పీజీ స్థాయిలో ప్రమాణాలను నెలకొల్పేందుకు కఠినమైన నిబంధనలు అవసరమన్నారు. ప్రత్యేకమైన కారణాలుంటే తప్ప, పీజీ ప్రవేశాలకు అర్హత మార్కులను తగ్గించరాదన్నారు. స్పందించిన ధర్మాసనం..'సీట్లను ఖాళీగా వృథా ఉంచరాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే సమయంలో, ప్రవేశాల కోసం ఎక్కువ మంది అభ్యర్థులు ముందుకు రావడం లేదు. అందుకే కటాఫ్‌ను తగ్గించాల్సి వస్తోంది. అయితే, సీట్లను ఖాళీగా ఉంచరాదనే నెపంతో ప్రమాణాల విషయంలో రాజీ పడటం తగదన్న వాదనలున్నాయి. ఈ సమస్యకు ఏదో ఒక పరిష్కారాన్ని మనం వెదకాలి'అని అభిప్రాయపడింది. ఈ అంశంపై సరైన పరిష్కారంతో ముందుకు రావాలని ఎన్‌బీఈఎంఎస్‌ను ఆదేశిస్తూ ధర్మాసనం తదుపరి విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. నీట్ పీజీ–2025 ప్రవేశాల్లో 18 వేలకు పైగా పీజీ మెడికల్ సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి. దీంతో, బోర్డు రిజర్వుడు కేటగిరీల అభ్యర్థుల అర్హత పర్సంటైల్‌ను 40 నుంచి సున్నాకు తగ్గించింది. దీనర్థం 800కు గాను మైనస్ 40 స్కోరు సాధించిన అభ్యర్థులు సైతం మూడో విడత కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశమేర్పడింది. అదేవిధంగా, జనరల్ కేటగిరీ నీట్ పీజీ అభ్యర్థుల అర్హత స్కోరును 50 నుంచి 7కు తగ్గించారు. అయితే, ఈ నిర్ణయం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లకు భంగం కలిగించడమేనంటూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 4వ తేదీన విచారణ చేపట్టిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, నేషనల్ మెడికల్ కమిషన్ తదితరులకు నోటీసులు జారీ చేసింది.

రష్యా సైనిక నిఘా అధికారిపై కాల్పులు

డెలివరీ బాయ్‌గా వచ్చి దాడి చేసిన దుండగుడు

మాస్కో: రష్యాలో కీలక సైనికాధికారులపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. ఇందుకు ఉక్రెయిన్ కారణమని రష్యా ఆరోపిస్తోంది. శుక్రవారం రష్యా సైనిక నిఘా సంస్థ డిప్యూటీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ వ్లాదిమిర్ అలెక్సేయెవ్(64)పై గుర్తు తెలియని దుండగుడు పలురౌండ్లు కాల్పులు జరిపి పరారయ్యాడు. ఈ ఘటనలో అలెక్సేయెవ్ తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు ఆయనను ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. రష్యా రాజధాని మాస్కోలో ఈ కాల్పులు జరగడం కలకలం సృష్టించింది. అలెక్సేయెవ్ ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఇంట్లో ఉండగా డెలివరీ బాయ్ రూపంలో వచ్చిన దుండగుడు కాల్పులు జరిపాడు. ఈ ఘటన వెనుక సూత్రధారులు ఎవరన్నది అధికారులు ఇంకా గుర్తించలేదు. 2011 నుంచి రష్యా మిలటరీ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 'జీఆర్‌యూ'డిప్యూటీ చీఫ్‌గా అలెక్సేయెవ్ సేవలందిస్తున్నారు. సిరియాలో రష్యా సైనిక కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నందుకు 'హీరో ఆఫ్ రష్యా'మెడల్ కూడా అందుకున్నారు. ఇదిలా ఉండగా, అమెరికా మధ్యవర్తిత్వంతో అబుదాబీలో రష్యా, ఉక్రెయిన్ మధ్య రెండు రోజులపాటు జరిగిన చర్చలు శుక్రవారమే ముగిశాయి. అదేరోజు రష్యాలో సైనికాధికారిపై కాల్పులు జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ చర్చల్లో అలెక్సేయేవ్ పై అధికారి అయిన మిలటరీ ఇంటెలిజెన్స్ చీఫ్ అడ్మిరల్ ఇగోర్ కోస్టియుకోవ్ రష్యా తరఫున పాల్గొన్నారు. అలెక్సేయెవ్‌పై కాల్పుల గురించి అధికారులు రష్యా అధినేత పుతిన్‌కు సమాచారం అందించారు. ఈ దాడి గురించి ఉక్రెయిన్ ఇంకా స్పందించలేదు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడుతూ.. అలెక్సేయెవ్‌పై కాల్పుల ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. శాంతి చర్చలను పక్కదారి పట్టించడానికి ఉక్రెయిన్ ప్రభుత్వం ఉగ్రవాదులను పురిగొల్పి, ఈ దాడికి పాల్పడి ఉండొచ్చని అనుమానం వ్యక్తంచేశారు.

అలెక్సేయెవ్

న్యూస్టార్ట్ చర్చలకు అమెరికా, రష్యా ఓకే

మాస్కో: ఆయుధాల నియంత్రణకు సంబంధించిన న్యూస్టార్ట్ ఒప్పందంపై చర్చలను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని అమెరికా, రష్యాలు అంగీకారానికి వచ్చాయి. రష్యా, ఉక్రెయిన్, అమెరికా ప్రతినిధుల మధ్య యూఏఈలోని దుబాయ్‌లో జరుగుతున్న శాంతి చర్చల సమయంలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చినట్లు శుక్రవారం రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ చెప్పారు. అదేవిధంగా, రెండు దేశాల మిలటరీ మధ్య 2021 నుంచి నిలిచిపోయిన ప్రత్యక్ష సంబంధాలను తిరిగి నెలకొల్పుకునేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేశాయని వివరించారు. బాధ్యతాయుతమైన రెండు దేశాలు స్టార్ట్ చర్చలపై ఆసక్తితో ఉన్నాయన్నారు. అమెరికా, రష్యాల మధ్య చిట్టచివరి వ్యూహాత్మక ఆయుధాల నియంత్రణ ఒప్పందం(స్టార్ట్) గడువు గురువారంతో ముగిసిపోయింది. దీంతో, అత్యధికంగా అణ్వాయుధాలు కలిగిన ఈ రెండు దేశాలకు ఇప్పుడు ఇక ఎటువంటి పరిమితులు లేవు. స్టార్ట్ ఒప్పందం విధించిన పరిమితులకు కట్టుబడి ఉండేందుకు తాము సిద్ధమని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇటీవల ప్రకటించగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పట్టించుకోలేదు. చైనా కూడా ఈ ఒప్పందంలో చేరాలని పిలుపునిచ్చారు. చైనా మాత్రం ససేమిరా అంటోంది.

బదులిచ్చే ధైర్యం ప్రధానికి లేదు: ఖర్గే

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం విమర్శలు గుప్పించారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం ప్రధానికి లేదన్నారు. ప్రభుత్వం సభను ప్రజాస్వామ్య పద్ధతిలో నడపాలనుకోవడం లేదని ఆరోపించారు. పదేపదే అబద్ధాలు చెప్పడమే మోదీ పని అని ఆరోపించారు. ''రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై మోదీ తన 97 నిమిషాల ప్రసంగంలో ముఖ్యమైన, అవసరమైన విషయం ఒక్కటీ చెప్పలేదు. ఇంకా వందేళ్లు, 75 ఏళ్లు, 50 ఏళ్ల కిందటి సంగతులే మాట్లాడుతున్నారు'' అని ఎద్దేవా చేశారు. ''లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ ప్రస్తావించిన ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకం ఇంకా ప్రచురణ కాలేదని అధికార పక్షం పార్లమెంటులో చెబుతోంది. తాము ఆ పుస్తకాన్ని బాహాటంగా చూపినా వారికి అర్థం కావడం లేదు. ముందుగా వాస్తవాలను శ్రద్ధగా విని, ఆపై సమాధానం చెప్పాలి'' అని ఖర్గే అన్నారు. రాహుల్, కేంద్ర మంత్రి రవ్‌నీత్ బిట్టూ వివాదంపైనా ఆయన స్పందించారు. సభ బయట ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణను సిక్కులకు జరిగిన అవమానంగా ముద్ర వేశారని మండిపడ్డారు. ''సిక్కులను కాంగ్రెస్ పార్టీ ఎంతో గౌరవిస్తుంది. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా, తర్వాత ప్రధానిగా పనిచేశారు'' అని గుర్తు చేశారు. సిక్కులను, దళితులను, ఆదివాసీలను ఎవరినీ గౌరవించే అలవాటు లేనిది బీజేపీకేనన్నారు. ఇతరులను ఎలా కించపరచాలా అనే మోదీ ఆలోచిస్తారని ఖర్గే ఆరోపించారు. ''దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించిందే తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ. కానీ మోదీ మాత్రం వాటిని దివాలా తీసే కర్మాగారాలు అని పిలుస్తూ నెహ్రూపై విమర్శలు చేస్తున్నారు. దేశాన్ని నడిపే దార్శనికత మోదీకి లేదు'' అన్నారు. రాహుల్ ఏం ప్రశ్నలు అడుగుతారో, ఎలాంటి వాస్తవాలు బయటపెడతారోనని మోదీ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ''లోక్‌సభలో మోదీపై దాడి జరుగుతుందని నిఘా సమాచారముందని చెబుతున్నారు. అంత గొప్ప ఇంటెలిజెన్స్ పుల్వామా వంటి ఉగ్ర దాడుల సమయంలో ఏమైంది?'' అని ఖర్గే ప్రశ్నించారు. ''ఎప్‌స్టీన్ ఫైల్స్ బయటపడ్డ తరవాత మోదీ ఆందోళనగా ఉన్నారు. అందుకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లొంగిపోయి ఆ దేశంతో ఏకపక్ష వాణిజ్య ఒప్పందం కుదుర్చు కున్నారు. తద్వారా మన దేశ రైతులను బలిపశు వులను చేశారు'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.


ఖర్గే

ఇండిగో విమానానికి... ల్యాండింగ్ గేర్ సమస్య

సురక్షితంగా ల్యాండింగ్

ముంబై: ఇండిగో విమానంలో తలెత్తిన ల్యాండింగ్ గేర్ లివర్ సమస్య కొద్దిసేపు అందరినీ కంగారు పెట్టింది. ఈ ఉదంతం శుక్రవారం ముంబై విమానాశ్రయంలో జరిగింది. 210 మందికి పైగా ప్రయాణికులతో కూడిన ఏ321 తరహా విమానం రన్‌వేపై దిగే సమయంలో ల్యాండింగ్ గేర్‌కు సంబంధించిన ఆటోమేటిక్ మోడ్ మొరాయించింది. దాంతో కాసేపు గందరగోళం తలెత్తింది. కొద్దిసేపటి ప్రయత్నం అనంతరం విమానం సురక్షితంగా దిగింది. ఆ వెంటనే నిపుణులు రంగంలోకి దిగి సమస్యను సరిదిద్దారు. కొద్దిపాటి ఆలస్యంతో విమానం యథావిధిగా కార్యకలాపాలు సాగించినట్టు ఇండిగో పేర్కొంది. తలెత్తింది చిన్న సాంకేతిక లోపం మాత్రమేనని చెప్పుకొచ్చింది.

సాక్షి తిరుపతి

శనివారం । 7 । ఫిబ్రవరి । 2026

శ్రీసిటీలో జపాన్ వాణిజ్య బృందం

శ్రీసిటీలో జపాన్ వాణిజ్య ప్రతినిధుల బృందం పర్యటించింది. అంతర్జాతీయ వాణిజ్య సంబంధాల లక్ష్యంగా పర్యటన సాగింది. - 8లో



ఆర్టీసీ అధికారుల పరిశీలన

విన్నమాల వద్ద ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగిన నేపథ్యంలో ఆ వాహనాన్ని శుక్రవారం అధికారులు పరిశీలించారు. - 8లో

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

భాకరాపేట అడవిలో ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అటవీశాఖాధికారులు అరెస్టు చేసి, దుంగలను స్వాధీనం చేసుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

స్పెల్-2 ప్రాక్టికల్స్‌కు 143 మంది గైర్హాజరు

తిరుపతి సిటీ: జిల్లా వ్యాప్తంగా ఇంటర్ స్పెల్-2 ప్రాక్టికల్స్‌లో భాగంగా తొలిరోజు శుక్రవారం జరిగిన పరీక్షలకు 143 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐఓ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షకు 3,785 మందికి గాను 3,697 మంది విద్యార్థులు హాజరుకాగా మధ్యాహ్నం జరిగిన ప్రయోగ పరీక్షకు 3,080 మందికి గాను 3,025మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఈనెల 10వ తేదీవరకు జరగనున్నాయన్నారు.

హోమ్ లోన్ మేళా నేడు, రేపు

తిరుపతిఎడ్యుకేషన్ : కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో 7, 8వ తేదీల్లో హోమ్ లోన్ మేళా నిర్వహించనున్నట్లు ఆ బ్యాంకు జీఎం పాండురంగ మిితాయ ఓ ప్రకటనలో తెలిపారు. కరకంబాడీ రోడ్డులోని గెస్ట్‌లైన్ డేస్ హోటల్ సమీపంలోని ఏబీ ఆవాస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫానెక్స్ టవర్ ప్రాంగణంలో రెండు రోజుల పాటు హోమ్ లోన్ మేళాను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేళాలో వినియోగదారులకు తక్షణమే లోన్ అప్రూవల్, తక్కువ వడ్డీ రేటు, ప్రత్యేక ఆఫర్లను అందించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 70134 10562 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10లక్షల విరాళం

విరాళం ఇస్తున్న రాఘవేంద్ర

తిరుపతితుడా: స్విమ్స్ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి బెంగళూరుకు చెందిన నారాయణ సిల్క్స్ అధినేత నమ్రత ఆర్ దేవత తండ్రి డీఎస్ రాఘవేంద్ర కోరిక మేరకు రూ. 10,00,116 విరాళం అందజేశారు. ఈ మేరకు డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌ను ఆయన చాంబర్‌లో దాత తరపున తిరుపతికి చెందిన వై రాఘవేంద్ర శుక్రవారం కలసి అందుకు సంబంధించి పత్రాలను, చెక్కును అందజేశారు. పేద రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిగణలోనికి తీసుకుని విరాళం అందజేసినట్టు దాతలు తెలిపారు.

ఏమాత్ర అనుమతి లేదు?

చిత్తూరు తోటపాళ్యంలో కొత్తగా ఓ ఆస్పత్రి ఏర్పాటైంది. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ ఉన్నా ఆస్పత్రిలో ఏర్పాటు చేసి మందుల దుకాణానికి ఎలాంటి అనుమతి లేదు. అనుమతి లేకుండానే ఏడాదిగా మందులు, మాత్రలు విక్రయిస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోకపోడంపై విమర్శలకు తావిస్తోంది. అలాగే చిత్తూరు నగరం పొన్నియమ్మ గుడివీధిలోని ఓ మందుల షాపులో అబార్షన్ల కిట్లు విక్రయిస్తున్నారని ఆరు నెలల క్రితం అధికారులు చేపట్టిన తనిఖీలో తేలింది.

అనధికారికంగా 1200 దుకాణాలు

చిత్తూరు, తిరుపతి జిల్లాలో 2500 మెడికల్ షాపులున్నాయి.

అనధికారికంగా సుమారు 1200 వరకు మెడికల్ షాపులున్నాయి.

ప్రధానంగా ప్రైవేటు ఆస్పత్రులు 2700 వరకు ఉండగా వీటిల్లో 1500 వరకు అనుమతులు లేకుండా మందుల షాపులను నడుపుతున్నారు.

అలాగే ఆర్ఎంపీలు సుమారు 2 వేల మంది ఉండగా వీరు నిబంధనలకు విరుద్ధంగా మందులు, మాత్రలు విక్రయిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

అడిగేవారు లేరని.. ఎవరూ అడ్డురారని మందుల దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఔషధ నియంత్రణ శాఖ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా విక్రయాలు... కాలం చెల్లినవైనా.. స్టెరాయిడ్స్ అయినా అడ్డే లేకుండా మూడు పువ్వులు, ఆరు కాయల చందంగా మందుల వ్యాపారం సాగిస్తున్నారు. వెరసి ప్రజారోగ్యం గాలిలో దీపంలా మారింది.

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మందుల దుకాణాలు
- ఆస్పత్రుల్లో అనుమతులు లేకుండా మాత్రల విక్రయం
- చిత్తూరు, తిరుపతి జిల్లాలో విచ్చలవిడిగా మెడికల్‌షాపులు
- రిజిస్ట్రేషన్ లేకుండా ప్రైవేటు ఆస్పత్రుల్లో షాపులు
- ఆర్ఎంపీలు సైతం మాత్రల విక్రయాలు
- కాలం చెల్లినవి, స్టెరాయిడ్స్ అమ్మకాలు

కాణిపాకం: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విచ్చలవిడిగా మెడికల్ షాపులు పుట్టుకొచ్చాయి. అనుమతులు లేకుండా ఆస్పత్రుల్లో మందులు, మాత్రలను విక్రయిస్తున్నారు. ఆర్ఎంపీలు యథేచ్ఛగా మందుల ను అమ్ముకుంటున్నారు. విక్రయాలకు ప్రభుత్వ చట్టాలు, ఔషధ నియంత్రణ నిబంధనలు కాగితాలకే పరిమితమైపోయాయి. లైసెన్సులు లేకుండా, ఫార్మసిస్ట్ అర్హతలు లేకుండానే వందలాది మెడికల్ షాపులు బహిరంగంగానే పనిచేస్తూ ప్రజారోగ్యాన్ని తాకట్టు పెడుతున్నాయి. గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అక్రమ మెడికల్ షాపులు విస్తరించాయి.

ఆర్ఎంపీలే డాక్టర్లు

అర్హతలేని ఆర్ఎంపీలు డాక్టర్లుగా మారిపోయారు. స్టెతస్కోప్ మెడకు వేసుకుని, బోర్డులపై పెద్ద అక్షరాలతో పేర్లు రాసుకుని, మందుల షాపుల్ని కూడా నడుపుతున్నారు. ప్రిస్క్రిప్షన్ అనే మాటే లేకుండా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, నొప్పి మందులు పంచిపెడుతున్నారు. ఫలితంగా యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ వంటి ప్రమాదకర సమస్యలు పెరుగుతున్నాయి.

స్టెరాయిడ్స్, అబార్షన్ కిట్లు బహిరంగ వ్యాపారం



డాక్టర్ సూచన తప్పనిసరిగా ఉండాల్సిన స్టెరాయిడ్స్‌ను ఇష్టానుసారంగా అమ్ముతున్నారు. అబార్షన్ కిట్ల విక్రయం జోరుగా సాగుతోంది. ఇది కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదు మహిళల ప్రాణాలతో ఆటలాడడమేనని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అబార్షన్ల కిట్ల విక్రయం కూడా జోరుగాసాగుతోంది. ఇందుకు చిత్తూరులోని పొన్నియమ్మ గుడివీధి, సుందరయ్యవీధి అడ్డాగా మారాయి. అలాగే తిరుపతి జిల్లాలో పలు ప్రాంతాల్లో అబార్షన్ కిట్లువిక్రయిస్తున్నారు.

ఆస్పత్రులే అక్రమాల అడ్డా..

ప్రైవేటు ఆస్పత్రుల ప్రాంగణాల్లోనే నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు నడుస్తున్నాయి. చాలా వరకు ప్రైవేటు ఆస్పత్రులు ఆవరణలోనే మెడికల్ షాపులను సైతం ఏర్పాటు చేసుకున్నాయి. చిత్తూరు నగరం, జీడీనెల్లూరు, పలమనేరు, కుప్పం, నగరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, చంద్రగిరి, సత్యవేడు, పుత్తూరు తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు ఆస్పత్రుల్లో అనుమతి లేకుండా మెడికల్ షాపులు టేర్పాటు చేసుకున్నారు. రోగి బయటకు అడుగు పెట్టకుండానే మందుల విక్రయాలు సాగుతున్నాయి. ఒకే ఆస్పత్రిలో పరీక్షలు, ప్రిస్క్రిప్షన్, మందుల అమ్మకం మూడు ఒకే చోట జరుగుతున్నా, నియంత్రణ మాత్రం శూన్యం.

డాక్టర్ చీటి విలువ జీరో

డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌కు విలువ లేకుండా పోయింది. ''ఏ మందైనా ఇస్తాం'' అన్న ధోరణితో మెడికల్ షాపులు వ్యవహరిస్తున్నాయి. ఇది వైద్యవృత్తికే మచ్చగా మారుతోంది. రోగులు అడగ్గానే మెడికల్ షాపుల నిర్వాహకులు ప్రాణాంతకమైన నిద్రమాత్రలు, స్టెరాయిడ్స్ ఇస్తున్నారు. అది కూడా డాక్టర్ చీటీ లేకుండానే. డాక్టర్ ఒక మాత్ర రాస్తే మెడికల్ షాపుల్లో మరొకటి ఇచ్చి, అదే కాంబినేషన్ అని చెబుతారు. కాంబినేషన్ ఒకటే అయినా.. అది తక్కువ ధర, ఎక్కువ కమీషన్ ఇచ్చే మాత్ర అయి ఉంటుంది. ఇలా చాలా మందుల దుకాణాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఔషధ నియంత్రణ అధికారులు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అక్రమ వ్యాపారులకు ఇదే బలంగా మారింది. మొత్తంగా చూస్తే చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రజారోగ్యం గాల్లో దీపంలా మారింది. ఔషధ నియంత్రణ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మాఫియా ముసుగులో పడి..తనిఖీలకు అంటిముట్టనట్టు తిరుగుతున్నారు.

నిబంధనలకనుగుణంగానే విక్రయాలు

నిబంధనలకు అనుగుణంగానే మందుల విక్రయించాలి. వైద్యులు సిఫార్సు లేకుండా అబార్షన్ కిట్, అనస్థీషియా పరిధిలోకి వచ్చే మందులను విక్రయించడం చట్టరీత్యా తీవ్ర నేరం. ఇతర ఏ మందులైనా వైద్యులు సిఫార్సు తప్పనిసరి. మెడికల్ షాపుల లైసెన్సులను సకాలంలో పునరుద్ధరించుకోవాలి. లైసెన్సు లేకపోయినా, అందులో ఏవైనా లోటుపాట్లు ఉన్నా, లైసెన్సు ప్రకారం సంబంధిత ఫార్మసిస్ట్ లేకపోయినా తీవ్ర చర్యలు ఉంటాయి. నిబంధనలు అనుసరించి మెడికల్ షాపులను నిర్వహించుకోవాలి.

– హరిప్రసాద్, జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ

నారాసుర ఆధరహో!

చిత్తూరు అర్బన్: తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మద్యం ధరల నియంత్రణ గాలికొదిలేశారు. అమ్ము కున్నోడికి అమ్ముకున్నంతగా పట్టించుకోవడం మానేశారు. ఇదే అదునుగా వ్యాపారులు మద్యం ధరలను పెంచేశారు. ఇష్టానుసారంగా ధరలు వసూలు చేస్తూ మందుబాబులకు చుక్కలు చూపిస్తున్నారు.

కోట్లు లూటీ

'వడ్డించేవాడు మనోడైతే చాలు..' అన్నట్లు మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు ఏడాదిన్నరగా పెద్దగా లాభాలు రావడంలేదని భావించిన ప్రభుత్వం.. క్వార్టర్ బాటిల్‌పై రూ.10 పెంచుకో వడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలా చెప్పిందో లే దో.. జీవో రాకపోయినా పర్లేదు అన్నట్లు, వ్యాపారులు జిల్లాలో ధరలు పెంచేశారు. జీవో ఇవ్వడానికి నాలుగు రోజుల సమయం పట్టగా.. అప్పటికే దాదాపు రూ.5 కోట్లు కొల్లగొట్టేశారు. ఇక అప్పటి నుంచి రెండు జిల్లాల్లో మద్యం ధరలపై నియంత్రణ పట్టుతప్పింది. ఒక దుకాణంలో దొరికే ధర, మరో దుకాణంలో ఇవ్వడం లేదు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు అమ్ముకుంటున్నారు. ఫలితంగా రెండు జిల్లాల్లో మద్యం ప్రియుల నుంచి రోజుకు దాదాపు రూ.40 లక్షల వరకు దోచుకుంటున్నారు. ఇందులో అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వాటాల్లేవంటే నమ్మశక్యం కావడం లేదు.

తిరుపతి జిల్లాలో మద్యం దుకాణాలు, బార్లు	
మద్యం దుకాణాలు	- 225
మద్యం బార్లు	- 27
రోజుకు వ్యాపారం (సగటు)	- రూ. 2 కోట్లు
పెరిగిన ధరలతో భారం	- రూ.32 లక్షలు

తిమ్మిని బమ్మి చేస్తూ..

పెంచిన మద్యం ధరలపై ఎవరైనా ప్రశ్నిస్తే వ్యాపారులు ఇచ్చే సమాధానంతోనే మద్యం ప్రియులకు సగం కిక్కు దిగిపోయేలా ఉంటుంది. తొలుత ధరల పెంపు జీవో రాకమునుపే.. ప్రభుత్వం ధరలు పెంచింది అని బోర్డు పెట్టి అదనంగా దండుకున్నారు. ఆపై జీఓ అమల్లోకి వచ్చాక.. తీరా బాటిళ్లపై పాత ధరలు ఉన్న వాటిని కొట్టేసి, కొత్త ధరలు ప్రింట్ చేసి పాత ధరను చెరిపేసి.. పెరిగిన ధరను ముద్రించారు. పెరిగిన ధర ముద్రించిన తర్వాత కూడా బాటిళ్లపై ఉన్న ధర కాదని అదనపు నగదు వసూలు చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే ప్రభుత్వం ధరలు పెంచిందే బోర్డు చూపిస్తున్నారు. ధరలు పెరిగాయంటూ అదనపు నగదు వసూలు చేస్తూ రోజుకు రూ.లక్షలు దోచుకుంటున్నారు.

విచ్చలవిడిగా 'బెల్టు'

రెండు జిల్లాల్లో బెల్టు దుకాణాలు విచ్చలవిగా వెలుస్తున్నాయి. ఇప్పటికే రెండు జిల్లాల్లో దాదాపు 4 వేలకు పైగా బెల్టు దుకాణాలున్నట్టు సమాచారం. చిల్లర కొట్టు నుంచి కిరాణా దుకాణం వరకు ప్రతి చోటా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఎమ్మార్పీ కంటే రూ.20-రూ.50 అధిక ధరలకు బెల్టు దుకాణాల్లో మద్యం అమ్మేస్తున్నారు. వీటిల్లో లభిస్తున్న మద్యం ఏ బ్రాండు..? ఏ దుకాణం నుంచి వచ్చింది..? అసలు కల్తీనా..? అనే ప్రశ్నలకు ఎవ్వరి వద్దా సమాధానాలు దొరకడం లేదు. మద్యం కల్తీ కాకపోతే వాటిపై ఉన్న క్యూఆర్ ఆధారంగా అవి ఏ దుకాణానికి చెందినవో ఎక్సైజ్ అధికారులు గుర్తించి, రూ.లక్షల్లో జరిమానాలు విధించాలి. కానీ జిల్లాల్లో అలా జరగడం లేదు.

అన్నింటిపై బాదుడే

గత నెల 8న అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎక్సైజ్ పాలసీలో పలు మార్పులు చేస్తూ క్యాబినెట్ నిర్ణయిం తీసుకుంది. ఇందులో ప్రతి మద్యం బాటిల్‌పై రూ.10 పెంచడమనేది ప్రధాన నిర్ణయం. రూ.99 మద్యంకు ఇందులో మినహాయింపు ఇచ్చింది. దీనిపై నిర్ణయం తీసుకున్న క్షణాల్లోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న మద్యం దుకాణాల్లో ధరలు పెంచేశారు. ప్రతి క్వార్టర్ బాటిల్‌పై రూ.10 అక్రమంగా వసూలు చేయడం ప్రారంభించారు. బీర్ విక్రయాలపై ధరల పెంపు లేకపోయినా.. జిల్లాలో యథేచ్ఛగా ధరలు పెంచేసి దోచేస్తున్నారు. ప్రీమియం బ్రాండ్లపై రూ.20 – రూ.50 చొప్పున క్వార్టర్ బాటిల్‌పై వసూలు చేస్తున్నారు. ఐదు రోజులు తర్వాత జీవో వచ్చినా.. అప్పటికే మద్యం ప్రియుల నుంచి రూ.కోట్లు పిండుకున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

మద్యం ధరలు ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే తప్పకుండా చర్యలు ఉంటాయి. చిత్తూరు జిల్లాలో ఎక్సైజ్ సూపరింటెండ్ 94929 25832, తిరుపతి జిల్లాలో 9440902540 నంబర్లకు ఫిర్యాదు చేయండి. టోల్‌ఫ్రీ నంబర్14405 కు కూడా ఫిర్యాదు చేస్తే చర్య లు తీసుకుంటాం.

– విజయశేఖర్, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్

శ్రీవారి సేవలో సినీనటి మీనాక్షి చౌదరి

తిరుమల: శ్రీవారిని శుక్రవారం సినీ నటి మీనాక్షి చౌదరి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డు ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

32 మంది విద్యార్థుల డిబార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో శుక్రవారం జరిగిన పలు కోర్సులకు సంబంధించిన యూజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడిన 32 మంది విద్యార్థులను స్క్వాడ్ అధికారులు డిబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజామాణిక్యం తెలిపారు.



క్లుప్తంగా

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

భాకరాపేట: భాకరాపేట అటవీశాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో సుమారు రూ.35 లక్షల విలువైన 763 కిలోల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. అధికారుల కథనం మేరకు.. చిన్నగొట్టిగల్లు మండలంలోని శేషాచల అడవుల్లో భాకరాపేట అటవీశాఖాధికారులు శుక్రవారం ఉదయం కూంబింగ్ చేశారు. ఆ సమయంలో అనుమానాస్పద వాహనం వస్తుండగా ఆపారు. అయితే డ్రైవర్ తప్పించుకునేందుకు యత్నించగా సిబ్బంది వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. వాహనంలో తనిఖీ చేయగా సుమారు 763 కిలోల ఎర్రచందనం దుంగలు ఉండగా స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఘటనకు సంబంధించి వాహన డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు స్మగ్లర్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

భక్తుల సేవే మహద్భాగ్యం

ధ్వజస్తంభానికి మొక్కుతున్న నూతన ఈఓ

తిరుమల: శ్రీవారి భక్తులకు సేవ చేసుకునే మహద్భాగ్యం కలగడం చాలా ఆనందంగా ఉందని టీటీడీ నూతన ఈఓ ముద్దాడ రవిచంద్ర తెలిపారు. శ్రీవారి ఆలయంలో ఆయన శుక్రవారం ఉదయం టీటీడీ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. తరువాత టీటీడీ బోర్డు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అంతకు ముందుగా ఆయన క్షేత్ర సంప్రదాయం పాటిస్తూ వరాహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఈఓకు అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. బాధ్యతలు స్వీకరణ అనంతరం ఆయనకు పండితులు వేదాశీర్వచనం అందించగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నులిపురుగుల నివారణకు అల్బెండజోల్

తిరుపతి అర్బన్: నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు ఇవ్వాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన వర్చువల్ పద్ధతిలో అన్ని విభాగాలకు చెందిన అధికారులతో నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ నెల 17న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని వెల్లడించారు. డీఎంఅండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనత తగ్గడమే కాకుండా, వారి శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 4,97,311 మందికి అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలనే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఎర్రచందనం కేసులో ఇద్దరికీ ఐదేళ్ల జైలు

తిరుపతి లీగల్: ఎర్రచందనం కేసులో ఇద్దరికీ ఐదేళ్లు చొప్పున జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పినట్టు ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు. శేషాచలం అటవీ ప్రాంతం, కరకంబాడి బీట్ ప్రాంతం 2016లో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం తనిఖీలు చేసింది. తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లాకు చెందిన శివమూర్తి సేతు, తిరుపతి శివమణి అటవీ ప్రాంతంలో అక్రమంగా సంచరించడాన్ని గుర్తించి, ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఇద్దరిపై నేరం రుజువు కావడంతో ఇద్దరికీ శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆర్టీసీ అధికారుల పరిశీలన

నాయుడుపేటటౌన్: మండలంలోని విన్నమాల సమీపంలో ఆర్టీసీ బస్సులో వెనుక నుంచి మంటలు చేలరేగిన సంఘటనకు సంబంధించి శుక్రవారం ఆర్టీసీ అధికారులు పరిశీలించారు. వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం రాత్రి 29 మంది ప్రయాణికులతో తిరుపతి నుంచి వినుకొండకు వెళుతుండగా విన్నమాల వద్దకు వచ్చే సరికే బస్సు వెనుక వైపు ఒక్కసారిగా మంటలు చేలరేగిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి తిరుపతి జిల్లా ఆర్టీసీ ఆర్ఎం జగదీష్‌తో పాటు సూళ్లూరుపేట డిపో మేనేజర్ కళ తదతరులు, మెకానిక్ బృందంతో బస్సును పరిశీలించారు.

రక్షణ విజ్ఞాన సదస్సులో ఎస్వీయూ వీసీకి గౌరవ ఫెలోషిప్



వీసీ టాటా నర్సింగరావు

తిరుపతి సిటీ: విజయవాడ వేదికగా జరిగిన రక్షణ విజ్ఞాన సదుస్సులో ఎస్వీయూ వీసీ టాటా నర్సింగరావుకు అరుదైన గౌరవం లభించింది. అకాడమి ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఏఎస్‌టీసీ) ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ సదస్సులో ఆయనకు ఏఎస్‌టీసీ గౌరవ ఫెలోషిప్‌ను ప్రకటించింది.

మహిళా వర్సిటీలో 'వికాస్-2026' జోనల్ సదస్సు

సదస్సును ప్రారంభిస్తున్న యూజీసీ కార్యదర్శి మనీష్‌జోషి

తిరుపతి రూరల్: పద్మావతి మహిళావర్సిటీలో ''వికాస్–2026 పరిశ్రమజ్ఞానం, అప్రెంటీస్‌షిప్, స్కిల్లింగ్ వైపు అడుగులు'' అనే అంశంపై సౌత్‌జోన్ సదస్సును యూజీసీ సెక్రటరీ ప్రొఫెసర్ మనీష్ జోషి ప్రారంభించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యలో నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడం, వికసిత్ భారత్ లక్ష్య సాధన వైపు యువతను నడిపించడమే ప్రధాన లక్ష్యంగా ఉన్నత విద్యాసంస్థలు పనిచేయాలన్నారు. అందులో భాగంగానే యూజీసీ 2025లో తీసుకువచ్చిన ఎంబడెడ్ డిగ్రీ ప్రోగ్రాంను తప్పక అమలు చేయాల్సి ఉందన్నారు. ఎంబెడెడ్ డిగ్రీ కోర్సుల గైడెన్స్‌ను తప్పక అమలు చేసిన విద్యాసంస్థల విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కరరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు కొత్త ప్రణాళికలు, ఎంటర్‌ప్రెన్యూర్స్‌లను అభివృద్ధి చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకుంటోందని వెల్లడించారు. మహిళా వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ వికాస్ 2026 సౌత్ జోన్ సదస్సులో ఇండస్ట్రీ అకాడమీ అనుసంధానం, స్వయంప్లస్ మాడ్యూల్స్ రూపకల్పన, కోక్రియేషన్ ఆఫ్ కరికులం తదితర ముఖ్య అంశాలపై అర్థవంతమైన చర్చలు జరపడం ఆనందంగా ఉందన్నారు. రిజిస్ట్రార్ ఆర్ ఉష, యూజీసీ సంయుక్త కార్యదర్శి అవిచల్ కపూర్, సదస్సు కో ఆర్డినేటర్లు విద్యావతి, శోభారాణి పాల్గొన్నారు.

గాజు సీసాలో ఆనంద నిలయం

మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భక్తుడు తిరుమల శ్రీవారి ఆలయ మహాద్వార గోపురాన్ని గాజు సీసాలో సూక్ష్మంగా తయారు చేసిన నమూనా ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నమూనాను ఆ భక్తుడు శుక్రవారం తిరుమల శ్రీవారి ఆలయం ముందు ప్రదర్శించారు. – తిరుమల

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

మాట్లడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

శ్రీకాళహస్తి : ఆగమ శాస్త్రాలకు అనుగుణంగా శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగిన సమీక్ష సమావేశంలో శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందుల్లేకుండా దర్శనం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఉచిత దర్శనానికే ప్రాధాన్యత ఇస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ బలోపేతం, సీసీ కెమెరాలు, డ్రోన్ నిఘా, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ తెలిపారు. ప్రతి శివరాత్రిని కొత్త శివరాత్రిలా భావించి ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్ లాల్ సూచించారు. ఇతర రాష్ట్రాల్లోనూ బ్రహ్మోత్సవాలకు విశేష ప్రాచుర్యం ఉందని ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా బాల్యవివాహాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. ఉత్సవాలకు వచ్చే ప్రతి భక్తునికి స్వామి, అమ్మవార్ల పసుపు,కుంకుమ పాకెట్ క్యాలెండర్ పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని ఏర్పాట్లు సమన్వయంతో చేపడతామని ఆలయ ఈఓ బాపిరెడ్డి చెప్పారు.

సోలార్ రూఫ్ టాప్ అమలుపై అవగాహన కల్పిస్తున్నాం

తిరుపతి రూరల్: ప్రధానమంత్రి– సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (పీఎంఎస్ జీఎంబీవై) పథకంలో భాగంగా యుటిలిటీ లిడ్ అగ్రిగేషన్ (యూఎల్‌ఏ) మోడల్ ద్వారా సోలార్ రూఫ్ టాప్ అమలు అంశంపై వినియోగదారులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నామని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ తెలిపారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్‌లో నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ (ఎంఎన్ఆర్ఇ), ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), నాబార్డ్, ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (నెడ్ క్యాప్), ఏపీఎస్పీడీసీఎల్ సంయుక్త ఆధ్వర్యంలో పీఎం–సూర్య ఘర్ పథకంపై విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులు, కాంట్రాక్టర్లకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ శివశంకర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ పీఎం–సూర్యఘర్ పథకం ద్వారా గృహాల్లో స్వచ్ఛ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా 2024లో కేంద్ర ప్రభుత్వం, ఎంఎన్ఆర్ఈ ద్వారా ప్రారంభించిన జాతీయ రూఫ్ టాప్ సోలార్ పథకం ప్రపంచంలో అతిపెద్ద గృహ రూఫ్ టాప్ సోలార్ పథకంగా ఏర్పాటైందన్నారు. ఒక నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను పొందేందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడల్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. సంస్థ పరిధిలో 2.07 లక్షల వినియోగదారులకు ఈ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో సోలార్ పద్ధతిలో 416 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడానికి సోలార్ సిస్టమ్స్ ఏర్పాటుకు నెడ్ క్యాప్ టెండర్ ప్రక్రియను పూర్తి చేసిందన్నారు.

ఎమ్మెల్యే గారూ..అసెంబ్లీలో మాట్లాడండి

ఉపాధ్యాయులు ఇచ్చిన వినతి పత్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి అర్బన్: 'ఎమ్మెల్యే గారూ.. అసెంబ్లీ సమావేశాల్లో...ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడండి సార్..ఒకటి కాదు రెండు కాదు పదుల సంఖ్యలో అయ్యోర్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఒక్క సమస్యకు పరిష్కారం దొరకడం లేదు.' అంటూ శనివారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు యూటీఎఫ్ జిల్లా కమిటీకి చెందిన ఉపాధ్యాయులు మొరపెట్టుకున్నారు. పీఆర్సీ కమిషన్ నియమించాలని, 29 శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, ఉద్యోగుల పెన్షన్ బకాయిలు చెల్లింపునకు రూట్ మ్యాప్ ప్రకటించాలని, సీపీఎల్ రద్దు చేయాలని, 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, హెల్త్‌కార్డుల మెడికల్ బిల్లుల సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముత్యాలరెడ్డి, గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా కార్యదర్శులు పద్మజ, సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ నాగరాజు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మోహన్, డివిజనల్ కోఆర్డినేటర్ మురళి, కృష్ణంరాజు, నేతలు ఖాదర్ బాషా, హేమాద్రి బాబు, ప్రభుకుమార్, వరలక్ష్మి, మురళి, గోపాల్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

విజ్ఞానకేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియ

సూళ్లూరుపేట: పులికాట్ సరస్సులో పక్షులు సందర్శనకు వచ్చే పర్యాటకులకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎఫ్ఓను అడిషనల్ పీసీసీఎఫ్ శాంతిప్రియ ఆదేశించారు. పులికాట్ సరస్సును అడిషనల్ పీసీపీఎఫ్ శాంతిప్రియ శుక్రవారం సందర్శించారు. అనంతరం అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్ర బడ్జెట్‌లో సుమారు రూ.100 కోట్లు సముద్ర ముఖద్వారాల పూడికకు కేటాయించినట్టుగా కేంద్ర ఆర్థికశాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన నేపథ్యంలో ఆమె శుక్రవారం పులికాట్ సరస్సు పరిశీలనకు వచ్చినట్టుగా తెలుస్తోంది. అటకానితిప్ప పర్యావరణ కేంద్రం పక్కనే చిన్న పాటి చెరువు ఉండడాన్ని చూసిన ఆమె ఇక్కడ పెడల్‌బోట్లు ఏర్పాటు చేస్తే పర్యాటకులు బాగా ఆనందించే అవకాశం ఉంది కదా.. మరి ఎందుకు ఇక్కడ ఆ ఏర్పాట్లు చేయలేదని అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు సీఎఫ్ సెల్వం, డీఎఫ్ఓ హారిక ఉన్నారు.

పట్టపగలే నగల చోరీ

పగల గొట్టిన బీరువా

పాకాల: పట్టపగలే రోడ్డు పక్కన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని నేంద్రగుంటలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. నేంద్రగుంటకు చెందిన రవి ఇంటికి తాళం వేసుకుని మధ్యాహ్నం సుమారు 12.30 నుంచి 1.30 గంటల ప్రాంతంలో తన కుమారుడి షాపు వద్దకు వెళ్లాడు. అలాగే ఆ ఇంటిపైన అద్దెకు ఉన్న వాసు ఇంటికి తాళం వేసుకుని దైవదర్శనం కోసం కాణిపాకం వెళ్లాడు. వాసు వినాయకస్వామి దర్శనం ముగించుకుని స్కూటర్‌లో ఇంటి వద్దకు రావడంతో దుండగులు మొదటి అంతస్తు నుంచి దూకి పారిపోవడం గమనించాడు. వాసు ఇంటిపైకి వెళ్లి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడం గుర్తించారు. రవి ఇంట్లో తాళాలు పగలగొట్టి బీరువాలోని బంగారు నెక్లెస్, కమ్మలను చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయమై పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ సుదర్శన్ ప్రసాద్ ఇళ్లను పరిశీలించారు. ఈ మేరకు ఎస్ఐ తరుణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన జాతీయ గోల్‌ఫూట్ బాల్ పోటీలు

విజేతలతో క్రీడా నిర్వహకులు

తిరుపతి అర్బన్: నగరంలో నాలుగురోజులుగా జరుగుతున్న 3వ సబ్ జూనియర్ బాల, బాలికల జాతీయ గోల్‌ఫూట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీలు గేమ్స్ వ్యవస్థాపకుడు నోట్ల రాజేంద్ర ప్రసాద్ నాయకత్వంలో జీవకోనలోని విశ్వం స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోచ్‌లు, రిఫరీలు, వలంటీర్లు, విశ్వం పాఠశాల యాజమాన్యంతోపాటు పలువురు పిల్లల తల్లిదండ్రుల సహకారం అమూల్యమైనదని కొనియాడారు. 23 రాష్ట్రాల నుంచి 500 మందికి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. రాష్ట్రంతోపాటు తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, కేరళ, పుద్దిచ్చేరి, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బిహార్, అసోం, ఢిల్లీ, జమ్మూ కశ్మీర్ నుంచి క్రీడాకారులు విచ్చేశారని వెల్లడించారు. అనంతరం విశ్వం విద్యా సంస్థల డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి చేతుల మీదుగా విజేతలకు ట్రోఫీలు, మెడళ్లు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోల్ షూట్ బాల్ ఇండియన్ కోశాధికారి రామ్ ప్రవేశ్ కుమార్ వీరూ, సౌత్ ఇండియా ఇన్‌చార్జి కరుణాకరన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి దేవి ప్రియా, సంయుక్త కార్యదర్శి ప్రసన్న కుమార్, కోశాధికారి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌హెచ్‌ఎం జిల్లా కార్యవర్గం ఎంపిక

గోపి, వెంకటరమణ, మధుసూదనరాజు, గీర్వాణి,

పుత్తూరు : మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్స్ (పీఎస్‌హెచ్‌ఎం) ఫోరం తిరుపతి జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం పుత్తూరులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రం ఫోరం కార్యదర్శి శ్రీనివాసులు, అసోసియేట్ ఉపాధ్యక్షుడు రమణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం త్వరలో సమగ్ర ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. ఏప్రిల్‌లో చేపట్టనున్న బదిలీల్లో పీఎస్‌హెచ్‌ఎంలకు తొలి ప్రాధాన్యత ఇచ్చి స్కూల్ అసిస్టెంట్స్‌గా నియమించాలని డిమాండ్ చేశారు. జనవరి 13న ప్రభుత్వం ఇచ్చిన మెమోను అందరికీ ఆమోదయోగ్యంగా సవరించాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమ బాట పడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఫోరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కె.గోపి (ఏర్పేడు), అధ్యక్షుడిగా వి.వెంకటరమణ (నాగలాపురం), ప్రధాన కార్యదర్శిగా ఎస్.మధుసూదన్‌రాజు (తిరుపతి రూరల్), కోశాధికారిగా కె.నరేష్ (వడమాలపేట), మహిళా అధ్యక్షురాలుగా డి.గీర్వాణి (తిరుపతి రూరల్), అసోసియేట్ అధ్యక్షులుగా, కార్యనిర్వాహక సభ్యులుగా మరి కొందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 21 కంపార్ట్‌మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. గురువారం అర్ధరాత్రి వరకు 61,655 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,003 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

శ్రీసిటీలో జపాన్ వాణిజ్య బృందం

శ్రీసిటీ (వరదయ్యపాళెం) : జపాన్‌లోని ఫుకోకా రాష్ట్రానికి చెందిన ఎఫ్ఎఫ్‌టీఏ– ఫుకువోకా ఫారిన్ ట్రేడ్ అసోసియేషన్ సభ్యులు ఏడుగురి బృందం శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు, పారిశ్రామిక సహకారం బలోపేతం లక్ష్యంగా ఎఫ్ఎఫ్‌టీఏ కార్యదర్శి జనరల్ మసాహిరో నిషియోరి నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికారు. ఫుకోకా రాష్ట్రంతో ఆర్థిక బంధాలను బలపరచడంలో ఈ పర్యటన అత్యంత కీలకమైనదని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శ్రీసిటీలో మౌలిక సదుపాయాలు, విభిన్న రంగ పరిశ్రమలు, సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడి అనుకూల వాతావరణం తదితర అంశాలపై శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బొడ్గాన్ జార్జ్ ప్రతినిధులకు వివరించారు. ఎఫ్ఎఫ్‌టీఏ కార్యదర్శి జనరల్ మసాహిరో నిషియోరి శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌలిక వసతులను ప్రశంసించారు. పర్యటనలో భాగంగా శ్రీసిటీ అధికారులతో సమావేశమైన ప్రతినిధులు, పెట్టుబడి అవకాశాలు, మౌలిక వసతుల విస్తరణ, భాగస్వామ్యాలపై పరస్పర చర్చలు జరిపారు.

తిరుపతిలో రోడ్డు ప్రమాదం

ఇంటర్ విద్యార్థి మృతి

తిరుపతి క్రైం: నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియట్ విద్యార్థి మృతి చెందాడు. అన్నమయ్య జిల్లా కేవీ పల్లి మండలం మూల వడ్డేపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య కుమారుడు బాబు (17) ఉద్యోగం కోసం తిరుపతికి వచ్చి పీజీ హాస్టల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 11.45 గంటల సమయంలో స్నేహితుడు హరికృష్ణతో కలిసి స్కూటీపై ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని డీమార్ట్ పక్కన ఉన్న సందు దారి నుంచి ప్రధాన రోడ్డులోకి వస్తుండగా, టీవీఎస్ సర్కిల్ వైపు నుంచి అన్నమయ్య సర్కిల్ దిశగా అతివేగంగా వచ్చిన బైక్ స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాబు రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని వెంటనే రుయా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2.12 గంటలకు మృతి చెందాడు. మృతుడి అన్న పల్లపు రమణ కుమారుడు పల్లపు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సిద్ధార్థలో మీనాక్షిచౌదరి సందడి

క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న మీనాక్షిచౌదరి

నారాయణవనం: సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రాత్రి సినీ నటి మీనాక్షి చౌదరి విద్యార్థులతో కలిసి సందడి చేశారు. కళాశాల సిల్వర్ జూబిలీ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్పోర్ట్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అనంతపురం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య, సినీ నటి మీనాక్షిచౌదరి హాజరయ్యారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించారు. సాయంత్రం ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో క్రీడల్లో గెలుపొందిన వారికి కృష్ణయ్య, మీనాక్షిచౌదరి ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులకు శారీరకంగానూ, మానసికంగానూ ధృఢంగా ఉంటేనే చదువుపై దృష్టిని సారించే అవకాశం ఉంటుందన్నారు. సినీ నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్‌లో క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకున్నానన్నారు. దేహ ధారుడ్యానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ శనివారం పూర్వ విద్యార్థుల అలుమిని డే, ఆదివారం నిర్వహించే సిల్వర్ జూబ్లీ వేడుకల్లో సినీ హీరోయిన్స్ నిధి అగర్వాల్, శ్రీలీల, హీరో తేజా సజ్జా, తమన్ సంగీత విభావరి, నటరాజ్ ట్రూప్ నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



ఈగ రమణయ్య (ఫైల్)

వెంకటగిరి రూరల్: కరెంట్‌షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని కాంపాళెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కాంపాళేనికి చెందిన ఈగ రమణయ్య (52) గురువారం గొడ్డేరువాగు సమీపంలో కట్టెలు కొట్టడానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ ఉన్న విద్యుత్ వైర్లు ప్రమాదవశాత్తు రమణయ్యకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రమణయ్య మృతి చెందడంతో కాంపాళెం ప్రాంతంలోవిషాదఛాయలు అలుముకున్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ONE SITTING

For Disc. (Stu):10th,Inter,BA, B.Com, B.Sc, B.Tech, B.Pharm, D.Pharm, B.Ed, BMLT, DMLT, Nursing ,M.Sc, MBA, MCA, LLB. ✆ 9381287629.

Real Estate

PLOTS FOR SALE

తిరుపతి IIT,IISER కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల దగ్గరలో ఫైనల్ అప్రూవ్ కలిగిన ప్లాట్లు అతి తక్కువ ధరకే ,డైరెక్ట్ ఓనర్. 9966262221/9502774175

WANTED PLOTS

డైరెక్ట్ ఓనర్స్. విద్యానగర్ కాలనీ, చెర్లోపల్లి, తాటితోపు, శ్రీనివాసమంగాపురం,పెరుమాళ్ళపల్లి, కాలూరు క్రాస్, L.B.నగర్ Opp. S.V. ఇంజరింగ్ కాలేజీ ఏరియాలలో తుడా అప్రూవల్ ప్లాట్స్ కావలెను. ✆ 94908 30856.

Services

SECOND SALES

పాత AC, ఫ్రిడ్జ్, వాషింగ్ మెషిన్, గీజర్లు మంచి రేటుకు కొనబడును సంప్రదించండి ఫోన్: 0877-2249070, సెల్: 9553550350.

PERSONAL CARE

CHANGE OF NAME

I, Bandela Jagadesh S/o Bandela Prasad (Old Name) Resident D.No. 6-18/B, Sai Nagar, Tirupati, Tirupati Dist, A.P. have changed my name Bandela Jagadeesh S/o Bandela Prasad (New Name)

Wanted

తిరుపతిలోని ఒక ప్రముఖ CBSE స్కూల్‌లో అర్హత కలిగిన ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, రిసెప్షనిస్ట్ & టెలికాలర్లు (స్త్రీ / పురుషులు) కావలెను. ఏదైనా డిగ్రీ చదివి మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు (తెలుగు, ఇంగ్లీషు, హిందీ, కన్నడ, తమిళ్) ఉన్నవారు అలానే గర్ల్స్ హాస్టల్ వార్డన్ కొరకు (లేడీస్) దరఖాస్తు చేసుకోవచ్చు. టైమింగ్స్ : ఫుల్ టైమ్ జీతం పని ఆధారంగా ఉంటుంది. సంప్రదింపు నంబర్లు : 6301959921, 6301959922 E-mail.id:hrvsstpt@gmail.com

Wanted Female Hostel Incharges Qualification Any Degree. Age Limit: 25 to 45years, Salary Upto: 15,000/- Working Location: Master Minds College, Tirupati. Contact: 8978180843

WANTED FEMALE TELECALLERS Q: Degree/B.Tech/Any PG. Location : Tirupati, Salary:15,000 to 20,000, Exp. / Fresher. 9994091579, 7550254545.

శివకార్తికేయ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్ /నర్సులు కావలెను.ఫ్రీవసతి భోజనం.జీ: 20K. Ph:9912011499, 9912011899.

మీ ఇంటివద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801

కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను.జీ:15వేలు-40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd. 9347197693

గమనిక

వాణిజ్యలైన్ల ప్రకటనకు రూ. 375/- ప్రతి ప్రకటనపై అదనపు లైనుకు రూ.:90/- G.S.T 5% అదనం

CONTACT : 9440166091, 9951602970

క్లుప్తంగా

క్లెయిమ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్

మాట్లాడుతున్న రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరణ హర్షణీయమని, అయితే క్లెయిమ్స్‌కు సంబంధించి బకాయిలను సైతం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ, బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ప్రమాదంలో మరణించిన, అంగవైకల్యం పొందిన కార్మికులకు రూ.10 లక్షలు అందించాలని కోరారు. 60 ఏళ్ల దాటిన ప్రతి కార్మికుడికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని సూచించారు. నేతలు ఎన్‌డీ రవి, చంద్రశేఖర్‌రెడ్డి, హరి, చంద్రబాబు పాల్గొన్నారు.

అప్పలరాజు విడుదలపై హర్షం

తిరుపతి కల్చరల్ : సీపీఎం నేత అప్పలరాజు బెయిల్‌తో విడుదల కావడంపై సీపీఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అన్యాయంగా పీడీ యాక్ట్ ప్రయోగించి 42 రోజుల పాటు అప్పలరాజును జైల్లో పెట్టిందని మండిపడ్డారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

తిరుపతి క్రైం: గిరిపురంలోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగినట్లు వెస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ముత్యాలమ్మ ఆలయ హుండీలో నగదు చోరీ చేసినట్లుగా శుక్రవారం ఆలయ పూజారి గుర్తించి ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని సీఐ తెలిపారు. ఈ హుండీలో సుమారు రూ.10 వేలు ఉన్నట్లుగా ఆలయం సిబ్బంది చెబుతున్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం

ఉపాధ్యాయులతో విద్యార్థులు

రామచంద్రాపురం : మండలంలోని కమ్మ కండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. హెచ్‌ఎం సునీత మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలతో పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అబూబిన్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

తమ్ముళ్ల తకరారు!

- పచ్చమూక ఫెక్సీల రగడ
- పోలీసుల అదుపులో టీడీపీ కార్యకర్తలు

చంద్రగిరి : ప్రతిపక్ష పార్టీ నేతలపై దాడులు.. ప్రజలపై దౌర్జన్యాలతో టీడీపీ నేతలు ఇంతకాలం గడిపారు. అయితే ఇప్పుడు సొంత పార్టీలోనే ఆధిపత్యం పోరుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా చంద్రగిరి టీడీపీలో అంతర్గత విబేధాలు భగ్గుమన్నాయి. ఫెక్సీల రాజకీయం తమ్ముళ్ల నడుమ తకరారుకు కారణమైంది. వివరాలు.. పట్టణానికి చెందిన ఓ టీడీపీ నేత ఎమ్మెల్యే పులివర్తి నానికి స్వాగతం పలుకుతూ తొండవాడ నుంచి చంద్రగిరి వరకు ఫెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక తమ్ముళ్లకు మండుకొచ్చింది. పక్క పంచాయతీ నుంచి వచ్చి ఇక్కడ బ్యానర్లు కట్టడమేంటని ఆవేశం పొంగుకొచ్చింది. దీంతో వెంటనే సదరు నేత పెట్టించిన ఫెక్సీలను టీడీపీ కార్యకర్తలే రెండు రోజుల క్రితం చించేశారు. ఫ్రేమ్‌లను సైతం ఎత్తుకెళ్లిపోయారు.

పోలీసులకు ఫిర్యాదు

ఫెక్సీలను ధ్వంసం చేయడంతో సదరు టీడీపీ నేత అవమానంగా భావించారు. ఫ్రేమ్‌లను సైతం తీసుకెళ్లిపోవడంతో ఆగ్రహించారు. వెంటనే దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే అరుణకాలనీకి చెందిన 10 టీడీపీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెండు రోజులుగా విచారణ పేరుతో పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పుతున్నట్లు ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఈమేరకు పోలీసులు వ్యవహరిస్తున్న తీరుతో మరో వర్గం తమ్ముళ్లు మండిపడుతున్నారు. తమ పంచాయతీలో ఆయన పెత్తనం ఏమిటని..? ఎవరిని అడిగి ఇక్కడ బ్యానర్లు ఏర్పాటు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైగా సొంత పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయించడంపై తొండవాడకు చెందిన టీడీపీ నేతలు ఆవేదన చెందుతున్నారు. తొండవాడలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు సదరు నేత వస్తే అడ్డుకుంటామని హెచ్చరిస్తుండడం గమనార్హం.

రూరల్ ఎంపీపీగా మాధవరెడ్డి

బాధ్యతలు స్వీకరిస్తున్న మాధవరెడ్డి

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ ఎంపీపీగా విడుదల మాధవరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీగా మూలం చంద్రమోహన్‌రెడ్డి, మొదటి వైస్ ఎంపీపీ యశోదమ్మ ఆరు నెలల పాటు సెలవులోకి వెళ్లడంతో రెండో వైస్ ఎంపీపీ మాధవరెడ్డికి ఈ అవకాశం వరించింది.

ఈ సందర్భంగా ఎంపీపీ చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి రంగనాథం, సిబ్బంది, పలువురు సన్నిహితులు నూతన ఎంపీపీ మాధవరెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎంబీయూలో ఫీజుల దోపిడీపై ఆందోళన

ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎంబీయూలో ఫీజుల దోపిడీపై విద్యార్థి, యువజన సంఘాల నేతలు మండిపడ్డారు. శుక్రవారం ఎస్వీయూలో ప్రకాశం భవనం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎంబీయూలో అక్రమ ఫీజులను అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నేతలను కిడ్నాప్ ఘటనకు బాధ్యులైన మోహన్ బాబు, మంచు విష్ణును తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. విద్యార్థుల నుంచి అక్రమంగా వసూలు చేసిన రూ.26 కోట్లను వెంటనే పిల్లలకు తిరిగి చెల్లించాలని స్పష్టం చేశారు. లేకుంటే ఎంబీయూ వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నేతలు అశోక్ కుమార్, చిన్నా, ప్రసన్నకుమార్, బండి చలపతి, సునీల్, మల్లికార్జున, రవి, ఉదయ్, ప్రవీణ్, పవిత్ర, భార్గవ్, యోగేష్ పాల్గొన్నారు

అభివృద్ధి పనుల వేగవంతం

తిరుపతి తుడా: నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శుక్రవారం ఈ మేరకు ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పర్యటించినప్పుడు, గ్రీవెన్స్‌లో వచ్చిన వినతుల ఆధారంగా ప్రాధాన్యమైన పనులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. ఈ క్రమంలోనే సీసీ రోడ్లు, డ్రైనేజి కాలువల నిర్మాణం, కాలువల మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్‌ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి పాల్గొన్నారు.

మహా సంప్రోక్షణ కరపత్రం ఆవిష్కరణ

తిరుపతి అన్నమయ్యసర్కిల్: నాగలాపురం శ్రీవేద వల్లీ సమేత వేదనారాయణస్వామివారి ఆలయంలో ఈ నెల 17 నుంచి 22వ తేదీ వరకు చేపట్టనున్న విమాన జీర్ణోద్ధరణ అష్టబంధన మహాసంప్రోక్షణ కార్యక్రమాల కరపత్రికను ఈఓ రవిచంద్ర ఆవిష్కరించారు. శుక్రవారం టీటీడీ పరిపాలన భవనంలో ఈఓ మాట్లాడుతూ రాజగోపుర, అష్ట బంధన మహా సంప్రోక్షణలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. టీటీడీ అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, జేఈఓలు వీరబ్రహ్మం, డాక్టర్ శరత్, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ సూపరింటెండెంట్ ధర్మయ్య పాల్గొన్నారు.

పృథ్వీకి సత్కారం

పృథ్వీతో నేతలు

తిరుపతి కల్చరల్ : బీజేవైఎం యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎంపికైన జి.పృథ్వీరెడ్డిని బీజేవైఎం జిల్లా యువజన విభాగం నేతలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. నేతలు సుబ్బ యాదవ్, చైతన్య యాదవ్, హరియాదవ్, ఈశ్వర్ యాదవ్, దీపక్ యాదవ్ పాల్గొన్నారు.

‘వండర్ కిడ్స్’ విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చాటిన విద్యార్థులు

తిరుపతి రూరల్ : అవిలాల పంచాయతీలోని వండర్ కిడ్స్ ఆక్టివిటీ బేస్డ్ స్కూల్ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన యునైటెడ్ వరల్డ్ రికార్డ్స్‌లో అద్భుత ప్రతిభను కనబరిచారు. 25 మంది విద్యార్థులు నాన్ చాక్ పెర్ఫార్మెన్స్ చేపట్టి సర్టిఫికెట్లు, మెడల్స్ అందుకున్నారు. శుక్రవారం ఈ మేరకు విద్యార్థులను అభినందించారు. వండర్ కిడ్స్ చైర్మన్ రవి కుమార్ నాగిశెట్టి, అప్సా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్ బాబు, కరాటే కోచ్ అనిల్, డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో డాక్టర్ రాధా వెంకటేశన్

వెంకటేశన్‌ను సత్కరిస్తున్న డైరెక్టర్

తిరుపతి తుడా : శ్రీవారి వైద్యసేవలో భాగంగా తిరుపతికి విచ్చేసిన కేరళకు చెందిన వేతన రహిత అధ్యాపక వైద్యులు రాధా వెంకటేశన్ శుక్రవారం స్విమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. నొప్పి, పాలియేటివ్ కేర్ విభాగం పరిశీలించారు. అనంతరం అంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రాణబంధు దాస్, వైద్య బృందంతో విస్తృతంగా చర్చించారు. పాలియేటివ్ కేర్ సేవల అమలు విధానాలు, మరింత బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈక్రమంలోనే ఆమెను డైరెక్టర్ ఆర్వీ కుమార్ ఘనంగా సత్కరించారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

పాకాల : దేశవ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన చేపట్టనున్న సమ్మె పోస్టర్‌ను శుక్రవారం సంతగేటు వద్ద సీఐటీయూ నేత మధుసూదన్‌రావు ఆవిష్కరించారు. నేతలు ఆనంద్, గోపి, వెంకట్రామయ్య, నరేంద్ర, రవి, ఉదయ్ పాల్గొన్నారు.

ఇద్దరు ‘ఎర్ర’ స్మగ్లర్లపై పీడీ యాక్ట్

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న కర్ణాటకకు చెందిన నారాయణస్వామి (48), తమిళనాడుకు చెందిన సయ్యద్ అబ్దుల్ లతీఫ్ అలియాస్ సేటు అలియాస్ సేటు బాయ్ (49)లపై టాస్క్‌ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఎర్రస్మగ్లర్లపై టాస్క్‌ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బారాయుడు సిఫారసు మేరకు కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఎర్రస్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేయడంతో నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

‘విజన్ బిల్డింగ్’పై శిక్షణ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం విజన్ బిల్డింగ్ మాడ్యుల్–3పై శిక్షణ తరగతులు నిర్వహించారు. వెలుగు ఏపీఎం సీతారామయ్య మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులందరూ వనరును సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరారు. ఏపీఎం బి. నారాయణమ్మ, సీసీలు శివశంకర్ రెడ్డి, కె. నారాయణ మూర్తి, నాగభూషణం పాల్గొన్నారు.

భూసార పరీక్షలు అవసరం

భాకరాపేట : మామిడితోటల్లో భూసార పరీక్షలు అవసరమని ఉద్యాన శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. శుక్రవారం కోకోకోలా ఫౌండేషన్, కృషి విజ్ఞాన కేంద్రం వారు ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించారు. మట్టి సేకరణ విధానం మరియు భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. శాస్త్రవేత్త అనిల్ కుమార్, రాస్ సిబ్బంది కిషోర్ పాల్గొన్నారు.

రెడ్‌కార్పెట్ జ్యువెలరీ ఎగ్జిబిషన్

తిరుపతి కల్చరల్ : పీఎల్ఆర్ కన్వెన్షన్‌లో రెడ్‌కార్పెట్ బిగ్గెస్ట్ జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. గోల్డ్, డైమండ్స్, పోల్కి, జెమ్స్‌కు సంబంధించిన 30 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ఆర్‌కే నాయుడు, శైలజారామ్ తెలిపారు. జ్యువెలరీ ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందని వెల్లడించారు. శని, ఆదివారం రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు ఈ ప్రదర్శన ఉంటుందని వివరించారు.

కొనసాగుతున్న పుస్తక ప్రదర్శన

తిరుపతి అర్బన్ : నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో భారతీయ విద్యాభవన్ వారు ఏర్పాటు చేసిన 18వ పుస్తక ప్రదర్శన శుక్రవారం నాలుగోరోజు కొనసాగింది. అల్లాడి మోహన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. నడింపల్లి సత్యనారాయణ రాజు, ఆచార్య విజయభాస్కరరావు పాల్గొన్నారు.

వసతుల అప్‌లోడ్ తప్పనిసరి

పాకాల : ప్రతి పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను విద్యాంజలి 2.0 వెబ్ సైట్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ గౌరీశంకర్‌రావు తెలిపారు. శుక్రవారం పాకాల ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ తరగతి నిర్వహించారు. గౌరీశంకర్‌రావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, ఎన్ఆర్ఐలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల భాగస్వామ్యంతో పాఠశాలలకు కావలసిన మౌలిక వసతులను సమకూర్చుకునేందుకు యత్నించాలని సూచించారు. దాతల నుంచి నగదు తీసుకోకూడదని, వస్తువులు మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎంఈఓలు బాబ్జీ, లింగయ్య, ఆర్‌పీలు వెంకటాద్రి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

‘ఎన్ఏఆర్ఎల్’లో స్వచ్ఛతా పక్వాడ

పాకాల : మండలంలోని గాదంకి వద్ద ఎన్ఏఆర్ఎల్‌లో స్వచ్ఛతా పక్వాడాను శుక్రవారం నిర్వహించారు. ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ డాక్టర్ అమిత్‌కుమార్ పాత్రా మాట్లాడుతూ స్వచ్ఛతలో సుస్థిరత సాధించాలని కోరారు. 15వ తేదీ వరకు స్వచ్ఛతా కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు వివరించారు.

‘గాండ్ల తెలికుల’ సమావేశం రేపు

తిరుపతి కల్చరల్: తిరుచానూరులోని పద్మావతి కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి బండారు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. నేతలు సాకం ప్రభాకర్, ఉమాపతి, గుణశేఖర్, ప్రకాష్, శంకర్, ప్రతాప్ పాల్గొన్నారు.

రైల్వే సీఐగా వరప్రసాద్

తిరుపతి క్రైమ్ : తిరుపతి రైల్వే సీఐగా ఎన్.వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే ప్రయాణం సురక్షితంగా, ప్రశాంతంగా ఉండేలా కృషి చేస్తామని తెలిపారు.



ఇబ్రహీంపట్నం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట తరలివస్తున్న అశేష జనవాహినిలో ఓ భాగం

పవిత్ర లడ్డూపై దుష్ప్రచారం ఆపి... క్షమాపణ చెప్పాలి

చంద్రబాబు సర్కారు దుష్ప్రచార కుట్రలపై వైఎస్ జగన్ నిప్పులు

సీబీఐ సిట్ చార్జ్‌షీట్ వేసిన తర్వాత అయినా చంద్రబాబు చేయాల్సిన పని ఏంటంటే.. శ్రీ వేంకటేశ్వరస్వామి ముందు లెంపలేసుకుని ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. కనీసం మానవత్వం ఉన్న మనిషైతే చంద్రబాబు అలాంటి పని ఎందుకు చేయడం లేదు?

సీబీఐ సిట్ చార్జ్‌షీట్‌లో పొందుపరిచిన వాస్తవాలను చూపించి ఎవరైనా చంద్రబాబుని ప్రశ్నిస్తే.. ఆయన అసహనంతో మా నాయకుల మీద దాడులు చేయించే నీచ స్థాయికి దిగజారిపోయాడు. అందులో భాగంగానే వరుసపెట్టి మా నాయకులు విడదల రజిని, బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి మీద దాడి చేయడమే కాకుండా అంబటి రాంబాబు ఇంటి మీద కూడా దాడి చేశారు.

అసలు చంద్రబాబుకు చిప్ సరిగ్గా ఉంటే ఇలాంటి పనులు చేయిస్తారా? తిరుమల లడ్డూ విషయంలో సీబీఐ క్లీన్‌చిట్ ఇచ్చినా.. ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌లు ఎలాంటి జంతు కొవ్వు లేదని ధ్రువీకరించినా.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్ తమ తీరు అస్సలు మార్చుకోవడం లేదు.

తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న కూటమి నేతల ఆరోపణల నేపథ్యంలో చంద్రబాబు వక్రబుద్ధి, అబద్ధాలపై వైవీ సుబ్బారెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ సిట్‌ను ఏర్పాటు చేసింది. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా సీబీఐ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌ను ఎవరూ తప్పుపట్టలేరు. ఇవాళ చంద్రబాబు తన స్వార్థం కోసం వన్‌మ్యాన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వాటికి ఎలాంటి ప్రామాణికత ఉండదు. తనకు అనుకూలంగా రిపోర్టు రాకపోవడంతో మళ్లీ కొత్త కమిషన్ ఏర్పాటు చేసుకుని, తనకు అనుకూలమైన రిపోర్టు కోసం కుట్ర చేస్తున్నాడు.
– మీడియాతో వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: 'చంద్రబాబు చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని సీబీఐ చార్జ్‌షీట్‌లో తేల్చి చెప్పింది. తిరుమలలో వాడిన నెయ్యిలో జంతు కొవ్వు కానీ, పంది కొవ్వు కానీ, చేప నూనె కానీ కలవలేదని స్పష్టం చేసింది. అయినప్పటికీ చంద్రబాబు అన్యాయంగా ఇంకా దుష్ప్రచారం కొనసాగిస్తూనే ఉన్నారు. చంద్రబాబు సీఎం కాక ముందు వరకు ఎవరైనా తిరుమల ప్రసాదం ఇస్తే కళ్లకు అద్దుకుని తినేవారు. కానీ ఇప్పుడు ఆ ప్రసాదం పవిత్రతను చంద్రబాబు దిగజార్చాడు. ఒక అబద్ధాన్ని సృష్టించి రాజకీయాల కోసం దేవుడిని కూడా వాడుకున్న దుర్మార్గుడు చంద్రబాబే. లడ్డూ ప్రసాదం నెయ్యిలో జంతు కొవ్వు లేదని ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్‌ల నివేదికలు స్పష్టం చేసినా చంద్రబాబు ఇంకా ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం దారుణం..' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. అబద్ధాన్ని సృష్టించి రెక్కలు కట్టి దుష్ప్రచారం చేశారని, కానీ చంద్రబాబువి అబద్ధాలని సీబీఐ చార్జ్‌షీట్ తేల్చేసిందని వైఎస్ జగన్ గుర్తు చేశారు.

కక్షగట్టి దాడులు

చంద్రబాబు అబద్ధాలను ప్రశ్నిస్తున్నందుకు చిప్ పని చేయక పోవడం వల్లే కక్షగట్టి దాడులకు దిగుతున్నారని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. చేసిన తప్పు ఒప్పుకుని, లెంపలు వేసుకుని క్షమాపణ చెప్పకుండా ఎదురుదాడి చేస్తున్నారని ఆక్షేపించారు. ఇప్పుడు వన్‌మ్యాన్ కమిషన్ అంటూ అనుకూల నివేదిక కోసం చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని, ఆ కమిషన్‌కు ఏ మాత్రం విలువ ఉండదని తేల్చి చెప్పారు. టీడీపీ గూండాలు గుంటూరులో అంబటి రాంబాబు ఇంట్లో ఐదు కార్లు ధ్వంసం చేయడంతోపాటు ఇల్లు, ఆఫీసులో విధ్వంసం సృష్టించి ఆఫీస్‌కు నిప్పుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ మర్నాడు ఆదివారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు జోగి రమేష్ ఇంటిపై ఏకంగా యాసిడ్ బాటిళ్లతో, పెట్రోల్ బాంబులతో విధ్వంసం సాగించారని ధ్వజమెత్తారు. అక్కడ అంబటి రాంబాబు.. ఇక్కడ జోగి రమేష్ తండ్రిపై హత్యాయత్నం జరిగిందని, పోలీసుల సమక్షంలోనే రెండు చోట్లా దాడులు జరిగాయని.. టీడీపీ గూండాలకు వారు అండగా ఉంటున్నారని కన్నెర్ర చేశారు. నాగరిక సమాజం తల దించుకునేలా చంద్రబాబు రాష్ట్రంలో జంగిల్‌రాజ్ కొనసాగిస్తున్నారని నిప్పులు చెరిగారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే భౌతిక దాడులు చేస్తున్నారని, నాగరిక సమాజం తల దించుకునేలా చంద్రబాబు సర్కారు చర్యలు ఉన్నాయని మండిపడ్డారు. తప్పులు చేస్తున్న ఎవరినీ వదిలిపెట్టబోమని, సుప్రీంకోర్టు తలుపు కూడా తడతామని హెచ్చరించారు. మరో మూడేళ్లలో వచ్చేది తమ ప్రభుత్వమే అని, ఇప్పుడు తప్పులు చేస్తున్న అందరినీ బోనులో నిలబెడతామని, వారికి శిక్ష తప్పదని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో టీడీపీ మూకల దాడిలో దెబ్బతిన్న జోగి రమేష్ ఇంటిని శుక్రవారం వైఎస్ జగన్ పరిశీలించారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

నాగరిక సమాజం తలదించుకునేలా..

రాష్ట్రంలో జంగిల్‌రాజ్ పరిపాలన సాగుతోంది. నాగరిక ప్రపంచం తలవంచుకునేలా చంద్రబాబునాయుడు చేశారు. గుంటూరులో అంబటి రాంబాబు ఇంట్లో 5 కార్లను ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడ్డారు. అద్దాలను పగలగొట్టారు. ఇంట్లో ఆడవాళ్లను దుర్భాషలాడారు. ఇంటి పక్కనే ఉన్న ఆఫీసులోకి చొరబడి విధ్వంసానికి దిగి ఆఫీసును తగలబెట్టారు. ఇవన్నీ పోలీసుల సమక్షంలో జరగటాన్ని అంతా చూశాం. అక్కడ సాయంత్రం 5 గంటల నుంచి అర్ధరాత్రి వరకు దహనకాండ జరిగింది. ఆ మర్నాడే ఇక్కడ కూడా సాయంత్రం అదే పరంపర కొనసాగింది. జోగి రమేష్ ఇంటిపైనా దారుణంగా దాడి చేశారు.

చంద్రబాబు చెప్పేవన్నీ అబద్ధాలని సీబీఐ తేల్చింది

చంద్రబాబునాయుడు నిస్సిగ్గుగా అబద్ధాలు ఆడుతున్నాడని, ప్రజలను తప్పుదోవ పట్టించాడని సాక్షాత్తూ సీబీఐయే తేటతెల్లం చేస్తూ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. చంద్రబాబు ఆరోపించినట్లుగా తిరుమలలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కానీ, గొడ్డు మాంసం కానీ, పందికొవ్వు కానీ, చేప నూనె కాని కలపలేదని సీబీఐ స్పష్టం చేసింది. శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా చంద్రబాబు దుష్ప్రచారం చేశాడు.

ప్రతిష్టాత్మక ల్యాబ్‌లూ అదే నిర్ధారించాయి

తిరుమలలో వాడిన నెయ్యిపై చంద్రబాబు చెబుతున్నవి అబద్ధాలని దేశంలోనే ప్రతిష్టాత్మకమైన నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌డీఆర్‌ఐ), నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) ల్యాబ్‌లు నిర్ధారించాయి. ఆ మేరకు నివేదికలు ఇచ్చాయి. అవి రెండూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు. వారు పరీక్షించిన నెయ్యి శాంపిల్స్ అన్నీ కూడా చంద్రబాబు సీఎంగా ఉండగా, ఆయన మనిషి టీటీడీ ఈవోగా ఉండగా సేకరించినవే. సీబీఐ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీకి ఆ శాంపిల్స్ పంపారు. తిరుమలలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు లేదని, గొడ్డుమాంసం లేదని, పందికొవ్వూ లేదని, ఎలాంటి చేపనూనె కూడా కలవలేదని ఆ ల్యాబ్‌లు ధ్రువీకరించాయి. ఆ రిపోర్టులను సీబీఐ కూడా సర్టిఫై చేసింది. సీబీఐ సిట్ ఆ మేరకు చార్జ్‌షీట్ దాఖలు చేసింది.

భూమన, వైవీకి సీబీఐ క్లీన్‌చిట్..

ఆ చార్జ్‌షీట్‌లో సీబీఐ మరో విషయం కూడా చెప్పింది... గతంలో టీటీడీ చైర్మన్లుగా వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి ఉన్నప్పుడు వాళ్లు ఎలాంటి తప్పూ చేయలేదని, అన్యాయమైన పనులు చేయలేదని స్పష్టం చేసింది. అందుకే వారి పేర్లు చార్జ్‌షీట్‌లో పెట్టలేదు. వారిలో ఎవరినీ అరెస్టు చేయలేదు. అంటే సీబీఐ వారికి క్లీన్‌చిట్ కూడా ఇచ్చింది. ఇదొక్కటే కాదు.. ఆ చార్జ్‌షీట్‌లో మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే.. (పేజీ నెం 62 ప్రస్తావించారు) చంద్రబాబు సీఎం అయిన తర్వాత 2024 జూలై 25న నెయ్యిలో నాణ్యత లేదని టీటీడీ 4 ట్యాంకర్లను రిజెక్ట్ చేసింది (ఆ రిపోర్టు చదివి వినిపించారు. చార్జ్‌షీట్‌లోని పేజీ నెం 64, 44 అంశాలను చదివి వినిపించారు). కానీ ఆ రిజెక్ట్ చేసిన ట్యాంకర్లు మళ్లీ ఇదే చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే దొడ్డిదారిన వేరేవాళ్ల పేరుతో తిరిగి వస్తే వాటిని టీటీడీ ఆమోదించింది. అవే ట్యాంకర్ల నెయ్యిని లడ్డూ తయారీకి వాడారని స్వయంగా సీబీఐ వెల్లడించింది. అలా చంద్రబాబు ప్రభుత్వం మీద, వాళ్లు చేసిన తప్పుల మీద, వాళ్లు చేసిన అన్యాయంపై చార్జ్‌షీట్‌లో రాశారు.

పాపం చేసింది ఎవరు బాబూ..?

ఏకంగా సీబీఐనే చంద్రబాబు ప్రభుత్వం మీద ఈ మాదిరిగా చార్జ్‌షీట్‌లో రాసిన తర్వాత అసలు పాపం చేసిన వాళ్లు ఎవరు? అని చంద్రబాబును, ఆయన కుమారుడిని, కూటమిలో ఉన్న పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నిస్తున్నా. టీటీడీ నెయ్యిలో చేప నూనె, గొడ్డు కొవ్వు, జంతువుల కొవ్వు కలిసిందని ఎవరు చెప్పారు..? సీబీఐ చెప్పిందా..? ఎన్‌డీఆర్‌ఐ, ఎన్‌డీడీబీ ల్యాబ్ రిపోర్టులు చెప్పాయా..? చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌తో పాటు రోజూ వారి పల్లకి మోస్తున్న ఎల్లో మీడియా (ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5) ప్రచారం చేయడం మినహా ఎవరైనా చెప్పారా? ఒక అబద్ధానికి రెక్కలు కట్టి దుష్ప్రచారం చేసి దాని ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం కన్నా హేయమైన చర్య ఇంకోటి ఉంటుందా?

చంద్రబాబుకు ఇకనైనా బుద్ధి రావాలి..

అనిల్ సింఘాల్‌ను చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే టీటీడీ ఈవోగా నియమించారు. మా ప్రభుత్వం ఆయన్ను కొనసాగించింది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చినప్పుడు ఆయన్నే తెచ్చారు. శ్యామలరావును టీటీడీ ప్రక్షాళన కోసం తెచ్చానని చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక చెప్పారు. ప్రక్షాళనకు ముందే ఆయన్ను ఎందుకు టీటీడీ ఈవోగా తొలగించారు? శ్యామలరావు ఈవోగా ఉన్నప్పుడు కొన్ని నెయ్యి ట్యాంకర్లు రిజెక్ట్ అయ్యాయి. అవే ట్యాంకర్లు.. మళ్లీ టీటీడీకి మరో డెయిరీ పేరుతో తిరిగి వచ్చినట్లు సీబీఐ సిట్ ధ్రువీకరించింది. మరి పాపం చేసింది ఎవరు చంద్రబాబూ? చంద్రబాబుకు ఇకనైనా బుద్ధి రావాలని దేవుడిని ప్రార్థిస్తున్నా.

పూజలు చేయడం తప్పా..?

మానవత్వం లేని చంద్రబాబుని ప్రశ్నిస్తూ.. ఆయనకు దేవుడు జ్ఞానోదయం కలిగించాలని ప్రార్థిస్తూ మా నాయకులు ఆలయాల్లో పూజలు చేశారు. ఆయనతోపాటు లోకేశ్, పవన్‌కల్యాణ్‌తో సహా ఇతర నాయకులకు బుద్ధి, జ్ఞానం కలగాలని, వారి చిప్ రిపేర్ చేయాలని మా నాయకులంతా గుళ్లల్లో పూజలు చేశారు. ఒక అబద్ధానికి రెక్కలు కట్టి దుష్ప్రచారం చేస్తూ శ్రీవారి ప్రతిష్టను మంట కలిపేస్తుంటే మావాళ్లు గుళ్లలో పూజలు చేయడం తప్పా?

ఇది హత్యాయత్నం కాదా..?

లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు ఆరోపణలు పచ్చి అబద్ధమని అంత స్పష్టంగా, అన్ని విధాలుగా తేలిన తర్వాత కూడా ఈ పెద్ద మనిషి ఫ్లెక్సీలు కట్టి తిరుమల ప్రతిష్టను దిగజార్చేలా దుష్ప్రచారం చేయడం ధర్మమేనా? ఆ ఫ్లెక్సీల్లో అన్యాయమైన మాటలు రాసి దుష్ప్రచారం చేయడం న్యాయమేనా? చంద్రబాబు, లోకేశ్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రశ్నిస్తూ మా నాయకుడు జోగి రమేష్.. మీ చిప్ రిపేర్ చేసుకోమని సలహా ఇచ్చాడు. దానికి ఇంత అన్యాయమైన పని చేయడం ధర్మమేనా? సలహా ఇవ్వడం మినహా జోగి రమేష్ ఏమీ చేయలేదు. దానికే చంద్రబాబుకి అసహనం ఏస్థాయిలో వచ్చింది అంటే.. ఏకంగా యాసిడ్ బాటిల్స్, పెట్రోల్ బాంబులతో జోగి రమేష్ ఇంటి మీద దాడులు చేయించాడు. ఆ యాసిడ్ పడిన ప్రాంతంలో బండలు కూడా తీవ్రంగా కాలిపోయాయి. గోడల నిండా యాసిడ్ మరకలు కనిపిస్తున్నాయి. యాసిడ్ పడి డోర్లు కాలిపోయాయి. ఆ పక్కనే ఉన్న స్విచ్ బోర్డుల మీద పడి షార్ట్ సర్క్యూట్ అయితే పెద్ద ఘోరం జరిగి ఉండేది. ఇంట్లో ఉన్న కర్టెన్లు, ఉడెన్ ఫర్నీచర్లు కాలిపోతే పరిస్థితి తీవ్ర రూపం దాల్చేది. ఇంట్లో 80 ఏళ్ల వయసున్న జోగి రమేష్ నాన్న నడవలేని స్థితిలో ఉన్నాడు. ఇది హత్యాయత్నం కాదా? బీసీ నాయకుడిగా జోగి రమేష్ ఎదుగుతుంటే, ప్రభుత్వ తప్పులపై ఆయన తన వాయిస్ బలంగా వినిపిస్తుంటే.. ఆ గొంతు నొక్కే కుట్రలో భాగంగానే చంద్రబాబు ఇలాంటి దుర్మార్గపు ఆలోచనలతో దాడులు చేయిస్తున్నాడు.

టీడీపీ గూండాల దాడిలో ధ్వంసమైన జోగి రమేష్ ఇంటిని పరిశీలిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జోగి రమేష్ ఇంటిపై దాడి జరగడానికి ముందు ఇబ్రహీంపట్నంలో టీడీపీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావుతో డీసీపీ గుణ్ణం రామకృష్ణ, సీఐ చంద్రశేఖర్ చర్చిస్తున్న ఫొటోను చూపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పోలీసులతో కలిసి టీడీపీ కుట్ర..

జోగి రమేష్ ఇంటి మీద సాయంత్రం ఐదు గంటలకు దాడి జరిగితే.. ఆ దాడికి సంబంధించి పోలీసులు, తెలుగుదేశం పార్టీ వ్యక్తులు ఏ రకంగా కుట్రలు చేశారనే దానికి ఈ ఫొటోనే సాక్ష్యం (పోలీసులతో టీడీపీ నాయకులు మంతనాలు జరుపుతున్న ఫొటోను చూపారు). ఇదే సర్కిల్‌లో డీసీపీ రామకృష్ణ, ఇబ్రహీంపట్నం సీఐ చంద్రశేఖర్‌తో టీడీపీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు దాడులకు సంబంధించి వ్యూహరచన చేశాడు. జోగి రమేష్‌ను హత్య చేసి, ఇంటి మీద దాడి చేసి వారి ఆస్తులను ధ్వంసం చేసే కుట్రలకు ఇక్కడే పోలీసులతో టీడీపీ నాయకుడు మంతనాలు జరిపాడని క్లియర్‌గా తెలిసిపోతోంది. హత్యా యత్నం ఎలా చేయాలి? ఆ దాడికి పోలీసులు ఎలా సహకరించాలో పథక రచన చేశారు. ఏకంగా పోలీసులే టీడీపీ నాయకులతో కలిసి మధ్యాహ్నం 2 గంటల సమయంలో మంతనాలు జరిపారు. ఆ తర్వాత టీడీపీ నాయకులు ఏకంగా పోలీసులనే వెంటబెట్టుకుని కలసికట్టుగా జోగి రమేష్ ఇంటిపై దాడికి దిగారు.

ఈ పాపాలు ఎవరివి బాబూ?

- నాలుగు నెయ్యి ట్యాంకర్లను రిజెక్ట్ చేసి.. మళ్లీ అదే నెయ్యి ట్యాంకర్లు మరో పేరుతో వస్తే ఆమోదించింది చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే కదా.
- అవే ట్యాంకర్ల నెయ్యిని లడ్డూ తయారీకి వాడారని స్వయంగా సీబీఐ చెప్పింది.
- చంద్రబాబు ప్రభుత్వం తప్పులు, వాళ్లు చేసిన అన్యాయాన్ని చార్జ్‌షీట్‌లో సీబీఐ రాసింది
- టీటీడీ ఈవోగా అనిల్ సింఘాల్‌ను తీసుకొచ్చింది ఎవరు?
- ప్రక్షాళన కోసం తెచ్చామన్న శ్యామలరావును తప్పించింది ఎవరు?

ఇవిగో పచ్చి నిజాలు... సాక్ష్యాలు

పెట్రోల్ బాంబులు విసురుతున్న టీడీపీ నాయకుడు ఫతావుల్లా ఫొటోను చూపుతున్న వైఎస్ జగన్

టీడీపీ నాయకుడు ఫతావుల్లా ఏకంగా యాసిడ్ బాటిల్, పెట్రోల్ బాంబులతో దాడి చేశాడు. దాడికి ముందు వాటితో ఉన్న ఫొటోల్లో క్లియర్‌గా చూడవచ్చు. పోలీసుల సమక్షంలోనే జోగి ఇంటిపైకి పెట్రోల్ బాంబులు విసిరి నిప్పంటించాడు. ఫతావుల్లాతోపాటు ఆశా అనే టీడీపీ కార్యకర్త కూడా జోగి రమేష్ ఇంటి మీద పోలీసుల సమక్షంలోనే రాళ్ల దాడి చేసింది. ఆశా కుమార్తె పెళ్లికి చంద్రబాబు కూడా హాజరయ్యాడు. (చంద్రబాబు, లోకేశ్, హోంమంత్రితో వారు దిగిన ఫొటోలు, ఆశా కుమార్తె పెళ్లికి హాజరైన చంద్రబాబు ఫొటోలు చూపించారు. పోలీసులతోనే కలసి వచ్చి వారి సమక్షంలోనే టీడీపీ నాయకులు దాడికి దిగిన వీడియోలు కూడా చూపారు). టీడీపీ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు, డీసీపీ, సీఐ మంతనాలు జరుపుతున్న దృశ్యాలు వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. పోలీసులతో కలిసి టీడీపీ శ్రేణులు వస్తున్న దృశ్యాలు వీడియోలో ఉన్నాయి. (టీడీపీ నాయకుడు బాటిల్ ఎగరేస్తూ పోలీసులతో కలిసి జోగి రమేష్ ఇంటి వద్దకు వచ్చిన వీడియో క్లిప్పింగ్స్‌ను మీడియాకు చూపారు). మనం నాగరిక ప్రపంచంలో ఉన్నామా? లేక జంగిల్ రాజ్‌లో ఉన్నామో చెప్పేందుకు ఈ వీడియోలే సాక్ష్యం. కల్తీ లిక్కర్ కేసుకు సంబంధించి తంబళ్లపల్లె కోర్టుకు హాజరయ్యేందుకు జోగి రమేష్ వెళ్తుండగా ఇక్కడ ఇబ్రహీంపట్నంలోని తన ఇంటిపై దాడి జరిగినట్లు ఆయనకు సమాచారం వచ్చింది. ఈ విషయంపై విజయవాడ సీపీకి ఫిర్యాదు చేసేందుకు జోగి రమేష్ ఫోన్ చేసినా స్పందించలేదు. గుంటూరులో మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటిపై దాడి సమయంలోనూ ఇలాగే జరిగింది.

నారా లోకేశ్‌తో ఫతావుల్లా ఉన్న ఫొటోను చూపుతున్న వైఎస్ జగన్

అన్ని ఆధారాలున్నాయ్.. ఎవరినీ వదిలిపెట్టం..

దాడులు, విధ్వంసాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. ఎన్‌హెచ్‌ఆర్సీ నుంచి సుప్రీంకోర్టు వరకు ప్రతి గడప తొక్కుతాం. న్యాయ పోరాటం చేస్తాం. రాష్ట్రంలో సాగుతున్న జంగిల్‌రాజ్ పాలనను దేశానికి తెలియజేస్తాం. కూటమి ప్రభుత్వానికి ఇప్పటికే రెండేళ్లు పూర్తయ్యాయి. ఇక మిగిలింది మూడేళ్లే. ఆ తరువాత వచ్చేది మా ప్రభుత్వమే. ఇవాళ మా పార్టీ నాయకుల ఇళ్లపై గూండాగిరీ చేసిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెడతాం. ప్రతి ఒక్కరికీ శిక్ష తప్పదు.

బీసీలంటే చంద్రబాబుకు చులకన..

తంబళ్లపల్లిలో టీడీపీ తరపున పోటీ చేసిన వ్యక్తి నకిలీ లిక్కర్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశాడు. కమీషన్ల పంపకాల్లో తేడా రావడంతో ఆ వ్యవహారం బయటపడింది. ఆ కేసులో జయచంద్రారెడ్డిని అరెస్టు చేయాల్సింది పోయి సంబంధం లేని జోగి రమేష్‌ను కేసులో చేర్చారు. చంద్రబాబు రాజ్యంలో జోగి రమేష్ లాంటి వ్యక్తి నకిలీ లిక్కర్ తయారు చేయగలడా? ఆ లిక్కర్‌ను బెల్ట్ షాపుల్లోకి సరఫరా చేయగలరా? జోగి రమేష్‌పై చంద్రబాబు ప్రభుత్వం 12 కేసులు పెట్టింది. చేయని నేరానికి 83 రోజులు జైలులో పెట్టారు. ఆయన కుమారుడు రాజకీయంగా యాక్టివ్ అవుతున్నాడని చిన్న పిల్లాడిపై ఏడు కేసులు పెట్టారు. జోగి రమేష్ భార్యపై పోలీసులే దౌర్జన్యం చేసి తిరిగి ఆమెపైనే కేసులు పెట్టారు. బీసీలపై చంద్రబాబుకు ఉన్న చులకన భావానికి జోగి రమేష్‌పై నమోదైన కేసులే నిదర్శనం.

The sides of a right angle triangle PQR are..

INTRODUCTION TO TRIGONOMETRY

Trigonometric Ratios:



- $\sin\theta = \dfrac{\text{Opposite side to }\theta}{\text{Hypotenuse}} = \dfrac{AB}{AC}$
- $\cos\theta = \dfrac{\text{Adjacent side to }\theta}{\text{Hypotenuse}} = \dfrac{BC}{AC}$
- $\tan\theta = \dfrac{\text{Opposite side to }\theta}{\text{Adjacent side to }\theta} = \dfrac{AB}{BC}$
- $\operatorname{cosec}\theta = \dfrac{\text{Hypotenuse}}{\text{Opposite side to }\theta} = \dfrac{AC}{AB}$
- $\sec\theta = \dfrac{\text{Hypotenuse}}{\text{Adjacent side to }\theta} = \dfrac{AC}{BC}$
- $\cot\theta = \dfrac{\text{Adjacent side to }\theta}{\text{Opposite side to }\theta} = \dfrac{BC}{AB}$

$\sin\theta = \dfrac{1}{\operatorname{cosec}\theta}, \operatorname{cosec}\theta = \dfrac{1}{\sin\theta}, \sin\theta.\operatorname{cosec}\theta = 1$

$\cos\theta = \dfrac{1}{\sec\theta}, \sec\theta = \dfrac{1}{\cos\theta}, \cos\theta.\sec\theta = 1$

$\tan\theta = \dfrac{1}{\cot\theta}, \cot\theta = \dfrac{1}{\tan\theta}, \tan\theta.\cot\theta = 1$

$\tan\theta = \dfrac{\sin\theta}{\cos\theta}, \cot\theta = \dfrac{\cos\theta}{\sin\theta}$

- The values of trigonometric ratios of angles 0°, 30°, 45°, 60°, 90°

Angle θ	0°	30°	45°	60°	90°
sinθ	0	$\frac{1}{2}$	$\frac{1}{\sqrt{2}}$	$\frac{\sqrt{3}}{2}$	1
cosθ	1	$\frac{\sqrt{3}}{2}$	$\frac{1}{\sqrt{2}}$	$\frac{1}{2}$	0
tanθ	0	$\frac{1}{\sqrt{3}}$	1	√3	Not defined
cosecθ	Not defined	2	√2	$\frac{2}{\sqrt{3}}$	1
secθ	1	$\frac{2}{\sqrt{3}}$	√2	2	Not defined
cotθ	Not defined	√3	1	$\frac{1}{\sqrt{3}}$	0

Trigonometric identities

- $\sin^2\theta + \cos^2\theta = 1$
- $\sin^2\theta = 1 - \cos^2\theta$,

  $\sin\theta = \sqrt{1-\cos^2\theta} = \sqrt{(1-\cos\theta)(1+\cos\theta)}$
- $\cos^2\theta = 1 - \sin^2\theta$,

  $\cos\theta = \sqrt{1-\sin^2\theta} = \sqrt{(1-\sin\theta)(1+\sin\theta)}$
- $1+\tan^2\theta = \sec^2\theta$, $\sec^2\theta - 1 = \tan^2\theta$

  $\sec^2\theta - \tan^2\theta = 1$,

  $\tan^2\theta - \sec^2\theta = -1$

  $(\sec\theta + \tan\theta)(\sec\theta - \tan\theta) = 1$

  $\sec\theta + \tan\theta = \dfrac{1}{\sec\theta - \tan\theta}$

  $\sec\theta - \tan\theta = \dfrac{1}{\sec\theta + \tan\theta}$
- $1+\cot^2\theta = \operatorname{cosec}^2\theta$; $\operatorname{cosec}^2\theta - 1 = \cot^2\theta$

  $\operatorname{cosec}^2\theta - \cot^2\theta = 1$;

  $\cot^2\theta - \operatorname{cosec}^2\theta = -1$

  $(\operatorname{cosec}\theta + \cot\theta)(\operatorname{cosec}\theta - \cot\theta) = 1$

  $\operatorname{cosec}\theta + \cot\theta = \dfrac{1}{\operatorname{cosec}\theta - \cot\theta}$

  $\operatorname{cosec}\theta - \cot\theta = \dfrac{1}{\operatorname{cosec}\theta + \cot\theta}$
- $(\sin\theta + \cos\theta)^2 + (\sin\theta - \cos\theta)^2 = 2$
- $(\sec^2\theta - 1)(\operatorname{cosec}^2\theta - 1) = 1$
- sinθ value increases from 0 to 1
- cosθ value decreases from 1 to 0
- If sinθ = cosθ then θ = 45°
- The value of sinθ or cosθ never exceeds 1, whereas the value of secθ or cosecθ is always greater than or equal to 1.

1 Mark Questions

1. For what value of θ, the trigonometric ratios sine, cos are equal?

Sol: If θ = 45° then $\sin\theta = \sin 45^\circ = \dfrac{1}{\sqrt{2}}$

$\cos\theta = \cos 45^\circ = \dfrac{1}{\sqrt{2}}$

If θ = 45° then sinθ, cosθ are equal.

2. (sec A + tan A) (1–sinA) is equal to ( )

1) sec A 2) cos A

3) cosecA 4) sin A **Ans: 2**

3. $3\tan^2\theta - 3\sec^2\theta$ = ———— **Ans: 3**

2 Marks Questions

1. If $\sin A = \dfrac{3}{5}$, *Evaluate CosA*

Sol: $\sin A = \dfrac{3}{5} = \dfrac{\textit{opposite side}}{\textit{hypotenuse}} = \dfrac{BC}{AC}$



From Right angled triangle ΔABC

By Pythagoras theorem

$AC^2 = AB^2 + BC^2$

$5^2 = AB^2 + 3^2$

$AB^2 = 25 - 9 = 16 \Rightarrow AB = \sqrt{16} = 4$

$CosA = \dfrac{\textit{Adjacent side}}{\textit{hypotenuse}} = \dfrac{AB}{AC} = \dfrac{4}{5}$

2. *Show that* $\dfrac{1+\tan^2 A}{1+\cot^2 A} = Tan^2 A$

$LHS = \dfrac{1+\tan^2 A}{1+\cot^2 A} = \dfrac{\sec^2 A}{\operatorname{cosec}^2 A}$

(∵ $1 + \tan^2 A = Sec^2A$)

$1 + \cot^2A = \operatorname{cosec}^2A$)

$= \dfrac{1}{\cos^2 A} \Big/ \dfrac{1}{\sin^2 A}$

$= \dfrac{\sin^2 A}{\cos^2 A} = \tan^2 A = RHS$

$\left(\because \sec A = \dfrac{1}{\cos A}, \operatorname{cosec} A = \dfrac{1}{\sin A}\right)$

LHS = RHS Proved

3. Evaluate $2\tan^2 45^\circ + \cos^2 30^\circ - \sin^2 60^\circ$

Sol: $\tan 45^\circ = 1$, $\cos 30^\circ = \dfrac{\sqrt{3}}{2}$, $\sin 60^\circ = \dfrac{\sqrt{3}}{2}$

$2\tan^2 45 + \cos^2 30 - \sin^2 60$

$= 2(1)2 + \left(\dfrac{\sqrt{3}}{2}\right)^2 - \left(\dfrac{\sqrt{3}}{2}\right)^2 = 2$

4. Show that $\dfrac{2\tan 30^0}{1-\tan^2 30^0} = \tan 60^0$

Sol: $\tan 30^\circ = \dfrac{1}{\sqrt{3}}$, $\tan 60^\circ = \sqrt{3}$

$LHS = \dfrac{2\tan 30^0}{1-\tan^2 30^0} = \dfrac{2.\frac{1}{\sqrt{3}}}{1-\left(\frac{1}{\sqrt{3}}\right)^2} = \dfrac{\frac{2}{\sqrt{3}}}{1-\frac{1}{3}}$

$\dfrac{\frac{2}{\sqrt{3}}}{\frac{3-1}{3}} = \dfrac{2}{\sqrt{3}}.\dfrac{3}{2} = \dfrac{3}{\sqrt{3}} = \dfrac{\sqrt{3}.\sqrt{3}}{\sqrt{3}} = \sqrt{3}$

$= \tan 60^\circ = RHS$

LHS = RHS

Hence proved.

5. In ΔPQR, right angled at Q, PQ = 3cm and PR = 6cm. Determine

$\angle QPR$ **and** $\angle PRQ$

Sol: Given PQ = 3cm, PR = 6cm, ∠Q = 90°



Continued on next page..

$$\sin R = \frac{\text{opposite to R}}{\text{hypotenuse}} = \frac{PQ}{PR} = \frac{3}{6} = \frac{1}{2}$$

$$\sin R = \frac{1}{2} = \text{Sin } 30^0$$

$$\therefore R = 30^0 \Rightarrow \underline{|PRQ} = 30^0$$

$\angle P + \angle R = 90°$, $\angle P = 90° - \angle R$
$= 90° - 30° = 60°$
$\underline{|QPR} = 60^0$

6. State whether the following are true or false, justify your answer
(i) Sin (A+B) = SinA + SinB
(ii) The value of Cosθ increases as θ increases

Sol: (i) Let A = 30°, B = 60°
LHS = Sin (A+B) = Sin (30+60) = Sin 90° =1
RHS = SinA + SinB = $\text{Sin}30^\circ + \text{Sin}60^\circ$

$$= \frac{1}{2} + \frac{\sqrt{3}}{2} = \frac{1+\sqrt{3}}{2}$$

So Sin (A+B) ≠ SinA + SinB
Given statement is false.
(ii) $\text{Cos } 0^\circ = 1$, $\text{Cos } 60^\circ = \frac{1}{2} = 0.5$
$\text{Cos } 90^\circ = 0$
So, If θ increases, Cosθ values are decreases
Given statement is false.

7. Is it right to say that Cos(60° + 30°) = Cos 60° Cos 30° – Sin 60°. Sin 30°

Sol: LHS = Cos (60 + 30) = Cos 90° = 0
RHS = Cos 60 . Cos 30 – Sin 60. Sin 30

$$= \frac{1}{2}.\frac{\sqrt{3}}{2} - \frac{\sqrt{3}}{2}.\frac{1}{2} = \frac{\sqrt{3}}{4} - \frac{\sqrt{3}}{4} = 0$$

∴ It is right to say that Cos(60° + 30°) = Cos 60° . Cos 30° – Sin 60° . Sin 30°

4 Marks Questions

1. Evaluate the following
i) sin60°. cos30° + sin30°. cos60°
ii) 2tan°45° + cos²30° – sin²60°?

Sol : $\sin 60° = \cos 30° = \frac{\sqrt{3}}{2}$,
sin30° = cos60° = ½
sin60° . cos30 + sing30 . cos60 =

$$= \frac{\sqrt{3}}{2}.\frac{\sqrt{3}}{2} + \frac{1}{2}.\frac{1}{2} = \frac{3}{4} + \frac{1}{4} = \frac{3+1}{4} = \frac{4}{4} = 1$$

ii) Tan 45° = 1

$$\cos 30° = \frac{\sqrt{3}}{2}, \sin 60° = \frac{\sqrt{3}}{2}$$

2tan² + 45° + cos² 30°– sin²60°

$$= 2(1)^2 + \left(\frac{\sqrt{3}}{2}\right)^2 - \left(\frac{\sqrt{3}}{2}\right)^2 = 2$$

2. If $\cos A = \frac{12}{13}$, then find cosecA, cotA.

Sol:



$$\cos A = \frac{\text{Adjacent side to } \underline{|A}}{\text{Hypotenuse}} = \frac{12}{13}$$

From the right angle triangle ΔABC
By Pythagoras Theorem.
$AC^2 = AB^2 + BC^2$

$$\Rightarrow BC = \sqrt{AC^2 - AB^2} = \sqrt{13^2 - 12^2}$$

$$= \sqrt{169-144} = \sqrt{25} = 5$$

$$\text{cosec } A = \frac{\text{Hypotenuse}}{\text{Opposite side to } \underline{|A}} = \frac{13}{5}$$

$$\cot A = \frac{\text{Adjacent side to } \underline{|A}}{\text{Opposite side to } \underline{|A}} = \frac{12}{5}$$

3. The sides of a right angle triangle PQR are PQ=7cm, QR=25cm, ∠P=90° respectively. Then find tanQ – tanR.

Sol:



From the right angle triangle PQR,
By Pythagoras Theorem

$$QR^2 = PR^2 + PQ^2 \Rightarrow PR = \sqrt{QR^2 - PQ^2}$$

$$= \sqrt{(25)^2 - 7^2} = \sqrt{576} = 24$$

$$\tan Q = \frac{\text{Opposite side to } \angle Q}{\text{Adjacent side to } \angle Q} = \frac{24}{7}$$

$$\tan R = \frac{\text{Opposite side to } \angle R}{\text{Adjacent side to } \angle R} = \frac{7}{24}$$

$$\tan Q - \text{Tan}R = \frac{24}{7} - \frac{7}{24} = \frac{24^2 - 7^2}{7 \times 24} = \frac{576-49}{168}$$

$$= \frac{527}{168}$$

4. If $\sin(A+B) = \frac{\sqrt{3}}{2}$, $\cos(A-B) = \frac{\sqrt{3}}{2}$, 0° < A +B ≤ 90° A > B, Find A, B.

Sol: $\sin(A+B) = \frac{\sqrt{3}}{2} = \sin 60° \left(\because \sin 60° = \frac{\sqrt{3}}{2}\right)$

$A + B = 60° \longrightarrow (1)$

$\cos(A-B) = \frac{\sqrt{3}}{2} = \cos 30° \left(\because \cos 30° = \frac{\sqrt{3}}{2}\right)$

$A - B = 30° \longrightarrow (2)$
Adding (1), (2)   2A = 90° ⇒ A = 45°
From (1) 45 + B = 60° ⇒ B = 15°

5. In triangle ABC, right angled at B, if tan A $= \frac{1}{\sqrt{3}}$, find the value of
(i) Sin A cos C + Cos A . Sin C
(ii) Cos A . Cos C – SinA . SinC



Sol: In ΔABC, right angled at B
∠A + ∠C = 90° →(1) (∠A + ∠B + ∠C = 180° ∠A + ∠C = 180 – ∠B = 180 – 90 = 90°)

Given $\tan A = \frac{1}{\sqrt{3}} = \tan 30°$,   ∠A = 30°

Substitute $\angle A = 30^\circ$ in eq (1) we get
30 + ∠C = 90
$\angle C = 90 - 30 = 60^\circ$
(i) SinA CosC + CosA.SinC = Sin30.Cos60 + Cos30.Sin60

(∵ ∠A = 30, ∠C = 60)

$$= \frac{\sqrt{3}}{2}.\frac{\sqrt{3}}{2} + \frac{1}{2}.\frac{1}{2} = \frac{3}{4} + \frac{1}{4} = \frac{3+1}{4} = 1$$

(ii) CosA CosC – SinA . SinC = Cos 30 . Cos 60 – Sin 30 . Sin 60

$$= \frac{\sqrt{3}}{2}.\frac{1}{2} - \frac{1}{2}.\frac{\sqrt{3}}{2} = \frac{\sqrt{3}}{4} - \frac{\sqrt{3}}{4} = 0$$

Y. Vanamraj
Subject Expert
Kurnool

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. Choose the grammatically correct sentence.
A) He finished his homework yesterday.
B) He has finished his homework yesterday.
C) He has finish his homework yesterday.
D) He had finish his homework yesterday.

2. Choose the correct option.
If she _ hard, she would have passed the exam.
A) studies   B) studied
C) had studied   D) has studied

3. Identify the correct reported speech.
He said, "I am feeling tired."
A) He said that he is feeling tired.
B) He said that he was feeling tired.
C) He says that he was feeling tired.   D) None

4. Choose the correct option.
Hardly _ the bell rang when the students rushed out.
A) do   B) had   C) has   D) was

5. Choose the correct sentence.
A) Each of the players have been given a prize.
B) Each of the players were given a prize.
C) Each of the players has been given a prize.
D) Each of the players are given a prize.

తనను చూసేందుకు వచ్చిన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

రూటు మారినా తగ్గని

జన సునామీ

చంద్రబాబు సర్కారు కుట్రలను భగ్నం చేస్తూ భారీగా తరలివచ్చిన జనం

- అభిమాన నేత వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలికిన ఎన్టీఆర్ జిల్లా ప్రజానీకం
- తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నం వరకు దారిపొడవునా జగన్నినాదం
- పలు చోట్ల ఆగుతూ.. అభివాదం చేస్తూ ముందుకు సాగిన వైఎస్ జగన్
- పర్యటనకు అడుగడుగునా ఆంక్షలు విధించిన పోలీసులు
- నేతలకు నోటీసులు.. పర్యటనలో పాల్గొంటే కేసులంటూ బెదిరింపులు
- ప్రజాభిమానం పోటెత్తడంతో తాడేపల్లి నుంచి ఇబ్రహీంపట్నానికి ఆరు గంటల సమయం
- జోగి రమేష్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పిన జననేత

తాడేపల్లి రూరల్ / వన్‌టౌన్(విజయవాడపశ్చిమ) : సర్కారు ఎన్ని కుయుక్తులు పన్నినా, రూటు మార్చినా జననేత పర్యటనకు జనం సునామీలా తరలివచ్చారు. 17 కిలోమీటర్ల దూరం 47 కిలోమీటర్లకు పెరిగినా ఇసుకేస్తే రాలనంతగా ప్రజలు పోటెత్తారు. ఎన్టీఆర్ జిల్లా పర్యటనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జననేతను దగ్గర్నుంచి చూడాలని, పలకరించాలని, కుదిరితే కరచాలనం చేయాలనే ఆసక్తితో జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. దారి పొడవునా పూలు చల్లుతూ ఆత్మీయంగా స్వాగతం పలికారు. సీఎం.. సీఎం.. జై జగన్.. జైజై జగన్ నినాదాలతో పర్యటన ఆద్యంతం మార్మోగింది. ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి, బీసీ నేత జోగి రమేష్ ఇంటిపై ఇటీవల తెలుగుదేశం పార్టీ గూండాలు దాడి చేసి.. పెట్రోల్ బాంబులు విసిరి దగ్ధం చేయటానికి కుట్రలు చేసిన నేపథ్యంలో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు శుక్రవారం ఉదయం వైఎస్ జగన్ తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరారు. ప్రభుత్వం ఎన్ని కుయుక్తులు పన్నినా, ఉదయమే తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసం వద్దకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చారు. వైఎస్ జగన్.. నివాసం నుంచి బయటకు రాగానే అక్కడ ఉన్న నాయకులు, కార్యకర్తలు జై జగన్ అంటూ నినదించారు. కాన్వాయ్ భరతమాత సెంటర్ వద్దకు వచ్చేసరికి రోడ్డుపై మహిళలు, అభిమానులు భారీగా ఉండడంతో.. వైఎస్ జగన్ వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అక్కడి నుంచి పాతూరు క్రాస్‌రోడ్ వరకు కారులో నుంచి పలుమార్లు బయటకు వచ్చి ప్రజలకు అభివాదం చేశారు. భారీగా అభిమానులు రావడంతో అనుకున్న సమయానికి అనుకున్న ప్రదేశానికి చేరుకునే సరికి ఆలస్యమైంది. అయినా ప్రజలు రోడ్డుపై ఉండి ఆయన కోసం ఎదురు చూశారు. కాజ వద్ద

గ్రామస్తులు భారీగా స్వాగతం పలికారు. 2029లో జగనే ముఖ్యమంత్రి అంటూ నినాదాలు చేశారు. కాజ టోల్‌గేటు వద్ద కూడా అదే పరిస్థితి. పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించి, ప్రజల్ని అడ్డుకున్నా వైఎస్ జగన్‌ను కలిసేందుకు జనం పోటీ పడ్డారు. దారిపొడవునా బస్సుల్లో నుంచి ప్రజలు అభివాదం చేశారు. చినకాకాని వెస్ట్ బైపాస్ ప్రారంభంలో ఒక దివ్యాంగుడు వేచి ఉండటం గమనించి వైఎస్ జగన్ కారు దిగి, అతనితో కరచాలనం చేశారు. వెస్ట్ బైపాస్‌లో ఎక్కడా రోడ్డుపైకి వచ్చేందుకు అవకాశం లేకపోయినా బైపాస్ వెంబడి పలుచోట్ల ప్రజలు జగన్‌ను చూసేందుకు పెద్ద సంఖ్యలో బారులుతీరారు. వెంకటపాలెం టోల్ గేటు వద్ద 10 నిమిషాల పాటు జగన్ కాన్వాయ్ ఆపి.. అక్కడికొచ్చిన మాజీ ఎంపీ నందిగం సురేష్‌తో పాటు అందరినీ ఆప్యాయంగా పలకరించారు.

పర్యటనను నీరుగార్చే కుట్ర భగ్నం

వైఎస్ జగన్ ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటికి వెళ్లేందుకు మాజీ ముఖ్యమంత్రి హోదాలో పోలీసు శాఖకు తన పర్యటన వివరాలను ముందుగానే పంపించారు. అయితే ఆయన పర్యటనను నీరుగార్చేందుకు, ప్రజలు ఆయన్ను కలవకుండా చేసేందుకు ప్రభుత్వం పోలీసు శాఖ ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేసింది. ముందు ప్రకటించిన రూట్‌లో కాకుండా మంగళగిరి మీదుగా కాజ టోల్‌గేటు వద్దకు వెళ్లి.. అక్కడి నుంచి వెస్ట్ బైపాస్ మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్లాలని గురువారం రాత్రి నోటీసులు జారీ చేసింది. దాంతో పార్టీ క్యాడర్‌లో కొంత గందరగోళం నెలకొంది. అయినా శుక్రవారం ఉదయం వైఎస్ జగన్ వస్తున్న రూట్ వివరాలను తెలుసుకొని తదనుగుణంగా పార్టీ శ్రేణులు, ప్రజలు జగన్ పర్యటించే మార్గంలో ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. పోలీసుల కుట్రలను భగ్నం చేసి, పర్యటనను విజయవంతం చేశారు.

వాహనాలను అడ్డుకున్న పోలీసులు

వైఎస్ జగన్ పర్యటనను అడ్డుకోవటానికి పోలీసు శాఖ తీవ్ర స్థాయిలో ప్రయత్నించింది. ఇందులో భాగంగా అడుగడుగునా ఆంక్షలు విధించింది. పార్టీ నేతలను పోలీసు అధికారులు భయభ్రాంతులకు గురి చేయటమే కాకుండా, పలు చోట్ల వాహనాలను అడ్డుకున్నారు. తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలను ఎక్కడికక్కడ ఆపేశారు. ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తోపాటు, జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులు ర్యాలీగా వెళ్లకూడదంటూ నోటీసులు జారీ చేశారు. నేతల వెంట జనం ఉండకూడదని హెచ్చరించారు. నోటీసులను ధిక్కరిస్తే కేసులు పెడతామని భయపెట్టేందుకు ప్రయత్నించారు. అయినా పార్టీ శ్రేణులు వేలాదిగా ఎవరికి వారుగా స్వచ్ఛందంగా కార్యక్రమానికి తరలివచ్చారు. వైఎస్ జగన్ అడుగులో అడుగు వేస్తూ ముందుకు సాగారు. ఇలా అడుగడుగునా అభిమానం పోటెత్తడంతో తాడేపల్లి నుంచి ఉదయం 11 గంటలకు బయలు దేరిన జగన్.. ఇబ్రహీంపట్నం చేరుకునే సరికి సాయంత్రం 5 గంటలైంది. ఇలా ఏకంగా ఆరు గంటల సమయం పట్టింది. గొల్లపూడి నుంచి జోగి రమేష్ ఇల్లు చేరుకునేందుకు మూడు గంటలకు పైగా సమయం పట్టిందంటే జనాభిమానం ఏమేరకు ఉందో ఇట్టే తెలుస్తోంది. దారిపొడవునా తన కోసం వేచి ఉన్న ప్రజలకు వైఎస్ జగన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

వేలాదిగా బైక్‌లపై తరలివచ్చిన యువత

పార్టీ శ్రేణులు, అభిమానులు, యువత వేలాదిగా తరలివచ్చారు. ఉదయమే తాడేపల్లి కార్యాలయానికి చేరుకొని వైఎస్ జగన్‌ను అనుసరించారు. ఎక్కడికక్కడ పోలీసులు వాహనాలను అడ్డుకొని వేరు మార్గాల వైపు తరలించినా, అభిమానులు అంతకంతకూ పెరిగారు. వేలాది మంది ద్విచక్ర వాహనాలపై తరలి వచ్చి, తమ అభిమాన నేత జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో పాల్గొన్నారు. పలువురు న్యాయవాదులు వైఎస్ జగన్‌కు సంఘీభావం తెలిపారు. బైపాస్ నల్లకుంట నుంచి ఇబ్రహీంపట్నంలోని జోగి రమేష్ ఇంటి వరకు రోడ్డుపై జనం ఇసుక వేస్తే రాలనంతగా నిండిపోయారు.

ఇబ్రహీంపట్నం సమీపంలో జాతీయ రహదారిపై
వైఎస్ జగన్ కాన్వాయ్‌ని అనుసరిస్తున్న జనసందోహంలో ఓ భాగం

జోగి రమేష్ కుటుంబానికి భరోసా

ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ పరామర్శించారు. దాడి జరిగిన తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఎంతసేపు దాడి జరిగింది.. మారణాయుధాలతో ఎలా భయపెట్టారు.. పెట్రోల్ బాంబులు ఎలా విసిరారు.. తదితర విషయాలను జోగి రమేష్ కుటుంబ సభ్యులు వివరించారు. దాడి జరిగిన సమయంలో వారు ఎదుర్కొన్న మానసిక సంఘర్షణను జననేతకు చెప్పుకున్నారు. ఇలాంటి దాడులకు భయపడొద్దని, తాను అండగా ఉంటానని వారికి జగన్ భరోసా కల్పించారు. పార్టీ అండగా ఉంటుందన్నారు. రానున్న కాలంలో దాడి చేసిన వారిని చట్టపరంగా న్యాయస్థానంలో నిలబెడతామని చెప్పారు. కాగా, వైఎస్ జగన్‌తో పాటు పలువురు నేతలు జోగి రమేష్ కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా, జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎన్టీఆర్ జిల్లా పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, మల్లాది విష్ణు, మొండితోక జగన్‌మోహన్‌రావు, కై లే అనిల్ కుమార్, అన్నాబత్తుల శివకుమార్, ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, ఎండి రుహుల్లా, వరుదు కళ్యాణి, జగ్గయ్యపేట ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, తిరువూరు ఇన్‌చార్జ్ నలగట్ల స్వామి దాసు, పెనమలూరు ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, డిప్యూటీ మేయర్ అవుతు శైలజ రెడ్డి, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్, నాయకులు ఏ రవిచంద్ర, పుణ్యశీల, వేముల తిరుపతిరావు, వంగవీటి నరేంద్ర తదితరులు జోగి రమేష్‌ను కలిశారు.

వైఎస్ జగన్‌ను చూసేందుకు మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటి వద్దకు చేరుకున్న భారీ జనసందోహం

స్కూల్ బస్సులో వెళ్తూ జగన్ మామయ్యను చూసి చిన్నారుల కేరింతలు

అదిగో జగనన్న అంటూ అక్క చెల్లెమ్మల ఆనందం

అశేష జనవాహిని మధ్య జననేత వైఎస్ జగన్ కాన్వాయ్

వైభవంగా విశ్వవిజేత

ప్రపంచకప్ ట్రోఫీతో భారత బృందం సంబరం

అండర్-19 ప్రపంచ కప్ గెలుచుకున్న భారత్

- ఫైనల్లో ఇంగ్లండ్‌పై 100 పరుగులతో విజయం
- వైభవ్ సూర్యవంశీ 80 బంతుల్లో 15 ఫోర్లు, 15 సిక్స్‌లతో 175
- టీమిండియా యువ జట్టు ఖాతాలో ఆరో టైటిల్

స్థాయి ఎలాంటిదైనా, వేదిక ఏదైనా, ప్రత్యర్థి ఎవరైనా తనకు తెలిసింది మైదానంలో బ్యాట్‌తో విధ్వంసం సృష్టించడమే అని వైభవ్ సూర్యవంశీ మరోసారి నిరూపించాడు. ఈ పాలబుగ్గల కుర్రాడు సునామీ ఆటతో సరికొత్త రికార్డులను సృష్టిస్తూ దూసుకుపోయాడు. ఆ షాట్లలో పవర్, పదును, ఎక్కడా తడబాటు కనిపించకుండా పూర్తి సాధికారతతో ఆడిన వైనం నిజంగా అసాధారణం. విశేషణాలతో వర్ణించలేని గొప్ప ఇన్నింగ్స్‌ను వైభవ్ క్రికెట్ ప్రపంచానికి చూపించాడు. పాయింట్, కవర్స్, మిడ్ వికెట్, ఫైన్ లెగ్, లాంగాఫ్, లాంగాన్... ఇలా ప్రతీ దిశలో అత్యద్భుత షాట్లతో పరుగుల సునామీ సృష్టించిన వైభవ్ ఏకంగా 15 ఫోర్లు, 15 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. బౌండరీల ద్వారానే 150 పరుగులు రాబట్టిన అతని ఆట ముందు అండర్-19 వరల్డ్ కప్ దాసోహమంటూ భారత యువ జట్టును ఆరోసారి విశ్వ విజేతను చేసింది. వైభవ్ మెరుపులతో 400పైగా పరుగులు చేసి సవాల్ విసిరిన భారత్ ముందు ఇంగ్లండ్ నిలవలేకపోయింది. కొంత పోరాడినా లక్ష్యానికి సుదూరంగానే ఆగిపోవడంతో భారత కుర్రాళ్లు ప్రపంచ చాంపియన్లుగా సగర్వంగా నిలిచారు.


వైభవ్ సెంచరీ గర్జన

175
సీనియర్ వరల్డ్ కప్, మహిళల వరల్డ్ కప్‌తో సహా ఏదైనా ఐసీసీ టోర్నీ ఫైనల్లో అత్యధిక స్కోరు (175) సాధించిన బ్యాటర్‌గా వైభవ్ నిలిచాడు.

హరారే: ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌లో భారత్ మరోసారి విజేతగా నిలిచింది. మొత్తం 16 సార్లు టోర్నీని నిర్వహించగా... భారత్ టైటిల్ సాధించడం ఇది ఆరోసారి కావడం విశేషం. శుక్రవారం ఇక్కడ జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత యువ జట్టు 100 పరుగుల తేడాతో ఇంగ్లండ్ అండర్-19 టీమ్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వైభవ్ సూర్యవంశీ (80 బంతుల్లో 175; 15 ఫోర్లు, 15 సిక్స్‌లు) అసాధారణ సెంచరీతో చెలరేగగా, కెప్టెన్ ఆయుశ్ మాత్రే (51 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో అండగా నిలిచాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 90 బంతుల్లోనే 142 పరుగులు జోడించారు. అనంతరం ఇంగ్లండ్ 40.2 ఓవర్లలో 311 పరుగులకు ఆలౌటైంది. కాలెబ్ ఫాల్క్‌నర్ (67 బంతుల్లో 115; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) శతకం నమోదు చేయగా, బెన్ డాకిన్స్ (56 బంతుల్లో 66; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. టోర్నీలో 7 ఇన్నింగ్స్‌లలో కలిపి ఏకంగా 169.49 స్ట్రయిక్‌రేట్‌తో మొత్తం 439 పరుగులు సాధించిన వైభవ్ సూర్యవంశీకే 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు దక్కింది.

అండర్-19 స్థాయిలో వైభవ్ కొత్త రికార్డులిలా...

1 భారత్ తరఫున వరల్డ్ కప్‌లో అత్యధిక స్కోరు
2 ఓవరాల్‌గా భారత్ తరఫున రెండో అత్యధిక స్కోరు (తొలి స్థానంలో అంబటి రాయుడు 177 నాటౌట్)
15 ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు
30 అత్యధిక బౌండరీలు
150 బౌండరీల ద్వారా అత్యధిక పరుగులు
5 ఐదో వేగవంతమైన సెంచరీ (55 బంతుల్లో)
30 ప్రపంచకప్‌లో అత్యధిక సిక్స్‌లు
439 ఒకే వరల్డ్ కప్‌లో భారత్ తరఫున చేసిన పరుగుల్లో శిఖర్ ధావన్ (505) తర్వాత రెండో స్థానం.

రాణించిన కెప్టెన్

గత మ్యాచ్‌లో చెలరేగిన హైదరాబాదీ బ్యాటర్ ఆరోన్ జార్జ్ (9) ఫైనల్లో విఫలమైన అనంతరం వైభవ్, ఆయుశ్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. ధాటిగా ఆడిన కెప్టెన్ 50 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తర్వాతి బంతికే అతను అవుట్ కాగా, 51 పరుగులు జత చేసిన వేదాంత్ త్రివేది (36 బంతుల్లో 32; 2 ఫోర్లు), విహాన్ మల్హోత్రా (36 బంతుల్లో 30; 2 ఫోర్లు) ఆరు పరుగుల వ్యవధిలో వెనుదిరిగారు. అభిజ్ఞాన్ కుందు (31 బంతుల్లో 40; 6 ఫోర్లు, 1 సిక్స్), చివర్లో కనిష్క్ చౌహాన్ (20 బంతుల్లో 37 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడు ప్రదర్శించడంతో స్కోరు 400 దాటింది. తొలి 25 ఓవర్లలో 250 పరుగులు చేసిన భారత్ తర్వాతి 25 ఓవర్లలో 161 పరుగులు సాధించింది.

ఫాల్క్‌నర్ మినహా...

భారీ లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ బాగా తడబడింది. డాకిన్స్, బెన్ మాయెస్ (28 బంతుల్లో 45; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 74 పరుగులు జోడించి మెరుగైన స్థితిలో నిలిపినా ఆ తర్వాత జట్టు వరుసగా వికెట్లు కోల్పోయి 22 ఓవర్లలో 177/7 వద్ద ఓటమికి చేరువైంది. ఈ దశలో జేమ్స్ మింటో (28)తో కలిసి ఫాల్క్‌నర్ కొద్దిగా పోరాడాడు. భారీ షాట్లు ఆడిన ఫాల్క్‌నర్ అంబ్రిష్ ఓవర్లో 3 సిక్స్‌లు బాది 63 బంతుల్లో సెంచరీ సాధించాడు. అయితే తర్వాతి ఓవర్లోనే ఖిలాన్ చక్కటి క్యాచ్‌తో అతను చివరి వికెట్‌గా అవుట్ కావడంతో భారత్ సంబరాల్లో మునిగిపోయింది.

స్కోరు వివరాలు

భారత అండర్-19 ఇన్నింగ్స్: ఆరోన్ జార్జ్ (సి) మాయెస్ (బి) గ్రీన్ 9; వైభవ్ (సి) ర్యూ (బి) లమ్స్‌డెన్ 175; ఆయుశ్ (సి) మాయెస్ (బి) గ్రీన్ 53; వేదాంత్ (సి) మాయెస్ (బి) మింటో 32; విహాన్ (సి) డాకిన్స్ (బి) మింటో 30; అభిజ్ఞాన్ (సి) ఆల్బర్ట్ (బి) మోర్గాన్ 40; అంబ్రిష్ (బి) మింటో 18; కనిష్క్ (నాటౌట్) 37; ఖిలాన్ (సి) మూర్స్ (బి) మోర్గాన్ 3; హెనిల్ (రనౌట్) 5; దీపేశ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 411. వికెట్ల పతనం:** 1–20, 2–162, 3–251, 4–302, 5–308, 6–359, 7–367, 8–375, 9–393. **బౌలింగ్:** మోర్గాన్ 9–0–74–2, గ్రీన్ 5–0–49–2, లమ్స్‌డెన్ 8–0–81–1, మింటో 8–0–63–3, ఫర్హాన్ 10–0–77–0, ఆల్బర్ట్ 10–0–66–0.

ఇంగ్లండ్ అండర్-19 ఇన్నింగ్స్: డాకిన్స్ (సి) ఖిలాన్ (బి) ఆయుశ్ 66; మూర్స్ (బి) అంబ్రిష్ 17; మాయెస్ (సి) హెనిల్ (బి) ఖిలాన్ 45; థామస్ ర్యూ (సి) ఆయుశ్ (బి) కనిష్క్ 31; ఫాల్క్‌నర్ (సి) ఖిలాన్ (బి) కనిష్క్ 115; ఆల్బర్ట్ (రనౌట్) 0; ఫర్హాన్ (సి) అభిజ్ఞాన్ (బి) దీపేశ్ 1; మోర్గాన్ (సి) అండ్ (బి) దీపేశ్ 0; మింటో (సి) (సబ్) ఇనాన్ (బి) అంబ్రిష్ 28; లమ్స్‌డెన్ (సి) వేదాంత్ (బి) అంబ్రిష్ 3; గ్రీన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (40.2 ఓవర్లలో ఆలౌట్) 311. వికెట్ల పతనం:** 1–19, 2–93, 3–142, 4–174, 5–174, 6–177, 7–177, 8–269, 9–281, 10–311. **బౌలింగ్:** అంబ్రిష్ 9–1–56–3, హెనిల్ 4–2–28–0, దీపేశ్ 6–0–64–2, ఖిలాన్ 8–0–66–1, కనిష్క్ 8.2–0–63–2, ఆయుశ్ 5–0–31–1.

విధ్వంసాన్ని సృష్టిస్తూ...

తొలి మూడు బంతుల్లో పరుగు తీయలేదు, నాలుగో బంతికి ఫోర్‌తో స్కోర్ మొదలైంది. అవతలి వైపు తొలి వికెట్ పడే సమయానికి 13 బంతుల్లో 10 పరుగులే. అయితే ఈ కొద్దిసేపు మాత్రమే వైభవ్ కాస్త ప్రశాంతంగా కనిపించాడు. పాయింట్ దిశగా కొట్టిన మొదటి సిక్స్‌తో జోరు షురూ చేసిన అతను అనంతరం ఎక్కడా తగ్గలేదు. ఆ తర్వాతా ఇదే మోత కొనసాగుతూ మరో 14 సిక్సర్లు అతని ఖాతాలో చేరాయి! మింటో ఓవర్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టిన వైభవ్ 32 బంతుల్లోనే హాఫ్ సెంచరీని చేరుకున్నాడు. ఆఫ్ స్పిన్నర్ ఫర్హాన్ ఓవర్లో 2 సిక్స్‌లు బాదిన అనంతరం అతని తర్వాతి ఓవర్లో వైభవ్ మరింత చెలరేగిపోయాడు. వరుసగా 6, 6, 4, 6తో బంతిని చితక్కొట్టాడు. ఆల్బర్ట్ ఓవర్లో ఆఫ్ సైడ్ దిశగా సింగిల్ తీయడంతో 55 బంతుల్లో వైభవ్ శతకం పూర్తయింది. ఆ వెంటనే గ్రీన్ ఓవర్లో కూడా మరో 2 సిక్స్‌లు కొట్టిన అనంతరం ఆల్బర్ట్ వేసిన ఇన్నింగ్స్ 23వ ఓవర్లో మరింత పండగ చేసుకున్నాడు. వైభవ్ వరుసగా 2, 4, 6, 6, 4, 4 బాదగా వైడ్‌తో కలిసి మొత్తం 27 పరుగులు వచ్చాయి. 71 బంతుల్లో అతను 150 పరుగుల మార్క్‌ను చేరుకున్నాడు. అర్ధసెంచరీ నుంచి సెంచరీ చేరేందుకు 23 బంతులు తీసుకున్న అతనికి సెంచరీనుంచి 150కు చేరేందుకు 16 బంతులు సరిపోయాయి. మోర్గాన్ ఓవర్లో కూడా 2 సిక్స్‌లు, 2 ఫోర్లు కొట్టిన అతను డబుల్ సెంచరీ దిశగా నడిచాడు. అయితే పుల్–స్కూప్ షాట్‌కు ప్రయత్నించి కీపర్‌కు క్యాచ్ ఇవ్వడంతో వైభవ్ అసాధారణ ఇన్నింగ్స్ ముగిసింది.

ప్రపంచకప్‌తో వైభవ్ సెల్ఫీ

టి20 ప్రపంచకప్ పూర్తి షెడ్యూల్
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

పదింతల విధ్వంసానికి 'సై'

నేటి నుంచి టి20 ప్రపంచకప్

హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో డేవిడ్ మిల్లర్ కొట్టిన భారీ షాట్... సిక్స్‌గా మారిందనుకున్న క్షణాన వైడ్ లాంగాన్ నుంచి అనూహ్యంగా దూసుకొచ్చిన సూర్యకుమార్ యాదవ్... అసాధారణ రీతిలో బౌండరీ గీత అంచున గాల్లోకి ఎగిరి అందుకున్న క్యాచ్ భారత్‌ను విశ్వవిజేతగా నిలబెట్టింది... ఈ ఘట్టం ఇంకా సగటు అభిమానుల కళ్లల్లో మెదులుతుండగానే మరో టి20 ప్రపంచ కప్ వచ్చేసింది... నాడు హీరోగా నిలిచిన సూర్యకుమార్ నేడు నాయకుడిగా జట్టును నడిపిస్తున్నాడు... జూన్ 29, 2024 గత టి20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిచిన రోజు... కాగా ఫిబ్రవరి 7, 2026న తాజా టి20 ప్రపంచకప్‌లో భారత్ తమ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల మధ్య విరామం 588 రోజులు... ఇన్ని రోజుల్లో తేదీ మాత్రమే మారింది... భారత్ ఆటలో దూకుడు, గెలుపు బాట ఏమాత్రం మారకుండా సేమ్ టు సేమ్... అద్భుత ఫామ్‌తో టైటిల్ నిలబెట్టుకొని చరిత్ర సృష్టించేందుకు, సొంతగడ్డపై సత్తా చాటేందుకు టీమిండియా సిద్ధమైంది.

రెండేళ్లు కూడా పూర్తి కాకముందే ఇరవై నెలలకే మళ్లీ 'ప్రపంచకప్' రావడం కొంత ఆసక్తిని తగ్గించడం సహజమే అయినా పోటీ విషయంలో ఏ జట్టూ తక్కువ కాదు అంటూ సమరానికి 'సై' అంటున్నాయి. బిగ్‌బాష్‌లో చెలరేగిన కుర్రాళ్లతో ఆ్రస్టేలియా రెండో టైటిల్ కోసం సన్నద్ధమై రాగా, టి20 స్పెషలిస్ట్‌లతో ఇంగ్లండ్ తమ మూడో ట్రోఫీని అందుకోవాలని పట్టుదలగా ఉంది. మరో మాజీ చాంపియన్ వెస్టిండీస్ కూడా మూడో టైటిల్ అందుకొని ఈ ఫార్మాట్‌లోనైనా తమ స్థాయిని ప్రదర్శించాలని భావిస్తుండగా, సహ ఆతిథ్య జట్టుగా దక్కిన అవకాశాన్ని వాడుకోవాలని శ్రీలంక ఆశిస్తోంది. వివాదాల పాకిస్తాన్ రెండో ట్రోఫీని అందుకోగలదా అనే చర్చ సాగుతుండగా, ఒక్క వరల్డ్ కప్ వేటలో న్యూజిలాండ్ తమ పోరాటాన్ని కొనసాగించాలని సన్నద్ధమైంది. క్రితంసారి చేజారిన ట్రోఫీని ఈసారైనా దక్షిణాఫ్రికా గెలుచుకోగలదా చూడాలి. బంగ్లాదేశ్ నిష్క్రమించిన చోట ఇతర చిన్న జట్లు ఏమాత్రం ప్రభావం చూపిస్తాయనేది ఆసక్తికరం.

భారీ విజయంపై భారత్ దృష్టి
నేడు అమెరికాతో తొలి పోరు

ముంబై: ఆడిన 41 మ్యాచ్‌లలో 31 విజయాలు, 6 పరాజయాలు మాత్రమే... 2 మ్యాచ్‌లు 'టై' కాగా వాటిలో కూడా 'సూపర్ ఓవర్' గెలుపుతో కలిపి మొత్తం విజయాల సంఖ్య చూస్తే 33.. మొత్తం 9 సిరీస్‌లు ఆడితే అన్నింటిలోనూ విజేత... గత టి20 వరల్డ్ కప్‌లో విజయం సాధించిన తర్వాత భారత జట్టు అసాధారణ రికార్డు ఇది. ఇలాంటి స్థితిలో డిఫెండింగ్ చాంపియన్‌గా టీమిండియా మళ్లీ తమ జైత్రయాత్రకు సిద్ధమైంది. వాంఖెడే మైదానంలో జరిగే తమ తొలి పోరులో అమెరికాతో భారత్ తలపడనుంది. బలాబలాలపరంగా ఇరు జట్ల మధ్య ఉన్న అంతరాన్ని చూస్తే ఫలితం గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదు. మ్యాచ్ విన్నర్లతో నిండిన సూర్యకుమార్ బృందం తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరిస్తే సునాయాస విజయం ఖాయం. గత టోర్నీలో పాక్‌ను ఓడించి సంచలనం సృష్టించిన అమెరికా ఈ సారి మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని భావిస్తోంది. 2024లో భారత్ 7 వికెట్ల తేడాతో అమెరికాను అలవోకగా ఓడించింది. **గాయంతో భారత బౌలర్ హర్షిత్ రాణా టోర్నీకి దూరం కాగా... అతని స్థానంలో హైదరాబాద్ స్పీడ్‌స్టర్ మొహమ్మద్ సిరాజ్‌కు భారత జట్టులో చోటు దక్కింది.**

ఏ గ్రూప్‌లో ఎవరెవరు...

గ్రూప్ 'ఎ': భారత్, పాకిస్తాన్, నెదర్లాండ్స్, నమీబియా, యూఎస్ఏ. **గ్రూప్ 'బి':** ఆ్రస్టేలియా, శ్రీలంక, ఐర్లాండ్, జింబాబ్వే, ఒమన్.
గ్రూప్ 'సి': ఇంగ్లండ్, వెస్టిండీస్, స్కాట్లాండ్, నేపాల్, ఇటలీ. **గ్రూప్ 'డి':** దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్, కెనడా, యూఏఈ.

సూపర్-8 గ్రూప్, సీడింగ్స్ వివరాలు
గ్రూప్-1: భారత్ (ఎక్స్1), ఆస్ట్రేలియా (ఎక్స్2), వెస్టిండీస్ (ఎక్స్3), దక్షిణాఫ్రికా (ఎక్స్4).
గ్రూప్-2: ఇంగ్లండ్ (వై1), న్యూజిలాండ్ (వై2), పాకిస్తాన్ (వై3), శ్రీలంక (వై4).

ముంబై: టి20 ఫార్మాట్‌లో పదో ప్రపంచ కప్‌కు సమయం ఆసన్నమైంది. భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీకి నేడు తెర లేవనుంది. తొలి రోజు మూడు వేర్వేరు వేదికల్లో మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. గత టోర్నీ తరహాలోనే 20 జట్లు ఇందులో బరిలోకి దిగుతున్నాయి. 30 రోజుల్లో 55 మ్యాచ్‌ల పాటు ఈ ధనాధన్ వినోదం సాగుతుంది. ఇటలీ జట్టు తొలిసారి అర్హత సాధించగా... భద్రతా కారణాలరీత్యా భారత్‌లో ఆడలేమంటూ బంగ్లాదేశ్ టోర్నీ నుంచి వైదొలిగింది. మార్చి 8న అహ్మదాబాద్‌లో ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తారు. భారత్‌లో ముంబై, అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై వరల్డ్ కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తున్నాయి. శ్రీలంకలో కొలంబో, పల్లెకెలె వేదికలుగా ఉన్నాయి. మొత్తం జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ఒక్కో గ్రూప్ నుంచి టాప్-2 టీమ్‌లు 'సూపర్-8' దశకు క్వాలిఫై అవుతాయి. 'సూపర్-8'లోని రెండు గ్రూప్‌ల నుంచి రెండేసి జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఆ తర్వాత ఫైనల్ జరుగుతుంది. తొలి రోజు మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. కొలంబోలో నెదర్లాండ్స్‌తో పాకిస్తాన్ (ఉదయం 11 గంటల నుంచి), కోల్‌కతాలో వెస్టిండీస్‌తో స్కాట్లాండ్ (మధ్యాహ్నం 3 గంటల నుంచి) తలపడతాయి.

భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ లేదు!

ఐసీసీ టోర్నీలో అభిమానులు ఆసక్తిగా ఎదురు చూసే భారత్, పాకిస్తాన్ మ్యాచ్ ఈసారి లీగ్ దశలో ఉండటం లేదు. భారత్‌తో మ్యాచ్ ఆడరాదని పాక్ బోర్డు నిర్ణయం తీసుకుంది. మ్యాచ్ తేదీ సమయానికి ఏదైనా అనూహ్యం సంభవిస్తే తప్ప మ్యాచ్ జరిగే అవకాశం లేదు. ఈ రెండు టీమ్‌లు నాకౌట్‌లో ఆడాల్సి వస్తే ఏమిటనేది కూడా ఆసక్తికరం. టి20 వరల్డ్ కప్‌లో 2009, 2010 మినహా... 2007లో రెండు మ్యాచ్‌లతో పాటు గత ఆరు వరుస వరల్డ్ కప్‌లలో ఇరు జట్లు తలపడ్డాయి.

భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్

ఫిబ్రవరి 7	భారత్ x అమెరికా	(ముంబై)
ఫిబ్రవరి 12	భారత్ x నమీబియా	(ఢిల్లీ)
ఫిబ్రవరి 15	భారత్ x పాకిస్తాన్	(కొలంబో)
ఫిబ్రవరి 18	భారత్ x నెదర్లాండ్స్	(అహ్మదాబాద్)
'సూపర్-8' (అంచనా)		
ఫిబ్రవరి 22	భారత్ x దక్షిణాఫ్రికా	(అహ్మదాబాద్)
ఫిబ్రవరి 26	భారత్ x ఆస్ట్రేలియా	(చెన్నై)
మార్చి 1	భారత్ x వెస్టిండీస్	(కోల్‌కతా)
మార్చి 4	తొలి సెమీఫైనల్	(కోల్‌కతా/కొలంబో)
మార్చి 5	రెండో సెమీఫైనల్	(ముంబై)
మార్చి 8	ఫైనల్	(అహ్మదాబాద్/కొలంబో)

నోట్: భారత్ మ్యాచ్‌లన్నీ రాత్రి 7 గంటలకు మొదలవుతాయి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి బిజినెస్
శనివారం
7-2-2026

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	266	83,580
నిఫ్టీ ▲	51	25,694

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	22,944	▲	403
డోజోన్స్	49,847	▲	939
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,368	▲	368
డాక్స్	24,769	▲	278
షాంఘై	4,066	▼	10
నికాయ్	54,254	▲	436

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.05	91.07
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	121.88	124.91
€	యూరో	ఎస్‌బీఐ	105.32	108.16
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.19	58.59
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	62.36	64.71
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	68.82	72.56
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.22	24.73
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.73	24.99
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.15	13.97

రేట్లకు బ్రేక్.. వృద్ధే టార్గెట్

రెపోరేటు యథాతథం

- తటస్థ విధానానికే ఓటు
- ఎంఎస్‌ఈలకు రూ. 20 లక్షల రుణసాయం
- బ్యాంక్ కస్టమర్ మోసపోతే రూ.25వేల పరిహారం
- రీట్‌లకు ఇకపై బ్యాంక్ రుణాలు
- ఆర్‌బీఐ ఎంపీసీ నిర్ణయాలు

ముంబై: అంచనాలకు అనుగుణంగా కీలక పాలసీ రేట్లలో ఎలాంటి మార్పులకు వెళ్లకుండా, ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ యథాతథ స్థితినే కొనసాగించింది. బడ్జెట్‌లో మూలధన వ్యయాలు పెంచడంతో వృద్ధిపై విశ్వాసం వ్యక్తం చేస్తూ, ద్రవ్యోల్బణం నియంత్రణల్లోనే ఉంటుందన్న అంచనాలు వ్యక్తం చేస్తూ.. అంతర్జాతీయంగా అనిశ్చితుల నేపథ్యంలో రెపో రేటు తగ్గింపు చేపట్టకుండా తటస్థ వైఖరిని కొనసాగిస్తూ నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ అంచనాలను పెంచింది. బ్యాంకు కస్టమర్లు మోసపోతే తక్షణ పరిహారం కింద రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించడం ఖాతాదారులకు ఊరటనిచ్చేది.

దీర్ఘకాలం పాటు నిలకడైన వృద్ధి..

పెరిగిపోయిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అనిశ్చితుల మధ్య భారత ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధితో మెరుగైన స్థితిలో ఉంది. ఐరోపా సమాఖ్యతో చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదరడం, యూఎస్‌తోనూ వాణిజ్య ఒప్పందానికి సమీపంలో ఉన్న నేపథ్యంలో వృద్ధి గమనం దీర్ఘకాలం పాటు నిలకడగా కొనసాగుతుంది. జీఎస్‌టీ సంస్కరణలు, ఇప్పటివరకు చేసిన రేట్ల తగ్గింపు, ద్రవ్యోల్బణం దిగువ స్థాయిలో ఉండడం ప్రైవేటు వినియోగానికి మద్దతునిస్తుంది. వాణిజ్య ఒప్పందాలతో ఎగుమతులు పుంజుకుంటాయి.

\- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లకు (రీట్‌లు) సైతం బ్యాంక్‌ల నుంచి రుణ వితరణకు పచ్చజెండా ఊపింది. ఎంఎస్‌ఈలకు పూచీకత్తులేని రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచడం మరో కీలక నిర్ణయం. అలాగే, కొన్ని రకాల ఎన్‌బీఎఫ్‌సీలకు సైతం నిబంధనల పరంగా వెసులుబాటు కల్పించింది.

ఎన్‌బీఎఫ్‌సీలకు వెన్నుదన్ను

రూ.1,000 కోట్ల కంటే తక్కువ ఆస్తులున్న బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు), ప్రజల నుంచి నిధులు సమీకరించని వాటిని కొన్ని షరతుల మేరకు తప్పనిసరి రిజిస్ట్రేషన్ నుంచి మినహాయింపు కల్పించాలని ఆర్‌బీఐ ఎంపీసీ ప్రతిపాదించింది. బంగారంపై రుణాలు ఇచ్చే ఎన్‌బీఎఫ్‌సీలు–ఇన్వెస్ట్‌మెంట్ అండ్ క్రెడిట్ కంపెనీలు (ఐసీసీలు), 1,000 శాఖలకు మించి ఉన్నవి కొత్త శాఖల విస్తరణకు ఇకపై ఆర్‌బీఐ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఇక బంగారం రుణాల విషయంలో ఎలాంటి ఆందోళనల్లేవని, సౌకర్యంగానే ఉన్నామని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా స్పష్టం చేశారు. ఆస్తుల లోన్ టు వ్యాల్యూ (ఎల్‌టీవీ/బంగారం ధరపై రుణ వితరణ) తాము నిర్దేశించిన పరిమితులకు దిగువనే ఉన్నట్టు చెప్పారు. బంగారంపై రుణాలు సహా ఎన్‌బీఎఫ్‌సీల రుణాల పోర్ట్‌ఫోలియోలను ఆర్‌బీఐ సమీక్షించినట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 2026–27లో రుణ సమీకరణను రూ.17.2 లక్షల కోట్లకు పెంచడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న క్రమంలో.. నికర రుణ సమీకరణను చూడాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కంటే రూ.20,000 కోట్లే ఎక్కువన్నారు.

పాలసీలోని ముఖ్యాంశాలు..

➤ రెపో రేటును (ఆర్‌బీఐ నుంచి బ్యాంక్‌లు తీసుకునే నిధులపై వసూలు చేసే రేటు) 5.25 శాతం వద్దే కొనసాగించాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన గల ఆరుగురు సభ్యుల మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించింది. గత డిసెంబర్ సమీక్షలో రెపో రేటును ఆర్‌బీఐ పావు శాతం తగ్గించడం తెలిసిందే. అంతేకాదు 2025 ఫిబ్రవరి నుంచి మొత్తం మీద రెపో రేటును 125 బేసిస్ పాయింట్లు (1.25 శాతం) తగ్గించడం గమనార్హం. రివర్స్ రెపో (బ్యాంకుల నుంచి ఆర్‌బీఐ తీసుకునే నిధులపై చెల్లించే రేటు) రేటు 3.35 శాతంగా కొనసాగనుంది. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) 5 శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్‌ఎఫ్) 5.50 శాతం రేట్లలోనూ మార్పు చేయలేదు.

➤ ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26)లో 2.1 శాతంగా (గత అంచనా 2 శాతం) కొనసాగుతుందని ఆర్‌బీఐ ఎంపీసీ పేర్కొంది. 4 శాతానికి పరిమితం చేయాలన్నది ఆర్‌బీఐ లక్ష్యం. 2025–26 క్యూ4లో 3.2 శాతం (గత అంచనా 2.9 శాతం), 2026–27 క్యూ1లో 4 శాతానికి, 2026–27 క్యూ2లో 4.2 శాతానికి పెరుగుతుందని అంచనాలకు వచ్చింది. 2026–27 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను తదుపరి ఏప్రిల్ సమీక్ష సందర్భంగా ప్రకటిస్తామని ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా తెలిపారు.

➤ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాలను 7.3 శాతం నుంచి 7.4 శాతానికి ఆర్‌బీఐ ఎంపీసీ పెంచింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27) క్యూ1 (ఏప్రిల్–జూన్), క్యూ2 (జూలై–సెప్టెంబర్) వృద్ధి అంచనాలను 6.8 శాతం నుంచి 6.9 శాతానికి సవరించింది. రియల్ జీడీపీ సిరీస్‌ను ఈ నెల చివర్లో విడుదల చేయనుండడంతో పూర్తి ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాలను ఏప్రిల్‌లో ప్రకటిస్తామని మల్హోత్రా పేర్కొన్నారు.

➤ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు (ఎంఎస్‌ఈ) ఆర్థిక భరోసా కల్పిస్తూ పూచీకత్తు లేని రుణ పరిమితిని ప్రస్తుతమున్న రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచింది. 2026 ఏప్రిల్ 1 నుంచి కొత్తగా తీసుకునే రుణాలతోపాటు గత రుణాల పునరుద్ధరణలకూ ఇది వర్తిస్తుంది.

➤ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లకు (రీట్‌లు) బ్యాంకుల రుణ వితరణను అనుమతించే ప్రతిపాదనను ఆర్‌బీఐ ఎంపీసీ తీసుకొచ్చింది. రియల్ ఎస్టేట్ రంగానికి మరింత రుణ వితరణను ప్రోత్సహించేందుకు వీలుగా కొన్ని రక్షణ చర్యలతో రీట్‌లకు బ్యాంకుల రుణాలను అనుమతించే ప్రతిపాదన చేసింది.

➤ కార్పొరేట్ బాండ్ల మార్కెట్‌ను మరింత విస్తృతం చేసేందుకు వీలుగా.. 2026–27 బడ్జెట్ ప్రకటనకు అనుగుణంగా, కార్పొరేట్ బాండ్ సూచీల డెరివేటివ్స్‌కు నియంత్రణ పరమైన కార్యాచరణను ఆర్‌బీఐ విడుదల చేయనుంది.

➤ తదుపరి ఆర్‌బీఐ ఎంపీసీ భేటీ ఏప్రిల్ 6 నుంచి 8 వరకు జరుగుతుంది.

డిజిటల్ మోసాలకు పరిహారం

బ్యాంక్ కస్టమర్ ప్రమేయంతో, ఓటీపీ తెలుసుకుని లేదా కస్టమర్ ప్రమేయం లేకుండా జరిగే డిజిటల్ మోసాల్లో ఎలాంటి ప్రశ్నలు లేకుండా బ్యాంక్ రూ.25,000ను పరిహారం కింద చెల్లిస్తుంది. కాకపోతే కస్టమర్ ఉద్దేశపూర్వక పాత్ర ఉండకూడదు. కస్టమర్ తన వంతుగా 15 శాతం నష్టాన్ని భరించాల్సి ఉంటుంది. ఒకవేళ అధిక విలువ కలిగిన మోసాల్లో పరిహారం రూ.25 వేలకు పరిమితం అవుతుంది. డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ నుంచి ఈ మొత్తాన్ని చెల్లిస్తారు.

కరుగుతున్న వెండి

రూ. 13,000 డౌన్

న్యూఢిల్లీ: వెండి, పసిడిలో లాభాల స్వీకరణ కొనసాగడంతో ధరలు వరుసగా రెండో రోజూ తగ్గాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో వెండి కిలో రేటు రూ.13,000 (5 శాతం) తగ్గి రూ. 2,55,000కు దిగివచ్చింది. అటు 99.9 శాతం స్వచ్ఛత గల పసిడి ధర రూ. 3,400 (2 శాతం) క్షీణించి రూ. 1,57,200కి తగ్గింది.అయితే అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్లో ఔన్సు (31.1 గ్రాములు) సిల్వర్ ధర 3.02 డాలర్లు పెరిగి 74 డాలర్లకు చేరింది.ఇంట్రాడేలో 10 శాతం పతనమై 64.08 డాలర్ల స్థాయిని కూడా తాకింది. అటు ఇంట్రాడేలో 4,654.86 డాలర్ల కనిష్టాన్ని తాకిన బంగారం తర్వాత 106.74 డాలర్లు పెరిగి 4,887.30 డాలర్లకు ఎగిసింది.

పడి పెరిగిన మార్కెట్

- ఆదుకున్న ప్రైవేటు బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ షేర్లు
- ఆర్‌బీఐ ద్రవ్య పాలసీ నిర్ణయాలతో జోష్

ముంబై: ట్రేడింగ్ చివర్లో ఎఫ్‌ఎంసీజీ, ప్రైవేటు రంగ బ్యాంకుల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్ లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ 266 పాయింట్లు పెరిగి 83,580 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 51 పాయింట్లు లాభపడి 25,694 వద్ద నిలిచింది. ఉదయం సెన్సెక్స్ 389 పాయింట్లు పతనమై 82,925 వద్ద, నిఫ్టీ 151 పాయింట్లు కోల్పోయి 25,492 వద్ద కనిష్టాలు నమోదు చేశాయి. అంచనాలకు తగ్గట్లే.., ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను యథాతథంగా కొనసాగించడంతో మార్కెట్ సెంటిమెంట్ బలపడింది. ఆరంభ నష్టాలను భర్తీ చేసుకోవడంతో పాటు చివర్లో ఎఫ్‌ఎంసీజీ, ప్రైవేటు రంగ బ్యాంకుల షేర్లు రాణించడంతో లాభాలతో ముగిశాయి.

ఐపీవోకు ఎన్‌ఎస్‌ఈ సై: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు తాజాగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్‌ఎస్‌ఈ) బోర్డు అనుమతించింది. ఇటీవలే సెబీ ఇందుకు ఎన్‌వోసీ జారీ చేసిన నేపథ్యంలో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. తాజా సమావేశంలో ఎన్‌ఎస్‌ఈ బోర్డ్ ఐపీవో కమిటీని పునర్వ్యవస్థీకరించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తబ్లేష్ పాండే అధ్యక్షతన కొత్త కమిటీ ఏర్పాటుకానుంది. కాగా.. ఎన్‌ఎస్‌ఈ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) క్యూ3లో నికరలాభం 37% క్షీణించి రూ. 2,408 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) క్యూ3లో రూ. 3,834 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 9% నీరసించి రూ. 4,395 కోట్లకు పరిమితమైంది.

వచ్చే నెలలో ఆడి కొత్త స్పోర్ట్స్ కార్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వచ్చే నెలలో భారత్‌లో కొత్త స్పోర్ట్స్ కారును ప్రవేశపెట్టడం ద్వారా తమ పోర్ట్‌ఫోలియోను మరింత పటిష్టం చేసుకోనున్నట్లు లగ్జరీ కార్ల దిగ్గజం ఆడి ఇండియా బ్రాండ్ డైరెక్టర్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ తెలిపారు. రూపాయి క్షీణత పరిణామాల నేపథ్యంలో కార్ల రేట్లను మరోసారి పెంచే అవకాశం ఉందన్నారు. ప్రోగ్రెసివ్ షోరూమ్ కాన్సెప్ట్ కింద శుక్రవారమిక్కడ ఆడి హైదరాబాద్ సెంట్రల్ షోరూమ్‌ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ విషయాలు వివరించారు. హైదరాబాద్‌లో ఇది తమకు రెండో షోరూమ్ అని, జాతీయ సగటుకన్నా రెట్టింపుగా తెలంగాణలో తమకు 8–10% స్థాయిలో మార్కెట్ వాటా ఉంటోందని బల్బీర్ సింగ్ తెలిపారు. నగరంలో లగ్జరీ కార్ల సెగ్మెంట్ గణనీయంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో కస్టమర్లకు సర్వీసులు అందించడంపై దృష్టి పెట్టనున్నట్లు డీలర్ ప్రిన్సిపల్ వికాస్ చౌదరి, వీవీసీ గ్రూప్ చైర్మన్ వీవీ రాజేంద్ర ప్రసాద్ చౌదరి తెలిపారు.

ఖాళీ ప్లేట్లు మోగిస్తూ పీఏసీఎస్ ఉద్యోగుల నిరసన

సమస్యలు పరిష్కరించి, ఆకలి తీర్చాలంటూ విజ్ఞప్తి

కొరిటెపాడు(గుంటూరు): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగులు తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గుంటూరులోని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఖాళీ ప్లేట్లు పట్టుకొని మోగిస్తూ, సమస్యలు పరిష్కరించి తమ ఆకలి తీర్చాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాకినాడ, అనకాపల్లి జిల్లాలకు చెందిన పీఏసీఎస్‌ల ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల రాష్ట్ర నేతలు ముప్పా వెంకటేశ్వరరావు, కె.ఆదినారాయణ మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండు నెలలుగా ఆందోళన, నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 12 వరకు నిరసన, వంటవార్పు, 13న కమిషనర్, రిజిస్ట్రార్ కార్యాలయాల ముట్టడి, చేపట్టనున్నామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే, 16 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీఏసీఎస్‌లను మూసివేసి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల మెడలు వంచి అయినా డిమాండ్లను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా 'చలో అసెంబ్లీ'

- అగ్రిగోల్డ్ బాధితుల సంఘం పిలుపు

సాక్షి, అమరావతి: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారంలో చంద్రబాబు ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి అగ్రిగోల్డ్ బాధితుల సంఘం పిలుపునిచ్చింది. ఈ నెల 20న ఇచ్ఛాపురం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 13 రోజుల పాటు అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య సభలు నిర్వహించాలని నిర్ణయించింది. విజయవాడ దాసరి భవన్‌లో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాయుడు అధ్యక్షతన జరిగిన సదస్సులో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం, అగ్రిగోల్డ్ యాజమాన్య కుట్రలను ప్రతిఘటించేందుకు మరో పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. 20న ఇచ్ఛాపురం నుంచి యాత్ర చేపట్టి చలో అసెంబ్లీకి తరలివెళ్లనున్నట్టు వివరించారు.

వాళ్లూ పూర్తిస్థాయి ఉపాధ్యాయులే!

సర్వ శిక్షా అభియాన్ పార్ట్‌టైం, కాంట్రాక్ట్ టీచర్లు, ఇన్‌స్ట్రక్టర్లపై సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు

''యువత ఈ దేశ భవిష్యత్తు. వారికి సరైన దిశానిర్దేశం చేసి నిర్మాణాత్మక శక్తిగా మార్చేది ఉపాధ్యాయులే. ఒక బలమైన దేశానికి పునాది ఆ దేశ పౌరుల వ్యక్తిత్వం, విలువలలో ఉంటుంది. పునాదే బలహీనంగా ఉంటే దేశం కూలిపోక తప్పదు. మన భారత భాగ్య విధాతలను గొప్పవారిగా మలచడంలో ఉపాధ్యాయులది అత్యంత కీలక పాత్ర. భారతీయ సంస్కృతిలో 'గురు బ్రహ్మ.. గురు విష్ణు.. గురు దేవో మహేశ్వరః' అని అంటారు. ఉపాధ్యాయుడిని దైవంతో సమానంగా చూస్తాం. కొన్ని సందర్భాల్లో ఉపాధ్యాయుడు దైవం కంటే కూడా గొప్పవాడు. దేశ పునాదిని నిర్మించే ప్రాథమిక ఉపాధ్యాయులకు ప్రభుత్వం అత్యున్నత గౌరవాన్ని ఇవ్వాలి. వారి సేవలకు తగిన విధంగా గౌరవ వేతనం, ప్రతిఫలాన్ని అందించాలి. నిజానికి వారు చేసే సేవలకు ఏ గౌరవ వేతనమూ సరితూగదు''

\- సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, అమరావతి: 'సర్వ శిక్షా అభియాన్' పథకం కింద నియమితులైన పార్ట్‌టైం టీచర్లు / కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్లు / కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల విషయంలో సుప్రీంకోర్టు చారిత్రక తీర్పు వెలువరించింది. నియామక కాలం పూర్తయిన తరువాత కూడా కొనసాగుతున్న ఉపాధ్యాయులను ఇకపై 'కాంట్రాక్ట్' ఉద్యోగులుగా పరిగణించడానికి వీల్లేదని తేల్చి చెప్పింది. వారు ఇతర పనులు చేయకుండా ప్రభుత్వం నిషేధించినందున పూర్తిస్థాయి ఉపాధ్యాయులే అవుతారని స్పష్టం చేసింది. ఈ పథకం కింద ఉపాధ్యాయులకు వేతనం చెల్లించాల్సిన బాధ్యత ప్రాథమికంగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపింది. కేంద్రం తన వాటా నిధులు ఇవ్వకపోయినా.. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉపాధ్యాయులకు ముందుగా చెల్లించి, ఆ తర్వాత కేంద్రం నుండి ఆ మొత్తాలను వసూలు చేసుకోవాలని పేర్కొంది. పార్ట్‌టైం టీచర్లు / కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్లు / కాంట్రాక్ట్ ఉపాధ్యాయులకు చెల్లించే గౌరవ వేతనం ఎప్పుడూ ఒకేలా ఉండకూడదని, కనీసం ప్రతి మూడేళ్లకు ఒకసారి సవరించాలని పేర్కొంది. 2013లో ఖరారు చేసిన రూ.7 వేలనే ఇప్పటికీ గౌరవ వేతనంగా చెల్లిస్తుండటం 'వెట్టిచాకిరి' కిందకే వస్తుందని తేల్చి చెప్పింది. ఇది ఎంతమాత్రం సమర్థనీయం కాదంది. 10 ఏళ్లుగా నిరంతరాయంగా పనిచేస్తున్న నేపథ్యంలో వీరి పోస్టులు శాశ్వతమైనవిగా పరిగణించాలంది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ ప్రసన్న బి.వరాలే ధర్మాసనం రెండు రోజుల క్రితం తీర్పు వెలువరించింది. సర్వ శిక్షా అభియాన్ పథకం కింద ఉత్తరప్రదేశ్‌లో నియమితులైన ఉపాధ్యాయులకు గౌరవ వేతనాన్ని రూ.7 వేలుగా మాత్రమే చెల్లిస్తుండటంపై దాఖలైన వ్యాజ్యాల్లో సుప్రీంకోర్టు ధర్మాసనం ఈమేరకు కీలక తీర్పు వెలువరించింది. 2017–18 సంవత్సరానికి మాత్రమే రూ.17 వేలను కనీస వేతనంగా చెల్లించాలన్న హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ పార్ట్‌టైం ఉపాధ్యాయులు, ఇన్‌స్ట్రక్టర్ల సంఘం సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేసింది. మరోవైపు రూ.17 వేలను కనీస వేతనంగా నిర్ణయించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో అప్పీళ్లు దాఖలు చేసింది. వీటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. టీచర్ల సంఘం దాఖలు చేసిన అప్పీళ్లను అనుమతిస్తూ, ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టేసింది.

వారి ఆర్థిక భద్రత బాధ్యత రాష్ట్రాలదే...

'ఈ ఉపాధ్యాయుల సేవలు విద్యా వ్యవస్థకు నిరంతరం అవసరం కాబట్టి సర్వ శిక్షా అభియాన్ పథకం కొనసాగినంత కాలం వారికి తగిన ఆర్థిక భద్రత కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. వేతనం విషయంలో జాప్యం, కోతలు, అస్పష్టత ఉపాధ్యాయులను ఆర్థికంగా బలహీనులను చేస్తుంది. ఇది విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఉపాధ్యాయులకు గౌరవ వేతనాన్ని సమయానికి, నిరంతరాయంగా చెల్లించాలి. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు (వేతనం తగ్గించడం, ఆలస్యం చేయడం) అన్యాయమైనవే కాకుండా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఉపాధ్యాయుల సేవలను దృష్టిలో ఉంచుకొని వారికి గౌరవప్రదమైన జీవనానికి సరిపడే వేతనం ఇవ్వాల్సిందే. ప్రస్తుత కేసులో.. సర్వశిక్షా అభియాన్ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం రూ.7 వేలు మాత్రమే ఇస్తోంది. ఇది మామూలు కార్మికులకు ఇచ్చే కనీస వేతనం కంటే తక్కువ. ఈ ఉపాధ్యాయులకు నెలకు రూ.17 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించాలి. కనీసం ప్రతి మూడేళ్లకొకసారి వేతనాన్ని సవరించాలి' అని ధర్మాసనం తన తీర్పులో తేల్చి చెప్పింది.

పార్ట్‌టైం టీచర్లని పిలవడం మోసపూరితం..

'ప్రాథమిక పాఠశాలల్లో నియమితులైన పార్ట్‌టైం, కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఎన్‌సీటీఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్) నిర్దేశించిన ప్రాథమిక విద్యార్హతలు కలిగి ఉంటారు. అందువల్ల వీరు రెగ్యులర్ ఉపాధ్యాయుల కంటే ఏ విషయంలోనూ తక్కువ కాదు. వీరిని 'పార్ట్ టైం టీచర్లు' అని పిలవడం మోసపూరితం. వారు రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానమైన అర్హతలు కలిగి ఉండి, సమాన విధులను నిర్వర్తిస్తున్నారు. వారి విషయంలో ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం వేరే ఏ ఇతర ఉద్యోగం చేయకూడదు. ప్రభుత్వం వారిని ఇతర పనులు చేయకుండా నిరోధించినప్పుడు, వారిని వాస్తవానికి పూర్తి స్థాయి ఉపాధ్యాయులుగానే పరిగణించాలి' అని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది.

తాత్కాలికం మానేసి.. రెగ్యులర్ నియామకాలు చేపట్టాలి

'పార్ట్‌టైం టీచర్లు, ఇన్‌స్ట్రక్టర్లు 10 ఏళ్లకు పైగా నిరంతరాయంగా పనిచేస్తున్నారు. దీంతో వీరికి ఒక రకమైన శాశ్వతత్వం ఏర్పడింది. వారు రోజుకు ఎనిమిది పీరియడ్‌ల వరకు బోధిస్తూ రెగ్యులర్ ఉపాధ్యాయుల మాదిరిగానే పని భారాన్ని మోస్తున్నారు. వారి పని శాశ్వత స్వభావం కలిగినది. అనుభవం ఉన్న ఈ ఉపాధ్యాయులను తీసేసి కొత్త వారిని నియమించడం కుదరదు. ఒక కాంట్రాక్ట్ ఉద్యోగిని.. మరో కాంట్రాక్ట్ ఉద్యోగితో భర్తీ చేయకూడదు. ప్రభుత్వం ఇలాంటి తాత్కాలిక నియామక పద్ధతులను మానేసి సరైన పద్ధతిలో రెగ్యులర్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలి. వీరంతా సరైన ప్రక్రియ, ప్రకటన ద్వారా ఎంపికయ్యారు కాబట్టి వీరి నియామకాలను పూర్తిస్థాయి నియామకాలుగానే పరిగణించాలి. వీరిని అడ్‌హాక్ సిబ్బందిగా పిలవడం అసంబద్ధం. ప్రభుత్వ సంస్థలలో తాత్కాలిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న దోపిడీని ఈ కోర్టు గుర్తించింది. సమానమైన పనులు చేస్తున్నప్పటికీ వారిని 'తాత్కాలికం' అని ముద్ర వేసి పెన్షన్, పీఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి ప్రాథమిక హక్కులను నిరాకరించడం వారి గౌరవానికి భంగం కలిగించడమే' అని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

> **69.** A simple reading of the aforesaid provision reveals that the State Government shall take into account not only the sums provided by the Central Government to the State Government but also its other resources and shall be responsible to provide funds for the implementation of the provisions of the Act. Therefore, an onerous duty has been cast upon the State Government to implement the provisions of the Act *vis-à-vis* the payment of honorarium to the instructors/teachers. Therefore, in all earnest, it is primary duty of the State Government to pay honorarium to the instructors/teachers appointed under the Act or the scheme formulated thereunder. In the event, the Central Government fails to contribute its share of finances, the State Government is free to recover it from the Central Government but cannot deny payment to instructors/teachers. The principle of "pay and recover" as such would be attracted and would be applicable.

కేంద్రం నిధులు ఇవ్వలేదన్న కారణంతో రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఆపడానికి వీల్లేదన్న సుప్రీం కోర్టు

తక్కువ వేతనానికి పని చేయించుకోవడం వెట్టి చాకిరియే..

'ఉపాధ్యాయుల గౌరవ వేతనాన్ని నిర్ణయించడం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం అయినప్పటికీ అది ఏకపక్షంగా ఉండకూడదు. ధరల పెరుగుదల, జీవన వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని కాలానుగుణంగా వేతనాన్ని సవరిస్తూ ఉండాలి. అతి తక్కువ వేతనానికి పని చేయించుకోవడం రాజ్యాంగంలోని 23వ అధికరణం ప్రకారం 'వెట్టిచాకిరి' కిందకు వస్తుంది. ఆర్థిక ఇబ్బందుల వల్ల తక్కువ వేతనానికి అంగీకరించడం స్వచ్ఛందమైన పని కాదు. అది బలవంతపు శ్రమ అవుతుంది. వేరే పని చేయనివ్వకుండా కట్టడి చేసి ఇచ్చే వేతనాన్ని కూడా తగ్గించడం ఆర్థికంగా వారిని అణచివేయడమే. ఇది రాజ్యాంగ విరుద్ధం' అని ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. 'బడ్జెట్ ఆమోదించడం, గౌరవ వేతనాన్ని నిర్ణయించే అధికారం కేవలం పీఏబీ (ప్రాజెక్ట్ అప్రూవల్ బోర్డ్)కు మాత్రమే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం లేదా ఇతర కమిటీలు వేతనాలను తగ్గించడం లేదా మార్చడం చేయలేవు. గౌరవ వేతనం ఖరారుతో సహా బడ్జెట్ కేటాయింపుల అధికారాలన్నీ పీఏబీకే ఉన్నాయి. ఒకసారి పీఏబీ ఆమోదించిన గౌరవ వేతనం అమలులో ఉన్నప్పుడు దాన్ని రాష్ట్రం ఏకపక్షంగా తగ్గించడం చట్టవిరుద్ధం. విద్యా హక్కు చట్టంలోని రూల్ 20 ప్రకారం ఈ ఉపాధ్యాయుల జీతభత్యాలు, పెన్షన్, ఇతర సౌకర్యాలు రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా ఉండాలి' అని తేల్చి చెప్పింది.

రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా అన్ని ప్రయోజనాలు..

'నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం, ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించకూడదు. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో జనగణన, విపత్తు నివారణ విధులు, స్థానిక సంస్థలు లేదా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల విధులకు మాత్రమే వారిని కేటాయించవచ్చు. సర్వ శిక్షా అభియాన్ పథకం కింద పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా ఇటువంటి బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద నియమితులైన ఉపాధ్యాయుల జీతభత్యాలు, వైద్య సదుపాయాలు, పెన్షన్, గ్రాట్యుటీ, పీఎఫ్ వంటివన్నీ కూడా రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా ఉండాలి. దీని అర్థం.. వీరు కూడా అన్ని రకాల ప్రయోజనాలకు అర్హులు. ఈ ఉపాధ్యాయులు అకడమిక్ పనులతో పాటు ఇతర విధులను కూడా నిర్వహిస్తున్నందున వారికి ఇతర ఉపాధ్యాయులతో సమానంగా గౌరవ వేతనం అందాలి' అని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

వైఎస్ జగన్ భద్రతపై వైఎస్సార్‌సీపీ ఆందోళన

- జడ్ ప్లస్ కేటగిరీ సెక్యూరిటీ కలిగిన నేత భద్రతను గాలికొదిలేసిన పోలీసులు
- జోగి రమేష్ కుటుంబాన్ని పరామర్శించిన తర్వాత తిరుగు ప్రయాణంలో భద్రతా వైఫల్యం
- భద్రతా సిబ్బంది, వ్యక్తిగత సిబ్బందికి కూడా సమాచారం ఇవ్వకుండా కాన్వాయ్ మళ్లింపు
- ఉద్దేశ పూర్వకంగా ఇరుకు రోడ్లు, గ్రామాల మీదుగా తాడేపల్లికి తీసుకొచ్చిన వైనం
- కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్తామని వైఎస్సార్‌సీపీ స్పష్టీకరణ
- ఉదయం పోలీసుల ఆంక్షల మేరకు పశ్చిమ బైపాస్ మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్లిన జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రతపై ఆ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. టీడీపీ గూండాల దాడికి గురైన జోగి రమేష్ కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించిన తర్వాత తిరుగు ప్రయాణంలో వైఎస్ జగన్ భద్రతను పోలీసులు గాలికొదిలేశారు. వైఎస్ జగన్ భద్రతా సిబ్బందికి, వ్యక్తిగత సిబ్బందికి కూడా కనీస సమాచారం ఇవ్వకుండా.. ఎటు వెళ్తున్నామో కూడా చెప్పకుండా కాన్వాయ్‌ని దారి మళ్లించారు. జోగి రమేష్ నివాసం నుంచి మందడం, పెనుమాక, యర్రబాలెం, మంగళగిరి క్రాస్, ఉండవల్లి మీదుగా తాడేపల్లికి తీసుకెళ్లారు. ఇబ్రహీంపట్నం నుంచి తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసానికి 20 కిలోమీటర్ల దూరం ఉంటే.. పోలీసులు దారి మళ్లించి.. ఇరుకైన రోడ్లు, గ్రామాల మీదుగా కాన్వాయ్‌ను మళ్లించి 45 కిలోమీటర్లు తిప్పారు. జడ్ ప్లస్ కేటగిరీ సెక్యూరిటీ కలిగిన వైఎస్ జగన్ భద్రతను గాలికి వదిలేయడంపై వైఎస్సార్‌సీపీ ఆందోళన వ్యక్తం చేసింది.శుక్రవారం తాడేపల్లిలోని తన నివాసం నుంచి విజయవాడ ప్రధాన రహదారుల మీదుగా కాకుండా పోలీసులు విధించిన ఆంక్షల మేరకు పశ్చిమ బైపాస్ మీదుగా వైఎస్ జగన్ ఇబ్రహీంపట్నం వెళ్లారు. కానీ.. తిరుగు ప్రయాణంలో వైఎస్ జగన్ సిబ్బంది, వ్యక్తిగత సిబ్బందికి కూడా ఎటు వెళ్తున్నామో చెప్పకుండా పోలీసులు కాన్వాయ్ మళ్లించడం సరికాదని నేతలు తప్పు పడుతున్నారు. రెగ్యులర్ రహదారి మీదుగా తీసుకొస్తున్నామని చెప్పి.. ఇరుకు రోడ్ల మీదుగా కాన్వాయ్‌ను మళ్లించడంలో ఉద్దేశం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. వైఎస్ జగన్ భద్రతను పోలీసులు గాలికొదిలేయడంపై కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్తామని పార్టీ స్పష్టం చేసింది.

ఇళ్లపై దాడి చేయడం సరికాదు: సీపీఐ నేత నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: నాయకుల ఇళ్లపై దాడి చేసే సంస్కృతి సరికాదని, అలా చేసిన వారిపై సీఎం హోదాలో ఉన్నవారు చర్యలు తీసుకోవాలని సీపీఐ సీనియర్ నాయకుడు కె.నారాయణ అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల ఇళ్లపై దాడి నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నారాయణ శుక్రవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌ను బదిలీ చేయడం కాదని, తప్పుంటే శిక్షించాలన్నారు.

లడ్డూపై రాజకీయానికి ముగింపు పలకండి

- సీఎం చంద్రబాబుకు సీపీఐ నేత రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: తిరుమల లడ్డూపై రాజకీయానికి ముగింపు పలకాలని సీఎం చంద్రబాబుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను రామకృష్ణ శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. లడ్డూను వివాదాస్పదం చేసి ప్రచారాస్త్రంగా ఉపయోగించుకోవడం తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా ఉందన్నారు. ఇప్పటికే సీబీఐ సిట్ దర్యాప్తు చేసిందని, లడ్డూలో కల్తీ జరిగితే దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అంతేగాని రాష్ట్రంలో ప్రజా సమస్యలేమీ లేవన్నట్టు లడ్డూ చుట్టూ వివాదాలు చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

సిట్ నివేదిక పక్కనపెట్టి కమిషన్ పేరుతో కాలయాపనా?

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: సిట్ నివేదిక పక్కన పెట్టి మళ్లీ కమిషన్ పేరుతో కాలయాపన చేస్తారా? అంటూ చంద్రబాబు ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తప్పుబట్టారు. లడ్డూ నెయ్యి కల్తీ విషయమై వేసిన సిట్ నివేదికను బయట పెట్టాలని డిమాండ్ చేశారు. లడ్డూను రాజకీయ వివాదంగా మార్చి రాష్ట్ర ప్రజల్లో విద్వేషాలు పెంచొద్దని సీఎంకి ఆయన విజ్ఞప్తి చేశారు.

ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పించేందుకు రాష్ట్ర విద్యా శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన వారు http:// cse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 25శాతం ఉచిత ప్రవేశాల్లో అనాథలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు 6శాతం చొప్పున రిజర్వేషన్లు కేటాయించారు. ప్రైవేట్ పాఠశాలలు ఈనెల 7 నుంచి 16 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. విద్యార్థుల కోసం ఫిబ్రవరి 20 నుంచి మార్చి 10 వరకు రిజిస్ట్రేషన్ కొరకు ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులో ఉంటుంది. మార్చి 17 నుంచి అడ్మిషన్లకు అర్హత గల విద్యార్థుల జాబితాను తయారుచేసి ఫస్ట్ రౌండ్ లాటరీ ఫలితాలను మార్చి 25న ప్రకటిస్తారు. 2వ రౌండ్ ఫలితాలు ఏప్రిల్ 12న ప్రకటిస్తారు.

గుండె పోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

- భోజనం చేయడానికి వెళ్తుండగా కుప్పకూలిన వైనం
- వెంటనే ఆస్పత్రికి తరలింపు.. చికిత్స పొందుతూ మృతి
- తొక్కిసలాటే కారణమని ఎల్లో మీడియాలో దుష్ప్రచారం

మృతుడు డి.రాంబాబు

జగ్గయ్యపేట : ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త డి.రాంబాబు (38) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఇబ్రహీంపట్నం వస్తుండటంతో ఆయన్ను చూసేందుకు గ్రామం నుంచి కార్యకర్తలతో కలిసి ఉదయం ప్రత్యేక వాహనంలో వెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో భోజనం చేసేందుకు సమీపంలోని హోటల్‌కు వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన మేనల్లుడు గోపి, పార్టీ కార్యకర్తలు, నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆయన్ను సమీపంలోని ఆరోగ్య ఉప కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గొల్లపూడిలోని ఆంధ్రా ఆ స్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి డి.సింహాద్రి చిల్లకల్లు గ్రామ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిసున్నాడు. మృతునికి భార్య, ఐదవ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. మృతుడు కొంత కాలంగా గుండె సంబంధిత సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, రాంబాబు గుండెపోటుతో మృతి చెందితే తొక్కిసలాట కారణంగా మృతి చెందినట్లు ఎల్లో మీడియాలో దుష్ప్రచారం చేయడం దారుణమని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బురదజల్లే ప్రయత్నాలకు పోలీసులు కూడా సహకారం అందిస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే ఇబ్రహీంపట్నం, భవానీపురం సీఐలు.. ఆయన్ను ప్రభుత్వాస్పత్రికి తరలించాలని ఒత్తిడి చేశారని తెలిపారు.

ధైర్యంగా ఉండండి... పార్టీ అండగా ఉంటుంది

వైఎస్సార్‌సీపీ నేత డి.రాంబాబు సోదరుడికి జగన్ పరామర్శ

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డి.రాంబాబు అనారోగ్యంతో మృతిచెందడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విచారం వ్యక్తంచేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇబ్రహీంపట్నం పర్యటనలో పాల్గొన్న డి.రాంబాబు అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలిసి రాంబాబు సోదరుడు జానకిరామయ్యతో వైఎస్ జగన్ ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రాంబాబు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాంబాబు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానని తెలిపారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications LimitedSakshi Press, Survey No 2/4, Kothapalem Village, Renigunta Mandal, Tirupati Revenue Division,Tirupati Dist - 517 520, and Printed at Jagati Publications Limited Survey No 2/4, Kothapalem Village, Renigunta Mandal, Tirupati Revenue Division,Tirupati Dist - 517 520
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act)Phone No.0877-2275378 Fax No. 0877-2271213, RNI Regn No. APTEL/2008/23805. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

కౌండిన్య, మోర్ధానలో..

తమిళనాడు ఫారెస్ట్‌శాఖకు పట్టుబడిన వారిలో పలమనేరు వాసి
గతంలో కర్ణాటక ఏనుగు దంతాల కేసులో చిత్తూరు మూలాలు
మూడు రాష్ట్రాల స్మగ్లర్లకు అంతర్జాతీయ మాఫియాతో లింకులు
కౌండిన్యలో మృతిచెందే ఏనుగుల విషయం రహస్యమేనా?

వీరప్పన్‌లు!

రాష్ట్ర సరిహద్దులో పేట్రేగుతున్న ఏనుగు దంతాల స్మగ్లర్లు



మోర్ధాన అటవీ ప్రాంతంలో నయా వీరప్పన్‌లు చెలరేగిపోతున్నారు. భూమిపై నివశించే క్షీరదాల్లో అతి పెద్దదైన ఏనుగులను వెంటాడి వేటాడేస్తున్నారు. నాటు తుపాకులు, నల్లమందు ఉండలు పెట్టి నిట్టనిలువునా చంపేస్తున్నారు. వివిధ కారణాలతో మృతిచెందినా వదలకుండా.. వాటివద్ద గద్దల్లా వాలిపోతున్నారు. దంతాలను పీకి ఎంచక్కా విదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత కొంత కాలంగా ఏనుగు దంతాల స్మగ్లర్లు అటు కర్ణాటక, ఇటు తమిళనాడుతోపాటు ఆంధ్రలోనూ చక్కర్లు కొడుతున్నారు. ఇటీవల తమిళనాడులోని గుడియాత్తంలో ఓ ముఠా పట్టుబడడంతో ఆ మూడు రాష్ట్రాల అధికారులు అలెర్ట్ అయ్యారు.

పలమనేరు: దక్షిణ భారతదేశంలో గజరాజుల మనుగడ ప్రశ్నార్థంగా మారింది. ఏనుగు దంతాలకు విదేశాల్లో భారీ డిమాండ్ ఉండడంతో స్మగ్లర్లు వాటిపై కన్నేశారు. కార్ణటక, తమిళనాడు, ఆంధ్ర సరిహద్దులోని మోర్ధానాలో మాటు వేసి మరీ వేటాడుతున్నారు. ఆపై గుట్టుచప్పుడు కాకుండా వాటి కోరలు పీకి విదేశాలకు తరలిస్తున్నారు. గతంలో కర్ణాటకలో ఏనుగు దంతాల కేసుకు సంబంధించిన మూలాలు చిత్తూరు జిల్లాలోని వారికి సంబంధం ఉందనే విషయం బయటపడింది. తాజాగా తమిళనాడులోని గుడియాత్తంలో అక్కడి ఫారెస్ట్ అధికారులకు పట్టుబడిన ముఠాతో పలమనేరు మండల వాసికి సంబంధాలున్నాయనే విషయం సంచలనమైంది. ఏనుగు మృతి చెందితే దాన్ని జూ అధికారులు పోస్టుమార్టం చేసి దాని దంతాలను తొలగించి ఆపై పాతిపెడుతుంటారు. కానీ వందల కిలోమీటర్లున్న అడవిలో మృతి చెందే ఏనుగుల పరిస్థితి ఏంటో మరి.

గతంలో కర్ణాటకలో వెలుగులోకి

కర్ణాటకలోని హెబ్బాళ్ల పోలీసులకు గతంలో ఏనుగు దంతాల కేసులో చిత్తూరు జిల్లా చెందిన స్మగ్లర్ల విషయం వెలుగుచూసింది. కౌండిన్య అభయారణ్యం, శేషాచలం అడవుల్లో సంచరించే ఏనుగుల దంతాలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

మృతిచెందిన ఏనుగు దంతాల తొలగింపు

సాధారణంగా మృతిచెందిన ఏనుగు నుంచి దంతాలను తీసి ఆపై పూడ్చి పెడుతుంటారు. కౌండిన్య అభయారణ్యంలో ఇప్పటిదాకా 20 ఏనుగులు మృతిచెందాయి. వీటిని పాతిపెట్టేముందు సంబంధిత ఎఫ్ఆర్వో ఉన్నతాధికారుల నుంచి కస్టోడియల్ ఫామ్‌ను పొంది ఆపై జూ డాక్టర్లు పోస్టుమార్టమ్ నిర్వహించాలి. దంతాలను కత్తిరించాక పాతిపెట్టిన ప్రదేశాన్ని జియో రెఫరెన్స్ చేసి ఇందుకు సంబంధించిన కేస్ రిపోర్ట్‌లో ఉంచాలి. దంతాలను ఫారెస్ట్ కస్టోడియన్ స్టోర్ రూమ్‌లో భద్రపరుస్తారు.

మృతిచెందిన ఏనుగుకు దంతాలను కత్తిరించి ఖననం చేస్తున్న దృశ్యం(ఫైల్)

విదేశాల్లో భలే డిమాండ్

చైనా, జపాన్, సింగపూర్, యూఏఈ లాంటి దేశాల్లో ఏనుగు దంతాలకు భారీ డిమాండ్ ఉంది. వీటి విలువ కిలో రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పైగా ఉంటుందని సమాచారం. వీటితో అందమైన కళాఖండాలు, బొమ్మలు, మతపరమైన చిహ్నాలు, ఫియానో, చందరంగ చిహ్నాలు, విలాసాలు, హోదాలకు కోటీశ్వరులు కొంటున్నట్టు తెలిసింది.

ఏనుగులను చంపి దంతాలను సేకరిస్తున్నారా?

ఏనుగులు అడవిలో మృతిచెందినా, లేక వేటగాళ్లు నాటు తుపాకులతో, నల్లమందు ఉండలతో చంపినా వాటి నుంచి దంతాలను సేకరించే అవకాశాలున్నాయి. గతంలో హొగినేకళ్ అడవుల్లో వీరప్పన్ హయాంలో ఏనుగు దంతాల స్మగ్లింగ్ సాగింది. కౌండిన్య అడవిలోంచి మదపుటేనుగులు శేషాచలం అడవుల్లోకి వెళుతుంటాయి. ఏపీ, తమిళనాడు అడవుల్లో ఇలాంటి కార్యక్రమాలు సాగేందుకు అనుకూలంగా ఉంటుందనే మాట వినిపిస్తోంది. మోర్ధాన అడవిలో మూడు ఏనుగులు మృతి చెందిన విషయం అక్కడి అటవీశాఖకు నెల దాకా తెలియ దంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తాజాగా తమిళనాడులో...

కౌండిన్య అభయారణ్యానికి ఆనుకొని ఉన్న తమిళనాడులోని మోర్ధాన ఫారెస్ట్‌లో గత డిసెంబర్ 4న మూడు ఏనుగుల కళేబరాలు భయపడ్డాయి. వీటిలో మదపుటేనుగు దంతాలు కనిపించకపోవడంతో అక్కడి ఫారెస్ట్ అధికారులు శోధిస్తుండగా నాలుగు రోజుల క్రితం గుడియాత్తంలో ఏనుగు దంతాలను విక్రయిస్తున్న ముఠాను పట్టుకున్నారు. వారిని విచారించగా తమకు పలమనేరు మండలంలోని ఓ వ్యక్తి ద్వారా వచ్చాయనే విషయం వెలుగుచూసింది.

మగ ఏనుగులకు మాత్రమే దంతాలు

పలమనేరు, కుప్పం, చిత్తూరు ఫారెస్ట్‌రేంజ్‌ల పరిధిలోని కౌండిన్య అభయారణ్యం దాదాపు 250 చ.కి.మీగా ఉంది. ఇందులో సుమారు వంద దాకా ఏనుగులున్నాయి. ఇక ఇదే అడవికి ఆనుకొని ఉన్న మోర్ధా నా రేంజ్ 130 చ.కి.మీగా ఉండగా ఇందులో 26 దాకా, కృష్ణగిరి, మైసూరు జిల్లాలో 320 చ.కిమీ విస్తీర్ణంలో 46 దాకా ఏనుగులున్నట్టు తెలుస్తోంది. వీటిలో మగ ఏనుగులు (టస్కర్స్) 27 దాకా ఉన్నట్టు సమాచారం. ఇందులో కొన్ని మదపుటేనుగులు కౌండిన్య ఎలిఫెంట్ శాంచురీని దాటి భాకరాపేట అడవుల మీదుగా శేషాచలం అడవుల్లోనూ సంచరిస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి తోడు అటు తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం ఫారెస్ట్‌లోని మోర్ధాన ప్రాంతం, క్రిష్ణగిరి, కావేరిపట్నం, కర్ణాటకలోని హొసూర్, బన్నేర్‌గట్టల నుంచి తరచూ కౌండిన్యలోకి ప్రవేశించే సంచార ఏనుగులున్నాయి. జిల్లాలో మొత్తం 12 మదపుటేనుగులుండేవి. వీటిలో ఆరు మృతిచెందగా ఇప్పుడు ఆరు మగ ఏనుగులు మాత్రమే ఉన్నాయి.

దేశీ ఆవుకు పుంగనూరు జాతి దూడ జననం

చౌడేపల్లె: అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ దాదేపల్లెకు చెందిన షేక్ రాహుల్‌కు చెందిన నాటు ఆవు(అల్లికారుజాతి)కి శుక్రవారం పుంగనూరు జాతి దూడ జన్మించింది. పశువైద్య సిబ్బంది సూచనల మేరకు పుంగనూరు జాతి సెమన్ వేయించామని, అంతేకాక వారి సలహాలు పాటించడంతో పుంగనూరు జాతి పెయ్యిదూడ జన్మించిందని రాహుల్ తెలిపారు.

గాజు సీసాలో తిరుమల ఆలయం గోపురం

మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భక్తుడు తిరుమల శ్రీవారి ఆలయ మహాద్వార గోపురాన్ని గాజు సీసాలో సూక్ష్మంగా తయారుచేసిన నమూనా ఎంతగానో ఆకట్టుకుంది. ఈ నమూనాను ఆ భక్తుడు శుక్రవారం తిరుమల శ్రీవారి ఆలయం ముందు ప్రదర్శించారు.

– తిరుమల

రక్షణ విజ్ఞాన సదస్సులో ఎస్వీయూ వీసీకి గౌరవ ఫెలోషిప్

తిరుపతి సిటీ: విజయవాడ వేదికగా జరిగిన రక్షణ విజ్ఞాన సదుస్సులో ఎస్వీయూ వీసీ టాటా నర్సింగరావుకు అరుదైన గౌరవం లభించింది. అకాడమి ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఏఎస్‌టీసీ) ఎన్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయనకు ఏఎస్‌టీసీ గౌరవ ఫెలోషిప్ ప్రకటించారు. విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, పరిశోధన, ఆవిష్కరణలు, శాస్త్రీయ దృక్పథం ప్రోత్సాహంలో ఆయన చేసిన విశేష సేవలను గుర్తించి ఈ గౌరవాన్ని ప్రకటించారు.

పారని ఆశలు.. పండని బతుకులు

95 శాతం భూముల్లో ఒక్క పంటే!

కోసిగి ప్రాంతం నుంచి వాహనాల్లో వలస వెళ్తున్న ప్రజలు

- ఒకటి కంటే ఎక్కువ పంటలు 35,220 హెక్టార్లలోనే
- కర్నూలు జిల్లాలో 3,06,298 మంది సన్న, చిన్నకారు రైతులు
- వర్షాధార పంటలు నవంబర్ నెలతోనే పూర్తి
- విధిలేని పరిస్థితుల్లో వలసబాట పడుతున్న అన్నదాత
- పశ్చిమ ప్రాంతంపై గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వేదవతి, గుండ్రేవులను విస్మరించిన టీడీపీ ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): నీటి పారుదలతో పాటు పరిశ్రమల ఏర్పాటుతోనే వలసల నివారణ సాధ్యం. ఏడాది పొడవునా భూములపై పంటలు ఉంటే ఆ ప్రాంతం సస్యశ్యామలమే. అప్పుడే వ్యవసాయ కూలీలకు, ప్రజలకు చేతి నిండా పని ఉంటుంది. నీటిపారుదల సదుపాయం లేదు.. పరిశ్రమలు లేవు.. ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉమ్మడి కర్నూలు జిల్లా పూర్తిగా వెనుకబడింది. వివిధ జిల్లాలతో పోలిస్తే సాగు భూమికి కొదువ లేదు. జిల్లా మీదుగా తుంగభద్ర నది కూడా ప్రవహిస్తుంది. వేదవతి నది పారుతోంది. నీటి వనరులు ఉన్నా ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోని పరిస్థితి. జిల్లాలో మొత్తం రైతులు 3,95,498 మంది కాగా.. వీరికి 5,90.667 హెక్టార్ల భూములు ఉన్నాయి. వీరిలో చిన్న, సన్న కారు రైతులే (రెండు హెక్టార్లలోపు) 3,06,293 మంది. 2025–26లో 5,67400 హెక్టార్లలో వ్యవసాయం జరుగుతోంది. ఇందులో 5,32789 హెక్టార్లలో ఏడాది మొత్తంగా కేవలం ఒక్క పంట మాత్రమే సాగవుతోంది. కేవలం వర్షాధారంపై ఆధారపడటం వల్లే 90 శాతంపైన భూములు ఒక్క పంటకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ఖరీఫ్‌లో భూములను ఖాళీగా ఉంచుకొని రబీలో శనగ వేస్తుండటంతో 80,421 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. జిల్లా నుంచి వలసలు భారీగా ఉండటానికి ఇదే ప్రధాన కారణం.

35,220 హెక్టార్లలోనే ఒకటి కంటే ఎక్కువ పంటలు

జిల్లాలో సాగు భూమికి కొదువ లేకపోయినా 35,220 హెక్టార్లలో మాత్రమే ఒకటి కంటే ఎక్కువ పంటలు సాగవుతున్నాయి. మొత్తం సాగు భూమిలో కనీసం 50 శాతం పైగా భూముల్లో ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ పంటలు సాగవ్వాల్సి ఉంది. అప్పుడే రైతులతో పాటు వ్యవసాయ కూలీలకు ఏడాదిలో 9–10 నెలల వరకు పనులు ఉంటాయి. జిల్లాలో మొత్తం సాగు భూమి 5,90,667 హెక్టార్లు ఉన్నప్పటికీ ఇందులో కేవలం ఐదారు శాతం భూముల్లోనే ఒకటి కంటే ఎక్కువ పంటలు సాగవుతున్నాయి. విస్తారంగా సాగు భూమి ఉన్నప్పటికీ ఇందులో కేవలం ఐదారు నెలలే పంటలు ఉంటున్నాయి. పత్తి, కంది దీర్ఘకాలిక పంటలు కావడం వల్ల ఐదారు నెలల వరకు అవకాశం ఉంది. జిల్లాలో నల్లరేగడి నేలలు ఎక్కువగా ఉండటం వల్ల కొన్ని ప్రాంతాల్లో ఖరీఫ్‌కు భూములను ఖాళీగా ఉంచుకొని రబీలో శనగ సాగు చేస్తున్నారు.

నీటి వనరులున్నా ఒక్క పంటే

జిల్లాలోని వివిధ మండలాల మీదుగా తుంగభద్ర నది ప్రవహిస్తోంది. పశ్చిమ ప్రాంతంలో తుంగభద్రకు అనుబంధంగా ఎల్ఎల్‌సీ కాలువ ఉన్నా నీరు అంతంతమాత్రమే వస్తుంది. ఎత్తిపోతల పథకాలు ఉన్నా ఉపయోగం లేకుండాపోయింది. మరోవైపు వేదవతి నది కూడా ప్రవహిస్తోంది. ఎల్ఎల్‌సీ కాలువ కూడా ఉండటంతో 74వేల హెక్టార్లకు నీటి సదుపాయం స్థిరీకరించారు. అయితే 35వేల హెక్టార్లకు మాత్రమే సాగునీరు అందుతోంది. మిగిలిన భూముల్లో ఏడాదికి ఒకటి కంటే ఎక్కువ పంటలు పండించుకోవాలంటే వేదవతి ప్రాజెక్టు అత్యవసరం. ఇది సాకారమైతేనే వలసల నివారణ సాధ్యం. ఆ దిశగా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం ఈ ప్రాంత ప్రజలకు శాపంగా మారింది.

వేదవతి నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)

రెండేళ్లుగా పెరిగిన వలసలు

పశ్చిమ ప్రాంతం పూర్తిగా వర్షాధారంపైనే ఆధారపడింది. ఒక్క పంటకు మాత్రమే పరిమితం కావడంతో పలు మండలాల్లో రెండు నెలల క్రితమే వ్యవసాయ పనులు పూర్తయ్యాయి. దీంతో వ్యవసాయ కూలీలు, సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి కరువైంది. ఇప్పటికే పెద్దకడుబూరు, ఆదోని, కోసిగి, మంత్రాలయం, కౌతాళం, హాలహర్వి, హొలగొంద, తుగ్గలి, దేవనకొండ, పత్తికొండ తదితర మండలాల నుంచి వేలాది కుటుంబాలు ఊళ్లు విడిచివెళ్లాయి. వలసలు పెరగడంతో పాఠశాల్లో హాజరు 40–50 శాతం వరకు పడిపోయినట్లు తెలుస్తోంది.

పశ్చిమ ప్రాంత అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెనుకబడిన కర్నూలు జిల్లాను, అందులోనూ ముఖ్యంగా పశ్చిమ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేసింది. ఇందులో 17 మండలాలు ఉన్నాయి. అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి ప్రభుత్వ పథకాల అమలులో ఈ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ వహించింది. నీటిపారుదల సదుపాయం కల్పించేందుకు వేదవతి ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. 2024 జూన్ నెలలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావడంతోనే ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఉనికే లేకుండా పోయింది. దీంతో పశ్చిమ ప్రాంతం అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి.

రెండో పంటకు అవకాశం లేకనే వలస

మాకు ఒకటిన్నర ఎకరాల భూమి ఉంది. ఖరీఫ్‌లో పత్తి సాగు చేశాం. గత ఏడాది నవంబర్ నెలకే పూర్తయింది. రెండో పంట లేకపోవడంతో ఉపాధి కరువైంది. అరకొరగా కల్పిస్తున్న ఉపాధి పనులకు వెళ్లినా వేతనాలు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి. బతుకుదెరువుకు గుంటూరు ప్రాంతానికి వలస వచ్చాం.

– ఈడిగ శ్రీనివాసులు, కామన్‌దొడ్డి, కోసిగి మండలం

రబీలో భూములు ఖాళీ

మాకు ఐదు ఎకరాల భూమి ఉంది. వర్షాధారం కిందనే వ్యవసాయం. ఖరీఫ్‌లో కంది సాగు చేశాం. అయిదు నెలల పాటు రేయింబవళ్లు కష్టపడితే 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ పంట నవంబర్ నెలకే పూర్తయింది. రబీలో ఈ భూములను ఖాళీగా ఉంచుకున్నాం. పశ్చిమ ప్రాంతం మీదుగా తుంగభద్ర నది ప్రవహిస్తున్నా రెండో పంట వేసుకునే అవకాశం లేకపోతోంది.

– మధుసూదన్‌రెడ్డి, ఆస్పరి

వేదవతి, గుండ్రేవులతోనే అభివృద్ధి

సాగునీటి వసతి లేక పశ్చి మప్రాంతం పూర్తిగా వెనుకబడింది. రెండో పంటకు అవకాశం ఉంటే పశ్చిమ ప్రాంతం నుంచి వలసలు ఉండవు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులు సాకారమైతేనే పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో కదలిక వచ్చింది. డీపీఆర్‌లు సిద్ధమయ్యాయి. అయితే చంద్రబాబు ప్రభుత్వం వీటిని పక్కన పెట్టింది.

– నాగభూషణం రెడ్డి, రైతు, హెబ్బటం, హొళగుంద మండలం

గిరి రైతు గురి

స్ట్రాబెర్రీ

సేకరించిన స్ట్రాబెర్రీ పండ్లు

పండ్లను సేకరిస్తున్న కూలీలు

లంబసింగిలో స్ట్రాబెర్రీ సాగు

ప్రకృతి ఒడిలో కురుస్తున్న దట్టమైన మంచు కేవలం పర్యాటకులకే కాదు, లంబసింగి రైతులకు కూడా కొత్త వెలుగులు తీసుకొచ్చింది. ఈ ఏడాది హిమబిందువుల మధ్య చేపట్టిన స్ట్రాబెర్రీ సాగుకు వాతావరణంఅనుకూలించడంతో మంచి దిగుబడి వచ్చింది. అటు ప్రకృతి అందం, ఇటు ఆర్థిక లాభం జతకలవడంతో ఏజెన్సీ రైతుల ఇంట స్ట్రాబెర్రీ తీపి కనిపిస్తోంది.

- మంచి దిగుబడులు సాధిస్తున్న లంబసింగి రైతులు
- నోరూరించే రుచితోపాటు లాభాలు
- ఎకరాకు రూ.8 లక్షల ఆదాయం
- కాసులు కురిపిస్తున్న పైరు

చింతపల్లి: ఆంధ్రా కశ్మీర్ లంబసింగి ప్రాంతం ఇప్పుడు విదేశీ పంటలకు కేంద్రంగా మారుతోంది. చలి తీవ్రత అధికంగా ఉండే ఈ ప్రాంతంలో గిరిజన రైతులు సంప్రదాయేతర పంట అయిన 'స్ట్రాబెర్రీ' సాగులో అద్భుత విజయాలు సాధిస్తున్నారు. ఉత్తర భారతదేశంలోని హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్, ఊటీ, మహాబలేశ్వర్ వంటి ప్రాంతాలకే పరిమితమైన ఈ పంట, ఇప్పుడు అల్లూరి జిల్లా లంబసింగిలో కూడా విరివిగా పండుతుండటం విశేషం.


అమ్మకానికి సిద్ధం చేసిన స్ట్రాబెర్రీ బాక్సులు

సాగు ప్రస్థానమిలా..

సుమారు 30 ఏళ్ల క్రితం చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇక్కడ స్ట్రాబెర్రీ సాగుపై ప్రయోగాలు చేపట్టారు. వారి సూచనల మేరకు గొందిపాకలు గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు బౌడు కుశలవుడు ప్రయోగాత్మకంగా సాగు మొదలుపెట్టారు. పూణే (మహాబలేశ్వర్) నుంచి కామరోజా అనే రకాన్ని తీసుకువచ్చి, ఎకరాలో 20 వేల మొక్కలతో సాగుకు శ్రీకారం చుట్టారు. ఆయన సాధించిన ఫలితాలను ఆదర్శంగా తీసుకుని నేడు అనేకమంది రైతులు దీనిని అనుసరిస్తున్నారు.

- ప్రస్తుతం లంబసింగి, రాజుపాకలు, గొందిపాకలు, రాజబంద, తాజంగి, లబ్బంగి, సిరిపురం, చెలకవీధి తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో ఈ సాగు విస్తరించింది. ప్రారంభంలో సాగు చేసిన రకాల కంటే, ప్రస్తుతం ఈ ప్రాంత వాతావరణానికి అత్యంత అనుకూలమైన 'వింటర్ డాన్' రకాన్ని రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. రబీ సీజన్‌లో భాగంగా సాగయ్యే ఈ పంట, సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాలుగు నుంచి ఐదు నెలల పాటు దిగుబడి ఇస్తుంది.
- ఎకరా సాగుకు సుమారు 20 వేల మొక్కలు అవసరమవుతాయి. మొక్కల కొనుగోలు, రవాణా, సాగు ఖర్చులు కలిపి ఎకరాకు సుమారు రూ. 3 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఒక్కో మొక్క నుంచి 300 నుంచి 500 గ్రాముల వరకు దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. మైదాన ప్రాంత రైతులు సైతం ఇక్కడికి వచ్చి, గిరిజనుల భూములను కౌలుకు తీసుకుని మరీ సాగు చేపడుతుండటం ఈ పంట లాభదాయకతకు నిదర్శనం.
- లంబసింగి పర్యాటక ప్రాంతం కావడంతో మార్కెటింగ్ సమస్యే లేదు. పండించిన పంటలో 90 శాతం ఇక్కడికి వచ్చే పర్యాటకులకే అమ్ముడుపోతోంది. తాజా స్ట్రాబెర్రీ పండ్లను పర్యాటకులు హాట్ కేకుల్లా కొనుగోలు చేస్తున్నారు. 250 గ్రాములు (సుమారు 15–20 పండ్లు) ఉండే బాక్స్‌ను రూ. 100 నుంచి రూ. 120 వరకు విక్రయిస్తున్నారు.

జామ్ తయారీ

పండ్లే కాకుండా, స్ట్రాబెర్రీ జామ్‌ను కూడా తయారు చేసి 100–200 గ్రాముల బాక్సులను రూ. 150 నుంచి రూ. 200 వరకు విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. ఎకరాకు పెట్టుబడి పోను రూ. 8లక్షల వరకు ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. ఈ ఏడాది వర్షాల వల్ల సాగు కాస్త ఆలస్యమైనప్పటికీ, వాతావరణం అనుకూలించిందని, గత మూడేళ్లతో పోలిస్తే మంచి దిగుబడులు వచ్చాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వింటర్‌డాన్ బాగుంది

ఎకరాలో స్ట్రాబెర్రీ సాగు 2009లో ప్రారంభించా. అప్పుడు ఈ ప్రాంతానికి కొత్త పంట. 20 వేల కామరోజా రకం మొక్కలతో సాగు చేపట్టా. ఈ రకం ఆశించినంతగా దిగుబడి ఇవ్వలేదు. దీంతో వింటర్‌డాన్ రకం తీసుకువచ్చి సాగు చేస్తున్నాం. దిగుబడి చాలా బాగుంది.

– బౌడు కుశలవుడు, అభ్యుదయ రైతు, గొందిపాకలు

లీజుకు తీసుకుని సాగు



లంబసింగిలో గిరిజన రైతుల నుంచి పది ఎకరాలు లీజుకు తీసుకుని సాగు చేపట్టా. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. దిగుబడి బాగుంది. స్ట్రాబెర్రీ పండ్లతో తయారు చేసిన జ్యూస్ గ్లాస్ రూ.100కు అమ్ముతున్నాం. పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

– సత్యనారాయణ, కౌలు రైతు, లంబసింగి

• రికార్డు

ట్రెడ్‌మిల్ పై 188 కి.మీ!!!

పిల్లలూ... చాలా ఇళ్లల్లో ట్రెడ్‌మిల్ ఉంటుంది. బయటకు వాకింగ్‌కు వెళ్లలేని వారు ట్రెడ్‌మిల్ పై నడవడమో, పరిగెత్తడమో చేస్తారు. అదో పావు గంటో, అరగంటో ఉంటుంది. కాని ఇక్కడ చూడండి ఏం జరిగిందో.

బ్రెజిల్‌కు చెందిన అథ్లెట్ పెపె ఫియమోనిసి ట్రెడ్‌మిల్‌పై ఏకధాటిగా 24 గంటలు పరిగెత్తి 188 కిలోమీటర్ల దూరం పూర్తి చేశాడు. అంటే ట్రెడ్‌మిల్ మీద కాకుండా రోడ్డు మీద పరిగెత్తి ఉంటే ఫర్ ఎగ్జాంపుల్ హైదరాబాద్ నుంచి బయలు దేరి కరీంనగర్ వైపు పరిగెత్తితే కరీం నగర్ దాటేసి ఉండేవాడు. విజయవాడ వైపు పరిగెత్తితే ఇంకొంత దూరంలో విజయవాడ వరకూ చేరుకుని ఉండేవాడు.

ఈ రికార్డు చూసి గిన్నెస్‌బుక్ వారు దంగైపోయారు. మరి ఇంత ఎవరైనా పరిగెడతారా ట్రెడ్‌మిల్ మీద? జాగ్రత్త. మీరలా చేయవద్దు. ట్రెడ్‌మిల్ మీద ఎవరంటే వాళ్లు సూచలు లేకుండా పరిగెత్తకూడదు. సరేనా.

• సాహస బాలుడు

సముద్రాన్ని ఈది కుటుంబాన్ని కాపాడాడు...

పిల్లలూ... సమస్యలు ఎదురైనప్పుడు భయపడకూడదు. ఆలోచించాలి. సమస్యను ఎదిరించాలి. లోపల ఉన్న శక్తులను బయటకు లాగాలి. సమస్య నుంచి బయట పడాలి. అంతే తప్ప ఏడుస్తూ కూచోకూడదు. పిరికిగా ఓటమిని అంగీకరించకూడదు.

ఈ కుర్రాడి గురించి తెలుసుకుంటే మీరు ఆ మాటను అంగీకరిస్తారు.

ఈ కుర్రాడి పేరు ఆస్టిన్ యాపిల్‌బీ. వయసు 13 సంవత్సరాలు. ఊరు గిడ్‌గాగనప్. ఇది ఆస్ట్రేలియాలోని పెర్త్ నగరానికి ఆనుకుని ఉన్న పల్లె. మొన్నటి శుక్రవారం (ఫిబ్రవరి 3) ఇతను తన తల్లి, తమ్ముడు, చెల్లెలతో కలిసి పెర్త్‌కు రెండున్నర గంటల దూరంలో ఉన్న 'డన్స్ బొరా' అనే బీచ్ టౌన్‌కు విహారానికి వెళ్లాడు. అక్కడ రిసార్ట్‌లో దిగారు. ఉదయం 10 గంటలకు వీరంతా సముద్రం మీద విహారానికి వెళ్లారు.

ఒక 'కయాక్' (చిన్న పడవ- తెడ్డుతో నడిపేది), రెండు పెడల్ బోర్డ్స్ (నిలుచుని తెడ్డుతో నడిపేది) తీసుకుని కుటుంబం బయలుదేరింది. తల్లి, కూతురు కయాక్‌లో తెడ్డు వేస్తూంటే ఆస్టిన్ ఒక పెడల్ బోర్డ్ మీద, అతని తమ్ముడు 12 ఏళ్ల బియు మరో పెడల్ బోర్డ్ మీద తల్లిని ఫాలో అయ్యారు. అంతా సజావుగానే ఉంది.

కాని లోపలికి కిలోమీటర్ వెళ్లాక అలలు పెరిగాయి. కయాక్, పెడల్ బోర్డులు అల్లకల్లోలం అయ్యి అందరినీ నీళ్లలో పడేశాయి. అందరూ లైఫ్ జాకెట్స్‌తో ఉన్నారు కాబట్టి మునిగిపోలేదు కానీ సముద్రంలో భీకర అలల మధ్య చిక్కుకున్నారు. ఆస్టిన్ తల్లి తన చిన్న కుమారుణ్ణి, కుమార్తెను దగ్గరకు తీసుకుని ఒక పెడల్ బోర్డును గట్టిగా పట్టుకుని నీళ్ల మీద తేలుతూ కాపాడుకుంటూ ఉంటే ఆస్టిన్ మరో పెడల్ బోర్డును పట్టుకుని సముద్రం మీద తేల సాగాడు.

అలలు తీవ్రంగా ఉన్నాయి. సహాయానికి ఎవరు వస్తారు? వీరు సముద్రంలో చిక్కుకున్నట్టు ఒడ్డున ఉన్నవారికి తెలియదు కదా.

ఇంక అంతేనా? సముద్రంలో ఆకలి దప్పులతో మరణించవలసిందేనా?

తల్లి ఆలోచించింది. 'ఆస్టిన్.. ఒడ్డుకు ఈదుకుంటూ వెళ్లగలవా' అని అడిగింది.

'వెళతానమ్మా' ధైర్యంగా అన్నాడు ఆస్టిన్.

ఆస్టిన్ ధైర్యం చేసి నేను ఒడ్డుకు ఈదుకుంటూ వెళతాను అని బయలుదేరాడు. అప్పటికే వాళ్లు సముద్రంలో రెండు కిలోమీటర్ల లోపలికి వెళ్లిపోయారు.

అయినా సరే ఆస్టిన్ నాలుగు గంటల పాటు ఈది ఒడ్డుకు చేరి అక్కడ ఉన్న రిసార్ట్ సిబ్బందికి ప్రమాదం గురించి చెప్పాడు.

దాంతో హుటాహుటిన రెస్క్యూ బృందం వెళ్లి ఆస్టిన్ తల్లిని, చిన్న కొడుకును, కూతురిని కాపాడి తీసుకు వచ్చారు. అప్పటి వరకూ వాళ్లు సముద్రం మధ్యలోనే ఉన్నారు.

ఆస్టిన్ సాహసం ఆస్ట్రేలియాలో గొప్ప సంచలనంగా మారింది. అంత దూరం సముద్రంలో భయపడకుండా ఈదడం సామాన్యమా? కాని కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం ఆస్టిన్ ప్రాణాన్ని ఉగ్గబట్టి ఈదాడు. ధైర్యంగా ఆ పని చేశాడు. కాబట్టి కుటుంబం ప్రాణాలతో మిగిలింది.

కాబట్టి ఎప్పుడూ భయపడవద్దు. ధైర్యంగా ఉండాలి. ధైర్యంగా ప్రవర్తించాలి. ఆస్టిన్‌కు చెబుదామా.... 'యూ ఆర్ గ్రేట్' అనీ.

• మన పుస్తకాలు



చిన్నారుల కోసం మాయాప్రపంచం

చిన్నారులకు మాయలు, మంత్రాలు, అద్భుతాలు అంటే ఇష్టం. అటువంటి వారి కోసం రాసిన పుస్తకం ఇది. ప్రపంచవ్యాప్తంగా అనేక మంది చిన్నారుల్ని అలరిస్తున్న పుస్తకం. కార్డాన్ అనే వ్యక్తి వల్ల శక్తులు కోల్పోయి నిరాశలో కూరుకుపోయిన జూడ్ అనే రాణి సహాయం కోరుతూ ఆమె కవల సోదరి టారిన్ వస్తుంది. ఆ సమయంలో జూడ్ తిరిగి ఈ భూమ్మీదకు వచ్చే అవకాశాన్ని పొందుతుంది. ఇక్కడకు వచ్చాక కార్డాన్‌ను ఆమె ఎదుర్కొందా? అందుకు ఆమె చేసిన సాహసాలేమిటి అనేది ఆసక్తిగా సాగే కథ.



చిన్నారుల్లో విలువల్ని పెంచే కథలు

మయూఖ ద్వైమాసిక అంతర్జాల ప్రతికలో వచ్చిన చిన్నారుల కథల్ని సంకలనం చేసి పుస్తకంగా బాలలకు అందించారు సంపాదకురాలు కొండపల్లి నీహారిణి. ఇందులోని ప్రతి కథ బాలల్లో ఉత్తేజాన్ని పెంచి, వారికి నీతిని బోధిస్తుంది. ఇందులోని అన్ని కథలూ బాలలకు నచ్చుతాయి. సమాజంలో వారి మీద చెడు ప్రభావం చూపించే విషయాలను నిరోధించి, వారి భవితకు బంగారుబాటలు వేసే విషయాలను చేరువ చేసేందుకు ఈ కథలు ఎంతో తోడ్పడతాయి.

• మహనీయులు

ఆంధ్ర పితామహుడు... మాడపాటి హనుమంతరావు

తెలుగు నేల మీద ఎంతోమంది మహనీయులు పుట్టి ప్రజలకు సేవలందించారు. అటువంటి వారిలో ఒకరు మాడపాటి హనుమంతరావు. 20వ శతాబ్ది తొలిదశకంలో ఆనాటి హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో ఆంధ్రోద్యమం వ్యాప్తి చేసేందుకు కృషి చేశారు. ఆయన చేసిన కృషికి గాను 'ఆంధ్ర పితామహుడు' అన్న పేరును పొందారు. ఆయన బహుభాషావేత్త.

హనుమంతరావు 1885 జనవరి 22న కృష్ణా జిల్లా నందిగామ తాలూకా పొక్కునూరులో జన్మించారు. వారి తల్లిదండ్రులు వెంకటప్పయ్య, వెంకట సుబ్బమ్మ. తెలుగువారి సాంస్కృతిక, సాంఘిక, రాజకీయ జీవనాన్ని ప్రభావితం చేసిన హనుమంతరావు తెలంగాణ ప్రాంతంలో నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి ఆంధ్ర మహాసభను నెలకొల్పారు. నిజాం ప్రభుత్వ విధానాల కారణంగా తెలంగాణలో తెలుగుభాష దెబ్బ తింటున్నప్పుడు తెలుగుభాష, సంస్కృతి వికాసానికి కృషి చేశారు. మాడపాటి చక్కటి కవి, రచయిత. రైతాంగ జీవితంపై 1912లో 'ఎవరికి?' అనే కథానిక రాశారు. పదమూడు కథలతో 'మల్లికాగుచ్ఛం' పేరుతో 1911లో పుస్తకం వచ్చింది. మాడపాటికి రచయితగా శాశ్వత కీర్తిని అందించిన గ్రంథం 'తెలంగాణ ఆంధ్రోద్యమం'...

హనుమంతరావు గ్రంథాలయోద్యమంలోనూ విశేష కృషి చేశారు. తనకు సన్మానం ద్వారా లభించిన సొమ్మును గ్రంథాలయాల అభివృద్ధికే అందజేశారు. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం, హనుమకొండలోని రాజరాజనరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం ఆయన అభివృద్ధి చేసినవే. హైదరాబాదులోని నారాయణగూడలో బాలికల పాఠశాల స్థాపించారు. ఇది దేశంలో ప్రప్రథమ బాలికోన్నత పాఠశాలల్లో ఒకటి. బాలికల కోసం ఆయన ఎన్నో పాఠశాలలను నెలకొల్పారు. హైదరాబాద్ నగరానికి తొలి మేయరుగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలికి తొలి అధ్యక్షునిగానూ వ్యవహరించారు. 1970 నవంబరు 11న తన 85వ ఏట మాడపాటి కన్నుమూశారు.

• తెలుసుకుందాం

చీపురు... శుభ్రతకు పెద్ద దిక్కు

మన ఇల్లు శుభ్రంగా ఉన్నా, బయట రోడ్లు శుభ్రంగా ఉండాలన్నా కావాల్సిన వస్తువు ఏమిటో తెలుసా? చీపురు. 'ఇల్లంతా తిరుగుతుంది. మూలన కూర్చుంటుంది' అనే పొడుపు కథ చీపురు ద్వారానే వచ్చింది. చీపురుకు మన నిత్యజీవితంలో చాలా ప్రాధాన్యం ఉంది. మరి ఈ చీపురు గురించి కొన్ని విశేషాలు తెలుసుకుందామా?

చీపురు ద్వారా పరిసరాల్ని శుభ్రం చేసుకోవడమనేది ఎప్పుడు మొదలైందో తెలియకపోయినా వేల ఏళ్ల నుంచే ఇటువంటి విధానాలు పాటించేవారని చరిత్రకారులు అంటున్నారు. పూర్వకాలంలో మొక్కల కొమ్మలు, గడ్డిని ఒక కర్రకు కట్టి శుభ్రం చేయడానికి ఉపయోగించేవారు. అయితే ఇవి గుండ్రటి ఆకారంలో ఉండటంతో మురికిని ఒకచోట చేర్చడానికి కష్టమయ్యేది. ఆ రోజుల్లో ఇళ్ల నిర్మాణం కూడా వేరేలా ఉండటంతో శుభ్రత విషయంలో అధిక జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చేది. ఎక్కువగా కొబ్బరి మండల్ని చీపురుగా వాడేవారు. 1797లో అమెరికాలోని మసాచుసెట్స్‌కు చెందిన రైతు లెవి డికిన్సన్ తన భార్య కోసం బ్రూమ్ కార్న్ మొక్కల నుండి చీపురు తయారు చేశారు. ఇది మురికిని బాగా పట్టుకోవడంతో ప్రాచుర్యం పొందింది. ఆధునికకాలంలో వాడే చీపుళ్లకు ఇదే మొదలని అంటారు. 1800ల ప్రారంభంలో చీపురును మరింత సౌకర్యవంతంగా చేశారు. 19వ శతాబ్దం మధ్య నాటికి అమెరికాలో చీపురు తయారీ కర్మాగారాలు మొదలయ్యాయి. మనదేశంలో చీపురును లక్ష్మీదేవికి చిహ్నంగా భావిస్తారు. అందుకే చీపురును కాలితో తన్నడం, విరగ్గొట్టడం చెడుగా భావిస్తారు. చీపురు ఉన్న చోట శుభ్రత ఉంటుందని, అందుకే శుభ్రతకు చీపురే పెద్ద దిక్కు అంటుంటారు. ప్రస్తుతం మార్కెట్లో రకరకాల ఆకృతుల్లో చీపుళ్లు అందుబాటులో ఉన్నాయి.

• కథ

కీలెరిగి వాత

అనగనగా ఓ ఊళ్లో విక్రముడు అనే యువకుడు చెడు సావాసాలకు అలవాటు పడ్డాడు. రోజూ ఉదయం ఇంటి నుంచి ధనం తీసుకునివెళ్లి జూదం ఆడుతూ గడిపేవాడు. అతణ్ని మార్చాలని తల్లిదండ్రులు ప్రయత్నించినా వారి వల్ల కాలేదు. పెళ్లి చేస్తే మారతాడని భావించారు. కమల అనే అమ్మాయితో అతనికి పెళ్లి చేశారు.

పెళ్లయిన కొన్ని రోజుల వరకూ విక్రముడు బుద్ధిగా ఉన్నాడు. తర్వాత మళ్లీ జూదానికి అలవాటుపడ్డాడు. కమల తెలివైన అమ్మాయి. భర్త అలవాట్లు, అతను చేస్తున్న దుబారా గురించి ఆలోచించింది. కీలెరిగి వాత పెట్టాలని భావించింది.





ఒక రోజు విక్రముడు పొద్దున్నే ఇంటి నుంచి బయలుదేరుతుండగా కమల 'ఇవాళ మీకు ఇష్టమైన వంకాయ కూర చేస్తాను. వచ్చేటప్పుడు తాజా వంకాయలు తీసుకుని రండి. మర్చిపోకండి' అని చెప్పింది. సరే అని విక్రముడు అని బయలుదేరాడు. సాయంత్రం వరకూ జూదం ఆడిన విక్రముడికి కమల చెప్పిన విషయం గుర్తొచ్చింది. వెంటనే హడావిడిగా సంతకు బయలుదేరాడు. సంత దాకా వెళ్లిన అతనికి జూదంలో తాను మొత్తం డబ్బులు పోగొట్టుకున్న విషయం గుర్తొచ్చింది.

సంతలో కూరగాయలు అమ్మేవాడి వద్దకు వెళ్లి తన దగ్గర డబ్బులు లేవని, ఇప్పుడు వంకాయలు ఇస్తే రేపు సొమ్ము తీసుకొచ్చి ఇస్తానని అన్నాడు. అతణ్ని ఎగాదిగా చూసి 'ముక్కూ మొహం తెలియని నీలాంటి వాడికి ఊరికే వంకాయలు ఇవ్వాలా? వేరే ఎవరినైనా చూసుకో' అని ఈసడించుకున్నాడు.

ఆ మాట విక్రముడికి అవమానంగా తోచింది. దూరంగా షావుకారు కనిపించాడు. అతను తన తండ్రికి స్నేహితుడు. ఆయన్ని అడిగితే డబ్బు ఇస్తాడని అనిపించింది. వెంటనే వెళ్లి ఆయన్ని కలిసి తనకు కొంత డబ్బు కావాలని అడిగాడు.

విక్రముడి అలవాట్లు, అతను చేసే దుబారా గురించి తెలిసిన షావుకారు 'తప్పకుండా ఇస్తాను విక్రమా! కానీ అప్పు పత్రం రాస్తాను. దాని మీద సంతకం కావాలి. నీది కాదు... నీ తండ్రిది. సరేనా?' అని అడిగాడు.

ఆ మాటతో విక్రముడి మనసు వికలమైంది.

వంకాయలు కొనేందుకు డబ్బు కావాలన్నా తనకు పరపతి లేదా అని బాధ కలిగింది.

అతని బాధ గమనించిన షావుకారు 'చూడు విక్రమా! నువ్వు యువకుడివి. వివాహమైనవాడివి. కొన్నాళ్లకు నీకు బిడ్డలు పుడతారు. వారికేదన్నా కొనాలన్నా నీకు ఇదే పరిస్థితి వస్తుంది. అందుకే ఇప్పటికైనా నీ చెడు అలవాట్లు మాని బుద్ధిగా ఏదైనా పని చేసుకొని భార్యని సంతోషంగా ఉంచు' అని చెప్పాడు.

ఆ మాటతో విక్రముడి మనసు మారింది. ఇన్నాళ్లూ తాను చేసిన తప్పు తెలిసింది. వెంటనే హుటాహుటిన ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల కాళ్ల మీద పడ్డాడు. తాను చేసిన తప్పుల్ని క్షమించని కోరాడు. తనలో మార్పుకు కారణమైన భార్య మీద ప్రమాణం చేసి ఇకపై చెడు అలవాట్లు మానుకుంటానని అన్నాడు. ఆ మాటతో అందరూ సంతోషించారు. తాను అనుకున్నది జరిగినందుకు కమల తృప్తి పడింది.

• భలే భలే

బోర్ కొడితే ఎన్ని లాభాలో!

పిల్లలూ! రోజంతా ఏదో ఒక సందర్భంలో మీకు బోర్ కొడుతున్నట్లు అనిపిస్తోందా? ఏం చేయాలో తోచడం లేదా? చాలామంది బోర్ కొట్టడమంటే అదేదో సమస్యలా భావిస్తుంటారు. కానీ బోర్ కొట్టడమంటే మనలో మార్పు మొదలైనట్లు అర్థం చేసుకోవాలని నిపుణులు అంటున్నారు. బోర్ కొట్టడం వల్ల అనేక లాభాలున్నాయని అంటున్నారు. అవేంటో చూసేద్దామా?

కొత్త ఆలోచనలు: ఇల్లు, స్కూల్, ఆటలు... వీటి మధ్యే మీ రోజు గడిచిపోతుంది. అయినా కూడా మీకు బోర్ కొడుతున్నట్లు అనిపిస్తోందంటే మీలో కొత్త ఆలోచనలు మొదలయ్యాయని అర్థం. ఏదో కొత్తగా చేయాలని అనిపిస్తుందనడానికి సంకేతం. కాబట్టి బోర్ కొడుతోందని చింతించకండి. కొత్త ఆలోచనలు చేయండి. సృజనాత్మక విషయాలపై దృష్టి పెట్టండి. మీలో ప్రశ్నలకు పదును పెట్టండి. సమాధానాలు తెలుసుకునేందుకు ప్రయత్నించండి.

కొత్త విషయాలు నేర్చుకుందామా: బోర్ కొట్టిన తర్వాత అందరూ చేసే పని ఆడుకోవడం, టీవీ చూడటం, నిద్రపోవడం. కానీ మీరు కొత్తగా ఆలోచించండి. కొత్త విషయాలు కనుక్కోండి. మరిన్ని విభిన్న విషయాల వైపు మీ చూపు తిప్పండి. అది గిటార్ నేర్చుకోవడం కావొచ్చు. బొమ్మలు గీయడం కావొచ్చు. కవితలు రాయడం కావొచ్చు. ఏదైనా సరే కొత్త విషయాలను ఆహ్వానించండి.

సమయంపై దృష్టి: మనకు బోర్ కొడుతోందంటే మనం మన సమయాన్ని సరిగ్గా వాడుకోవడం లేదని అర్థం. అలాంటప్పుడు రోజువారీగా మనం చేసే పనులపై మనకు దృష్టి అవసరం. ఏయే పనులు ఎంతసేపు చేస్తున్నాం, దానికి అవసరమైన సమయం ఎంత, వృథాగా పోతున్న సమయం ఎంత అని ఆలోచించండి. దీనివల్ల ఎక్కడ వృథా జరుగుతుందో తెలుస్తుంది. ఎక్కడ మరింత సమయం పెట్టాలో అర్థమవుతుంది.

ప్రపంచాన్ని చూసేద్దామా?: బోర్ కొట్టే సమయంలో మీరు ప్రపంచానికి దగ్గరయ్యే ప్రయత్నం చేయండి. తద్వారా మీ చుట్టూ ఉన్న అనేక విషయాలు అర్థమవుతాయి. స్కూల్లో టీచర్లు చెప్పే పాఠాల కన్నా విలువైన పాఠాలు ప్రపంచం నేర్పుతుంది. అమ్మనో, అన్నయ్యనో తోడు తీసుకుని మార్కెట్, జనరల్ స్టోర్స్, పార్క్ వంటి ప్రదేశాల్లో తిరుగుతూ అక్కడి మనుషులు, వారు చేసే పనులు గమనించండి. దీని వల్ల మీ చుట్టూ ఉన్న ప్రపంచంలో కార్మికులు, కష్టజీవుల గురించి మీకు అవగాహన వస్తుంది.

ఫోన్ గేమ్స్ వద్దు: బోర్ కొడుతోందనగానే చాలా మంది ఫోన్ ఓపెన్ చేసి గేమ్స్ ఆడుకుంటూ కాలం గడిపేస్తారు. ఆ సమయాన్ని పుస్తకం చదవడానికి, సంగీతం వినడానికి, ఇంట్లో చిన్న చిన్న పనులు చేయడానికి పెడితే ఎంతో లాభం వస్తుంది. అమ్మానాన్నలకు సాయపడితే మంచి పిల్లాడన్న పేరు కూడా దక్కుతుంది. అందరూ మిమ్మల్ని హీరోలా చూస్తారు.

చూశారా! బోర్ కొట్టడం వల్ల ఎన్ని లాభాలున్నాయో! ఈసారి మీకు బోర్ కొడితే ఇవన్నీ గుర్తుచేసుకొని కొత్తగా ఆలోచించి మీకు నచ్చిన పనులు చేసేయండి.

టి20 ప్రపంచకప్ షెడ్యూల్

తేదీ	ఎవరి మధ్య	వేదిక	సమయం
ఫిబ్రవరి 7	నెదర్లాండ్స్ x పాకిస్తాన్	కొలంబో	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 7	వెస్టిండీస్ x స్కాట్లాండ్	కోల్‌కతా	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 7	భారత్ x అమెరికా	ముంబై	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 8	న్యూజిలాండ్ x అఫ్గానిస్తాన్	చెన్నై	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 8	ఇంగ్లండ్ x నేపాల్	ముంబై	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 8	శ్రీలంక x ఐర్లాండ్	కొలంబో	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 9	స్కాట్లాండ్ x ఇటలీ	కోల్‌కతా	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 9	జింబాబ్వే x ఒమన్	కొలంబో	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 9	దక్షిణాఫ్రికా x కెనడా	అహ్మదాబాద్	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 10	నెదర్లాండ్స్ x నమీబియా	న్యూఢిల్లీ	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 10	న్యూజిలాండ్ x యూఏఈ	చెన్నై	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 10	పాకిస్తాన్ x అమెరికా	కొలంబో	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 11	దక్షిణాఫ్రికా x అఫ్గానిస్తాన్	అహ్మదాబాద్	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 11	ఆస్ట్రేలియా x ఐర్లాండ్	కొలంబో	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 11	ఇంగ్లండ్ x వెస్టిండీస్	ముంబై	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 12	శ్రీలంక x ఒమన్	పల్లెకెలె	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 12	నేపాల్ x ఇటలీ	ముంబై	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 12	భారత్ x నమీబియా	న్యూఢిల్లీ	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 13	ఆస్ట్రేలియా x జింబాబ్వే	కొలంబో	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 13	కెనడా x యూఏఈ	న్యూఢిల్లీ	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 13	నెదర్లాండ్స్ x అమెరికా	చెన్నై	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 14	ఐర్లాండ్ x ఒమన్	కొలంబో	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 14	ఇంగ్లండ్ x స్కాట్లాండ్	కోల్‌కతా	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 14	దక్షిణాఫ్రికా x న్యూజిలాండ్	అహ్మదాబాద్	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 15	వెస్టిండీస్ x నేపాల్	ముంబై	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 15	అమెరికా x నేపాల్	చెన్నై	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 15	భారత్ x పాకిస్తాన్	కొలంబో	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 16	అఫ్గానిస్తాన్ x యూఏఈ	న్యూఢిల్లీ	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 16	ఇంగ్లండ్ x ఇటలీ	కోల్‌కతా	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 16	ఆస్ట్రేలియా x శ్రీలంక	కొలంబో	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 17	న్యూజిలాండ్ x కెనడా	చెన్నై	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 17	ఐర్లాండ్ x జింబాబ్వే	పల్లెకెలె	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 17	నేపాల్ x స్కాట్లాండ్	ముంబై	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 18	దక్షిణాఫ్రికా x యూఏఈ	న్యూఢిల్లీ	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 18	పాకిస్తాన్ x నమీబియా	కొలంబో	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 18	భారత్ x నెదర్లాండ్స్	అహ్మదాబాద్	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 19	వెస్టిండీస్ x ఇటలీ	కోల్‌కతా	ఉ.గం. 11 నుంచి
ఫిబ్రవరి 19	శ్రీలంక x జింబాబ్వే	కొలంబో	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 19	అఫ్గానిస్తాన్ x కెనడా	చెన్నై	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 20	ఆస్ట్రేలియా x ఒమన్	పల్లెకెలె	రాత్రి గం. 7 నుంచి
సూపర్-8 షెడ్యూల్			
ఫిబ్రవరి 21	వై2 x వై3	కొలంబో	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 22	వై1 x వై4	పల్లెకెలె	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 22	ఎక్స్1 x ఎక్స్4	అహ్మదాబాద్	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 23	ఎక్స్2 x ఎక్స్3	ముంబై	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 24	వై1 x వై3	పల్లెకెలె	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 25	వై2 x వై4	కొలంబో	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 26	ఎక్స్3 x ఎక్స్4	అహ్మదాబాద్	మ.గం. 3 నుంచి
ఫిబ్రవరి 26	ఎక్స్1 x ఎక్స్2	చెన్నై	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 27	వై1 x వై2	కొలంబో	రాత్రి గం. 7 నుంచి
ఫిబ్రవరి 28	వై3 x వై4	పల్లెకెలె	రాత్రి గం. 7 నుంచి
మార్చి 1	ఎక్స్2 x ఎక్స్4	న్యూఢిల్లీ	మ.గం 3 నుంచి
మార్చి 1	ఎక్స్1 x ఎక్స్3	కోల్‌కతా	రాత్రి గం. 7 నుంచి
మార్చి 4	తొలి సెమీఫైనల్	కోల్‌కతా/కొలంబో	రాత్రి గం. 7 నుంచి
మార్చి 5	రెండో సెమీఫైనల్	ముంబై	రాత్రి గం. 7 నుంచి
మార్చి 8	ఫైనల్	అహ్మదాబాద్/కొలంబో	రాత్రి గం. 7 నుంచి

సూపర్-8 గ్రూప్, సీడింగ్స్ వివరాలు

గ్రూప్-1: భారత్ (ఎక్స్1), ఆస్ట్రేలియా (ఎక్స్2), వెస్టిండీస్ (ఎక్స్3), దక్షిణాఫ్రికా (ఎక్స్4).
గ్రూప్-2: ఇంగ్లండ్ (వై1), న్యూజిలాండ్ (వై2), పాకిస్తాన్ (వై3), శ్రీలంక (వై4).
నోట్: సీడింగ్ పొందిన జట్లు కాకుండా ఇతర జట్లు 'సూపర్–8' అర్హత సాధిస్తే సీడింగ్ ఇచ్చిన జట్టు స్థానంలో వస్తాయి. ఉదాహరణకు గ్రూప్ 'సి'లో ఉన్న వెస్టిండీస్‌కు ఎక్స్3 ఇవ్వగా... వెస్టిండీస్ బదులు వేరే జట్టు అర్హత సాధిస్తే ఆ జట్టు ఎక్స్3 జట్టుగా 'సూపర్–8'లో ఆడుతుంది. పాకిస్తాన్ సెమీ ఫైనల్, ఫైనల్ చేరితే మ్యాచ్‌లను కొలంబోలో నిర్వహిస్తారు.

మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

రాణించిన రికీ భుయ్

ఆంధ్ర 264/6
బెంగాల్‌తో రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్

కళ్యాణి (బెంగాల్): బెంగాల్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్ర కెప్టెన్ రికీ భుయ్ (83; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీతో జట్టును ఆదుకున్నాడు. రంజీ ట్రోఫీలో భాగంగా శుక్రవారం మొదలైన ఈ పోరులో టాస్ నెగ్గిన బెంగాల్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో ముందుగా బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర జట్టు తొలిరోజు ఆట నిలిచే సమయానికి 80 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. ఓపెనర్లు అభిషేక్ రెడ్డి (18; 2 ఫోర్లు), శ్రీకర్ భరత్ (47; 9 ఫోర్లు) మంచి ఆరంభమే ఇచ్చారు. తొలి వికెట్‌కు 58 పరుగులు జతయ్యాక అభిషేక్ అవుటయ్యాడు. కాసేపటికి అర్ధసెంచరీ దిశగా పరుగులు చక్కబెడుతున్న శ్రీకర్ భరత్‌ను ముకేశ్ అవుట్ చేయడంతో 89 పరుగుల వద్ద ఆంధ్ర రెండో వికెట్‌ను కోల్పోయింది. టాపార్డర్ బ్యాటర్ షేక్ రషీద్ (46; 9 ఫోర్లు), కెప్టెన్ రికీ భుయ్ కుదురుగా ఆడి జట్టు స్కోరును వంద పరుగులు దాటించారు. అయితే ఈ భాగస్వామ్యం బలపడకముందే 129 స్కోరు వద్ద రషీద్ నిష్క్రమించాడు. స్వల్వవ్యవధిలో జ్ఞానేశ్వర్ (7) కూడా వికెట్ పారేసుకోవడంతో 147 వద్ద నాలుగో వికెట్ కోల్పోయింది. ఈ దశలో రికీ భుయ్, నితీశ్ కుమార్ రెడ్డి (33; 3 ఫోర్లు) వికెట్‌ను కాపాడుకుంటూ జట్టు స్కోరు పెంచారు. దీంతో టీ విరామానికి మరో వికెట్ పడకుండా 190/4 స్కోరు చేసింది. ఆఖరి సెషన్‌లో ఆంధ్ర స్కోరు 200 దాటింది. కాసేపటికే 124 బంతుల్లో రికీ భుయ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఇద్దరు క్రీజులో పాతుకుపోవడంతో పరుగులు సులువుగానే వచ్చాయి. ఆట ముగిసే దశలో వరుస ఓవర్లలో వీళ్లిద్దరు అవుటవడం ఆంధ్ర జట్టుకు ఇబ్బందికరంగా మారింది. 255 స్కోరు వద్ద రికీని ఆకాశ్‌దీప్ పెవిలియన్ చేర్చడంతో ఐదో వికెట్‌కు 108 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరుసటి ఓవర్లో నితీశ్‌ను ముకేశ్ అవుట్ చేశాడు. ఆట నిలిచే సమయానికి త్రిపురాణ విజయ్ (1 బ్యాటింగ్), శశికాంత్ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

స్కోరు వివరాలు

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: అభిషేక్ (సి) హబీబ్ (బి) ఆకాశ్‌దీప్ 18; శ్రీకర్ (సి) షమీ (బి) ముకేశ్ 47; రషీద్ (సి) ఛటర్జీ (బి) ముకేశ్ 46; రికీ భుయ్ (సి) షహబాజ్ (బి) ఆకాశ్‌దీప్ 83; జ్ఞానేశ్వర్ (సి) షహబాజ్ (బి) షమీ 7; నితీశ్ (సి) ఆకాశ్‌దీప్ (బి) ముకేశ్ 33; విజయ్ (బ్యాటింగ్) 1; శశికాంత్ (బ్యాటింగ్) 7; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (80 ఓవర్లలో 6 వికెట్లకు) 264. బౌలింగ్:** మొహమ్మద్ షమీ 17-4-38-1, ముకేశ్ కుమార్ 18-5-50-3, సూరజ్ 14-3-53-0, ఆకాశ్‌దీప్ 17-3-64-2, షహబాజ్ అహ్మద్ 14-1-45-0.

ముంబై 120 ఆలౌట్

ముంబై: కర్ణాటకతో జరుగుతున్న రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో ముంబై జట్టు తమ సొంతగడ్డపైనే కుదేలైంది. తొలిరోజు ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 48.1 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. యశస్వి జైస్వాల్ (5), శార్దుల్ ఠాకూర్ (16)లాంటి టీమిండియా ప్లేయర్లు అందుబాటులో ఉన్న ముంబై మొదటి రోజే కర్ణాటక బౌలింగ్‌కు బెంబేలెత్తింది. ఓపెనర్ అఖిల్ హేర్వాడ్కర్ (60; 9 ఫోర్లు) ఒంటరి పోరాటం చేయడంతో జట్టు స్కోరు వంద దాటింది. లేదంటే ఇంకా తక్కువ స్కోరుకే ముంబై ఇన్నింగ్స్ ముగిసేది. ఎందుకంటే అఖిల్ మినహా ఇంకెవరూ కూడా 20 పరుగులైనా చేయలేదు. సిద్దేశ్ లాడ్ (12), సూర్యాన్ష్ (10) రెండంకెల స్కోరు చేశారంతే! విద్వత్ కావేరప్ప, ప్రసిధ్ కృష్ణ, శ్రేయస్ గోపాల్ తలా 3 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆడిన కర్ణాటక 2 వికెట్లకు 110 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (28) విఫలమవగా, మయాంక్ అగర్వాల్ (54 బ్యాటింగ్; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో అజేయంగా నిలిచాడు.

జార్ఖండ్ 235 ఆలౌట్

జంషెడ్‌పూర్: ఉత్తరాఖండ్‌తో జరుగుతున్న రంజీ క్వార్టర్స్‌లో మొదట బ్యాటింగ్ చేసిన జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 235 పరుగులకు ఆలౌటైంది. ఆదిత్య సింగ్ (83; 10 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ విరాట్ సింగ్ (47; 5 ఫోర్లు) రాణించారు. ఉత్తరాఖండ్ బౌలర్లలో జనమేజయ్ 4, ఆదిత్య రావత్, మయాంక్ చెరో 3 వికెట్లు తీశారు. తర్వాత తొలి ఇన్నింగ్‌లో ఉత్తరాఖండ్ వికెట్ కోల్పోకుండా 4 పరుగులు చేసింది. అవనీశ్ (4 బ్యాటింగ్), భూపెన్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

జమ్మూ కశ్మీర్ 194 ఆలౌట్

ఇండోర్: మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్లో తొలిరోజే జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 194 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ శుభమ్ (60; 6 ఫోర్లు), టెయిలెండర్ యుధ్‌వీర్ (41; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. మధ్యప్రదేశ్ బౌలర్లలో పేస్ బౌలర్ కుల్దీప్ సేన్ 5 వికెట్లు తీయగా, కార్తికేయకు 3 వికెట్లు దక్కాయి. అనంతరం మధ్యప్రదేశ్ 10 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 28 పరుగులు చేసింది. హర్ష్ (8 బ్యాటింగ్; 1 ఫోర్), యశ్ దూబే (14 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.

రుద్రాంక్ష్ గురి బంగారం అర్జున్‌కు రజతం

అర్జున్ రుద్రాంక్ష్

న్యూఢిల్లీ: ఆసియా సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల వేట కొనసాగుతోంది. శుక్రవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణం, రజతం... టీమ్ విభాగంలో బంగారు పతకం లభించాయి. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో రుద్రాంక్ష్ పాటిల్ 251.9 పాయింట్లు స్కోరు చేసి పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన అర్జున్ బబూతా 250.7 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలిచాడు. రుద్రాంక్ష్, అర్జున్, విశాల్ సింగ్‌లతో కూడిన భారత బృందం 1884.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. జూనియర్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో భారత షూటర్లు క్లీన్‌స్వీప్ చేశారు. హిమాన్షు (250 పాయింట్లు) స్వర్ణం నెగ్గగా... అన్ష్ దబాస్ (247.9 పాయింట్లు) రజతం... సురేశ్ ప్రణవ్ (226.8 పాయింట్లు) కాంస్యం గెలిచారు. హిమాన్షు, అన్ష్, సురేశ్ ప్రణవ్‌లతో కూడిన భారత జట్టు 1887.8 పాయింట్లతో పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

తొలి రోజు ఎవరిదో?

నేటి నుంచి నెదర్లాండ్స్‌తో భారత్ డేవిస్‌కప్ పోరు

బెంగళూరు: సొంతగడ్డపై భారత పురుషుల టెన్నిస్ జట్టు పరీక్షకు సిద్ధమైంది. డేవిస్‌కప్ పురుషుల ప్రపంచటీమ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భాగంగా వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్‌లో నెదర్లాండ్స్ జట్టుతో భారత్ తలపడనుంది. రెండు రోజులపాటు జరిగే ఈ పోరులో ఐదు మ్యాచ్‌లు జరుగుతాయి. తొలి రోజు రెండు సింగిల్స్‌ను నిర్వహిస్తారు. తొలి మ్యాచ్‌లో గయ్ డెన్ ఉడెన్‌తో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్... రెండో మ్యాచ్‌లో జెస్పెర్ డి జాంగ్‌తో దక్షిణేశ్వర్ సురేశ్ తలపడతారు. ఆదివారం మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. డబుల్స్ మ్యాచ్‌లో సాండ్రీ అరెండ్స్–డేవిడ్ పెల్ జోడీతో యూకీ బాంబ్రీ–శ్రీరామ్ బాలాజీ జంట పోటీపడుతుంది. అనంతరం రెండు రివర్స్ సింగిల్స్‌లో జెస్పెర్ డి జాంగ్‌తో సుమిత్ నగాల్... గయ్ డెన్ ఉడెన్‌తో దక్షిణేశ్వర్ సురేశ్ ఆడతారు.

హాజల్‌వుడ్ రూపంలో ఆసీస్‌కు మరోదెబ్బ

మెల్‌బోర్న్: నేడు భారత్, శ్రీలంక వేదికల్లో ఐసీసీ టి20 ప్రపంచకప్ మొదలవుతుండగా ఆస్ట్రేలియాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. మేటి పేస్‌బౌలర్ హాజల్‌వుడ్ తొడకండరాల గాయం కారణంగా మెగా ఈవెంట్‌కు దూరమయ్యాడు. ఇదివరకే సీనియర్ సీమర్ ప్యాట్ కమిన్స్ వెన్నుగాయంతో మొత్తం మెగా ఈవెంట్‌కే దూరమైన సంగతి తెలిసిందే. ఇతని స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌ను తీసుకున్నారు. అయితే హాజల్‌వుడ్ గాయంతో సతమతమవుతున్నప్పటికీ అతని స్థానాన్ని ఇంకా భర్తీ చేయడం లేదు. సీనియర్ పేసర్లు స్టార్క్ (రిటైర్మెంట్), కమిన్స్ లేని ఆసీస్ జట్టుకు హాజల్‌వుడ్‌లాంటి సీనియర్ సీమర్ అవసరం ఎంతగానో ఉంది. అందుకనే లీగ్ దశ తర్వాతైన అతను కోలుకుంటాడని ఆస్ట్రేలియా భావిస్తోంది. అందుకే అతని స్థానంలో ఉన్నపళంగా వెరొకరిని తీసుకోలేదు.

హర్షిత్ అవుట్... సిరాజ్‌కు పిలుపు

ప్రపంచకప్ టి20 భారత జట్టులో ఒక మార్పు

ముంబై: భారత కొత్త స్పీడ్‌స్టర్ హర్షిత్ రాణా టి20 ప్రపంచకప్ టోర్నీకి దూరమయ్యాడు. మోకాలు గాయం కారణంగా అతను ఈ మెగా ఈవెంట్‌లో బరిలోకి దిగడం లేదు. దీంతో అతని స్థానాన్ని హైదరాబాదీ స్పీడ్‌స్టర్ మొహమ్మద్ సిరాజ్‌తో భర్తీ చేశారు. దక్షిణాఫ్రికాతో వార్మప్ మ్యాచ్ సందర్భంగా గాయపడిన రాణా ఇబ్బంది పడుతున్నాడని కెప్టెన్ సూర్యకుమార్ చెప్పాడు. హర్షిత్ లేకపోయినా తుది 11 మంది జట్టుకు ఢోకా లేదని అతను చెప్పాడు. ఒకట్రెండు మ్యాచ్‌ల తర్వాత కూడా హర్షిత్ కోలుకునే అవకాశం లేకపోవడంతో యువ పేసర్ స్థానంలో అనుభవజ్ఞుడైన సిరాజ్‌ను తీసుకున్నారు. అంతర్జాతీయ కెరీర్‌లో అతను 45 టెస్టులు, 50 వన్డేలు, 16 టి20లు ఆడాడు. జట్టులో తాజా మార్పుపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ధ్రువీకరించింది. మరోవైపు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కండరాల గాయంతో సతమతమవుతున్నాడు. అయితే ఇదేమంత తీవ్రమైంది కాదని జట్టు వర్గాలు భావిస్తున్నాయి.

క్వార్టర్ ఫైనల్లో కథ ముగిసె!

చైనా, కొరియా చేతిలో ఓడిన భారత బ్యాడ్మింటన్ జట్లు

కింగ్డావ్ (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్ నుంచి భారత పురుషుల, మహిళల జట్లు రిక్తహస్తాలతో వెనుదిరిగాయి. కనీసం కాంస్య పతకం ఖరారు కావాలంటే దాటాల్సిన క్వార్టర్ ఫైనల్ అడ్డంకిని అధిగమించడంలో భారత జట్లు విఫలమయ్యాయి. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత మహిళల జట్టు 0–3తో చైనా జట్టు చేతిలో... భారత పురుషుల జట్టు 1–3తో దక్షిణ కొరియా జట్టు చేతిలో ఓడిపోయాయి. 2024లో తొలిసారి ఆసియా చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన భారత మహిళల జట్టు ఈసారి మాత్రం పీవీ సింధు గైర్హాజరీలో నిరాశాజనక ప్రదర్శన చేసింది. చైనాతో జరిగిన పోరులో తొలి మ్యాచ్‌లో ప్రపంచ 42వ ర్యాంకర్ తన్వీ శర్మ 9–21, 9–21తో ప్రపంచ పదో ర్యాంకర్ గావో ఫాంగ్ జియె చేతిలో ఓడిపోయింది. రెండో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి–ట్రెసా జాలీ ద్వయం 22–24, 18–21తో జియా యిఫాన్–జాంగ్ షు జియాన్ జంట చేతిలో ఓటమి పాలైంది. మూడో మ్యాచ్‌లో రక్షిత శ్రీ 14–21, 21–15, 17–21తో జు వెన్ జింగ్ చేతిలో పరాజయం చవిచూసింది.

లక్ష్య సేన్, సాత్విక్ లేకుండా...

దక్షిణ కొరియాతో జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత స్టార్స్ లక్ష్య సేన్, సాత్విక్ సాయిరాజ్– బరిలోకి దిగలేదు. లక్ష్య సేన్ వెన్నునొప్పితో బాధపడుతుండగా... తన తండ్రి సంవత్సరీకం కారణంగా సాత్విక్ స్వదేశానికి వెళ్లిపోయాడు. తొలి మ్యాచ్‌లో ఆయుశ్ శెట్టి 21–18, 14–21, 24–26తో యూ టేబిన్ చేతిలో ఓడిపోయాడు. రెండో మ్యాచ్‌లో హరిహరన్–చిరాగ్ శెట్టి ద్వయం 11–21, 13–21తో సాంగ్ హున్ చో–కిమ్ వన్ హో జంట చేతిలో ఓటమి పాలైంది. మూడో మ్యాచ్‌లో కిడాంబి శ్రీకాంత్ 21–15, 21–16తో చోయ్ జిహూన్‌పై గెలుపొందాడు. నాలుగో మ్యాచ్‌లో పృథ్వీ–సాయిప్రతీక్ జోడీ 11–21, 16–21తో జిన్ యోంగ్–కి డాంగ్ జు ద్వయం చేతిలో పరాజయం పాలైంది. ఫలితం తేలిపోవడంతో ఐదో మ్యాచ్‌ను నిర్వహించలేదు. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో చైనా 3–1తో చైనీస్ తైపీపై; జపాన్ 3–0తో మలేసియాపై, ఇండోనేసియా 3–2తో థాయ్‌లాండ్ జట్టుపై గెలిచి సెమీఫైనల్ చేరుకున్నాయి.

రెజ్లర్ సుశీల్‌కు బెయిల్ తిరస్కృతి

న్యూఢిల్లీ: వివాదాస్పద రెజ్లర్, రెండు ఒలింపిక్ పతకాల విజేత సుశీల్ కుమార్‌కు ఢిల్లీ కోర్టు బెయిల్ నిరాకరించింది. హత్యానేరంపై అతను ప్రస్తుతం తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. మాజీ జాతీయ జూనియర్ చాంపియన్ సాగర్ ధన్కర్‌ను హత్య చేసిన కేసులో సుశీల్ ప్రధాన నిందితుడు. తన అనుచరులు, సన్నిహితులతో కలిసి ఛత్రశాల్ స్టేడియంలో 2021లో యువ రెజ్లర్ సాగర్ ధన్కర్‌ను హాకీ స్టిక్స్, బేస్‌బాల్ బ్యాట్లతో తీవ్రంగా కొట్టి చంపాడు. అడ్డువచ్చిన సాగర్ స్నేహితులను సైతం సుశీల్ బృందం విచక్షణ రహితంగా కొట్టడంతో కొందరు గాయపడ్డారు. ఈ కేసులో సుశీల్ ఏ1గా తేలడంతో ఢిల్లీ పోలీసులు 2021 మేలో అరెస్టు చేశారు. అప్పటి నుంచి అతను తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. మోకాలు శస్త్ర చికిత్స కోసమని 2023, జూలైలో సెషన్స్ కోర్టు వారం రోజుల మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసింది. అనంతరం మళ్లీ ఒలింపియన్ రెజ్లర్‌ను జైలుకు తరలించారు. తాజాగా మరోసారి బెయిల్‌కు ప్రయత్నించగా ఢిల్లీ కోర్టు నిర్ద్వందంగా సుశీల్ పిటీషన్‌ను తిరస్కరించింది.



టీచర్ మోదీ!
పరీక్షా పే చర్చ సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని తన నివాసంలో విద్యార్థులకు బోర్డుపై వివరిస్తూ, వారితో కలిసి కూర్చుని చర్చిస్తూ, బహుమతులు స్వీకరిస్తూ ప్రధాని మోదీ

‘చెరిపేసే’ హక్కు ఏమిటి?

ఆన్‌లైన్ న్యూస్‌కు వర్తిస్తుందా? | సుప్రీంకోర్టు చెంతకు వివాదం | విచారణకు స్వీకరించిన ధర్మాసనం

న్యూఢిల్లీ: ఆర్టికల్ 21 ప్రకారం పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కుల్లో భాగంగా వారి గోప్యతను పరిరక్షించేందుకు ఉద్దేశించిన ‘చెరిపివేత హక్కు’(రైట్ టు బీ ఫర్‌గాటెన్–ఆర్‌టీబీఎఫ్)కు సంబంధించి ఆసక్తికరమైన కేసు ఒకటి సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. దీనిప్రకారం వ్యక్తులు తమపై ఆన్‌లైన్‌లో ఉన్న కంటెంట్‌ను తొలగించాలని కోరేందుకు హక్కు ఉంటుందా అన్న అంశాన్ని తేల్చాలంటూ ఒక పిటిషన్ దాఖలైంది. క్రిమినల్ కేసులో నిరపరాధిగా విడుదలైన ఒక వ్యక్తి తాలూకు విచారణ ప్రక్రియకు సంబంధించిన కంటెంట్‌ను ఆర్‌టీబీఎఫ్ కింద పబ్లిక్ డొమైన్ నుంచి తొలగించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఓ మీడియా సంస్థ దీన్ని దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ‘‘ఇది నూతన యుగం. కనుక గోప్యత హక్కులో భాగంగా ఆర్టికల్ 21లో పేర్కొన్న ఆర్‌టీఈఎఫ్, ఆర్టికల్ 19లో పేర్కొన్న మీడియా స్వేచ్ఛ హక్కులను సంతులనం చేయాల్సిన అవసరముంది’’అని ఈ సందర్భంగా పేర్కొంది. అసలు ఆర్‌టీబీఎఫ్‌ను, దాని పరిధిని నిర్దిష్టంగా నిర్వచించాలన్న పిటిషన్‌పై విచారణ జరిపేందుకు అంగీకరించింది. మార్చి 16లోగా స్పందించాల్సిందిగా టూ సదరు వ్యక్తికి, పిటిషన్లు దాఖలు చేసిన ఇతర మీడియా సంస్థలకు నోటీసులు జారీ చేసింది.

ఏమిటీ కేసు?

ఒక క్రిమినల్ కేసులో నిర్దోషిగా తేలిన ఓ వ్యక్తి విచారణ ప్రక్రియకు సంబంధించి మీడియా సంస్థల్లో తనపై వెలువడ్డ వార్తలు తదితరాలన్నింటినీ ఆన్‌లైన్ డొమైన్ల నుంచి తొలగించాలంటూ దిగువ కోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు దాఖలు చేసిన పరువు నష్టం కేసులో ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువడింది. ఇండియన్ కానూన్ అనే ఆన్‌లైన్ పోర్టల్ దాన్ని ఢిల్లీ హైకోర్టులో సవాలు చేసింది. హైకోర్టు కూడా కూడా సదరు వ్యక్తికే అనుకూలంగా 2025 డిసెంబర్ 18న తీర్పు వెలువరించింది. దాంతో మీడియా సంస్థ సుప్రీం గడప తొక్కింది. అనంతరం పలు ప్రఖ్యాత మీడియా సంస్థలు కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయ్యాయి. ఆన్‌లైన్ న్యూస్‌కు ఆర్‌టీబీఎఫ్ వర్తించదని ఇండియన్ కానూన్ పోర్టల్ తరఫున సీనియర్ న్యాయవాది అర్వింద్ దాతార్ ఈ సందర్భంగా వాదించారు. ఈ విషయంలో ఢిల్లీ తీర్పును హైకోర్టు మద్రాస్, రాజస్తాన్, పంజాబ్–హరియాణా హైకోర్టులు ప్రమాణంగా పరిగణించి అభిప్రాయాలు వెల్లడించాయని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దాంతో, పరువునష్టం కేసుల్లో తీర్పుల విషయంలో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన సదరు తీర్పును ప్రమాణంగా పరిగణించడానికి వీల్లేదని ధర్మాసనం పేర్కొంది. గోప్యత హక్కులో చరిత్రను చెరిపేసే హక్కు భాగం కాదని 2017 నాటి చరిత్రాత్మక కె.ఎస్.కుప్పుస్వామి కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసిందని దాతార్ గుర్తు చేశారు. ‘‘మీడియా సంస్థలు ఒకే వార్తను పదేపదే చూపిస్తే పరిస్థితి ఏమిటి? అలాంటప్పుడు ఆర్టికల్ 19, 21లలో దేన్ని వర్తింపజేయాలి?’’అని ధర్మాసనం ఆయనను ప్రశ్నించింది. పత్రికల్లో ఒకసారి ప్రచురితమయ్యే వార్త ఎప్పటికీ అలాగే ఉండిపోతుందని ఆయన గుర్తు చేశారు. కనుక వార్తాంశాన్ని చెరిపేయడం సాధ్యపడదని బదులిచ్చారు. ‘‘ఆ పరిస్థితిలో సదరు వార్త సజీవంగానే ఉండిపోతుంది. అలాంటప్పుడు చెరిపేసే హక్కు పరిస్థితి ఏమిటి?’’అని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారు. కోర్టు ఆదేశాల మేరకు సదరు వ్యక్తికి సంబంధించి వార్తాంశాలను తాము తొలగించినట్టు దాతార్ తెలిపారు. అయితే నిర్దిష్ట కాలం గడిచాక ఏ వార్తాంశమైన ఆర్కైవ్స్‌లోకి వెళ్లి ఉండిపోతుందని బదులిచ్చారు. పైగా ఇలాంటి వార్తాంశాల నుంచి సదరు వ్యక్తి పేరునే పూర్తిగా తొలగిస్తే ఆ ఉదంతానికి సంబంధించిన కథనమంతా కనుమరుగైనట్టేనని ఆందోళన వెలిబుచ్చారు. పౌరులకు సమాచారం అందుకుండా చేసేందుకు ఈ రోజుల్లో గోప్యత పేరిట అడ్డుగోడలు పుట్టుకొస్తున్నాయని జస్టిస్ భూయాన్ అన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ఆర్‌టీబీఎఫ్‌ను చరిత్రను చెరిపేసే పనిముట్టుగా వాడుకునేందుకు ఢిల్లీ హైకోర్టు తీర్పు వీలు కల్పించిందని దాతార్ ఆరపించారు. కనుక దాని రాజ్యాంగబద్ధత, అమలు పరిధి తదితరాలను స్పష్టంగా నిర్వచించాలని ధర్మాసనాన్ని అభ్యర్థించారు. ‘‘విచారణ సందర్భంగా కోర్టులు చేసే వ్యాఖ్యలు మర్నాడు మీడియాలో వార్తలుగా మారుతున్నాయి. అనంతరం కోర్టులు ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నంత మాత్రాన సదరు వార్తా కథనాలను కూడా తొలగించగలమా?’’అని ప్రశ్నించారు. ‘‘ఈ సోషల్ మీడియా యుగంలో కొన్ని విషయాలకు సంబంధించి తమను అంతా మర్చిపోవాలని వాంఛించే వారి సంఖ్య పెరుగుతోంది. ఏమైనా ఇది ఆసక్తికరమైన అంశమే. దీన్ని లోతుగా పరిశీలిస్తాం’’ అని జస్టిస్ నాగరత్న పేర్కొన్నారు.

గతంలోనూ ‘సుప్రీం’ఆందోళన

చెరిపేసే హక్కు (ఆర్‌టీబీఎఫ్) అమలు తీరుతెన్నులపై గతంలో కూడా సుప్రీంకోర్టు ఆందోళన వెలిబుచ్చింది. దీని ప్రకారం కోర్టు తీర్పులను పబ్లిక్ డొమైన్ నుంచి తొలగిస్తే పరిణామాలు తీవ్రంగా, దారుణంగా ఉంటాయని 2024లో ఓ కేసు విచారణ సందర్భంగా కోర్టు పేర్కొంది.

30 వారాల గర్భవిచ్ఛిత్తికి సుప్రీం అనుమతి

గర్భాన్ని కొనసాగించాలని బలవంతం చేయలేమని వ్యాఖ్య

న్యూఢిల్లీ: మహిళను, అందులోనూ బాలికను గర్భాన్ని కొనసాగించాలని బలవంతం చేయలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఓ పదిహేడేళ్ల బాలిక మోస్తున్న 30 వారాల అవాంఛిత గర్భాన్ని తొలగించేందుకు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. పొరుగింటి యువకుడితో సన్నిహిత సంబంధం ఫలితంగా గర్భం దాల్చిన ఓ బాలిక వేసిన పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన అన్ని ప్రమాణాలను పాటిస్తూ బాలికకు సురక్షితంగా గర్భ విచ్ఛిత్తి ప్రక్రియ చేపట్టాలంటూ ముంబైలోని జేజే హాస్పిటల్ నిపుణులకు స్పష్టం చేసింది. 30 వారాల వయస్సున్న పిండాన్ని తొలగించడం వల్ల బాలికకు ఎటువంటి అపాయం లేదన్న వైద్యుల నివేదికపై ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ‘బాధితురాలు మైనర్ కాబట్టి, ఆ గర్భం చట్టం దృష్టిలో సహజంగానే అక్రమమైనది. ఆమె పరస్పర అంగీకారంతోనా లేదా అత్యాచారంతో గర్భం దాల్చిందా అనే అంశం కంటే, ఒక బాలిక తల్లి కావడం దురదృష్టకర పరిస్థితి’అంటూ ధర్మాసనం అభిప్రాయపడింది. ‘గర్భం దాల్చిన మైనర్ ఆ బిడ్డను కనడానికి సిద్ధంగా లేదు. ఆమె ఆ గర్భాన్ని కొనసాగించరాదని గట్టిగా నిర్ణయించుకుంది. అలాంటప్పుడు ఆమెపై ఒత్తిడి తీసుకురావడం సరికాదు’అని భావిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.

ఆ లాయర్‌ను కోర్టుకు తీసుకురండి

ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులతోపాటు సుప్రీం బార్ అసోసియేషన్(ఎస్‌సీబీఏ) ఎన్నికల కమిటీ సభ్యులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి తప్పించుకు తిరుగుతున్న లాయర్ ముకుట్‌నాథ్ వర్మను తమ ఎదుట హాజరుపర్చాలని అత్యున్నత న్యాయస్థానం ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. 2023నాటి ఈ కేసుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. ఆ లాయర్‌పై జారీ చేసిన బెయిలబుల్ వారెంట్లను అందించేందుకు వెళ్లిన పోలీసులకు ఆయన జాడ దొరకడం లేదని ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు వికాస్ సింగ్, , సీనియర్ లాయర్ విజయ్ హన్సారియా తెలిపారు. ఎస్‌సీబీఏలో సంస్కరణలు చేపట్టాలంటూ 2023లో దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న సమయంలో లాయర్ వర్మ చేసిన అసభ్యకర వ్యాఖ్యల విషయం ప్రస్తావనకు వచ్చింది. దీనిపై ధర్మాసనం సీరియస్ అయ్యింది. ఆ లాయర్‌ను 2025 మే 29వ తేదీలోగా తమ ఎదుట హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. అయితే, ఆయన మే 29వ తేదీన వర్చువల్‌గా హాజరవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. వ్యక్తిగతంగా హాజరు కావాలని స్పష్టం చేస్తూ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసింది. అయితే, పోలీసులు జారీ చేసిన వారెంట్లు వాపసు వచ్చాయి. లాయర్ జాడ కనుగొనడం పోలీసులకు కష్టమైంది. తాజా విచారణ సందర్భంగా ఇదే అంశాన్ని తిలక్ మార్గ్ పోలీస్‌స్టేషన్ అధికారులు తెలిపారు. అయితే, లాయర్ వర్మను ఫిబ్రవరి 23వ తేదీలోగా బలవంతంగానైనా తీసుకురావాలని పోలీస్ కమిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది.

కేవలం ప్రశ్నలు అడిగేందుకు అరెస్ట్ చేయరాదు

పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: కేవలం ప్రశ్నలను అడిగేందుకు మాత్రమే పోలీసులు ఒక వ్యక్తిని అరెస్ట్ చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అది కేవలం పోలీసు అధికారి విచక్షణపై ఆధారపడి ఉంటుందే తప్ప, అరెస్ట్ తప్పనిసరి అంశం కాదని స్పష్టం చేసింది. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బీఎన్ఎస్ఎస్)–2023లోని నిబంధనలు అరెస్ట్‌ను కచ్చితమైన లక్ష్యం కలిగిన అవసరంగానే తప్ప, పోలీసు అధికారి వ్యక్తిగత సౌలభ్యంగా భావించరాదని చెబుతున్నాయని శుక్రవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ‘పోలీసులు కేవలం ప్రశ్నలు అడిగేందుకే అరెస్ట్ చేయమని దీనర్థం కాదు. ఏడేళ్ల వరకు శిక్ష పడే నేరాల విషయంలో, ఆ వ్యక్తిని కస్టడీలోకి తీసుకోకుండా విచారణ సమర్థవంతంగా ముందుకు సాగదని పోలీసు అధికారి నిర్ధారించుకోవాలి. దీనికి విరుద్ధంగా ఇచ్చే ఏ వ్యాఖ్యానమైనా, బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 35(1)(బి), సెక్షన్ 35(3) నుంచి 35(6) వరకు ఉన్న నిబంధనల ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది’అని ధర్మాసనం పేర్కొంది. ఏడేళ్ల లోపు శిక్ష పడే నేరాలన్నింటిలోనూ, నిందితుడిని అరెస్ట్ చేయకుండా నేరుగా సెక్షన్ 35(3) కింద నోటీసు జారీ చేయడం తప్పనిసరా కాదా అనే అంశంపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం పైవ్యాఖ్యలు చేసింది.

‘ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల్లో అరెస్ట్ అనేది మినహాయింపు మాత్రమే కావాలి, నిబంధన కాకూడదు. కాబట్టి, సాధారణ పరిస్థితుల్లో సెక్షన్ 35(3) ప్రకారం విచారణకు హాజరు కావాలని నోటీసు ఇవ్వడం తప్పనిసరి’అని తీర్పు వెలువరించింది. ఒకవేళ ఆ వ్యక్తి విచారణకు సహకరించకపోయినా, సాక్ష్యాలను నాశనం చేస్తారని నమ్మినా లేక నిందితుడు పారిపోయే అవకాశం ఉన్నప్పుడు మాత్రమే పోలీసులు అరెస్ట్ చేయాలని తెలిపింది. నోటీసు ఇవ్వకుండా నేరుగా అరెస్ట్ చేయాలని భావించిన పక్షంలో అందుకు గల బలమైన కారణాలను పోలీసు అధికారి లిఖితపూర్వకంగా రికార్డు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది.

మేయర్ పదవికి ‘స్వీపర్’ పోటీ

బరిలో నిలిపిన ఎంఐఎం

ఛత్రపతి శంభాజీనగర్: ఛత్రపతి శంభాజీనగర్ కార్పొరేషన్‌లో స్వీపర్‌గా పనిచేసి, ఆ తర్వాత కార్పొరేటర్‌గా మారిన వ్యక్తిని ఎంఐఎం పార్టీ తాజాగా మేయర్ పదవికి నామినేట్ చేసింది. ‘అశోక్ హిర్వాలేను మేయర్ పదవికి పోటీలో నిలుపుతున్నాం. ఆయన 28 ఏళ్లపాటు మున్సిపల్ స్వీపర్‌గా పనిచేశారు. ఈ నెల 10వ తేదీన జరిగే పోలింగ్‌లో బీజేపీయేతర పార్టీలన్నీ కలిసి ఆయన్ను గెలిపించాలి. ఎస్సీలపై గల ప్రేమను చాటుకోవాలి’అని ఎంఐఎం ఒక ప్రకటనలో తెలిపింది. జనవరి 15వ తేదీన జరిగిన శంభాజీ నగర్ కార్పొరేషన్‌ఎన్నికల్లో మొత్తం 115 మంది సభ్యులకు గాను బీజేపీ 57 సీట్లను గెలుచుకుని ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. 33 సీట్లతో ఎంఐఎం రెండో స్థానంలో నిలిచింది. ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేనకు 13 సీట్లు మాత్రమే దక్కాయి. శివసేన(యూబీటీ)కి ఆరు, వంచిత్ బహుజన్ అఘాడీకి నాలుగు స్థానాలు వచ్చాయి. బీజేపీ, ఏక్‌నాథ్ షిండే శివసేన కలిసి సమీర్ రాజుర్కర్‌ను మేయర్ పోస్టుకు బరిలో నిలిపాయి.

సరిహద్దుల్లో పటిష్ట భద్రత

- ఆధునిక పరికరాలు ఉపయోగించుకోవాలి
- జమ్మూకశ్మీర్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వెల్లడి

జమ్మూ: ఆధునిక పరికరాల ద్వారా సరిహద్దు భద్రతను అత్యంత పటిష్టంగా మార్చాల్సిన అవసరం ఉందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. సరిహద్దుల్లో నిఘా సిబ్బందిని నిరంతరం కొనసాగించడం అత్యంత కీలకమని అన్నారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఎన్నో కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని చెప్పారు. వాటిని తిప్పికొట్టడానికి అంతకంటే ఆధునిక టెక్నాలజీని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. అమిత్ షా శుక్రవారం జమ్మూకశ్మీర్‌లో పర్యటించారు. అంతర్జాతీయ సరిహద్దు వెంట భారత ఫార్వర్డ్ పోస్టులను సందర్శించారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ జవాన్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనిక దళాలు అద్భుతంగా పనిచేశాయని ప్రశంసించారు. జమ్మూ ఫ్రాంటియర్ దళం పాకిస్తాన్‌లో 118 సైనిక పోస్టులను, మూడు ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను ధ్వంసం చేసిందని వెల్లడించారు. దేశ సరిహద్దులను రక్షించడంలో బీఎస్ఎఫ్ పాత్ర శ్లాఘనీయమని ఉద్ఘాటించారు. ఎన్నో సవాళ్లను తట్టుకుంటూ విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు.

ప్రజలే మీ పార్టీని తిరస్కరించారు

- ప్రశాంత్ కిశోర్‌పై సుప్రీం వ్యాఖ్యలు
- బిహార్ ఎన్నికలపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సవాలు చేస్తూ జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. ఒక రాజకీయ పార్టీ కోరిక మేరకు మొత్తం రాష్ట్రానికి సంబంధించిన ఎన్నికల ఫలితాలపై ఎలాంటి ఆదేశాలూ జారీ చేయలేమని స్పష్టం చేసింది. ఇది కేవలం బిహార్‌కు మాత్రమే సంబంధించిన అంశం కనుక పట్నా హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. గతేడాది బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత ‘ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకం’కింద నితీశ్‌కుమార్ సర్కారు రాష్ట్రంలో ప్రతి మహిళకు రూ.10 వేలు పంపిణీ చేయడడం ఎన్నికల నియమావళికి విరుద్ధమంటూ కిశోర్ పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్లను ప్రభావితం చేయడానికి సంక్షేమ పథకాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కనుక రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ ధర్మాసనం నిరాకరించింది. ‘‘మీ పార్టీని ప్రజలే తిరస్కరించారు. అయినా ఇలా అత్యున్నత న్యాయస్థానం వేదికగా ప్రచారం పొందాలని చూస్తున్నారా?’’అని పిటిషనర్‌ను ప్రశ్నించింది. ఎన్నికల్లో ఉచితాల సమస్యను ఇప్పటికే తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని గుర్తు చేసింది. సర్వస్వం కోల్పోయిన ఒక పార్టీ కంటే, ప్రజాప్రయోజనాలను కోరే పిటిషనర్ల వాదనలు వినడానికే ఇష్టపడతామని పేర్కొంది. 243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీకి గతేడాది జరిగిన ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఏకంగా 202 స్థానాలు గెలుచుకుని అధికారాన్ని నిలబెట్టుకోవడం తెలిసిందే. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన విపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి కేవలం 35 స్థానాలు సాధించగా జేఎస్‌పీ ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఆ పార్టీ అభ్యర్థుల్లో చాలామంది డిపాజిట్లు కూడా కోల్పోయారు.

వీసా ఆంక్షలతో వెనక్కి తగ్గిన ఆఫ్రికా దేశాలు

యూకేలో అక్రమ వలసదారులుగా ఉన్న తమ పౌరులను తీసుకెళ్లేందుకు అంగీకారం

లండన్: వీసాలను నిలిపివేస్తామంటూ యూకే హోం శాఖ చేసిన బెదిరింపులతో ఆఫ్రికాలోని మూడు దేశాలు వెనక్కి తగ్గాయి. యూకేలోకి అక్రమంగా ప్రవేశించిన, ఇతర నేరాలకు పాల్పడిన వారిని వెనక్కి తీసుకెళ్లేందుకు ఈ దేశాలు సమ్మతిని తెలిపాయి. ఈ విషయాన్ని యూకే హోం శాఖ శుక్రవారం తెలిపారు. నమీబియా, అంగోలాలు ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు చేశాయన్నారు. పౌరులకు కోసం ఫాస్ట్‌ట్రాక్ వీసా ప్రాసెసింగ్ విధానాన్ని రద్దు చేయడంతోపాటు ఆ దేశం నుంచి వచ్చే ప్రముఖులకు ప్రత్యేక వీసా సౌకర్యాలను రద్దు చేస్తామంటూ హెచ్చరించడంతో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో(డీఆర్‌సీ) తాజా తమ దారికి వచ్చిందని హోం మంత్రి షబానా మహ్మూద్ చెప్పారు. విదేశీ ప్రభుత్వాలు తమ పౌరులను వెనక్కి తీసుకునేందుకు నిరాకరించిన పక్షంలో తగు పర్యావసానాలను ఎదుర్కోనక తప్పదన్నారు. అక్రమ వలసదారులు, ప్రమాదకరమైన నేరగాళ్లను పట్టుకుని, అంగోలా, నమీబియా, డీఆర్‌సీలకు పంపించివేస్తామన్నారు. భారత్, పాకిస్తాన్, నైజీరియా, బంగ్లాదేశ్, సోమాలియా, గబోన్ వంటి దేశాలు ఈ రకమైన ఒప్పందానికి వ్యతిరేకత చూపుతున్నందున, వాటిపైనా వీసా సంబంధిత ఆంక్షలు విధిస్తారంటూ వస్తున్న వార్తలపై ఆమె నేరుగా స్పందించలేదు. యూకేలో 2025 జూలైలో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చాక రికార్డు స్థాయిలో 58 వేల మంది అక్రమ వలసదారులను స్వదేశాలకు పంపించి వేసింది. తాజాగా, మూడు ఆఫ్రికా దేశాలతో కుదిరిన ఒప్పందం ఫలితంగా మరో 3 వేల మందిని ఆయా దేశాలకు తిప్పిపంపే అవకాశాలున్నాయి.

ఒమన్ మధ్యవర్తిత్వంతో అమెరికా-ఇరాన్ మధ్య పరోక్ష చర్చలు

ఇరుదేశాల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమైన ఒమన్ విదేశాంగ మంత్రి

మస్కట్: ఇరాన్ అణు కార్యక్రమం ప్రధాన అజెండాగా ఒమన్ మధ్యవర్తిత్వంతో శుక్రవారం అమెరికా–ఇరాన్‌ల మధ్య పరోక్ష చర్చలు మొదలయ్యాయి. రాజధాని మస్కట్‌లో జరిగిన ఈ భేటీలో ఒమన్ ప్రతినిధి ఆ రెండు దేశాల అధికారులతో వేర్వేరుగా చర్చలు జరిపారు. మస్కట్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఓ హోటల్ ఈ చర్చలకు వేదికైంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ఒమన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్ బుసైదీతో సమావేశమైనట్లు ఇరాన్ అధికార మీడియా తెలిపింది. ఇరాన్ ప్రభుత్వ వాహనాలు అక్కడి నుంచి నిష్క్రమించాక, ఆ హోటల్ ఆవరణలోకి అమెరికా జెండా కలిగిన ఎస్‌యూవీ సహా పలు వాహనాలు ప్రవేశించాయి. గంటన్నర తర్వాత అవి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. మంత్రి అరాగ్చి, అమెరికా దూత స్టీవ్ విట్కాఫ్, అధ్యక్షుడు ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌తో చర్చలు జరిపినట్లు అనంతరం అల్ బుసైదీ ఒక ప్రకటనలో తెలిపారు. ‘దౌత్య, సాంకేతిక పరమైన చర్చలను తిరిగి ప్రారంభించడానికి తగిన పరిస్థితులను కల్పించడమే ఈ సంప్రదింపుల లక్ష్యం. భద్రత, సుస్థిరతలను సాధించాలని ఇరు వర్గాలు ఆకాంక్షిస్తున్న వేళ ఈ చర్చలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది’అని ఆయన పేర్కొన్నారు. అమెరికా ప్రతినిధులతో చర్చలు ముగించుకున్న వెంటనే ఒమన్ ప్రతినిధి వర్గం ఆ హోటల్ నుంచి వెళ్లిపోయింది. చర్చలు కొనసాగేదీ లేనిదీ నిర్ధారణ కావాల్సి ఉంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చి ఈ చర్చలను శుభారంభంగా పేర్కొన్నారు. అయితే, ఈ చర్చల్లో విట్కాఫ్, కుష్నర్‌లతోపాటు అమెరికా సెంట్రల్ కమాండ్ హెడ్, నేవీ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ కూడా పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చల ద్వారా దారికి రాకుంటే దాడికి వెనుకాడబోమంటూ ఇరాన్‌ను హెచ్చరించడమే దీని వెనుక ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. ఇరాన్‌లో కొనసాగుతున్న ప్రజాందోళనలను ప్రభుత్వం కఠినంగా అణచివేస్తున్నందున దాడులు తప్పవంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు చేయడంతోపాటు ఇరాన్‌కు సమీపంలోకి అధునాతన సైనిక ఆయుధ సంపత్తిని తరలించడం తెల్సిందే. అణు కార్యక్రమాన్ని ఆ దేశం విడిచి పెట్టాలని ట్రంప్ షరతు విధిస్తుండగా, ఆంక్షలు ఎత్తి వేయాలంటూ ఇరాన్ మెలికపెడుతోంది.

నడి రోడ్డుపై 15 అడుగుల లోతు గొయ్యి

- అందులోపడి మోటారు సైకిలిస్ట్ మృత్యువాత
- గురువారం అర్ధరాత్రి ఘటన.. తెల్లారాక వెలుగులోకి..
- గుంత చుట్టూ సరైన రక్షణ చర్యలు చేపట్టలేదని వెల్లడి
- ముగ్గురు ఇంజనీర్లను సస్పెండ్ చేసిన ఢిల్లీ జల్‌బోర్డు

న్యూఢిల్లీ: నిర్మాణ పనుల కోసం ఢిల్లీ జల్ బోర్డు తవ్విన 15 అడుగుల లోతు గుంతలో ఓ మోటారు సైకిలిస్ట్ పడి, ప్రాణాలు కోల్పోయారు. గురువారం రాత్రి జనక్‌పురి ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన శుక్రవారం ఉదయం 8 గంటలకు వెలుగు చూసింది. కైలాస్‌పురికి చెందిన కమల్ భయానీ(25) ఓ ప్రైవేట్ బ్యాంకు కాల్ సెంటర్ ఉద్యోగి. గురువారం అర్ధరాత్రి సమయంలో విధులు ముగించుకుని బయలుదేరిన ఆయన..ఇంటికి చేరుకోలేదు. దీంతో, కుటుంబసభ్యులు భయాందోళనకు గురై ఆ చుట్టుపక్కలున్న జనక్‌పురి, సాగర్‌పూర్, వికాస్ పురి, రోహిణి తదితర పోలీస్‌స్టేషన్లకు వెళ్లి, విషయం అక్కడి అధికారులకు వివరించారు. పెద్దగా ఎవరూ స్పందించలేదు. కమల్ రోజూ ప్రయాణించే రహదారిపై రాత్రంతా గాలిస్తూనే ఉన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల వేళ ఓ మహిళ జనక్‌పురి ప్రాంత పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి, అధికారులు తవ్విన గుంతలో బైకుతోపాటు ఓ వ్యక్తి చలనం లేకుండా పడిపోయి కనిపించినట్లు తెలిపింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు లోపలికి దిగి కమల్ అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు గుర్తించారు. జనవరి 16వ తేదీ రాత్రి నోయిడాలో యువరాజ్ మెహతా(27) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నిర్మాణ ప్రాంతంలో నిలిచిన నీటి గుంతలో కారుతోపాటు పడి ప్రాణాలు కోల్పోవడం తెల్సిందే.

అన్ని చోట్లా నిర్లక్ష్యమే: బాధిత కుటుంబం

నిర్మాణ పనుల కోసం ఆ రోడ్డును కొన్ని రోజులుగా మూసివేశారు. గురువారం భారీ గుంతను తవ్వారు. ఆ విషయం తెలియక కమల్ అటుగా వచ్చి ప్రమాదం బారిన పడి ఉంటారని భావిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే కమల్ ప్రాణాలు కోల్పోయారని కుటుంబీకులు, సన్నిహితులు ఆరోపించారు. పోలీసులు వెంటనే స్పందించి వెతికి ఉంటే అతడి ప్రాణాలు దక్కించుకోగలిగేవారమన్నారు.

ముగ్గురు అధికార్ల సస్పెన్షన్

ఘటన ప్రాంతాన్ని ఢిల్లీ జల శాఖ మంత్రి పర్వేశ్ వర్మ స్వయంగా పరిశీలించారు. అధికారులు గుంత చుట్టూ కొంతమేర రక్షణ చర్యలు చేపట్టారని ఆయన చెప్పారు. అయినప్పటికీ, మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఆ మార్గంలో వాహనదారులు రాకపోకలను మాత్రం మానలేదన్నారు. అంతేకాకుండా, అక్కడ జరిగే పనుల్ని పట్టించుకోని జల్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, జూనియర్ ఇంజనీర్‌లను సస్పెండ్ చేశామన్నారు.

కొబ్బరి మట్టతో చిరుతను తరిమిన మహిళ

మలప్పురం: చిరుతపులి కోరలు చాచి మీదకి వస్తుంటే ఎవరైనా ఏం చేస్తారు? మహా అయితే భయంతో కేకలు వేస్తూ పారిపోయేందుకు ప్రయత్నిస్తారు. ఈ మలయాళ మహిళ మాత్రం చేతికందిన కొబ్బరి మట్టను తీసుకుని ఎదురుదాడికి దిగింది. కేరళలోని మలప్పురం జిల్లా పూక్కొట్టుంపదం గ్రామానికి చెందిన జానకి(50)శుక్రవారం తన నివాసం వెలుపల కూర్చుని ఉండగా వెనుక నుంచి పెద్ద శబ్దం వినిపించింది. వెనుదిరిగి చూడగా చిరుతపులి కనిపించింది. అది కోరలు చాచుకుని, మీదికి వచ్చింది. ఏమాత్రం భయపడని జానకి, చేతికి అందిన కొబ్బరిమట్టతో తిరిగి దాడికి యత్నించింది. అది భయపడి అడవిలోకి పారిపోయింది. తల, రెండు చేతులు, వీపునకు గాయాలైన జానకి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆప్రాంతాన్ని పరిశీలించిన తర్వాతే ఘటన వివరాలు తెలుస్తాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఏప్రిల్ 10న యూపీ తుది ఓటరు జాబితా

న్యూఢిల్లీ/లక్నో: ఉత్తరప్రదేశ్‌లో తుది ఓటరు జాబితా ఏప్రిల్ 10వ తేదీన విడుదల చేయనున్నట్లు ఎన్నికల కమిషన్(ఈసీ) ప్రకటించింది. మార్చి 6వ తేదీన ఓటరు జాబితాను ప్రచురించాలని ముందుగా నిర్ణయించినప్పటికీ, రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈసీ) నుంచి అందిన వినతిని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పురోగతికి సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని, షెడ్యూల్‌ను సవరించినట్లు ఈసీ వివరించింది. తాజా షెడ్యూల్ ప్రకారం తుది ఓటరు జాబితాను ఏప్రిల్ 10వ తేదీన ప్రచురిస్తామని తెలిపింది.

పంజాబ్‌లో ఆప్ నేత హత్య

గురుద్వారా బయటే కాల్చివేత

చండీగఢ్: పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత సత్వీందర్‌పాల్ సింగ్ అలియాస్ లక్కీ ఒబెరాయ్ (43) దారుణ హత్యకు గురయ్యారు. జలంధర్‌లోని మోడల్ టౌన్ ప్రాంతంలో శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. గురుద్వారా నుంచి బయటికి వచ్చి తన కారులో కూర్చున్న ఒబెరాయ్‌పై గుర్తు తెలియని దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అపస్మారక స్థితికి చేరిన ఒబెరాయ్‌ను స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆయన మరణించారు. దుండగుడు తలను కవర్ చేసేలా నల్లరంగు జాకెట్ ధరించి ఒబెరాయ్ కారుకేసి నడుచుకుంటూ రావడం సీసీటీవీ ఫుటేజీలో కన్పిస్తోంది. వస్తూనే ఆయనపై విచక్షణారహితంగా కాల్పులకు దిగాడు. ఆ వెంటనే పరుగెత్తి, సమీపంలో స్కూటర్‌పై వేచిచూస్తున్న సహచరునితో కలిసి పారిపోయాడు. ఎనిమిది నుంచి తొమ్మిది రౌండ్లపాటు కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. ఒబెరాయ్ గురుద్వారాకు రోజూ వస్తుంటారు. ఆయన కదలికలు తెలిసిన వ్యక్తులే పక్కాగా దాడికి ప్లాన్ చేసినట్లు భావిస్తున్నారు. ఒబెరాయ్‌కి ఎవరితోనన్న శత్రుత్వముందా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీపీ పర్మిందర్‌సింగ్ తెలిపారు. దుండగులను గుర్తించేందుకు ఫుటేజీని పరిశీలిస్తున్నామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఒబెరాయ్‌కి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

ప్రభుత్వ వైఫల్యమే విపక్షాలు

ఆప్ ప్రభుత్వ వైఫల్యమే సత్వీందర్‌పాల్ సింగ్ అలియాస్ లక్కీ ఒబెరాయ్ హత్యకు కారణమని విపక్షాలు పేర్కొన్నాయి. ఆప్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి దారుణంగా దిగజారిందని అకాలీదళ్, కాంగ్రెస్, బీజేపీ మండిపడ్డాయి. చివరికి అధికార పార్టీ నేతలకు కూడా రాష్ట్రంలో భద్రత లేకుండా పోయిందని విపక్ష నేత ప్రతాప్‌సింగ్ బజ్వా దుయ్యబట్టారు. ఆప్ పాలనలో పంజాబ్ రక్త మోడుతోందని అకాలదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ ఆరోపించారు. ‘‘ఈ ఏడాది జనవరిలోనే రాష్ట్రంలో ఏకంగా 25 హత్యలు జరిగాయి. గత వారంలోనే ఇది తొమ్మిదో హత్య! బిజీ షాపింగ్ కాంప్లెక్సులు, వివాహ వేదికలు మొదలుకుని చివరికి కోర్టు కాంప్లెక్సులు, గురుద్వారాల బయట కూడా హత్యలు జరిగిపోతున్నాయి’’ అంటూ మండిపడ్డారు. ఆప్ అసమర్థత పంజాబ్‌ను జంగిల్‌రాజ్‌గా మార్చిందని కాంగ్రెస్ నేత అమరీందర్‌సింగ్ రజా వారింగ్ ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనేందుకు ఈ హత్య తాజా నిదర్శనమని బీజేపీ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్ అన్నారు.

స్థానిక స్వపరిపాలన పితామహుడు ఎవరు..?

పీవీ నరసింహారావు హయాంలో.. పంచాయతీరాజ్ చట్టం కోసం 1991లో రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లును 1992 డిసెంబర్ 22న లోక్‌సభ, డిసెంబర్ 23న రాజ్యసభ ఆమోదించాయి. దేశంలోని 17 రాష్ట్రాలు ఈ బిల్లును ఆమోదించాయి. 1993 ఏప్రిల్ 20న రాష్ట్రపతి ఈ బిల్లుపై సంతకం చేశారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

స్థానిక ప్రభుత్వాలు

జి.వి.కె.రావు కమిటీ

- గ్రామీణాభివృద్ధి సాధనకు ఉండాల్సిన సంస్థాగత ఏర్పాట్ల అధ్యయనం కోసం ప్రణాళిక సంఘం 1985లో జి.వి.కె. రావు అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

కమిటీ సూచనలు

- విధాన రూపకల్పన అమలుకు జిల్లా ప్రధాన యూనిట్‌గా ఉండాలి.
- నిర్ణీత గడువులోగా పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలి.
- పంచాయతీరాజ్ సంస్థలకు ఎక్కువ వనరులను అందుబాటులో ఉంచాలి.
- పేదరిక నిర్మూలన కోసం చేపట్టే పథకాల అమల్లో పంచాయతీరాజ్ సంస్థలు చురుకైన పాత్ర పోషించాలి.
- ప్రజాస్వామ్య వికేంద్రీకరణలో జిల్లా పరిషత్ ప్రముఖ పాత్ర వహించాలి.
- రాష్ట్రస్థాయిలో కొన్ని ప్రణాళిక బాధ్యతలను జిల్లా ప్రణాళిక బోర్డులకు అప్పగించాలి.
- జిల్లా అభివృద్ధి అధికారి పేరుతో ఒక పదవిని సృష్టించాలి. ఇతనికి జిల్లా పరిషత్‌కు చెందిన ముఖ్య కార్యనిర్వాహక బాధ్యతలు అప్పగించాలి.
- అభివృద్ధి కార్యక్రమాల్లో కలెక్టర్ పాత్రను తగ్గించాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది.

ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ

- రాజీవ్ గాంధీ కాలంలో 1986లో పంచాయతీ రాజ్ సంస్కరణల కోసం ఎల్.ఎం. సింఘ్వీ కమిటీని నియమించారు.

కమిటీ సిఫారసులు

- పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించాలి. రాజ్యాంగ సవరణలు చేసి వీటిని రాజ్యాంగబద్ధం చేయాలి.
- కొన్ని గ్రామాలను కలిపి న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేయాలి.
- గ్రామ పంచాయతీలకు ఆర్థిక వనరులు కల్పించాలి.
- పంచాయతీరాజ్ సంస్థలు, ఎన్నికలు, రద్దు మొదలైన అంశాలు పరిశీలించడం కోసం 'జ్యూడిషియల్' ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలి.
- రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 64వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు, 65వ రాజ్యాంగ సవరణ ద్వారా నగర పాలక సంస్థలకు రాజ్యాంగ బద్ధత కల్పించాలని భావించింది. కానీ ఆ సవరణలు ఆమోదం పొందలేదు.

పి.కె. తుంగన్ కమిటీ

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పి.కె. తుంగన్ నాయకత్వంలో 1987లో ప్రధాని రాజీవ్ గాంధీ.. మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ వ్యవస్థకు స్వయం సమృద్ధి కల్పించి, దేశం అంతటా వర్తించే పంచాయతీరాజ్ వ్యవస్థను రూపొందించాలనే లక్ష్యంతో ఈ సంఘాన్ని ఏర్పాటు చేశారు.

73వ రాజ్యాంగ సవరణ

- పంచాయతీరాజ్ చట్టం కోసం లోక్‌సభలో 1991లో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. ఆ సమయంలో పి.వి.నరసింహారావు ప్రధానిగా ఉన్నారు.

- పంచాయతీరాజ్ వ్యవస్థపై ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును 1992 డిసెంబర్ 22న లోక్‌సభ, డిసెంబర్ 23న రాజ్యసభ ఆమోదించాయి.
- 17 రాష్ట్రాలు ఈ బిల్లును ఆమోదించాయి. 1993 ఏప్రిల్ 20న రాష్ట్రపతి ఈ బిల్లుపై సంతకం చేశారు.
- 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 1993లో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని రాజ్యాంగబద్ధం చేశారు. రాజ్యాంగంలోని 9వ భాగంలో.. 11వ షెడ్యూల్లో ఆర్టికల్ 242(ఎ) నుంచి ఆర్టికల్ 243 ఎ(ఓ) వరకు వీటిని పొందుపర్చారు
- నూతన పంచాయతీరాజ్ చట్టం 1993 ఏప్రిల్ 24న అమల్లోకి వచ్చింది.
- ఆర్టికల్ 243 పంచాయతీల గురించి వివరిస్తుంది.
- ఆర్టికల్ 243(ఎ) ప్రకారం గ్రామసభ, ఆర్టికల్ 243(బి) ప్రకారం ప్రతి రాష్ట్రంలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఉంటుంది.
- ఆర్టికల్ 243(సి) పంచాయతీ నిర్మాణం, ఎన్నికల గురించి తెలుపుతుంది.
- ఆర్టికల్ 243(డి) ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలి. మహిళలకు 1/3వ వంతు స్థానాలు కేటాయించాలి.
- మహిళలకు 243(ఇ) ప్రకారం పంచాయతీల కాలపరిమితి ఐదేళ్లు.
- ఆర్టికల్ 243(హెచ్) ప్రకారం రాష్ట్రపతి, శాసనసభ చేసిన చట్టం ఆధారంగా పన్నులను వసూలు చేసే అధికారం పంచాయతీలకు ఉంటుంది.
- ఆర్టికల్ 243(ఐ) ప్రకారం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని, ఆర్టికల్ 243(కె) ప్రకారం రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని.. గవర్నర్ ఏర్పాటు చేస్తారు.
- గ్రామంలోని ఓటర్లతో గ్రామసభ ఏర్పాటు చేయాలి.
- అన్ని రాష్ట్రాలు కచ్చితంగా మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- గ్రామాల్లో గ్రామ పంచాయతీ, మధ్యస్థాయిలో పంచాయతీ సమితిలు, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఏర్పాటు చేయాలి.
- పంచాయతీరాజ్ సంస్థలకు పోటీ చేయడానికి కావాల్సిన కనిష్ఠ వయస్సు 21 ఏళ్లు.
- ఏదైనా ఒక రాష్ట్రంలో 20 లక్షల కంటే తక్కువ జనాభా ఉంటే రెండో అంచె పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదు.
- 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థ అమల్లో లేని రాష్ట్రాలు...
  జమ్మూ కశ్మీర్, నాగాలాండ్, మేఘాలయ, మిజోరాం; మణిపూర్‌లోని కొండ ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, గుర్కా హిల్ కౌన్సిల్ ప్రాంతం.
- 2000లో 83వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 243(ఎం)ను చేర్చి అరుణాచల్ ప్రదేశ్‌లో ఎస్సీలకు రిజర్వేషన్లు తొలగించారు.
- ఆంధ్రప్రదేశ్‌లో నూతన పంచాయతీరాజ్ చట్టం 1994 మే 30న అమల్లోకి వచ్చింది.
- 1994 నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీరాజ్, మున్సిపాలిటీలలో ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 8 శాతం, బీసీలకు 33 శాతం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారు.
- పంచాయతీరాజ్ సంస్థలకు 11వ షెడ్యూల్లో 29 అధికారాలు కల్పించారు. వీటిపై పంచాయతీ రాజ్ సంస్థల అధికార పరిధి ఉంటుంది.

11వ షెడ్యూల్లోని ముఖ్యాంశాలు

- వ్యవసాయం, భూ సంస్కరణలు, చిన్నతరహా సాగునీటి పథకాలు– చేపల పెంపకం, సామాజిక అడవులు, తాగునీటి వసతి, రోడ్లు, బీపీఎల్ పథకాలు, వైద్యం, గ్రంథాలయాలు, ప్రజాపంపిణీ వ్యవస్థ, కుటుంబ పరిరక్షణ, సామాజిక ఆస్తుల పర్యవేక్షణ, పారిశ్రామిక శిక్షణ– స్త్రీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. స్థానిక సంస్థల్లో ఓటింగ్ వయసు?
   ఎ) పదహారేళ్లు బి) పద్దెనిమిదేళ్లు
   సి) 21 ఏళ్లు డి) 25 ఏళ్లు
2. ఏ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లో లేదు?
   ఎ) నాగాలాండ్ బి) కేరళ
   సి) త్రిపుర డి) అసోం

సమాధానాలు: 1) సి; 2) బి.

మాదిరి ప్రశ్నలు

1. 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని ఏ ప్రధాన మంత్రి హయాంలో రూపొందించారు?
   ఎ) రాజీవ్‌గాంధీ బి) చంద్రశేఖర్
   సి) వి.పి.సింగ్
   డి) పి.వి.నరసింహరావు
2. 73వ రాజ్యాంగ సవరణ చట్టం భారత రాజ్యాంగంలోని ఏ విభాగానికి సంబంధించింది?
   ఎ) Part-VII బి) Part-VIII
   సి) Part-IX డి) Part-X
3. భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ జిల్లా ప్రణాళికా మండలి గురించి వివరిస్తుంది?
   ఎ) 243-ZE బి) 243-ZD
   సి) 243-ZB డి) 243-ZC
4. స్థానిక ప్రభుత్వ సంస్థలకు సంబంధించి మొదటి తీర్మానంగా దేన్ని అభివర్ణిస్తారు?
   ఎ) లార్డ్ రిప్పన్ తీర్మానం
   బి) లార్డ్ మెయో తీర్మానం
   సి) బ్రిటిష్ రాణి తీర్మానం
   డి) వికేంద్రీకరణ
5. స్థానిక స్వపరిపాలనపై ఏ జాతీయ నాయకుడికి ఎక్కువ గౌరవం, విశ్వాసం ఉండేవి?
   ఎ) జవహర్ లాల్ నెహ్రూ
   బి) మహాత్మాగాంధీ
   సి) లాల్ బహదూర్ శాస్త్రి
   డి) సుభాష్ చంద్రబోస్
6. ముంబై, కోల్‌కతా నగరాల్లో మున్సిపల్ కార్పొరేషన్లను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   ఎ) 1726 బి) 1687
   సి) 1787 డి) 1870
7. లార్డ్ మెయో స్థానిక ప్రభుత్వాలకు సంబంధించి ఆర్థిక వికేంద్రీకరణ తీర్మానాన్ని ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   ఎ) 1770 బి) 1860
   సి) 1857 డి) 1870
8. స్థానిక స్వపరిపాలన పితామహుడు?
   ఎ) లార్డ్ కర్జన్ బి) లార్డ్ మింటో
   సి) లార్డ్ రిప్పన్ డి) లార్డ్ మాంటెంగ్
9. జి.వి.కె. రావు కమిటీని నియమించిన సంవత్సరం?
   ఎ) 1984 బి) 1985
   సి) 1986 డి) 1972
10. జిల్లా ప్రణాళికా వికేంద్రీకరణలో జిల్లా కలెక్టర్ ముఖ్యపాత్ర పోషించాలని సిఫారసు చేసిన కమిటీ?
    ఎ) సి.హెచ్.హనుమంతరావు కమిటీ – 1984
    బి) దంత్‌వాలా కమిటీ – 1978
    సి) ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ – 1986
    డి) పి.కె.తుంగన్ కమిటీ – 1987
11. 73వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని ఎన్ని రాష్ట్రాలు ఆమోదించాయి?
    ఎ) 16 బి) 17 సి) 18 డి) 19
12. నూతన పంచాయతీరాజ్ చట్టం – 1993 ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
    ఎ) 1993 ఏప్రిల్ 24
    బి) 1992 ఏప్రిల్ 25
    సి) 1993 ఏప్రిల్ 28
    డి) 1993 ఏప్రిల్ 26
13. పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించాలని ఏ కమిటీ సిఫారసు చేసింది?
    ఎ) జి.వి.కె.రావు కమిటీ
    బి) ఎల్.ఎం.సింఘ్వీ కమిటీ
    సి) పి.కె.తుంగన్ కమిటీ
    డి) దంత్‌వాలా కమిటీ
14. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ ఎన్ని అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది?
    ఎ) రెండంచెలు బి) మూడంచెలు
    సి) నాలుగంచెలు డి) ఒక అంచె
15. ఏ రాష్ట్రంలో నాలుగంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమల్లో ఉంది?
    ఎ) పశ్చిమ బెంగాల్ బి) బిహార్
    సి) ఉత్తరప్రదేశ్ డి) హర్యానా
16. ఏయే రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ వ్యవస్థకు తగిన ప్రాధాన్యం లేదు?
    ఎ) ఒడిశా, హర్యానా
    బి) బిహార్, ఉత్తరప్రదేశ్
    సి) మహారాష్ట్ర, కర్ణాటక
    డి) గుజరాత్, పశ్చిమ బెంగాల్
17. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ఏయే రాష్ట్రాలకు వర్తించదు?
    ఎ) జమ్మూ–కశ్మీర్
    బి) నాగాలాండ్
    సి) మేఘాలయ, మిజోరాం
    డి) పైవన్నీ
18. దంత్‌వాలా కమిటీ నివేదిక దేనికి సంబంధించింది?
    ఎ) పట్టణ ప్రణాళిక బి) రాష్ట్ర ప్రణాళిక
    సి) జిల్లా ప్రణాళిక
    డి) బ్లాక్ లెవల్ ప్రణాళిక

సమాధానాలు

1) డి; 2) సి; 3) బి; 4) ఎ; 5) బి; 6) ఎ; 7) డి; 8) సి; 9) బి; 10) బి; 11) బి; 12) ఎ; 13) బి; 14) బి; 15) ఎ; 16) బి; 17) డి; 18) డి.

వర్చువల్ వాటర్ అంటే?

మానవ శరీరంలో రేడియోధార్మిక ప్రభావానికి మొదట గురయ్యే అవయవం ఊపిరితిత్తులు. ఉరఃకుహరంలో స్పాంజి మాదిరి స్థితిస్థాపక శక్తి ఉన్న రెండు ఊపిరితిత్తులు ఉంటాయి. కుడి ఊపిరితిత్తి పెద్దదిగా ఉంటుంది. ఇవి 950 గ్రాముల బరువు ఉంటాయి. ఊపిరితిత్తుల చుట్టూ ఉండే రెండు పొరలను ప్లూరా అంటారు. ఊపిరితిత్తుల అధ్యయాన్ని ప్లూరాలజీ/ పల్మనాలజీ అంటారు.

శ్వాసవ్యవస్థ

శ్వాసక్రియ అన్ని సజీవకణాల్లో జరిగే జీవక్రియ. ఇందులో ఆహారపదార్థాలు (గ్లూకోజ్) ఆక్సీకరణం చెంది కార్బన్ డై ఆక్సైడ్, నీరు, శక్తి విడుదలవుతాయి. శ్వాసక్రియను కింది విధంగా సూచిస్తారు.

$C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O \rightarrow 6CO_2 + 12H_2O$ + 686 కి.కేలరీల శక్తి

లక్షణాలు:

- శ్వాసక్రియ ఒక ఆక్సీకరణ క్రియ. దీన్ని దహన క్రియతో పోల్చవచ్చు. శ్వాసక్రియలో శక్తి దశల వారీగా విడుదలైతే, దహన క్రియలో ఒకేసారి విడుదలవుతుంది.
- శ్వాసక్రియ ఒక శక్తి మోచక చర్య. దీనివల్ల జీవుల్లో శక్తి ఏర్పడుతుంది.
- శ్వాసక్రియ ఒక విచ్ఛిన్నక్రియ.
- శ్వాసక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ విడుదలవుతుంది. ఈ క్రియలో ఆక్సిజన్‌ను గ్రహించవచ్చు లేదా గ్రహించకపోవచ్చు.
- వైరస్‌లు శ్వాసక్రియ జరపలేవు.
- అభివృద్ధి చెందిన మొక్కలు, జంతువుల్లో వాయుసహిత శ్వాసక్రియ జరుగుతుంది.
- అభివృద్ధి చెందని జీవులైన బ్యాక్టీరియా, నీలి ఆకుపచ్చ శైవలాలు, ఈస్టు శిలీంధ్రంలో అవాయు శ్వాసక్రియ జరుగుతుంది.
- మెదడుకు 5 – 7 సెకన్లపాటు ఆక్సిజన్ సరఫరా జరగకపోతే ఆ వ్యక్తి మరణిస్తాడు. ఉరితీసినపుడు మెదడుకు రక్తం ద్వారా ఆక్సిజన్ అందదు. మెడలోని హయాయిడ్ ఎముక విరుగుతుంది. ఈ కారణాల వల్లే మనిషి చనిపోతాడు.
- మెదడుకు ఆక్సిజన్ సరఫరా తగ్గినపుడు ఆవలింతలు వస్తాయి.
- శరీరం మొత్తం బరువులో మెదడు బరువు రెండు శాతం మాత్రమే. కానీ అది శరీరం తీసుకొనే మొత్తం ఆక్సిజన్‌లో 20 శాతాన్ని వినియోగించుకుంటుంది
- సాధారణ మానవుడు నిమిషానికి 1.5 లీటర్ల ఆక్సిజన్‌ను తీసుకుంటాడు. చిన్న పిల్లలకు నిమిషానికి 3 లీటర్ల ఆక్సిజన్ అవసరం. క్రీడాకారులు నిమిషానికి 4 లీటర్ల ఆక్సిజన్ తీసుకుంటారు.
- నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ పరిమాణం 4 మి.గ్రా./లీ. కంటే తక్కువ ఉండకూడదు.
- కృత్రిమ శ్వాసను అందించేందుకు వాడే ఆక్సిజన్ సిలిండర్‌లో నైట్రోజన్, ఆక్సిజన్ మిశ్రమం ఉంటుంది. లేదా 10 శాతం కార్బన్ డై ఆక్సైడ్, 90 శాతం ఆక్సిజన్ (కార్బొజైన్ మిశ్రమం) ఉంటుంది.
- శ్వాసక్రియలో ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్ వాయువుల మార్పిడి జరుగుతుంది.
- మానవ శరీరంలో అత్యధికంగా లభించే వాయువు ఆక్సిజన్.

శ్వాసక్రియ- దశలు

శ్వాసక్రియ మూడు దశల్లో జరుగుతుంది. అవి

బాహ్య శ్వాసక్రియ:

శ్వాసాంగాల ద్వారా గ్రహించిన ఆక్సిజన్‌ను రక్తంలోకి, రక్తంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను బయటకు పంపడాన్ని బాహ్య శ్వాసక్రియ అంటారు. దీన్నే వెంటిలేషన్ (వాయుప్రసరణం) అని కూడా అంటారు. ఇది శ్వాసక్రియలో మొదటి దశ.

ప్రసరణ దశ:

ఈ దశలో రక్తంలోని హిమోగ్లోబిన్ ద్వారా ఆక్సిజన్ శరీరంలోని వివిధ కణాలకు రవాణా అవుతుంది. కార్బన్ డై ఆక్సైడ్ వ్యతిరేక దిశలో రవాణా అవుతుంది. ఇది రెండో దశ.

అంతర శ్వాసక్రియ/ఆక్సీకరణ క్రియ:

కణాలు ఆక్సిజన్‌ను గ్రహించి కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేసే క్రియను అంతర శ్వాసక్రియ / కణ శ్వాసక్రియ / శక్తి విడుదల అంటారు. ఇది రక్తం, కణజాలాల మధ్య జరిగే వాయువుల మార్పిడి.

- శ్వాసక్రియను నిర్వర్తించే కణాంగం మైటోకాండ్రియా. ఇందులో శక్తి నిల్వ ఉంటుంది. కాబట్టి మైటోకాండ్రియాలను కణశక్తి భాండాగారాలు అంటారు.
- ATP అనేది అధిక శక్తి బంధాలున్న అణువు. శక్తి ATPల రూపంలో నిల్వ ఉంటుంది. ATPని ఎనర్జీ కరెన్సీ అంటారు.
- మైటోకాండ్రియాలో శక్తి ఉత్పత్తి అయ్యే ప్రక్రియ ఆక్సీకరణ ఫాస్ఫారిలేషన్.

గమనిక: ఒక గ్లూకోజ్ అణువు వాయుసహిత శ్వాసక్రియలో పూర్తిగా ఆక్సీకరణం చెందినపుడు 36 లేదా 38 ATP అణువులు ఏర్పడతాయని భావించేవారు. కానీ 30 లేదా 32 ATP అణువులు మాత్రమే ఏర్పడతాయని ఇటీవలి పరిశోధనల ద్వారా తేలింది.

శ్వాసక్రియ రకాలు

శ్వాసక్రియ రెండు రకాలు. అవి..

వాయు శ్వాసక్రియ: వాతావరణంలోని ఆక్సిజన్ సహాయంతో గ్లూకోజ్ సంపూర్ణంగా విచ్ఛిన్నం చెందటం.

$C_6H_{12}O_6 + 6O_2 + 6H_2O \rightarrow CO_2 + 12H_2O$ + 686 కి.కేలరీల శక్తి

ఈ ప్రక్రియ ఉన్నత శ్రేణి మొక్కలు, జంతుకణాల్లో జరుగుతుంది.

అవాయు శ్వాసక్రియ: ఆక్సిజన్ లేకుండా గ్లూకోజ్ పాక్షికంగా విచ్ఛిన్నం చెందుతుంది. ఉదా. బ్యాక్టీరియాలు (బాసిల్లస్, క్లాస్ట్రీడియం), నీలిఆకుపచ్చ శైవలాలు (అనబినా, నాస్టాక్).

- ఈస్ట్ అనే శిలీంధ్రం, మొలకెత్తే విత్తనాలు, కండరాల్లో జరిగే శ్వాసక్రియ.
  $C_6H_{12}O_6 \rightarrow 2CO_2 + 2\ C_2H_5OH$ (ఇథనాల్) + 2ATP/56కి.కేలరీ (ఈస్ట్‌లో)
  $C_6H_{12}O_6 \rightarrow 2C_3H_6O_3$ +(లాక్టికామ్లం) + 2ATP/56 కి.కేలరీ (వేగంగా సంకోచించే కండరంలో)

గమనిక: వేగంగా సంకోచించే కండరాల్లో లాక్టికామ్లం ఏర్పడటం వల్ల కండరాలు త్వరగా అలసిపోవడాన్ని 'కండర గ్లాని' అంటారు.

- అవాయు శ్వాసక్రియనే కిణ్వనం అని అంటారు. కిణ్వన ప్రక్రియను ఉపయోగించి చక్కెర పదార్థాలను సూక్ష్మజీవుల సమక్షంలో పులియబెట్టి ఆల్కహాల్ తయారుచేస్తారు.
- ఈస్ట్ శిలీంధ్రాల నుంచి వేరుచేసిన ఎంజైమ్ జైమేజ్. ఈస్ట్ పారిశ్రామికంగా అతి ముఖ్యమైంది. దీని లాభాలు..
  1. ద్రాక్ష, చక్కెర పదార్థాల నుంచి ఆల్కహాల్ తయారీ.
  2. ఇడ్లీ, దోశ పిండి పులియ బెట్టడం.
  3. బ్రెడ్, కేక్స్ లాంటి బేకరీ పరిశ్రమల్లో ఈస్ట్‌ను ఉపయోగిస్తారు. బ్రెడ్‌పై రంధ్రాలు ఏర్పడటానికి, బ్రెడ్ మెత్తగా ఉండటానికి అవాయు శ్వాసక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ బయటకు రావడమే కారణం. రొట్టెలను బేకింగ్(వేడి) చేయటం వల్ల ఆల్కహాల్ ఆవిరవుతుంది.

శ్వాసక్రియ విధానం

ఊపిరితిత్తులలో జరిగే శ్వాసక్రియనే పుపుస శ్వాసక్రియ అంటారు. ఇది రెండు దశల్లో జరుగుతుంది.

1. **ఉచ్ఛ్వాసం:** వాతావరణం నుంచి గాలిని ఊపిరితిత్తుల్లోకి పీల్చుకోవడాన్నే ఉచ్ఛ్వాసం అంటారు. పీల్చే గాలిలో ఆక్సిజన్ 21 శాతం, కార్బన్ డై ఆక్సైడ్ 0.03 శాతం ఉంటాయి.
2. **నిచ్ఛ్వాసం:** ఊపిరితిత్తుల నుంచి గాలిని బయటకు పంపడాన్నే నిచ్ఛ్వాసం అంటారు. బయటకు వదిలే గాలిలో ఆక్సిజన్ 16 శాతం, కార్బన్ డై ఆక్సైడ్ 4.4 శాతం ఉంటాయి. పీల్చే, వదిలే గాలిలో నైట్రోజన్ 78.048 శాతం ఉంటుంది. నైట్రోజన్‌కు రంగు, రుచి, వాసన ఉండదు.

- సముద్ర అంతర్భాగంలో శ్వాసక్రియ కోసం ఆక్సిజన్, నైట్రోజన్ మిశ్రమాన్ని ఉపయోగిస్తారు.
- మానవునిలో శ్వాసక్రియ ఒక అసంకల్పిత, అనియంత్రిత చర్య.
- శ్వాసక్రియను మజ్జాముఖం(మెడుల్లా అబ్లాంగేటా) నియంత్రిస్తుంది.
- శ్వాసక్రియకు పురుషుల్లో డయాఫ్రం (విభాజక పటలం), స్త్రీలలో పక్కటెముకలు సహాయపడతాయి.
- ఎత్తుకు వెళ్లే కొద్దీ శ్వాసక్రియ వేగం పెరుగుతుంది. అందుకే ఎత్తయిన ప్రాంతాల్లోని జీవుల్లో ఎర్రరక్త కణాలు అధికంగా ఉంటాయి.

మానవుని శ్వాసక్రియ నిర్మాణం:

మానవుని శ్వాసక్రియలో ఏడు భాగాలు ఉంటాయి. అవి ముక్కు (నాసిక), గ్రసని, స్వరపేటిక, వాయునాళం, శ్వాసనాళం, శ్వాసనాళికలు– వాయుగోణులు, ఊపిరితిత్తులు.

1. ముక్కు (నాసిక): ఇది శ్వాసవ్యవస్థలో మొదటి భాగం. ముక్కు ద్వారా గాలి లోపలికి ప్రవేశిస్తుంది. నాసికలో రెండు నాసికా కుహరాలు ఉంటాయి. నాసికా కుహరాన్ని, అస్యకుహరాన్ని వేరు చేసే మృదులాస్థి నిర్మాణమే అంగిలి. అంగిలి ఉండటం క్షీరదాల ముఖ్యలక్షణం. పాములోని ఘ్రాణ గ్రాహకాన్ని జాకబ్‌సన్ అవయవం అంటారు. ఘ్రాణ గ్రాహకాలు పాములు, ఎలుకలు, కుక్కల్లో ఎక్కువగా అభివృద్ధి చెందాయి. కుక్కల ఘ్రాణ గ్రాహకం మనిషి కంటే 40 రెట్లు ఎక్కువ. అందుకే నేరస్తులను పట్టుకోవడానికి వీటిని ఉపయోగిస్తారు.

2. గ్రసని: ఇది వాయు, ఆహారమార్గాల కూడలి. గ్రసని కంఠబిలం ద్వారా స్వరపేటికలోకి తెరచుకుంటుంది. కంఠబిలం మీద మృదులాస్థితో ఏర్పడిన ఉపజిహ్వక మూతలా ఉంటుంది. ఆహారం స్వరపేటికలోకి పోకుండా ఇది అడ్డుకుంటుంది.

3. ధ్వనిపేటిక /స్వరపేటిక: ఇది వాయునాళం మొదటిభాగం. స్వరపేటికలో ఒక జత స్వరతంత్రులు ఉంటాయి. ఇవి శబ్దాన్ని ఉత్పత్తి చేస్తాయి. పురుషుల స్వరపేటిక స్త్రీల స్వరపేటిక కంటే పొడవుగా, మందంగా ఉంటుంది. కాబట్టి పురుషుల స్వరం గంభీరంగా ఉంటుంది. స్వరకోశాల పౌనఃపున్యం తక్కువ ఉండి, కంపనపరిమితి ఎక్కువగా ఉండటం వల్ల మగవారి స్వరం, సింహం గర్జన గంభీరంగా ఉంటాయి.

- స్వరకోశాల పౌనఃపున్యం ఎక్కువ, కంపన పరిమితి తక్కువగా ఉండటం వల్ల చిన్నపిల్లలు, స్త్రీల గొంతు కీచుగా ఉంటుంది. ధ్వని పౌనఃపున్యం పెరిగితే కీచుమనే శబ్దం వస్తుంది. ఉదా: దోమ, ఈగ.
- పక్షుల్లో 'శబ్దని' వల్ల శబ్దం ఉత్పత్తి అవుతుంది.

4. వాయునాళం: ఇది గాలి గొట్టం. దీనిలో 'C' ఆకారపు మృదులాస్థి ఉంగరాలు ఉంటాయి. కప్పలో మెడ లేకపోవడం వల్ల వాయునాళం లేదు. పెంగ్విన్ పక్షుల్లో రెండు వాయునాళాలు ఉంటాయి. బొద్దింకలో వాయునాళం శ్వాసక్రియ జరుపుతుంది.

5. శ్వాసనాళం: వాయునాళం ఛాతిలోకి ప్రయాణించి రెండు శ్వాసనాళాలుగా విడిపోతుంది.

6. శ్వాసనాళికలు: ప్రతి శ్వాసనాళం ఊపిరితిత్తిలో ప్రవేశించి తిరిగి విభజన చెంది అనేక శ్వాసనాళికలను ఏర్పరుస్తుంది. శ్వాసనాళం, శ్వాసనాళికలు, వాయుకోశ గోణులు కలిసి తలకిందులుగా ఉండే శ్వాసవృక్షాన్ని ఏర్పరుస్తాయి.

7. ఊపిరితిత్తులు: ఊపిరితిత్తుల అధ్యయాన్ని ప్లూరాలజీ/ పల్మనాలజీ అంటారు. ఇవి 950 గ్రాముల బరువు ఉంటాయి. మానవ శరీరంలో రేడియోధార్మిక ప్రభావానికి మొదట గురయ్యే అవయవం ఊపిరితిత్తులు. ఉరఃకుహరంలో స్పాంజి మాదిరి స్థితిస్థాపక శక్తి ఉన్న రెండు ఊపిరితిత్తులు ఉంటాయి. కుడి ఊపిరితిత్తి పెద్దదిగా ఉంటుంది. ఊపిరితిత్తుల చుట్టూ ఉండే రెండు పొరలను ప్లూరా అంటారు. కుడి ఊపిరితిత్తిలో 3 తమ్మెలు, ఎడమ ఊపిరితిత్తిలో 2 తమ్మెలు ఉంటాయి. రెండు ఊపిరితిత్తుల్లో కలిపి సుమారు 60 కోట్ల వాయుగోణులు ఉంటాయి. వాయుగోణులు ఊపిరితిత్తుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణాలు. వాయుగోణుల్లో వాయు మార్పిడి జరుగుతుంది. ఊపిరితిత్తుల్లో శుభ్రపడిన రక్తం, పుపుస సిర ద్వారా ఎడమ కర్ణిక, ఎడమ జఠరికలను చేరి మహాధమని ద్వారా శరీరంలోని అన్ని భాగాలకు సరఫరా అవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఆక్సిజన్ ట్యూబ్‌లో కృత్రిమ శ్వాసక్రియకు ఆక్సిజన్‌తోపాటు ఏ వాయువును వాడతారు?
   1) నత్రజని 2) హీలియం
   3) ఆర్గాన్
   4) బొగ్గుపులుసు వాయువు
2. వర్చువల్ వాటర్ అంటే?
   1) సముద్రం నుంచి లభించే తాగునీరు
   2) బోరుబావి నుంచి లభించే నీరు
   3) ఒక ఉత్పత్తి తాను ఉత్పత్తిగా మారే ప్రక్రియలో వినియోగించుకునే నీరు
   4) మనిషి లేదా జంతువు శరీరంలో ఉండే నీటి పరిమాణం
3. శాస్త్రీయంగా పులియబెట్టడమంటే?
   1) ఆక్సిజన్‌లో చక్కెరను అసంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
   2) ఆక్సిజన్ లేకుండా చక్కెరను సంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
   3) ఆక్సిజన్ లేకుండా చక్కెరను అసంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
   4) ఆక్సిజన్‌లో చక్కెరను సంపూర్ణంగా ఆక్సీకరణం చెందించడం
4. సిరా రక్తాన్ని ఆక్సిజన్ కోసం ఊపిరితిత్తులకు చేరవేసేది ఏది?
   1) పుపుస సిరలు
   2) పుపుస ధమనులు
   3) కుడి జఠరిక
   4) మహాసిర
5. గాలిలో 78 శాతం ఉండేది?
   1) ఆక్సిజన్
   2) కార్బన్ డై ఆక్సైడ్
   3) కార్బన్ మోనాక్సైడ్
   4) నైట్రోజన్
6. సగటు మనిషి ఊపిరితిత్తుల్లో ఎన్ని లీటర్ల గాలి ఉంటుంది?
   1) 2 లీటర్లు 2) 3 లీటర్లు
   3) 4 లీటర్లు 5) 1 లీటరు

సమాధానాలు

1) 1 2) 3 3) 3 4) 2 5) 4 6) 1.

జోడేఘాట్ పోరాటం ఎవరి నాయకత్వంలో జరిగింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఎకానమీ

ఎం.ఎస్. భరుచా కమిటీ

హైదరాబాద్ స్టేట్‌లో కౌలు రైతుల, వ్యవసాయ రంగ పరిస్థితులను తెలుసుకోవడానికి రెవెన్యూ శాఖ 1347 ఫసలీ(1937)లో ఎం.ఎస్.భరుచా అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కౌలుదారుల స్థితిగతులను పరిశీలించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలని సూచించింది. లేని పక్షంలో వ్యవసాయ రంగానికి, దేశానికి ఇబ్బందికరమని హెచ్చరించింది. అవసరమైన మార్పులను సూచిస్తూ కౌలుదారీ చట్టం నమూనాను సూచించింది. ఈ కమిటీ సూచనలకు అనుగుణంగా 1944లో 'హైదరాబాద్ ఆసామీ షక్మీ చట్టం' అమల్లోకి వచ్చింది.

ఆసామీ షక్మీ చట్టంలోని ముఖ్యాంశాలు:

ఈ చట్టం ప్రకారం.. వరుసగా ఆరేళ్లపాటు భూమిని కౌలుకు తీసుకొని సేద్యం చేసినవారు ఆసామీ షక్మీ (రక్షిత కౌలుదార్లు) అవుతారు. చట్ట వ్యతిరేక లెవీ పద్ధతి, సెస్‌లు, పన్నులు, వెట్టి చాకిరిని ఈ చట్టం ద్వారా నిషేధించారు. ఈ చట్టం ద్వారా తీవ్ర దుష్ఫలితాలు తలెత్తాయి. భరుచా కమిటీ (1939) పరిశీలన ప్రారంభించిన కాలం నుంచే భూస్వాములు కౌలుదార్లను వెళ్లగొట్టారు. తమకున్న అధికార బలంతో అధిక కౌలురేట్లను పొందగలిగారు. ఓ విధంగా ఈ చట్టం నిరుపయోగమైందని చెప్పొచ్చు. 1901–21 మధ్యకాలంలో కౌలుదార్ల సంఖ్య 40 వేల నుంచి 7.62 లక్షలకు పెరగ్గా.. 1931లో వీరి సంఖ్య 4.41 లక్షలకు తగ్గింది. చట్టపరమైన హక్కులను పొందాలనుకున్న జాగీర్దారులు, పెద్ద భూస్వాముల ఆర్థిక, సాంఘిక బలం వల్ల ఈ చట్టం అమల్లోకి రాలేకపోయింది.

కౌలు చెల్లింపులు - కౌలు రేట్లు

హైదరాబాద్ ప్రాంతంలో కౌలు చెల్లింపుల విధానం మూడు రకాలుగా ఉండేది.

1. బెతాయి లేదా పంటలో భాగం (క్రాప్ షేరింగ్): పంటలో కొంత భాగం ధాన్యాన్ని కౌలుగా చెల్లించేవారు. ఇది పంటలో 20 శాతం నుంచి 40 శాతం వరకు ఉండేది.

2. గల్లామక్తా: ఉత్పత్తితో సంబంధం లేకుండా, పండించిన పంటలో స్థిరమైన భాగం చెల్లించే పద్ధతి లేదా ఉత్పత్తితో సంబంధం లేకుండా ఒక ఎకరానికి కనీస మొత్తంగా ధాన్యరూపంలో చెల్లించే స్థిరమైన కౌలు. కొన్ని సందర్భాల్లో ఈ కౌలు పరిమాణం 2/3 వంతు ఉండేది.

3. ద్రవ్య రూప కౌలు/ నగదు రూప కౌలు: ఒక ఎకరానికి నగదు రూపంలో చెల్లించే స్థిరమైన కౌలు. ఈ కౌలు రేట్లు నికర ఉత్పత్తిలో 2/3 వంతు కంటే ఎక్కువగా ఉండేవని, నగదు రూప కౌలు భూమి అసెస్‌మెంట్ కంటే 5 నుంచి 12 రెట్లు అధికంగా ఉండేదని భరుచా కమిటీ నివేదిక తెలిపింది. ఇది గాక భూమిని కౌలుకు తీసుకునే ముందు రెన్యువల్ కోసం అనేక నజరానాలు చెల్లించాల్సి వచ్చేది.

వ్యవసాయం, సంబంధిత రంగాల్లో విప్లవాత్మక మార్పులు భూ సంస్కరణల ద్వారానే సాధ్యమవుతాయని కాంగ్రెస్ పార్టీ భావించింది. దీనికి అనుగుణంగా 1919 నుంచి అనేక తీర్మానాలు చేసింది. అందువల్ల స్వాతంత్ర్యం వచ్చాక అధికారంలోకి రాగానే భూ సంస్కరణలు ప్రవేశపెట్టి వ్యవసాయ రంగంలో మార్పులు తెచ్చింది. ఆ రంగ అభివృద్ధికి సహాయపడింది.

భూ యాజమాన్య కేంద్రీకరణ

స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో భూకేంద్రీకరణ చాలా అధికంగా ఉండేది. జమీందారీ, జాగీర్దారీ, ఇనాందారీ విధానాలే కాకుండా వడ్డీ వ్యాపారం వల్ల భూ యాజమాన్యం వ్యవసాయదారుల నుంచి వ్యవసాయం చేయని, చేయలేని వర్గాల చేతుల్లోకి పోయింది. దీనివల్ల పెద్ద కమతాల వ్యవసాయం ఎక్కువగా కౌలుదార్లు చేసేవారు. వారికి సరైన ప్రోత్సాహం లేకపోవడం వల్ల ఉత్పత్తి పెరగలేదు.

తెలంగాణలోని నల్గొండ, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల్లో 500 ఎకరాలకు పైగా భూమి ఉన్న పట్టాదారుల(భూస్వాములు) సంఖ్య 550. వీరి యాజమాన్యంలో.. మొత్తం సాగుబడిలో ఉన్న భూమిలో 60 నుంచి 70 శాతం వరకు ఉండేదని 1950–51లోని పరిపాలనా నివేదిక ద్వారా తెలుస్తోంది. మేజర్ ఇనాం భూములు కూడా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉండేవి. భూకేంద్రీకరణ వల్ల ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి భూ గరిష్ఠ పరిమితి చట్టం ఆవశ్యకత ఏర్పడింది. ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు డి.ఆర్.గాడ్గిల్ భూకమతాల గరిష్ఠ పరిమితిని సమర్థించారు..

రాజకీయ అంశాలు

స్వాతంత్ర్యానంతరం దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మొదటి దఫా (1947–1970) భూసంస్కరణలు ప్రవేశపెట్టారు. దీనికి అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విధానాలు, తీర్మానాలే ముఖ్య కారణం. 1885లో ఆవిర్భవించిన కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రాంతాల్లోని విద్యావేత్తలతో ప్రారంభమైంది. అప్పుడు పెట్టుబడిదారులు, వ్యాపారులు, మధ్య తరగతి ప్రజల సమస్యల పరిష్కారం కోసం, సివిల్ సర్వీస్ పరీక్షల నిర్వహణ, కార్పొరేషన్ అధికారాలు, శాసనసభల్లో ప్రాతినిధ్యం తదితర అంశాలపై పోరాడేవారు. 1885–1915 మధ్యకాలంలో దేశంలో పారిశ్రామికీకరణ జరపాలని, స్వదేశీ పరిశ్రమలకు రక్షణ కల్పించాలని, విదేశీ వస్తువులను బహిష్కరించాలని, స్వదేశీ వస్తువుల్నే ఉపయోగించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు జరిగాయి.

గాంధీజీ రాజకీయ జీవితం 1915 తర్వాత రైతాంగం పోరాటంతో ప్రారంభమైంది. 1917–18లో బిహార్‌లోని చంపారన్ రైతుపోరాటం, ఖేడా జిల్లా రైతు విముక్తి పోరాటాలు, గ్రామీణ ప్రాంతాల్లోని బీద వర్గాల్లో చైతన్యం తీసుకొచ్చాయి. ఫలితంగా వీరంతా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములయ్యారు. భారతదేశ సమస్యలకు పరిష్కారం న్యాయవాదులు, డాక్టర్లు, ధనిక భూస్వాముల నుంచి రాదని.. ఇది రైతాంగం నుంచే వస్తుందని గాంధీజీ అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య సముపార్జనలో గ్రామీణ రైతాంగమే ముఖ్యమైన శక్తిగా ఉండాలని, ఉంటుందని గాంధీజీ భావించారు.

సహాయ నిరాకరణ, పన్నుల నిరాకరణ, శాసనోల్లంఘన మొదలైన ఉద్యమాలు పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాయి. ఈ కార్యక్రమాల్లో రైతాంగం చురుగ్గా పాల్గొంది. వ్యవసాయదారుల సమస్యలను జాతీయ సమస్యలుగా అఖిల భారత జాతీయ కాంగ్రెస్ గుర్తించింది. గాంధీజీ అభిప్రాయం ప్రకారం.. స్వాతంత్ర్యం అంటే దేశాన్ని విదేశీ పాలన నుంచి విముక్తి చేయడమే కాదు. భారత పెట్టుబడిదారులు, భూస్వాముల దోపిడీ నుంచి రైతాంగాన్ని విముక్తి చేయటమే. 1919లో అమృత్‌సర్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో దున్నేవారికే భూమి యాజమాన్యం కల్పించాలని, రైతులపై భాటకానికి బదులు పన్ను విధించాలని, జమీందారీ ప్రాంతాల్లోని కౌలుదార్లకు యాజమాన్య హక్కులు ఇవ్వాలని తీర్మానం చేశారు.

భూస్వాముల తొలగింపు కాంగ్రెస్ కార్యక్రమంలో ప్రధాన పాత్ర వహించాలని జవహర్‌లాల్ నెహ్రూ కోరుకున్నారు. భారతదేశ భవిష్యత్తు రైతాంగం మీదే ఆధారపడి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 1929 మే నెలలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశం జరిగింది. దేశ ప్రజల దారిద్ర్యాన్ని తొలగించడానికి, దేశ ఆర్థిక, సామాజిక నిర్మాణంలోని అసమానతలను రూపుమాపడానికి విప్లవాత్మక మార్పులు అవసరమని ఈ సమావేశంలో తీర్మానించారు. ఇందుకు అనుగుణంగా 1931లో కరాచీలో జరిగిన కాంగ్రెస్ సభ జమీందారీ వ్యవస్థ రద్దు చేయాలని తీర్మానించింది. 1931లో లక్నో, ఫైజాపూర్‌లో ఈ అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ వ్యవసాయ పథకాన్ని రూపొందించింది.

1936 ఎన్నికల మ్యానిఫెస్టోలో భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిచ్చారు. ఎన్నికల తర్వాత వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ ఏర్పాటు చేసిన ప్రభుత్వాలు.. బిహార్‌లో కౌలు భాటకాన్ని తగ్గించడం, ఉత్తరప్రదేశ్‌లో కౌలు భాటకాలు, పాత బాకీలపై, రుణాలపై మారిటోరియం విధించడం, మధ్యప్రదేశ్‌లో కౌలుదారులకు రక్షణ కల్పించడం వరకే పరిమితమయ్యాయి. 1946 ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా మధ్యవర్తులను తొలగిస్తామని తెలిపారు. మధ్యవర్తుల హక్కులను తొలగిస్తున్నందువల్ల వారికి సరైన పరిహారం ఇస్తామని హామీ ఇచ్చారు. స్వాతంత్ర్యం తర్వాత జైపూర్ కాంగ్రెస్ మహాసభలో జె.సి.కుమారప్ప అధ్యక్షతన వ్యవసాయ సంస్కరణల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ సూచనల ఆధారంగా వివిధ రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు వివిధ రకాల భూ సంస్కరణల చట్టాలు తీసుకొచ్చాయి.

హైదరాబాద్ ప్రాంతంలో స్వాతంత్ర్యానికి పూర్వం ప్రజలకు ఎటువంటి పౌరహక్కులు ఉండేవి కావు. నిజాం ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీని గుర్తించపోవడమే గాక, 1946 వరకు నిషేధించింది. అందువల్ల ఈ ప్రాంతంలోని కాంగ్రెస్ వాదులంతా సంఘటితం కాలేకపోయారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఆర్యసమాజ్, ఆంధ్ర జనసంఘం మొదలైన సంఘాలు తెలంగాణ ప్రజల్లో చైతన్యం తీసుకుని రావడానికి ప్రయత్నించాయి. తెలంగాణ ప్రాంతంలో 1948కు ముందు కాంగ్రెస్ ప్రభావం తక్కువగా ఉన్నప్పటికీ అధికారంలో వచ్చాక భూ సంస్కరణ చట్టాల రూపకల్పన, అమలు చేయడంలో ఆ పార్టీ ప్రధాన పాత్ర పోషించింది. వ్యవసాయం, సంబంధిత రంగాల్లో విప్లవాత్మక మార్పులు భూ సంస్కరణల ద్వారానే సాధ్యమవుతాయని 1919 నుంచి కాంగ్రెస్ అనేక తీర్మానాలు చేసింది. అందువల్ల స్వాతంత్ర్యం వచ్చాక అధికారంలోకి రాగానే భూ సంస్కరణలు ప్రవేశపెట్టి వ్యవసాయ రంగంలో మార్పులు తెచ్చి, ఆ రంగ అభివృద్ధికి సహాయపడింది.

రైతాంగ ఉద్యమాలు

హైదరాబాద్ రాష్ట్రంలో, ప్రత్యేకించి తెలంగాణ రైతాంగం ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేసింది. ఈ ప్రాంతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలను నిషేధించారు. అందువల్ల ఈ పార్టీలు రైతు లేదా వ్యవసాయ కార్మిక సంఘాలను ప్రారంభించ లేకపోయాయి. కానీ రైతాంగం ఫ్యూడల్ భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించింది. 1920లో విస్నూరు దేశ్‌ముఖ్‌కు వ్యతిరేకంగా షేక్ బందగీ అనే ముస్లిం రైతు పోరాటం చేశాడు.

1921లో తెలుగు భాషాభిమానులు భాషాభివృద్ధి కోసం, గ్రంథాలయ స్థాపన కోసం 'ఆంధ్ర జనసంఘం' ప్రారంభించారు. 1928లో ఇది ఆంధ్ర మహాసభగా మారింది. పరిపాలనా యంత్రాంగంలో కొన్ని సంస్కరణలు చేపట్టాలని, పౌర హక్కులు కల్పించాలని, జాగీర్ రైతుల సమస్యలను పరిష్కరించాలని, పన్నులను తగ్గించాలని, వెట్టిచాకిరి రద్దు చేయాలని ఆంధ్ర మహాసభ తీర్మానాలు చేసింది. వెట్టిచాకిరి, వ్యాపారస్థుల సంఘం అనే రెండు కరపత్రాలు ప్రచురితమయ్యాయి. క్రమంగా 1940 నుంచి వామపక్ష వాదుల సంఖ్య పెరిగింది. 1945లో ఖమ్మంలో జరిగిన మహాసభలో జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతాంగ సాయుధ పోరాటం చేయాలని తీర్మానించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కొనసాగిన సాయుధ పోరాటంలో రజాకార్లు, నిజాం పోలీసుల సాయుధ దాడులను తిప్పికొట్టడానికి పదివేల మందితో గ్రామ దళాన్ని, రెండు వేల మంది గెరిల్లా సభ్యులతో శక్తిమంతమైన సాయుధ బలగాన్ని కమ్యూనిస్టులు నిర్మించుకోగలిగారు.

సుమారు 3000 గ్రామాల్లో 16,000 చదరపు మైళ్ల వైశాల్యంలో గ్రామసభలను ఏర్పాటు చేసి నిజాంకు విశ్వాసపాత్రులైన జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లను గ్రామాల నుంచి వెళ్లగొట్టారు. గ్రామ కమిటీల ద్వారా 10 లక్షల ఎకరాల భూమిని పునఃపంపిణీ చేశారు. వెట్టిచాకిరీ, వడ్డీ వ్యాపారం(నాగుల పద్ధతి), ఇతర నిర్బంధ వసూళ్లు, నిర్బంధ లెవీ మొదలైన వాటిని రద్దు చేయటంతోపాటు బంజర భూములను పునఃపంపిణీ చేశారు. వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచారు. ఈ ప్రాంతంలో సుమారు 12 నుంచి 18 నెలల వరకు గ్రామపాలన మొత్తం రైతు కమిటీల ఆధ్వర్యంలో సాగింది. ఈ పోరాటంలో నాలుగు వేల మంది కమ్యూనిస్టులు హత్యకు గురయ్యారు. పదివేల మంది బందీలయ్యారు. 1945 నుంచి భారత సైన్యం ఈ సంస్థానంలోకి ప్రవేశించే వరకు నిజాం, రజాకార్లు, దేశ్‌ముఖ్‌లపై ఉన్న ద్వేషంతో గ్రామీణ ప్రజలు సాయుధ పోరాటానికి మద్దతు పలికారు. పోలీసు చర్య తర్వాత సాయుధ పోరాటం అవసరం లేదని కాంగ్రెస్ భావించింది. కమ్యూనిస్టుల ప్రభావాన్ని తగ్గించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. భూ సంస్కరణల చట్టాలను ప్రవేశపెట్టి రైతాంగ పోరాటాలను అణగదొక్కింది. తెలంగాణ ప్రాంతంలోని రైతాంగ పోరాటాల ఫలితంగా అతి స్వల్పకాలంలోనే హైదరాబాద్ రాష్ట్రంలో విప్లవాత్మక భూ సంస్కరణ చట్టాలు అమలయ్యాయి. తెలంగాణ ప్రాంతంలో భూ సంస్కరణల చట్టాలను తీసుకొని రావడానికి రైతాంగ పోరాటాలే కారణం. నిజాంకు వ్యతిరేకంగా ఆదిలాబాద్ కోలామ్ – గోండు ఆదివాసీ గిరిజనులు కొమురం భీమ్ నాయకత్వంలో పోరాటం చేశారు. 1941లో వీరి ఆధ్వర్యంలోనే 'భాభిజరీ (జోడేఘాట్) పోరాటం' జరిగింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 339 ప్రకారం రాష్ట్రపతి గిరిజనుల సంక్షేమాన్ని పరిశీలిస్తారు. ఇందు కోసం ఐదేళ్లకు ఒకసారి తగిన చర్యలు తీసుకుంటారు. ఆర్టికల్ 342 ప్రకారం గిరిజనులను షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ)గా పేర్కొని వీరికి కొన్ని ప్రత్యేక అవకాశాలు కల్పించారు.

The word FTP stands for?

ISO/OSI MODEL IN COMMUNICATION NETWORKS

In the late 1970s, two projects began independently, with the same goal: to define a unifying standard for the architecture of networking systems. One was administered by the International Organization for Standardization (ISO), while the other was undertaken by the International Telegraph and Telephone Consultative Committee (CCITT). These two international standards bodies each developed a document that defined similar networking models. In 1983, these two documents were merged to form a standard called The Basic Reference Model for Open Systems Interconnection. The concept of a seven-layer model was provided by the work of Charles Bachman at Honeywell Information Services

The ISO-OSI model consists of seven layer architecture. It defines seven layers or levels in a complete communication system.

Layer 7	Application
Layer 6	Presentation
Layer 5	Session
Layer 4	Transport
Layer 3	Network
Layer 2	Data Link
Layer 1	Physical

Layer 1: The Physical Layer

The bottom most layer of the OSI model is the physical layer. It addresses the physical characteristics of the network i.e., it activates, maintain and deactivate the physical connection. Voltages and data rates needed for transmission. In this layer data will be in the form of electronic signals called bit stream (0 and 1). Devices used in this layer are Repeater and Hub.

Layer 2: Data Link Layer

Data Link Layer is the second layer in the OSI model. In data link layer data is transformed in the form of frames. In this layer devices like Switch and Bridge are used.

IEEE 802 divides the data link layer into two sub layers:

1) Media Access Control (MAC) layer:
It contains the address of each device on a network which is assigned to the device during its manufacturing.
2) Logical Link Control (LLC) layer:
In this layer the redundant data and error data can be detected using cyclic redundancy check.

Layer 3: The Network Layer

This layer provides the functional & procedural means of transferring variable length data sequences (called datagram's) from one node to another connected to the same network. In this layer router is used to connect devices of different networks. It routes the signal through different channels to the other end. It acts as a network controller. It decides by which route data should take. It divides the outgoing messages into packets and to assemble incoming packets into messages for higher levels.

Layer 4: Transport Layer

The main purpose of transport layer is to ensure that packets are moved over the network without errors and data loss. It decides if data transmission should be on parallel path or single path. Functions such as multiplexing, segmenting or splitting on the data done by layer four that is transport layer. Transport layer breaks the message (data) into small units so that they are handled more efficiently by the network layer.

Layer 5: The Session Layer

Session layer manages and synchronize the conversation between two different applications. Transfer of data from one destination to another session layer streams of data are marked and are resynchronized properly, so that the ends of the messages are not cut prematurely and data loss is avoided. In session layer during large file transfers it maintains check points.

Layer 6: The presentation Layer

Presentation layer takes concern that the data is sent in such a way that the receiver will recognize the information (data) and will be able to use the data. Data encryption, decryption, compression and decompression is done in the presentation layer.

Layer 7: Application Layer

It is the top layer. Manipulation of data (information) in various ways is done in this layer. Transferring of files disturbing the results to the user is also done in this layer. Mail services, directory services, network resource etc are services provided by application layer.

PREVIOUS QUESTIONS ON ISO/OSI MODEL

1. In which layer data will be in the form of bit stream
   a) Physical layer b) Data link layer
   c) Application layer d) Network layer
   e) Session layer
2. Data encryption and decryption is done in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer
   d) Presentation layer e) None of these
3. OSI Stands for
   a) Open Source Interconnect
   b) Open System Interconnect
   c) Open Systems Interconnection
   d) Open Sources Interconnected
   e) None of these
4. ISO stands for
   a) International Standardization Organization
   b) International Standard Organization
   c) International Standard for Organization
   d) International Organization for Standardization
   e) None of These
5. MAC layer is a sub layer of ________layer
   a) Physical layer b) Data link layer
   c) Application layer d) Network layer
   e) Session layer
6. Repeater is used in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer d) Presentation layer
   e) None of these
7. Router is used in which layer
   a) Physical layer b) Data link layer
   c) Application layer d) Network layer
   e) None of these
8. Cyclic Redundancy Check is done in which layer
   a) Network layer b) Physical layer
   c) Transport layer d) Presentation layer
   e) LLC Layer
9. Check points are maintained ___ layer
   a) Physical layer b) Data link layer
   c) Application layer d) Network layer
   e) Session layer
10. IPX stands for ___________
    a) Internet Packet Exchange
    b) Internet Protocol Exchange
    c) Internetwork Packet Exchange
    d) Intranet Protocol Exchange
    e) None of these
11. Which protocol is considered as connectionless protocol?
    a) SMTP b) FTP c) TCP
    d) UDP e) IP
12. IP protocol is used in which layer
    a) Physical layer
    b) Data link layer
    c) Application layer
    d) Network layer
    e) None of these
13. Bridge is used in which layer
    a) Session layer b) Physical layer
    c) Application layer d) Network layer
    e) Data link layer
14. The concept of OSI seven layers was proposed by__________
    a) Charles Babbage
    b) Von Neumann
    c) Lovelace d) Hopper
    e) Charles Bachman
15. LLC stands for
    a) Logic Layer Control
    b) Logical Control Layer
    c) Logic Link Control Layer
    d) Logic Links Centre Layer
    e) None of These

Answers:

1) a; 2) d; 3) c; 4) d; 5) b;
6) b; 7) d; 8) e; 9) e; 10) c;
11) d; 12) d; 13) e; 14) e; 15) c.

Model Questions on Computer Networks

1. The Internet began with the development of
   a) USENET b) ARPANET
   c) Ethernet d) Intranet
   e) None of these
2. A global network made up of thousands of privately owned computers and networks is called the:
   a) World Wide Web b) Internet
   c) Specialized search engine
   d) Internet2 e) None of these
3. A peer-to-peer LAN is an appropriate network architecture for__
   a) The Internet b) Home network
   c) Network requiring a server with shared resources
   d) wide area network e) None of these
4. What is a serial port that adds a direct connection to a network?
   a) FireWire b) NIC c) USB
   d) Server e) None of these
5. The__________ runs the front-end applications software in a network.
   a) Client b) Database c) Server
   d) USB e) None of these
6. This device is used to connect your computer with a telephone line, so that can access information from other servers and ordinary users too, said device is called ____________
   a) Modem b) Set Top Box
   c) LAN Card
   d) UPS e) None of these
7. Device on one network can communicate with devices on another network via________
   a) File Server b) Utility Server
   c) Printer Server
   d) Gateway e) None of these
8. Which of the following will connect you to the Internet?
   a) An commercial online service
   b) An internet service provider
   c) A network connection
   d) All of the above
   e) None of these
9. The word FTP stands for______
   a) File Translate Protocol
   b) File Transits Protocol
   c) File Typing Protocol
   d) File Transfer Protocol
   e) None of these
10. ______ is a set of rules computers utilize to talk to each other.
    a) Protocol b) Syntax
    c) DOS command d) HTML
    e) None of these
11. Which type of transmission media is acknowledged as regular telephone wire?
    a) Wi-Fi b) Twisted-pair wire
    c) Fiber optic cable
    d) Coaxial cable e) None of these
12. What is the idea of a firewall on a computer?
    a) To protect a computer from unauthorized access
    b) To protect a computer in case of fire
    c) To protect a computer from spam
    d) All of the above e) None of these

Answers:

1) b; 2) b; 3) b; 4) b; 5) a;
6) a; 7) d; 8) b; 9) d; 10) a;
11) b; 12) a.